

# అనంత యాత్ర
# 5వ భాగం

## పూజ్య శ్రీ బాబూజీ మహరాజ్, కస్తూరీ బహెన్‌ల
## ఉత్తర ప్రత్యుత్తరాలు

## 19 మార్చి 1959 నుంచి 2 మే 1975 వరకు
## ఉత్తరం సంఖ్య 701 నుంచి 901 వరకు

వ్యక్తిగత వినియోగం కొరకు మాత్రమే

కస్తూరీ బెహెన్ పుస్తకాల కొరకు

కె. రామదాస్ - **9440652774**

కె. సుదర్శన్ - **9247805058**

సంప్రదించగలరు.

# అనంత యాత్ర - 5వ భాగం


## ముందు మాటలు

శ్రీ బాబూజీ మహరాజ్ కృపతో ఈ అనంత యాత్ర పుస్తక రూపంలో 5వ సంపుటంగా పరిపూర్ణత నంది తన అంతాన్ని తాకి 'మాలిక్' చరణాలకు సమర్పితమైపోయింది అని వ్రాస్తున్నప్పుడు నాకు అత్యంత ఆనందం కలిగింది. అస్థిత్వం లేకుండా ఉండి, అందరి ప్రయోజనార్థం మన శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క దైవీయ శుభ ఆహ్వానంగా అయిపోయింది. ఈ అనంత యాత్రలో నాకు మరియు నా బాబూజీకి మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాల సాహిత్యం ఏదైతే లభ్యమైందో అదే వివరించబడింది. **'వారి' కృప యొక్క అనంత ధారలో తడిసిన నా అనంతయాత్ర యొక్క ఆద్యంతాలు నా బాబూజీ మహరాజ్ చరణాలను స్పర్శించి అనంతమైపోయాయి. 'వారే' ఈ లేఖా సంకలనానికి 'అనంత యాత్ర' అని నామకరణం చేశారు.** ఈ 'అనంత యాత్ర' పుస్తకం చదివేవారి హృదయాల్లో 'శ్రీ బాబూజీ మహరాజ్' యొక్క అనంత కృపాధార యొక్క ప్రవాహం ప్రవహిసస్తూ ఉంటుందని నేను ఆశిస్తున్నాను. నా ఈ ముందు మాటల లేఖనం (రచన) మరియు లేఖిని  (కలం) 'వారి' దివ్యప్రతిష్ట యొక్క అనుపమానమైన గౌరవాన్ని పొంది ఆనందభరితమైపోయాయి.

ఈ అనంత యాత్ర పుస్తకంలో ఉన్న రెండు శబ్దాలు, పాయింట్ '$K_2$' మరియు పాయింట్ '$L_2$' విశేషించి మహనీయమైనవిగా ఉన్నాయి. పాయింట్ '$K_2$'ను గురించి శ్రీ బాబూజీ మహరాజ్ ఈ విధంగా వ్రాశారు: **'$K_2$' పాయింట్‌లో నిన్ను ప్రవేశపెట్టినమీదట నీ 'బ్రహ్మరంధ్రం' యొక్క స్థానం తెరవబడినట్లుగా నేను చూశాను. అది ఆత్మ యొక్క ప్రవేశం మరియు నిష్క్రమణ ద్వారంగా ఉంటుంది. అందువలన నేను నిన్ను నా హృదయంలోకి తీసుకొని ఎగిరి దూకినట్లుగాచేసి 'బ్రహ్మరంధ్రం' అవతల ఉన్న '$L_2$' పాయింట్‌మీద స్థిరపర్చాను"** అని వ్రాసిన తర్వాత, వారు **"ఇప్పుడింక పాయింట్ యొక్క పరిశోధన పూర్తయిపోయింది. ఇంక ఎదుట (Central Region) కేంద్రమండలం ఉన్నది" అని కూడా వ్రాశారు.**

నేను సోదరి కేసర్‌కు చాలా ఋణపడి ఉన్నాను. ఎందుకంటే, ఇప్పటివరకు నా ప్రింట్ అయిన పుస్తకాలన్నింటికి కూడా హిందీ మరియు ఇంగ్లీషు అనువాదాలు కూడా శుద్ధప్రతులు (Fair Copies) తయారుచేసే పనిని ఆమె చేపట్టింది. ప్రెస్‌లో నా పుస్తకాలు ప్రింట్ అవ్వటానికి తోడ్పడిన సోదరులకు కూడా నేను ఋణపడి ఉన్నాను. ఎందుకంటే, వారు ఈ పుస్తకాలు గౌరవప్రదంగా తలంచి, తమ స్వంత ప్రచురణల మాదిరిగానే భావించి ప్రింట్ చేశారు. **మన శ్రీ బాబూజీ మహరాజ్ కృప ప్రపంచంలోని అందరి హృదయాలను ప్రక్షాళనంచేసి పవిత్రవంతంగా చేయాలని 'మాలిక్'ను ప్రార్థిస్తున్నాను.**

**సదా శ్రీ బాబూజీ మహరాజ్ సేవలో**



కస్తూరీ చతుర్వేది

# అనంత యాత్ర - 5వ భాగం

## ఉత్తరం సంఖ్య - 701

లఖీంపుర్,
19.03.1959

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. చాలా రోజులుగా తమ నుంచి ఉత్తరం రాలేదు. బహుశా తమరు ఇంకా ఇతర పనుల్లో నిమగ్నమై ఉండవచ్చు. ఏం ఫర్వాలేదు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఉన్న దశ ఎలా ఉందంటే, పూజ చేస్తున్నాగాని లేక చేయిస్తున్నగాని సమయంలో నా స్థానం ఖాళీగా ఉన్నట్లు అనిపిస్తోంది. ఈ విధమైన ఆలోచన ఉండటం మాత్రమే కాకుండా అసలు నిజంగా ఏమవుతున్నదో తెలియక నేను స్వయంగా ఆశ్చర్యంలో పడిపోతున్నాను. ఇది పూజకు సంబంధించినంతవరకే కాకుండా అదే నా దశగా అయిపోయింది. ఇప్పుడు లోపల, బయట అంతా స్వతంత్రంగా అయిపోయినట్లు లేదా విముక్తమైపోయినట్లు అనిపిస్తోంది. లోన, బయట అంతటా మరియు కణకణంలోను 'బకా' అంటే 'బకా'గానే అయిపోయినట్లుగాను, లోన, బయట కణకణమూ విముక్తమై పోయినట్లుగాను ఉంది. అన్ని బంధనాలు, అడ్డంకులు త్రెంచుకుని సర్వస్వతంత్రురాలిగా అయిపోయాను. కాని సద్గురువు యొక్క అంబులపొద నుంచి శిరస్సులోకి సంధించిన బాణం కూడా గాయపర్చకుండానే లోపలికి ప్రవేశించి గ్రుచ్చుకుపోయింది. దానితో ఏ దశ అయినాగాని శాంతి లేకుండా చేస్తోంది. అప్పుడప్పుడు, అసలు నా ఈ జన్మ అశాంతి కొరకే కల్పించబడిందా అన్న ఆలోచన మనస్సులో కలుగుతోంది. అయినప్పటికీ 'మాలిక్'వైపు నుంచి ఒక వెచ్చదనం (Fomentation) లేదా ప్రేమ యొక్క వెచ్చదనం తప్పనిసరిగా ప్రతిదానిని పరిమిత స్థితిలో ఉంచుతున్నట్లు అనిపిస్తోంది. అయితే ఇంకొక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, నా దశ ఇప్పుడు ఈ వెచ్చదనం లేదా పరిమిత (Fomentation or limited) అవస్థ నుంచి దాటిపోయినట్లుగాను మరియు అంటనట్లుగాను ఉంటున్నది. నేను తమకు వ్రాయలేనటువంటి కొన్ని ఆశ్చర్యకరమైన విషయాలు నాలో ఉన్నట్లుగా నేను చూస్తున్నాను.

ఇప్పుడు నా దశ ఎలా ఉందంటే, చనిపోయిన వానిని ఎవరో గిచ్చి పారిపోయినట్లుగాను లేదా హెచ్చరిస్తూ దూషణ వాక్యాలు పలికినట్లుగాను ఉంది. మృతశరీరాన్ని స్నానం చేయించేవాని చేతిలో ఉన్నట్లు ఉంది అనగా అతడ్ని నగ్నంగానైనా ఉంచవచ్చు లేదా వస్త్రం అయినా ధరింపజేయవచ్చు!

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 702

లఖీంపుర్,
4.04.1959

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. నాకు ఇప్పుడు తగినంతగా శక్తి కలిగింది. 'మాలిక్' కృప నాకు ఆంతరిక శక్తిని సమకూర్చింది. అందుకు 'అతని'కి ధన్యవాదాలు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు దశ ఎలా ఉన్నదంటే, దానిలో ఎటువంటి జ్ఞానంగాని, జ్ఞానం లేకుండా కలిసి ఉండటంగాని, ఆనందంగాని, ఆనందం లేకుండా కలిసి ఉన్నట్లుగా గాని లేదు. ఉనికి తెలిసినట్లుగా గాని, తెలియనట్లుగా గాని లేదు. నా ఈ దశలో నాకేమీ తెలియదు అని చెప్పటానికిగాని, తెలియకపోవటం వంటిది ఏమిలేదని చెప్పటానికిగాని వీల్లేకుండా ఉంది. ఏది ఎలా ఉన్నా నిర్జీవమైపోవటంగాని, (Spring) శోభగాని ఉండటం లేదు. ప్రేమ, ద్రవించటం మరియు భక్తి లేవు. ఎందుకోగాని నా తనువు, మనస్సు మరియు సౌభాగ్యం అన్నీ 'మాలిక్'యే అను దృఢ విశ్వాసం నా లోపల నెలకొని ఉన్నది. నా ఆత్మ కూడా నా ప్రియమైన శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క స్వరూపమే దాల్చటం ఆరంభమైనట్లుగా ఉంది.

ఇప్పుడు ఈ దశ పూజ (ధ్యానం)కు పూర్వం ఉన్నట్లుగానే ఉంది. దాని మీద ఎటువంటి ముసుగు లేదు. దానిని ఏ ఆచ్ఛాదనం కప్పలేనట్లుగాను, ఎంతమాత్రం దాచలేనట్లుగాను ఉంది. దశయే కాదు, శరీరం యొక్క కణకణం, లోపల, బయట అన్నీ ముసుగుతో కప్పబడి లేవన్నట్లుగా ఉంది. అయినా కాని మనస్సు తపిస్తోంది. ప్రశాంతత లేదు. ఎందుకంటే, లక్ష్యం మీద నా దృష్టి ఒక్క క్షణం కూడా లగ్నం కావటం లేదు. ఎంత ప్రయత్నించినా కూడా ఆ తపన నాలో ఉత్పన్నం కావటం లేదు. ఇంకా ఏమిటంటే, ఆధ్యాత్మిక విషయాలుగాని, ఈశ్వరీయ విషయాలుగాని ఏవీ నాకు ఇప్పుడు రుచించటం లేదు. నా ఈ దశను చూస్తూ ఉంటే, దానిని ఇప్పుడు నాకు తపనగా ఉందనిగాని, విలవిలలాడి పోతున్నాననిగాని చెప్పటానికి కూడా సిగ్గుగా ఉంది. ఇప్పుడు తపన చెందటానికి హృదయం తపిస్తూ ఉన్నది. ఎందుకో తెలుసా? ఆ విధంగా తపన చెందటానికి మరియు (Restlessness) తహతహలాడటానికే. (Restlessness) అశాంతినైనా పొందటానికి శాంతి ఉండటం లేదు. ఇంక అశాంతి కూడా దక్కటం లేదు. 'మాలిక్' కొలువులో ఎంతో మాయలాట ఉంది.

హృదయం మీదనే కాదు, అంతరంగంలో కూడా దృష్టి ఒక్క సెకను కాలమైనా నిలవటం లేదు. ఆ దృష్టికి అప్పుడు అక్కడ 'మాలిక్' ఉండేవారేమో నాకు తెలియదు. కాని ఇప్పుడు దానికి ప్రియతముడైన 'మాలిక్' అక్కడ లేకపోయేసరికి, బహుశా అందుకే తిరిగి వస్తున్నదేమోనని అనిపిస్తోంది. నా బాబూజీ, నా దశ ఇప్పుడు బాగా శిథిలమై పోయింది. నాకు తమరే దిక్కు. తపనతో మరణిస్తాను. 'బాబూజీ', 'బాబూజీ' అని నాకు తెలియకపోయినా హృదయం నుంచి ఆ ఆర్తి వెలువడుతూనే ఉంటుంది. నా దశ "మనస్సు స్థిరం, చిత్తం స్థిరం, రూపం స్థిరం, సకల శరీరం స్థిరం" అన్నట్లు ఉంది, అని తమకు వ్రాశాను. కాని అది అనగా ఆ (Stable) స్థిరత్వం ఇప్పుడు ఎక్కడా లేకుండా పోయింది. అంగాంగాల్లోను, కణకణంలోను (Instability) అస్థిరత్వమే నెలకొని ఉంది. స్థిరత్వానికి స్వయంగా తిలోదకం ఇచ్చినట్లుగా ఉంది. అస్థిరత్వం కూడా ఉందో లేదో నాకు తెలియదు. నేను చెడిపోయానో, బాగున్నానో తెలియదు కాని, ఏదీ నా వశంలో లేకుండా ఉంది. రెండు పిడికిళ్ళూ తెరవబడి ఉన్నాయి. లోనగాని, బయటగాని ఎటువంటి బంధనాలు లేవు. ఇంకేముంది, తపించటం కోసం తపించిపోతున్నాను.

నాకు ఏమయ్యిందో తెలియకుండా ఉంది, ఏమిటంటే, నా మనస్సు తమరే అయిపోయినట్లు చూస్తున్నాను. ఎందుకంటే, ఇప్పుడు నాకు నేనుగా అయిపోవాలను దిగులుగాని, పాడైపోకుండా ఉండాలను చింతగాని లేవు. క్రిందికి దిగజారినా గాని, పైకి ఎదుగుతున్నా గాని లెక్కచేయను. నా మనస్సులో నాకు సంబంధించిన విషయాలలో నన్ను వేరుపరచుకున్నాను. అది నా బాగు కోసమైనా సరే, నా చెడుకోసమైనా సరే. అసలు ఎప్పుడూ నాదంటూ ఏమీలేనట్లుగా నా సంబంధం తెగిపోయింది. అది, ఎంతవరకు అంటే, ఆఖరికి ఆధ్యాత్మికతతో కూడా సంబంధం తెగతెంపులు చేసుకుని వేర్పడిపోయింది. అంతేకాదు, దాని ప్రియతముడైన 'మాలిక్' యొక్క బందీగా ఉండేది, కాని ఇప్పుడు అదీ పారిపోయింది. ఇప్పుడైతే మనస్సును నాది అని చెప్పటానికి కూడా దానితో నాకు స్వంత సంబంధం లేకుండా పోయింది. నా 'మాలిక్', అలా అయినాగాని అది (మనస్సు) తన పాపాల వలలో (తప్పుల్లో) 'మాలిక్'ను

బంధించి వేసింది. ఎందుకంటే, ఎప్పటివరకు తప్పుల గురించిన తపన యొక్క తపన ఉంటుందో, వాటిని తొలగించటానికి 'మాలిక్'కు స్వయంగా బాధ్యత ఉంటుంది. ఇప్పుడు "ప్రభూ, బినా భక్తి తారొ, తబ్ తారిబొ తిహారొ హై" అనగా "ఓ ప్రభూ! నాలో భక్తి లేకుండానే నీవు నన్ను ఉద్ధరించినట్లయితే అది నీ ఘనతగా ఉంటుంది" అనిపిస్తోంది. ఇక్కడ పాపాలు అంటే నా ఉద్దేశ్యంలో నా తప్పులు (Shortcomings) మరియు అజ్ఞానం (Ignorance) అని భావన.

ఎందుకోగాని, తరచుగా నేను కేసర్ చెంత ఉన్నానా లేక ఎక్కడ ఉన్నాను, అను భ్రమ కలుగుతోంది. ఇదే పరిస్థితి రైలు ప్రయాణంలో కూడా ఉంది. మాటి మాటికి సామాను వంక చూస్తూ ఉంటే, నాకు కూడా సామాన్లు ఉన్నాయి అని పదే పదే గుర్తు చేసుకోవాల్సి వస్తోంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 703

బళ్ళారి క్యాంపు,

20.05.1959

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరం గుల్బర్గాలో అందింది. నేను 4,5 చోట్ల తిరిగి బళ్ళారి చేరుకున్నాను. ఇక్కడి నుండి మే 22న తిరుపతికి వెళ్తాను. 31వ తేదీకి మద్రాసు వెళ్ళి 2 రోజులు ఉండి, తర్వాత తిరుచినాపల్లిలో 4 రోజులు ఉంటాను. తిరుగు ప్రయాణంలో మళ్ళీ మద్రాసులో 2 రోజులు గడిపి తర్వాత విజయవాడలో 5 రోజులు ఉంటాను. అక్కడి నుండి షాజహాన్‌పూర్ వెళ్తాను. శ్రీ రాఘవేంద్రరావు శాఖ (బ్రాంచి)లో షుమారు 70 మంది అభ్యాసులు ఉన్నారు. ఇంకా పెరిగే అవకాశం ఉంది.

మే 2వ తేదీన నిన్ను '$S_1$' స్థానం మీదకు చేర్చాను. అక్కడి స్థితిని నీవు సామాన్యత (Simplicity) రూపంలో ఉన్నట్లు ఉత్తరంలో వ్రాశావు. ఆ సామాన్యత యొక్క అంతం కూడా కావలసి ఉంది. ఇప్పుడు నీకు అలుపు అనిపించటంలేదని అనుకుంటున్నాను. చౌబేజిగారి ఆరోగ్యం కుదుటపడిందని తెలిసి సంతోషించాను.

అమ్మగార్కి ప్రణామం. నీ సోదర సోదరీలకు ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 704

లఖీంపుర్,

3.06.1959

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు వ్రాసిన ఉత్తరం చేరింది, సమాచారం తెలిసింది. ఇక్కడ కూడా అందరూ కుశలమే. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశ ఎలా ఉందంటే, కలం ఎందుకు నిలిచిపోయిందో తెలియటం లేదు. వ్రాయటానికి సన్నద్ధమై కూర్చుంటే, ఆలోచనకు ఏమి రాకపోతే ఏమని వ్రాయగలను? ఒక విచిత్రమైన దశ, దానిని (Strange monotony) ఉదాసీనత అని చెప్పలేను కాని, ఒక శూన్య దశయే నా లోన, బయట వ్యాపించిపోయింది. ఇంతేగాకుండా నా స్వభావంలో కూడా ఒక (Natural emptiness) స్వాభావిక శూన్యతయే ఏర్పడిపోయింది. అది ఏమిటోగాని,

పురోగమనంలో అలసట కలగ్గానే మనస్సు త్రుళ్ళిపడుతోంది. ఏ పనిలోను, మనస్సు లగ్నం కావటం లేదు. ఒక విచిత్రమైన దశ నా స్వాధీనంలో లేనిది, అశాంతికరమైనది ఉంటోంది. అయితే అలసట తీరిపోగానే దశలో పునరుజ్జీవనం కలుగుతోంది. అప్పుడు మనస్సు స్వభావసిద్ధంగానే స్థిరంగా ఉంటోంది. నా దశ ఎలా ఉందంటే, 'తమ' యొక్క జ్ఞాపకం, నావైపు నుంచిగాని, తమరివైపు నుంచిగాని ఉన్నంతవరకు, నా జీవనం మరియు గమనం ఉంటోంది. అలాకానపుడు, కేవలం బూడిద అంటె బూడిదగానే (అనగా నిర్జీవంగానే) ఉంటోంది. ఈశ్వరీయత్వం (Godliness) మరియు ప్రాపంచికత్వం (Worldliness) రెండిటిని పిండేసి నా జీవితంలో నుంచి ఎవరో వాటిని నిస్సారంగా చేశారనిపిస్తోంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 705

లఖీంపుర్,

8.06.1959

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్య మాస్టర్ సాహెబ్‌గార్కి తమరు వ్రాసిన లేఖ వచ్చింది. చదివి ఆనందించాను. నేను నా ఆరోగ్యం కోసం తప్పకుండా శ్రమ తీసుకుంటాను. తమరు వ్రాసిన ప్రతి శబ్దం నా నరనరాల్లో ప్రవేశించి శక్తిని సమకూర్చుతోంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నా దశ ఎలా ఉందంటే, నాకు ఏమి తెలియనిదానిని గురించి నేను వ్రాస్తున్నాను. నాకు అర్థంకానటువంటి దానిని గురించి నేను మాట్లాడుతున్నాను. ఈ దశ ఏమిటోగాని, 'మాలిక్' తన పేదరాలైన కుమార్తె యొక్క సంస్కారాల ఆచ్ఛాదనలను ఉన్నవి ఉన్నట్లుగానే తీసివేశారు. నేను 'మాలిక్'కు ఏమైనా ఇవ్వవలసి ఉందో లేక తీసుకోవాల్సి ఉందో కూడా మరచిపోయాను. అంతేకాదు, 'వారి'ని జ్ఞాపకం ఉంచుకోవటం కూడా మరచిపోయాను. ఇప్పుడు లోపల, బయట ప్రతికణం యొక్క సంబంధం నాతో తెగిపోయి అంతమైపోయినట్లుగా ఉంది. రోజులు గడుస్తున్నా, అశాంతి ఒక్క క్షణమైనా అదుపులేకుండా అది వృద్ధి చెందుతూనే ఉంది. తపన అనేది ఒక వ్రణం (కురుపు) లాగా అయి బాధిస్తోంది. లోన, బయట అంతటా, కణకణం నుంచి తన మాయను సంతరించుకొని మాయాపతి అంతర్థానమైపోయినట్లుగా ఉంది. నా లోపల, బయట మొత్తం కుబుసాన్ని (ఆచ్ఛాదనం) తొలగించి ఆ టక్కరి నన్ను మోసగించి ఏమైపోయాడో తెలియదు. ఇప్పుడు నేను ఎక్కడ ఉన్నానో, ఏమి చేస్తున్నానో లేదా ఏమి చేయాలో కూడా తెలియటం లేదు. ఇది విస్మయం కలిగించేదిగా ఉన్నా కూడా నేను ఆశ్చర్యపోవటం లేదు. రంగు అంతా కృత్రిమంగా ఉండటం వలన ఎండలో వివర్ణమైపోతాయి అన్నట్లు ఉంది. ఇప్పుడు నా దశ ఎలా అయిపోయింది అంటే, రంగు అంతా వివర్ణమైపోయి నాకేమి తెలియకుండా ఉంది. 'మాలిక్' దయతో దశలోనైతే మార్పు కలుగుతూనే ఉంది. దానితోపాటుగానే ఉన్నతి కూడా కలుగుతూనే ఉంది. ఒక దశ నాలో సరిగ్గా ఇలాగే ఉంటున్నది. అది అపరివర్తనశీలమైనదిగా ఉండి మార్పు చెందటం లేదు. అయితే ఇప్పుడు మార్పు చెందే దశ ఏదైతే ఏర్పడుతుందో, అది మారిపోయి అపరివర్తనశీల దశ (అనగా మార్పు చెందని దశ)లో కలిసిపోయి దానితో ఒకే రకంగా అయిపోతున్నది. కనుక ఇప్పుడు అంతా మార్పు చెందని దశగానే అయిపోయింది. ఇప్పుడు లోన ఉంటున్న ఏకైక దశ ఎటువంటిది అంటే, దాని వైఖరి (attitude) మరియు నిరంతర ధ్యాస దినదినాభివృద్ధి చెందటం మీదనే నిలిచి ఉంటోంది, కనుక అదే అశాంతికరంగా ఉంది. అసలు ఇదంతా ఏమిటో నాకైతే తెలియదు.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 706

లఖీంపుర్,
22.06.1959

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నేను పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా పంపిన నా ఉత్తరం తమకు చేరిందని అనుకుంటున్నాను. ఇప్పుడు 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు నా దశలో, నాలోపల ఎక్కడో ఒక అంతుబట్టని బాధ దాగి ఉన్నట్లుగా ఉంది. దాని నుంచి విశ్రాంతి పొందటానికిగాని, అనుభవించటానికిగాని శక్తి లేకుండా ఉంది. మరొక ఉపాయమూ లేకుండా ఉంది.

నా దశ ఎంత శూన్యంగా అయిపోయింది అంటే, చేతికి సూది గ్రుచ్చుకుపోయినాగాని, చేయి కొంచెం కాలిపోయినాగాని అది ఎవరికి సంబంధించిన చేతికో తెలియటం లేదు, కాని నాకయితే స్పృహ ఉంటూనే ఉంది. మనస్సు కోల్పోయిన స్థితి ఉండటం లేదు. పనిపాటల్లో ఎప్పుడు ఏ లోపం కలగటం లేదు. అదేమిటో తెలియదు. అదేమిటోగాని 'మాలిక్'ను జ్ఞాపకం చేసుకునే జ్ఞాపకం కూడా రావటం లేదు. నీటి నుంచి బయటపడిన చేప స్థితి వంటిదిగా నా దశ ఉన్నట్లు ఉంది. ఇప్పుడు హృదయం, మనస్సు ఒక్కటిగా అయిపోయిన దశలాగా ఉంది. ప్రపంచపు దురాలోచనలు లేక దుష్ట వ్యవహారాలు లేదా గుణావగుణాలు ఏవీ దరిచేరనట్లుగా ఈ దశ ఉంది. అంతే కాకుండా, ఆలోచనలు, మంచి-చెడు, పవిత్రత-అపవిత్రత అనేవి కూడా దశకు చేరటం లేదు. ప్రాపంచిక మురికికి అతీతంగా ఒక చలించనిది మరియు విరామంలేని స్థితిగా ఉంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 707

లఖీంపుర్,
12.07.1959

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. నా ఆరోగ్యం బాగుంది. తమరు కూడా ఆరోగ్యంగా ఉన్నారని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు సిట్టింగ్ నావలన కావటం లేదు. తమ నుంచి సిట్టింగ్ తీసుకుంటున్న సమయంలో కూడా ఇదే దశ ఉంటోంది. అయితే ఒక క్రొత్త విషయం చూస్తున్నది ఏమిటంటే, లోలోపలనే దానంతట అదే నాకు తమరి నుంచి సిట్టింగ్ లేదా ఏదైనా సహాయం కలుగుతూ ఉంది. నీటిలో లేని చేప ఏ విధంగానైతే గిలగిల కొట్టుకుంటుందో నా దశ ఆ విధంగా ఉండి, నా లోలోపల ఏదైతే నాకు కలుగుతూ ఉన్నదో, అది లేనట్లయితే ప్రాణం ఒక్క సెకను కూడా నిలవదన్నట్లుగా ఉంది. అప్పుడప్పుడు తపన అనేది హద్దుమీరుతున్నప్పుడు, తమ స్వరూపం ఒక్క క్షణకాలం హృదయంలోకి వచ్చి వెంటనే మాయమైపోతూ ఉంది, అప్పుడు కొంత శాంతి లభిస్తోంది. జ్ఞాపకం యొక్క జ్ఞాపకం కూడా రాకపోతే రాకపోవచ్చును, కాని నేను చేయగలింది ఏమీ లేకుండా ఉంది. నిజం ఏమిటంటే, 'మాలిక్' నన్ను

ఈ విధంగా తహతహలాడేట్లుగా చేశారు. లేకపోతే నా ఫిర్యాదు (Complaint) అర్థంతరంగానే ఉండిపోతుంది. ఎప్పుడైతే 'మాలిక్' వాణి– "తప్పు నీది, 'మాలిక్' దృష్టిని నీ ఆలోచనలోకి తెచ్చుకోలేకపోతున్నావు" అని వినిపిస్తుందో, అప్పుడు ఎటువంటి దశ ఉంటుంది అంటే, ఎక్కడైతే మంటలు, దురదలు మరియు బాధలు ఉన్నాయో అన్నీ పూర్తిగా తొలగిపోయినట్లుగా ఉంటుంది.

ఇప్పుడు కలుగుతున్న దశలో, ఎందుకోగాని, సమస్త ఈశ్వరీయ శక్తి నా ఆజ్ఞ కొరకు నిరీక్షిస్తున్నట్లు ఉంది. నేను దీనిని చూసి, ఆ శక్తిని యావత్ భారతదేశంలోను, లఖీమ్‌పుర్‌లోను మరియు సమస్త భూతలం మీద, ఇంటింటా అన్ని మార్గాల్లోను మరియు నగరాలు అన్నింటిలోను శ్రీ రామచంద్ర మిషన్ యొక్క ప్రచారం కావటానికి వినియోగించాను. జనులందరిలోను ఉత్సాహం, ప్రేమ మరియు పట్టుదల పెరగటానికని సమస్త శక్తిని ఇందుకు వినియోగించాను, అలాగే జరిగి తీరుతుంది, అందులో సందేహం లేదు. ఇంకొక విషయం ఏమిటంటే, సాధ్యపడితే అతిశీఘ్రంగా నన్ను నా 'మాలిక్' వద్దకు చేర్చాలని కూడా నా ప్రార్థనగా ఉంది. ఇది ఒక విచిత్రమైన దశగా ఉంది. ఎందుకంటే, ఒక ప్రక్క దివ్యాధికారం, మరోవంక విన్నపం ఉన్నాయి. ఏమైతేనేమి, ఉన్నదంతా 'మాలిక్'కు తెలుసు. నా జీవిత దైనందిని (డైరీ) వారి చేతుల్లోనే ఉంది. వారికి ఏది ఇవ్వాలనిపిస్తే అది ఇస్తారు, ఎలా చేయాలనుకుంటే అలా చేస్తారు. అయితే నా జీవన దైనందినిలో ఇంతవరకు ఏమీ వ్రాయలేదన్నట్లు నాకు అనిపిస్తోంది. ఇంకా ఎక్కడైనా సూక్ష్మ అహం అనేది నాలో ఉన్నదా? అని నేను తమర్ని ప్రశ్నిస్తున్నాను. అయితే ఆ విధంగా జరిగే ప్రసక్తే లేదు. ఎందుకంటే, ఒకసారి తమరు "బిటియా! అహం నీలో ఎప్పటికీ ప్రవేశించదు" అని చెప్పారు. కనుక ఇంక ఆ భయమే లేదు. ఇంకొకటి ఏమిటంటే, ఇదంతా ఇలా ఉన్నా కూడా నా మనస్సు స్వతంత్రంగా ఉంది. విశేషానందంగాని, విచారంగాని లేవు. నేను ఎప్పుడు రోదిస్తానో, ఎప్పుడు నవ్వుతానో తెలియదు.

నాకు ఇప్పుడు దేహం ధరించాల్సిన దండన లేదు. ఎందుకంటే, దానితో నా సంబంధం ఎప్పుడో తెగిపోయింది. **నేను లక్షసార్లు కస్తూరీ అని పిలిచినా కూడా ఆమె ఎప్పుడూ బదులివ్వటం లేదు అని, నాకే కాదు ఇతరులెవ్వరికి కూడా ఆమె జవాబు ఇవ్వటంలేదని నేను గమనిస్తున్నాను.** ఇంకొక వింతైన దశ ఏమిటంటే, అప్పుడప్పుడు నేను మాస్టర్ సాహెబ్‌కు కూడా తల్లివంటి దానినిగా ఉన్నట్లుగాను, వారు పూర్తిగా నాకు ఒక బాలుడిలాగా అనిపిస్తున్నట్లుగాను, అప్పుడప్పుడు వారిని నేను ఆజ్ఞాపిస్తూ ఉంటాను. అయితే అప్పుడప్పుడు నేను వారి చిన్న కుమార్తెగా అయిపోయినట్లుగా అనుభూతి చెందుతున్నాను. ఇదంతా ఏమిటో తెలియటం లేదు. నా ఆంతరిక స్థితి ఎలా ఉందంటే, నేను పూర్తిగా ప్రాపంచిక విషయాలలో కూరుకుపోయిన సాధారణ ప్రాణిలాగా ఉన్నాను. ఎలా అంటే, దాని నుంచి విముక్తి చెందాలను జ్ఞానమే లేనట్లుగాను, ప్రాపంచికమైన మరియు ఆధ్యాత్మికమైనట్టి ఇతర కోర్కెలే ఏమీలేనట్లుగాను ఉంది. ఈ విధంగా ప్రాపంచికమైన దానిపట్ల ఎంత అనురక్తి ఉంటున్నా కూడా, చేప నీటి నుంచి బయటపడినపుడు ఏ విధంగా విలవిల్లాడుతుందో అదే విధంగా నా ఆంతరికం తపించిపోతున్నట్లుగా నా ఈ దశలో ఉంటోంది. నేను ప్రకృతికి మాత్రమేగాక సమస్త విశ్వానికి సమాచారం మరియు ఆజ్ఞ ఇస్తున్నట్లుగా ఉంది, కాని నేనయితే అలా ఇవ్వటం లేదు. నేను ఏమీ కోరనట్లుగా ఉంటున్నాను, కాని 'మాలిక్' నుంచి అన్నీ కోరుకుంటున్నాను. ఎవ్వరికైనా ఏదైనా కష్టంగాని, కొరతగాని ఏర్పడినట్లు నా దృష్టికి వచ్చినపుడు, అతడు ఎటువంటి వాడైనాగాని, అతని శ్రేయస్సు కొరకు 'మాలిక్'ను ప్రార్థిస్తున్నాను. ఈ దశలో శరీరంలో తత్వమే ఏమి లేనట్లుగా ఉంది. నయనాల్లో చూపు, వీనుల్లో శ్రవణం మొదలైన తత్వాలేమీ లేనట్లుగా ఉంది. ఎప్పుడు ఏది, ఎలా చూడగలుగుతున్నానో, వినగలుగుతున్నానో నాకు తెలియకుండా ఉంది. చివరకు అనుభవంలో కూడా ఏ తత్వమూ లేకుండా పోయాయి. అది ఆత్మిక దశను అనుభవిస్తున్నాగాని, కాకపోయినాగాని అలాగే ఉంటున్నది. ఇటువంటి దశలో నాకు ఒక చింత మాత్రం ఉంటుంది. అది ఏమిటంటే, పెద్దవాళ్ళ విషయంలో ఎటువంటి అమర్యాదకరమైనవి జరగరాదని తప్పకుండా అనిపిస్తుంది.

ఒకవేళ నా వలన ఏదైనా తప్పు జరిగి ఉంటే, దానిని క్షమించవలసిన బాధ్యత పెద్దలమీద ఉండునట్లుగా చేయమని నేను 'మాలిక్'ను ప్రార్థిస్తున్నాను. ఇప్పుడు దీనిని 'మాలిక్'యే సరిచూసుకుంటారు. ఎందుకంటే, అంతటా లోన–బయట, నా కణకణంలోను ఒక నూతన శక్తి ప్రసారమవుతూ ఉన్నట్లుగాను, దానిలో ఆధిపత్యం ఉన్నట్లుగాను అనుభూతి చెందుతున్నాను. అయినప్పటికీ నా దృష్టి మాత్రం 'మాలిక్'వైపుకే మరల్చి ఉన్నాను. 'అతడే' అంతా సమర్థించుకుంటాడు. మిగిలినదంతా తమకే తెలుసు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 708

లఖీంపుర్,

16.07.1959

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నేను ఒక ఉత్తరం వ్రాసి పంపాను. అది తమకు చేరిందని అనుకుంటున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు రోజులు గడుస్తున్నకొద్దీ, నా తపన ఒక పుండులాగా నన్ను బాధిస్తోంది. కాని ఈ బాధ ఎలా ఉందంటే, స్వప్నంలో ఏర్పడిన ఒక వ్రణం యొక్క బాధలాగా ఉంటోంది. ఇది ఒకప్పుడు అనుభూతికి వస్తుంది, మరొకప్పుడు ఏమీ లేకుండా పోతుంది. కాని ఇప్పుడు ఈ బాధ కూడా నా స్వరూపంలో కలిసిపోయినట్లుగా ఉంది. దీని యొక్క అనుభవం కలుగుతూ ఉన్నా కూడా లేనట్లుగా ఉంటుంది. ఏదైతే ఏమిగాని, ఈ బాధయే ఇప్పుడు నా పరమ సుఖమను దీపపు కాంతిగా ఉంది. ఇప్పుడు శరీరం (Simplicity) సరళత్వం మరియు (Nothingness) శూన్యత యొక్క రూపంగా అయిపోయింది. వీటి యొక్క అస్థిత్వం కూడా ఇప్పుడు కనిపించటం లేదు. ఈ దశ ఎటువంటిది అంటే, నాలో చైతన్యంగాని, కాంతిగాని ఎటువంటివీ లేవు. 'మాలిక్' మాత్రం నన్ను తపింపజేసి చంపేశారు. ఇప్పుడు ఆ తపన కూడా తొలగిపోతోంది. ఇప్పుడు దశ చలనం లేనిది, విరామం లేని గమనంగా ఉన్నట్లుగాను మరియు మార్పు చెందనిదానిగాను అయిపోయింది. ఇప్పుడు దశలో లోలోపలనే ఒక సహజమైన మార్పు (Natural change) కలుగుతూ ఉంది. కాని దానిని చెప్పలేకపోతున్నాను. వ్రాయాలను తలంపు ఉన్నా కూడా దానిని వ్యక్తం చేయలేకపోతున్నాను. అయినా కూడా లోలోపలనే 'మాలిక్' అంతా తనంతటతనే వింటున్నట్లుగా ఉంది. ఇప్పుడు 'మాలిక్' మరియు నా ఆంతరికం ఏకం అయిపోయి ఒకే ప్రశాంత సాగరంగా ప్రవహిస్తున్నట్లు ఉంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. కేసర్ ప్రణామం చెబుతోంది. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 709

లఖీంపుర్,

23.07.1959

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. చాలా రోజులుగా తమ నుంచి ఉత్తరం రాలేదు. దయచేసి తమ సమాచారం వెంటనే తెలియజేయండి. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ప్రతిక్షణం 'మాలిక్'ను కలవాలనే తపన కలుగుతోంది. ఇంకొక విషయం ఏమిటంటే, స్వప్నంలో కూడా ఎప్పుడూ ఎటువంటి కోరిక కలగటం లేదు. మనస్సే కరిగిపోయి అంతులేకుండాపోతే, ఇంక కోరిక ఎక్కడ ఉత్పన్నమవుతుంది! 'మాలిక్' నన్ను తనదిగా స్వీకరించాలనే కోరిక, ఈ తపన మనస్సులోనే కాకుండా నా కణకణంలో ఎందుకు చొచ్చుకుపోయి ఉంటుందో, అది ఎక్కడ, ఎందుకు వేధిస్తున్నదో తెలియటం లేదు.

ఈ దశలో ఎలా అనిపిస్తోంది అంటే, ఒక్క క్షణమైనాగాని ఎప్పుడైనా స్పృహ యొక్క ఎరుక పొగలాగ మనస్సులోకి వస్తే, అప్పుడే స్పృహ లేకపోవటం గురించిన తలంపుకు వస్తోంది. ఆలోచనలన్నీ కూడా పొగలాగా మనస్సులోకి వచ్చి పోతున్నాయి. వాటిని గురించిన రూపంగాని, అభిప్రాయంగాని ఉండటం లేదు. ఇంక ధ్యానం గురించి చెప్పాలంటే, ఇక్కడ తమ ఎదుట కూర్చుండి 'తమ'ను చూస్తూ ఉన్నంతసేపూ తమ రూపం యొక్క కాంతి కనిపిస్తూ ఉంటుంది. పొగలాగా (అనగా మసక మసకగా) కొంత ఏకత్వం యొక్క ఊహ కూడా అనుభవమవుతుంది. కాని ఎప్పుడైతే తమరు ఉన్న గది నుంచి మరొక గదిలోకి వస్తానో అప్పుడు వెంటనే తమరిని పూర్తిగా మరచిపోతున్నాను. ఎంత ప్రయత్నించినా కూడా జ్ఞాపకం రావటం లేదు. అంతేకాదు, తరచుగా తమరిని చూస్తూ ఉండి కూడా మరచిపోయినట్లుగానే ఉంటున్నాను. అయితే పాపం ఏదో ఒక స్పృహ (చైతన్యం), నాకు తోడుగా ఉంటున్నటువంటిది, అప్పుడప్పుడు నా 'శ్రీ బాబూజీ' యొక్క ప్రతిబింబాన్ని దర్శింపచేస్తుంది. అంతేగాకుండా, తమ మాటల ధ్వని చెవులకు సోకుతూనే ఉంటుంది. కాని అప్పుడప్పుడు ఏమవుతుంది అంటే, ఎప్పుడైతే పూర్తిగా వాటిపట్ల ధ్యాస నిలపటానికి ప్రయత్నిస్తానో అపుడు ఆ మాటల సవ్వడి ఎక్కడో దూరం నుంచి వినిపిస్తున్నట్లుగా ఉంటుంది. ఆ ధ్వని నా చెవులకు వినబడుతూ ఉన్నాగాని, అస్పష్టమైన ఆ మాటల ధ్వని మరియు ప్రేమమయమైన ఆ అస్పష్ట రూపానికే నేను అర్పితమై ఉంటాను. నేను తమ మాటల శబ్దాన్ని అధికంగా వినటానికి ప్రయత్నించినపుడు, ఇంతకంటే ఎక్కువ ధ్వని సాధ్యపడదు అని స్పష్టంగా తెలుస్తుంది. ఇంతకంటే బాగా చూడటానికి తగిన కాంతిగాని, బాగా వినటానికి అవసరమైన శ్రవణశక్తిగాని లేవు. అప్పుడు నిరాశ చెందుతున్నాను. ఇంకొక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, తమ మాటలు వ్రాయటానికి సిద్ధపడినపుడు అన్నీ వ్రాయగలుగుతాను ఏమీ మిగలకుండానే. అందుకు నా (Sub-Conscious mind) సుప్తచేతనా మనస్సు నాకు సహాయకారిగా ఉంటుంది, కాని అది కూడా నన్ను వెన్నంటి ఉండదు. నాతో సంబంధం కల్పించుకొని ఉండదు. తమరిని స్మరించటానికి, ధ్యానం చేయటానికి మరియు ప్రేమించటానికి దానితో కలిసి ఉండాలని కోరుకుంటాను, కాని నా ఈ మంచి నిర్ణయాన్ని కూడా అది అర్థం చేసుకోవటానికి సిద్ధపడటం లేదు.

ఇప్పుడు నాకు ఏమి అనిపిస్తోంది అంటే, సుప్తచేతనా మనస్సు (Sub-Conscious mind) స్థానంలో (Rough Conscious mind) సాధారణ చేతనా మనస్సు తమ రాక విషయంలో నాకు ఎంతో కొంత సహాయపడగలదు అని అనిపిస్తుంది.

ఇక్కడ ఉండి, 'తమరు' తిరిగి వెళ్ళేటపుడు వీడ్కోలు చెప్పటానికి బస్‌స్టాండ్ వరకు వెళ్ళలేదు. ఎందుకంటే అక్కడ అందరి ఎదుట నా బిక్కమొహం బయటపడుతుందని భావించాను. ఈ రోజు నాకు ఒక విషయం గ్రహింపుకు వచ్చింది ఏమిటంటే, ఇతరుల బాధ మరియు తపన మనం అనుభూతి చెందినట్లయితే అప్పుడు మన బాధ మరియు వేదన అంతమైపోతాయి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. కేసర్ ప్రణామం చెబుతోంది. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 710

లఖీంపుర్,

01.08.1959

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నిన్న పూజ్య మాస్టర్ సాహెబ్‌గారు వచ్చేశారు. వారి ద్వారా తమ సమాచారం మరియు ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని సంతోషించాను. కాని తమ శ్వాస గురించిన బాధ పూర్తిగా నివారణ కాలేదని తెలిసి విచారిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఎలా అనిపిస్తుందంటే, లోపలి నుండి జీవితం ధన్యమైపోయింది అను శబ్దం వస్తున్నట్లు వస్తోంది. ఈ మూగవాణి దానంతట అదే వస్తోంది కాని, ఇలా ఎందుకు లోపలి నుంచి స్వతహాగానే మాట లేకుండా మూగగా, మౌనంగా వస్తోందో తెలియటం లేదు.

ఇప్పుడు నాలోన, బయట, శరీరం మరియు మనస్సు యొక్క కణకణాలు కూడా చెదరిపోయినట్లుగాను, ప్రతికణం నుంచి 'బాబూజీ', 'బాబూజీ' అను స్వరం స్వయంగానే వస్తున్నట్లుగాను అనిపిస్తోంది. అయినా కూడా నేను దానిపై దృష్టి నిలపలేకపోతున్నాను. అందువలన మరచిపోయినదానిలాగ అయిపోతున్నాను. అయితే ఈ ధ్వని ఎప్పుడూ సమస్థాయిలోనే ఉండి సాగిపోతున్నది. నా దృష్టి దానివైపు ఉన్నా, లేకపోయినా కూడా కణకణం నా 'బాబూజీ' యొక్క జ్ఞాపకం కలగాలి అని అనుకుంటోంది. కాని నేనయితే ఒక నునుపైన కుండలాగా అయిపోయి ఉన్నాను. అనగా దానిమీద ఏదీ నిలవకుండా జారిపోతున్నట్లు ఉంటుంది. దీనిని వింటూ కూడా విననట్లుగా ఒక రాయిలాగా అయిపోయాను. నాలో సంబంధం అను మాటకు స్థానమే లేకుండా పోయింది. అయినప్పటికీ ప్రపంచంలో నా సంబంధానికి చెందిన వ్యాప్తి జరిగిపోయినట్లుగా ఉంది. ప్రతి ఒక్కరి ఆంతర్యంతోను నా సంబంధం ఉంది. ఎంత ప్రయత్నించినా కూడా నా ప్రవర్తనను ఆంతరికస్థితి నుంచి వేరుగా ఉంచలేకపోతున్నాను. నా కణకణం నుండి కేవలం 'శ్రీ బాబూజీ' 'శ్రీ బాబూజీ' అను ధ్వనియే వెలువడుతూ ఉండటమే కాకుండా కణకణం తమ అనుపమాన శక్తితో నిండిపోయి పరమానందభరితంగా అయిపోయినట్లుగా ఉంది. అయితే నేను ఒక్కర్తెను మాత్రమే ఈ విధంగా అయిపోయి ఈ ఆనందాన్నుంచి వేరే ప్రపంచంలోకి వెళ్ళి స్థిరపడినట్లుగా ఉన్నాను. అక్కడ ఉండటానికి ఏ స్థానం లేదు, లేనిస్థానమూ లేదు, జాడగాని, జాడలేకపోవటంగాని, ఇంకా ఏమైనా ఉండటంగాని, లేకపోవటంగాని లేవు. అక్కడయితే అంతా పూర్తిగా తెరవబడే ఉంది. దానితో దేనికీ సంబంధం లేనిదిగాను, దేనిని అంటిపెట్టుకుని ఉన్నట్లుగాను లేదు.

అమ్మ తమకు ప్రణామం చెబుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 711

లఖీంపుర్,

02.08.1959

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. తమరు ఆరోగ్యంగా ఉన్నారని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు కణకణం చెల్లాచెదురుగా అయిపోయాయి. అంతులేని దివ్యానందంతో ప్రతి ఒక్క అణువు లోన, బయట అంతటా నిండిపోయింది. అయితే నా దశ ఎలా ఉందంటే, దీనిని చూసి ఆనందిస్తున్నాను. నేను కేవలం

చూస్తూ సంతోషించటానికే అన్నట్లుగా అనిపిస్తోంది. నన్ను స్వయంగా ఎటువంటి దశ కూడా స్పర్శించటం లేదు. ఇంత అపరిమిత ఆనందాన్ని కూడా నేను సహించలేకపోతున్నాను. కొద్దిపాటి ఆనందం నావైపుగా వస్తుంది లేదా ఇంకొక రకంగా చెప్పాలంటే, కణకణంలో ఇంత అంతులేనిదిగాను, ప్రకాశవంతంగాను ఉన్నటువంటి ఒక్క కణం యొక్క అనుభవాన్ని కూడా నేను భరించలేకపోతున్నాను. ఇప్పుడు ప్రతిదాని నుంచి, ప్రతి అణువు నుంచి కాంతి వెలువడుతున్నట్లుగా అనిపిస్తోంది. కాని నేనే అంధురాలిగా ఉండి చూడలేకపోతున్నాను. ఈ దశ అంతా మరియు మొత్తం స్పందన (Vibration) నా హృదయంలోకి చొచ్చుకుపోతూ అక్కడ అంతా లయమైపోతున్నట్లుగా అనుభవమవుతోంది. నా హృదయం రాయిలాగా ఉండటం మూలంగా, ఇది నా దశయో లేక కేవలం ప్రేక్షకురాలిగా ఉన్నానో నాకు అర్థం కావటం లేదు. దీని ఆనందం కూడా నాకు అనుభవమవుతున్నదో, లేదో తెలియదు. అలాకాకపోయినా కూడా 'వారు' నావారు, నేను 'వారి'కి చెందిన దాననే.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 712

మద్రాసు,

08.08.1959

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరం ఆగష్టు 1వ తేదీది అందింది. చదివి చాలా సంతోషించాను. కణకణం ఈశ్వరుని జ్ఞాపకం చేసుకుంటున్నట్లుగా అనిపిస్తోంది అని, నీ స్థితిని గురించి తెలిపావు. ఇది హృదయం యొక్క నాల్గవ స్థితి. హృదయం యొక్క స్థితులన్నీ ఆధ్యాత్మిక యాత్రలో మళ్ళీ వస్తూ ఉంటాయి. ఈ స్థితి కలిగి ఉన్నా కూడా దీని అనుభూతి కలగదు. నీ స్థితిని గురించి వివరించటం చాలా దుర్లభం, కనుక నీ ఉత్తరాలకు జవాబు వ్రాయలేకపోతున్నాను. నీవు లక్నో వెళ్ళినట్లయితే అక్కడి నుండి షాజహాన్‌పూర్ రావటం సులభంగానే ఉంటుంది.

మీ పినతండ్రి అయిన జడ్జిగారు పదవీ విరమణ తర్వాత బాగా శ్రమపడుతున్నారు. వారిలో ప్రేమ అధికమవుతూ ఉంది. అలహాబాదులో కొంతమంది అభ్యాసులు ఆయనవద్దకు వెళ్ళినట్లయితే, నేను వారు శిక్షణ కార్యక్రమం చేపట్టటం ప్రారంభిస్తాను. ఆయన పాపం చాలా సరళమైన మనిషి కావటంచేత అభ్యాసులను చేర్చలేకపోతున్నారు. ఇంకొక విధంగా ఆలోచిస్తే ఆయనకు ఉన్నత శ్రేణికి చెందన వారితోనే ఎక్కువ పరిచయం ఉండటం వలన, వారిలో ఈ ఆధ్యాత్మిక శిక్షణ పొందదలిచేవారు చాలా తక్కువగా ఉంటారు.

చౌబేజీ మరియు అమ్మకు ప్రణామం. నీ సోదర సోదరీలకు ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 713

లఖీంపుర్,

12.09.1959

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం చేరింది. చదివి ఆనందించాను. యూనాని వైద్యం వలన తమ ఆరోగ్యం ఇప్పుడు ఎలా ఉంది? దయచేసి తమరు, తమ ఆరోగ్యం మీద దృష్టి పెట్టండి. ఎక్కువగా శ్రమపడవద్దు. 'మాలిక్'

కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

దశ ఇప్పుడు (Scattered) చెదిరిపోయి ఉంది. (Consolidated) ఏకీకృతంగా అనిపించటం లేదు. అందువలన మనస్సు కూడా ఏకాగ్రత (Concentration) చెందటం లేదు. అశాంతిగా ఉంటోంది, అయినా కూడా చేయి దాటి పోవటం లేదు. రెండు పిడికిళ్ళూ తెరచి ఉంచబడ్డాయి. చెదరిపోయిన దశనుగాని, చెదరిపోయిన మనస్సునుగాని కూడదీసుకునే ధైర్యం మరియు శక్తి నాలో లేకుండాపోయాయి. ఆత్మ మరియు ఆంతరికమే నాలో ఇప్పుడు ఏమీ లేకపోయినపుడు, ఆత్మిక దశ మరియు ఆంతరిక దశ కూడా ఎలా కలుగుతాయి?

ఇప్పుడు దశ యొక్క అణువులన్నీ చెల్లాచెదురైపోయాయి. నాలో వాటిని సమీకరించుకునే అవకాశమే లేకుండా ఉంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 714

షాజహాన్‌పూర్,

28.09.1959

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ రెండు ఉత్తరాలు చేరాయి. భగవంతుని అనుగ్రహం వలన నీలో మంచి స్థితి ఉంది. నిన్ను ఒక్కొక్క స్థానం (పాయింట్) చొప్పున నడిపిస్తున్నాను. మెదడు మీద ఒత్తిడి పెరుగుతున్నందువలన నిన్ను ఒక్కసారిగా తీసుకువెళ్ళడం లేదు. నీవు ఎంతగానో పురోగతి చెందుతున్నావు, ఎప్పుడూ పూజలోనే ఉంటున్నావు, పూజ నుండి వేరుపడి ఉంటున్నావు. **ద్వైతం (దైవం, అభ్యాసీ) ఎక్కడ ఉంటుందో అక్కడ పూజ ఉంటుంది. ఏకత్వ భావన (Oneness) ఏర్పడిన తర్వాత పూజ ఎవరిని గురించి చేయాల్సి ఉంటుంది? అప్పుడు అది తనకు తానుగా పూజ చేసుకున్నట్లుగా (Self-worship) అవుతుంది.**

అమ్మ, చౌబేజీలకు ప్రణామం.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 715

లఖీంపుర్,

14.09.1959

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. ఇక్కడ అందరూ క్షేమమే. తమరు కూడా ఇప్పుడు స్వస్థత చెంది ఉంటారని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ రోజు 'తమరు' నన్ను '$S_1$' పాయింట్ దాటించి '$T_1$' పాయింట్ మీదకు చేర్చారు. ఆ సమయం నుంచే నాలోపల చాలా విశ్రాంతి కలిగింది. చెల్లాచెదురైన దశ కూడా ఇప్పుడు లేకుండా పోయింది. కాని ఒక మంచి (Restful) విశ్రాంతమైనది, (Balanced) సమతుల్యమైనది మరియు (Simple) సరళమైనటువంటి (Subtle condition) సూక్ష్మమైన అవస్థ కలిగింది. అది, లోపలికి వస్తున్నది, బయటకు పోతున్నది ఏమీలేనట్లుగా ఉంది. ఇటువంటి దశలో, చాలా దూరం ప్రయాణించిన మనిషి ఒక విశ్రాంతిదాయకమైన స్థలానికి చేరుకుని నిశ్చింతగా నిద్రపోతాడో,

ఆ నిద్రలో అతనికి ఎంత హాయిగొల్పే విశ్రాంతి లభిస్తుందో, అటువంటి విశ్రాంతినే నాకు 'తమరు' రెండు నిమిషాల్లోనే అనుగ్రహించారు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 716

లఖీంపుర్,

30.09.1959

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నారాయణ దద్దాగారి ద్వారా తమ సమాచారం తెలిసింది. తమరు ఆరోగ్యంగా ఉన్నారని తెలుసుకుని సంతృప్తి చెందాను. ఇక్కడందరూ కుశలమే. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు నా దశ ఎలా ఉందంటే, నాలో ఏకత్వ భావనగాని, ద్వైత భావనగాని తెలియటం లేదు. నేను పూజతోనే వేరుపడిపోయి ఉండగా, దానిలోని ఏకత్వంగాని, ద్వైతంగాని నాలో ఎక్కడ నుండి ఏర్పడతాయి. నాకు సరైన జ్ఞానమే లేకుండా ఉంటే, ఈ ఏకత్వం, ద్వైతం లేదా మంచి, చెడు అనేవి ఎలా తెలుస్తాయి. అంతేకాదు, దీని సత్యత్వం (రియాలిటి) కూడా హృదయానికి రావటం లేదు. నాది, అన్నీ మరచిపోయిన స్థితిగా ఉంది. ఇప్పుడు ద్వైతంగాని, ఏకత్వంగాని నాకు ఎప్పుడూ విని ఉండని వాటిలాగా క్రొత్తవిగా అనిపిస్తున్నాయి. కాని ఆంతరికంగా పూజను గురించిగాని, పూజ చేయకపోవటం గురించిగాని ఏమైనా చర్చించాలనుకున్నా, అక్కడ సమశీతలత్వం వ్యాపించిపోయి, స్థిరంగా ఉండిపోయింది, అక్కడ అంతా శీతలమే ఉంటోంది. ఈ దశ, "గేదె ఎదుట వీణ వాయించినా గేదె పండుకుని నెమరు వేస్తూనే ఉంటుంది" అన్న సామెతాగా ఉంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 717

లఖీంపుర్,

22.10.1959

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం అందింది. హకీమ్ (వైద్యుడు) మందుతో తమకు మేలు సమకూరిందని సంతోషం కలిగింది. తమరు సదా ఆరోగ్యంగా ఉండాలనే ఈశ్వరునితో మా ప్రార్థనగా ఉంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు ఈ దశ ఎటువంటిది అంటే, నా లోపల ఆనందం కలిగినప్పటికీ నేను నా వశంలోకి రాలేకపోతున్నాను. ఆ పరవశత్వానికి బయటి నుండియే ఎగసిపడుతున్న దృష్టి, ఒక మరచిపోయిన బాటసారిలాగా పడి ఉంటోంది.

ఈరోజు రాత్రి స్పష్టంగా తమ మాటలులాగానే వినపడుతున్నాయి. ఏమని అంటే, "బిటియా, నీ తనువు, మనస్సు, ప్రాణం మరియు సూక్ష్మత్వానికి కారణం నేనుగా ఉన్నాను. నీవు ఇంతగా ఎందుకు చింతిస్తావు?" అని.

నేను తమ వాణిని పూర్తిగా వినగలిగానుగాని, స్వయంగా తమ దర్శనం పొందలేకపోయాను. నేను కూడా ఇప్పుడు, 'తమ' దర్శనం కలగనంతవరకు నేను తమ సాంత్వన వాక్యాలు ఏవీ వినబోను. ఆపైన తమ ఇష్టం. నేను ఏదైనా సరిపెట్టుకోగలను, కాని నా ఉన్నతి నేను కోరుకున్నట్లుగా కలగటంలేదని, తమతో నేను చేస్తున్న ఫిర్యాదును మాత్రం నేను సరిపెట్టుకోలేనన్న మాట ఖాయం. ఇప్పుడు ఆ పవిత్ర ప్రేమమయ వాణి నేను ఎందుకు మరచిపోతున్నానో తెలియటం లేదు. మనస్సులో ఎడతెగని వ్యథ ఉంది. దానిని ఒక్క నిమిషమైనా తొలగించాలని అనుకుంటున్నా తొలిగిపోవటం లేదు. నా పురోగమనం ఆగిపోయిందో ఏమో తెలియటం లేదు. అదేమిటో 'తమ'కే తెలియాలి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 718

లఖీంపుర్,

09.11.1959

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. చాలా రోజులుగా తమ నుంచి ఉత్తరం రాలేదు, ఎందుకో తెలియదు. దయచేసి తమ ఆరోగ్య స్థితిని గురించి వెంటనే తెలియజేయండి. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక స్థితిని గురించి వ్రాస్తున్నాను.

ఇది ఏమిటో నాకు తెలియకుండా ఉంది. అది ఏమిటంటే, **ఏ దశనైతే 'మాలిక్' నాకు ఇస్తున్నారో, దాని ఆనందాన్ని నేను సత్సంగీ సోదర సోదరీలకు ఇవ్వలేకపోతున్నాను. నాకైతే 'మాలిక్' కృపతో వారి ఉన్నతి కావాలి, అంతే. యదార్థం ఏమిటంటే, ఏ దశలయితే మరణం తర్వాత దక్కాల్సి ఉన్నాయో, వాటిని 'మాలిక్' నాకు ఇప్పుడే కల్పిస్తూ వెళ్తున్నారు.**

ఇప్పుడు ఉన్న దశ ఏమిటంటే, తరచుగా ఎప్పుడైతే ఆలోచనను తమవైపుకు మరల్చుతానో అప్పుడు ఒకటి ఏమిటంటే, ఆలోచనను తమకు చేర్చటానికి చాలా కష్టంగా ఉంటోంది, రెండవది, ఎప్పుడైతే ఆలోచన 'మాలిక్' వద్దకు చేరుతుందో అప్పుడు, ఎంతసేపు ఆలోచన నిలిచి ఉంటుందో, అంతసేపు నీటిలో నుంచి బయటపడిన చేపలాగానో లేదా మణిని పెరకివేసిన సర్పంలాగానో తపన కలుగుతుంది. అయితే ఇది కూడా నాకు బాగున్నట్లే అనిపిస్తుంది కాని, అది నాలుగైదు నిమిషాలకు మించి ఉండటం లేదు. ఎందుకంటే, ఆ వెంటనే ఏదో శక్తి నా ఆలోచనను తిప్పికొట్టుంది. ఇలాకాకపోయినప్పటికీ ఎందుకో తెలియదుగాని, ఆలోచనల ప్రవాహం నిరంతరం ఉంటూనే ఉంటుంది. ఈ తపన యొక్క దశను నేను సరిగ్గా నిర్వహించుకోలేకపోతే అది వెళ్ళిపోతుంది. అయితే ఇటువంటి దశలో కూడా లోపల ఒక సమాన స్థితియే ఏర్పడి ఉంటుంది. అక్కడ పరివర్తనమంటూ ఏమీ జరగదు. నేను ఇదివరకు, రెండు స్థితులు జంటగా నడుస్తున్నాయని తమకు వ్రాసినట్లుగానే ఇప్పుడు అలాగే ఈ దశ ఉంది. ఒకటైతే మార్పు కలిగిస్తూ ఉంటుంది, రెండవది ఒక సమానస్థాయిగా ఉండే దశా రూపంగా ఉంటుంది.

ఇదేకాదు, కేవలం లోపలనే కాకుండా, లోన–బయట నా వ్యవస్థ (సిస్టమ్) అంతా కూడా అదే రూపంగా అయిపోయింది. దీనికి కూడా స్వరూపం అను శబ్దం జోడించి ఆ దశకు నేను వస్త్రం ధరింపజేశాను లేదా ముసుగు వేశాను. దశ అయితే ఇప్పుడు నా వశంలో లేదు. స్థితి ఇప్పుడు (Unlimited melancholy) గంభీరమైన ఉదాసీనత యొక్క స్వరూపంగానే అయిపోయింది, కాని అదేమిటో తెలియదు. కాని ఎప్పుడైతే నేను ఈ గంభీర ఉదాసీనతలో ప్రవేశిస్తానో, అప్పుడు అక్కడ (Condition of Nothingness) ఏమీలేని మహాశూన్యతా దశయే వ్యాపించి ఉంటున్నది. ఇంతకూ యదార్థం ఏమిటంటే, నా దశ ఏమిటో తెలియటం లేదు. తమరు వ్రాసినప్పుడు మాత్రం కొంచెం

అర్థమవుతోంది, లేకపోతే (Knot) ముడి (చిక్కు) అంతా విప్పి ఉన్నా కూడా ఆ ముడి లేదా చిక్కు (గ్రంథి) యొక్క జ్ఞానం కూడా నాకు తెలిసే అవకాశమే లేదు. దాని మడతలు కూడా కనిపించటం లేదు. నా కణకణమూ శక్తిహీనంగా అయిపోయినట్లు నాకు కనిపిస్తోంది. బిచ్చగత్తె యొక్క జోలి ఖాళీగానే ఉంది కాని, 'అతని' మనస్సులో ఏదో ఉంది. అది ఏమిటో ఈ బిచ్చగత్తెకు ఏమి తెలుసు! ఇది గ్రహించి నేను, మనస్సును అన్వేషించే ప్రయత్నం చేయించటం లేదు. ఎందుకంటే, హృదయాన్ని వెదికినా కూడా అక్కడ శూన్యత లేదా చీకటియే వ్యాపించి ఉన్నట్లుగా గ్రహించాను. నేను తరచుగా మోసపోతున్నాను. కనుక ఉదాసీనత యొక్క స్వరూపమే దాల్చి తిరుగుతున్నాను. అయినప్పటికి నా 'బాబూజీ' నా హృదయంలో లీనమై ఉన్నారు. కనుక నేను 'అతని' దరిచేరటానికి ఎలాంటి నిర్లక్ష్యం చేసినా వెంటనే నాకు అశాంతిగా ఉంటోంది.

నా ఈ దశ బాగుండలేదు. పురోగమనం కూడా నేను కోరిన విధంగా లేదు. కాని 'మాలిక్' ఇచ్చ ఏదైనా, నేను దానికి బద్ధురాలను. అది ఏమిటోగాని, ఎవరో నా శిరస్సు మీద చేయి చాపితే, దానిని తమ హస్తంగా భావిస్తున్నాను. దానితో నాకు ఆనందం కూడా కలుగుతోంది. నా దశలో 'మాలిక్' గ్రంథులన్నింటినీ తెరచి ఉంచినట్లుగాను, అయినా కూడా అక్కడి నుంచి ఏమీ వెలువడనట్లుగాను, ఆ స్థానం కూడా దాటిపోయినట్లుగాను అనిపిస్తోంది. మరి నేను 'అతడి'ని ఎక్కడ కూర్చుండబెట్టను? **యదార్థం ఏమిటంటే, ఏ దశలయితే నాకు మృత్యువు తర్వాత దక్కవలసి ఉన్నాయో, వాటిని 'మాలిక్' నాకు ఇప్పుడే ఇస్తూ వెళ్ళుతున్నారు.**

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 719

లఖీంపుర్,
14.11.1959

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. నా ఆరోగ్యం కొంత ఇబ్బంది కలిగించింది, కాని ఇప్పుడు బాగయ్యింది. తమరు విచారించవద్దు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నేను ఈ దశలో ఈ విధంగా చూస్తున్నాను. నాలోపల ఈశ్వరీయ ధార మరియు ఈశ్వరీయ ప్రకాశంగాని లేకుండా అంతా అంధకారంగా ఉంది. అయితే అంధకారం అనేది నా స్వరూపంగానే అయిపోయింది. ఆశ్చర్యం ఏమిటంటే, నా చుట్టూరా ఒక దివ్యజ్యోతి వ్యాపించి ఉన్నట్లు అనుభూతి చెందుతున్నాను. అంతేకాకుండా, ఆ దివ్య జ్యోతియే బ్రహ్మాండమంతటా సమానంగా వ్యాపించిపోయింది. ఇంకొక విచిత్రం ఏమిటంటే, ఈ దివ్యత్వంలో నాకు ఈశ్వరీయ ప్రకాశంగాని, ఈశ్వరీయ ధార యొక్క సుగంధంగాని అనుభవానికి రావటం లేదు. అయితే దివ్యత్వం అను శబ్దమేతప్ప మరొకటి వెలువడటం లేదు. అందువలన ఉన్నదేదో ఉంది. నేను చూస్తూ ఉన్న ఇంకొక విషయం ఏమిటంటే, నేను ఇంతకుముందు తమకు వ్రాసిన నా యొక్క ఘోరమైన ఉదాసీన దశ ఏదైతే ఉందో అది కూడా దివ్య అవస్థయే అంటారా? అది నాకు తెలియటం లేదు. తెలుసుకోవాలని అనుకుంటూ ఉంటే, దాని లోపల ఒక శూన్య దశయే వ్యాపించి ఉన్నట్లుగా అనుభవమవుతోంది. దానినే సంపూర్ణ చీకటిగా చెప్పవచ్చు. దశలో సారం లేకుండా నిస్సారస్థితిగా అనిపిస్తోంది. అయితే స్థితిని గురించి చెప్పటానికి, ఎందుకో తెలియదు కాని దివ్యశబ్దమే వెలువడుతోంది. ఇదంతా 'మాలిక్' లీల, అదేమిటో నాకేమి తెలుసు!

ఇంకొక విషయం ఏమిటంటే, నేను ఇతరులకు భోజనం వడ్డించి తినిపిస్తున్నపుడు, వారు దానిని తినివేసిన తర్వాత దానిని నేనే తిన్నట్లుగా అనిపిస్తోంది. ఈ దశను కేవలం ఆలోచనాపరంగానే (లేదా ఊహాత్మకంగానే) భావించవచ్చు. ఏమిటంటే, కాంతి యొక్క ప్రభావం, అప్రభావం జరిగిపోయాక, ఇంక మిగిలేది ఏమీలేదు. అయితే ఈ విధంగా చెప్పటం సరైనది కాదని అనిపిస్తోంది. సత్యత్వం (రియాలిటీ), అది ఏమైె ఉన్నా, లేకపోయినాగాని, దాని పరమాణువులు కూడా కరిగిపోయి, తమ సత్యత్వాన్ని (రియాలిటీని) కోల్పోయాయి. నాకు ఈ విధంగా ఎందుకు అనిపిస్తోందో కాని, ఇప్పటివరకు నేను ఎవ్వరి వెంటనో వెళ్తున్నట్లుగా ఉంది. అది మసకబారిన ఆలోచనయే కావచ్చు. నేను ఇప్పుడు ఆ విషయం మీద ధ్యాస నిలిపినపుడు, అదేమిటో తెలియదు కాని, నేను ఒంటరిగానే ఉన్నట్లు గాను, అలా ఒంటరితనమే కాకుండా, నా లోపల, బయట, నా స్వరూపమంతా అలాగే అయిపోయినట్లుగా అనిపిస్తోంది. ఆలోచనలు కూడా ఇదే రూపం దాల్చాయి. అంతేకాకుండా, నేను ఎవరిదో చేయిపట్టుకుని రోడ్డుమీద నడుస్తూ ఉన్నాను, కాని నా చేతిని ఎవరో పట్టుకొని ఉన్నారని కూడా తెలియటం లేదు. పూర్తిగా శూన్యతయే దశ యొక్క స్వరూపంగా అయిపోయింది, కాదు కాదు, అదే నా స్వరూపంగా అయిపోయింది.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 720

లఖీంపుర్,

18.11.1959

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. తమరు ఆరోగ్యంగా ఉన్నారని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు నా దశ ఎటువంటిది అంటే, ఇప్పటివరకు నేను ఏదైతే చూశానో అదంతా స్వయంగా నా గారడీ లేదా భ్రమయేనని అనిపిస్తోంది. అటువంటిది తుడిచిపెట్టుకుపోయి ఎప్పుడు శుభ్రమైందో తెలియదు. ఈ దశ ఏమిటంటే, ఇప్పటివరకు దృష్టికి ఉన్న మసక శుభ్రపడి పోయి, లోపలి స్థితిలో కొంత విశ్రాంతి కలిగినట్లుగా ఉంది. ఇప్పుడు తాజాగా ఉన్నది ఏదీ అనుభవం కాకపోయినాగాని, ఉన్నదేదో ఉంది లేదా ఉన్నదేదో లేదు అని, లేనిదేదో ఉందని చెప్పవచ్చు. ఈ దశ ఏమిటో మరి, వ్రాయటానికైతే వ్రాశాను కాని నాకు ఇప్పుడు ఏమీ అర్థం కావటం లేదు. ఇప్పుడు నా దశ ఎలా ఉందంటే, మనస్సులో కలిగిన దానిని వ్రాయలేకపోతున్నాను. వ్రాస్తున్నది ఏదైనా ఉంటే అది మనస్సులోకి రావటం లేదు. అది ఉన్నది ఉన్నట్లుగా ఒకే (Essence) సారంగా ఉంది.

ఇప్పుడు దివ్యస్థితి యొక్క పరదా చిరిగిపోయింది. ఆ దివ్యత్వం అన్ని దిశలా వ్యాపిస్తూ ఉంది. ఇంతకుపూర్వం నేను, కళ్ళెదుట అకస్మాత్తుగా ఒక దివ్య ప్రకాశం కలిగి వెంటనే అంతమైపోతూ ఉంది అని వ్రాస్తూ ఉండే దానను. ఇప్పుడైతే ఆ దివ్యత్వమే పర్దాను చించివేసి ఇటూ, అటూ అన్ని దిశలా వ్యాపించిపోతూ ఉంది. అంతేకాదు, నిన్నటి నుంచి నావద్ద ధ్యానం చేస్తున్నవారు కూడా ఈ రోజు ఒక దివ్యస్థితి, అద్భుతమైనటువంటి దశ అనుభవమవుతూ ఉన్నదని చెప్తున్నారు. కాని నేను మాత్రం "గేదె ముందు వీణ వాయిస్తున్నట్లు"గానే, దివ్యం, దివ్యం అను మాటలు వింటున్నాను కాని ఇది ఏమిటా అని గ్రహించటానికి ఉరకలు వేయలేకపోతున్నాను. ఇది పెద్ద విశేషమైన విషయంగా భావించలేకపోతున్నాను. నేనయితే ఇలాగే అనుకుంటున్నాను, ఏమని అంటే, నా లోపల మరియు అణువణువులోను కొలువై ఉన్న 'మాలిక్'యే ముసుగు తొలగించుకుని నా కణకణంలోను, నరనరంలోను వ్యాపించిపోయారు లేదా నన్నే హత్తుకుపోయి ఈ విధంగా చేశారు, అని. 'వారి' లీల ఏమిటో 'వారి'కే తెలియాలి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 721

బళ్ళారి క్యాంపు,

03.12.1959

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరం గుల్బర్గాలో ఉండగా చేరింది. ఇక్కడ ప్రతి సెంటర్‌లోను ఎంతోకొంత అభ్యాసుల సంఖ్య పెరిగింది. గుల్బర్గా మరియు సేడమ్‌లో కలిసి 100 మందికి పైగా అభ్యాసులు పెరిగారు. నీ ఆధ్యాత్మిక దశ చాలా వికసించిపోతున్నట్లుగా అనిపిస్తున్నది.

నా ప్రోగ్రామ్ 2 నెలలుగా నిర్ణయించుకున్నాను, కాని కోర్టు పనివలన దానిని ఒక నెలవరకే పరిమితం చేయాల్సి వచ్చింది. చాలా ప్రాంతాలకు వెళ్ళాలని అనుకున్నాను కాని ఇప్పుడు వెళ్ళలేను.

అమ్మకు, చౌబేజీలకు ప్రణామం.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 722

లఖీంపుర్,

04.12.1959

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. ఇక్కడ అందరూ కుశలమే. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఈ దశ ఎలా ఉందంటే, తమరు కుడివైపున పురోగమింపజేస్తూ ఉన్నట్లయితే దశ సున్నా (Zero) లేదా శూన్యంగా ఉంటోంది, అది బాగానే ఉంది. కాని ఎడమవైపున పురోగమింపజేస్తూ ఉన్నట్లయితే స్థితిలో వెంటనే భయం కలుగుతోంది. అందువలన స్థితిని ఉన్నది ఉన్నట్లుగానే విడిచిపెట్టాను. స్థితి బహుశా (Simplicity) సరళత్వం లేక (Delicacy) సున్నితత్వం యొక్క స్వరూపంగానే అయిపోయింది. అలా కాదంటే, స్వయంగా నా రూపంగానే అయిపోయి వ్యాపించిపోయింది. అనగా దశ అని చెప్పుదామనుకున్నా కూడా ఇప్పుడు ఎంతగా ముందుకు తీసుకుని వెళ్ళినాగాని, 'దివ్యానుభూతి' అను శబ్దమే దానికి సరియైనదిగా వ్యక్తమవుతోంది. కాని ఆ శూన్య స్థితికి వెనుక చాలా సరళమైనది లేక సూక్ష్మమైనది లేక నిర్జీవమైన (నిశ్చలమైన) దశ ఉంది, కాని అది ఎంతమాత్రం సరియైనదిగా ఉండటం లేదు. ఇప్పుడు దశయే స్వయంగా అనగా దశతోనే ఉదాసీనంగా కాకుండా, ఖాళీ అయిపోయినట్లుగా చెప్పవచ్చు. నేను ఇప్పటివరకు సాదా దశ, చాలా వినమ్రతా దశ, శూన్యదశ మరియు ఉదాసీన దశగా వ్రాసినటువంటివి అన్ని కలసిపోయి ఖాళీ అయిపోయినట్లుగా తలపిస్తున్న దశ అని దీనిని చెప్పవచ్చు. ఇలా అంతా ఒక్కటిగా అయిపోయినా చుట్టూరా ఒక దివ్యానుభూతి దశ రూపంగా విస్తరించిపోయింది.

ప్రతి స్థితిలోను, ఒక దశకాని దశయే నాలోపల స్థిరపడిపోయినట్లుగా నేను చూస్తున్నాను. ఈ ఆధ్యాత్మిక యాత్రలో ముందుకు వెళ్ళిన తర్వాత కూడా నేను మళ్ళీ ఇదే దశమీదకు వచ్చేస్తున్నాను. దీనిని 'మాలిక్' నన్ను మోసపుచ్చి ఈ దశలోనే స్థిరపర్చినట్లుగా చెప్పాల్సి వస్తోంది. నా నరనరాల్లోను, లోన బయట ఇప్పుడు నేను

ఈ విషయాన్నే అనుభూతి చెందుతున్నాను. వాస్తవంగానైతే డోలులో రంధ్రం ఉన్నదో లేక రంధ్రంలో డోలు ఉన్నదో తెలియటం లేదు. "మాలిక్ నన్ను అనుక్షణం లాగి ఉంచుతున్నారు" అని ఆకర్షణ శక్తి గురించి నేను ఎప్పుడూ వ్రాస్తూ వచ్చినటువంటి దానిలో, ఆ ఆకర్షణశక్తి ఇప్పుడు ఏమైపోయిందో తెలియదు. అయితే నన్ను ఎప్పుడూ తనవైపు లాగి ఉంచిన ఆ ఆకర్షణశక్తి యొక్క జ్ఞాపకాన్ని సదా జ్ఞాపకంలో నిలుపుకోవాలని కోరుకుంటున్నాను. కాని ఎప్పుడు సఫలమవుతానో తెలియటం లేదు. లోన, బయటి కణకణాలన్నీ ఇక్కడ శుష్కించిపోయి ఉండగా, అది ఎలా సఫలమవుతుంది? ఈ శుష్కించిపోవటాన్ని జ్ఞాపకం ఉంచుకోవాలన్నా ఎక్కడా స్థానం లేదు. ఒకవేళ శుష్కించిపోవటాన్ని జ్ఞాపకం చేసుకున్నా అది (Dryness) శుష్కత్వాన్ని తెస్తుంది. నా దశ (Complete indifference) పూర్తిగా ఉదాసీనత రూపంగానే అయిపోయింది. ఇప్పుడు స్థితిలో ప్రకంపనం (Vibration) కల్పించాలనుకున్నాగాని అది జరగటం లేదు. ఒకవేళ అలా జరిగినా కూడా అనుభూతికి రావటంలేదు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 723

లఖీంపుర్,
16.12.1959

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం అందింది, సమాచారం తెలిసింది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

మొన్నటి నుంచి "సిద్ధపురుషుడు" అనే దశ ఏర్పడింది. దాని వలన మనస్సులోకి ఏది తలంపుకు వస్తుందో అదే జరుగుతుంది. ఇది కేవలం రెండు రోజులు మాత్రమే ఉన్నట్లుగా నేను గ్రహించాను. దానిలో కూడా ఎక్కువగా ఆ దశ యొక్క జ్ఞాపకం మరచిపోయినట్లుగా ఉంది. 'మాలిక్' దానిపై పరదా కప్పి ఉన్నారా అన్నట్లుగా ఉంది. కాని నా దశ ఎలా అయిపోయిందంటే, ఆధ్యాత్మిక దశలో కూడా నాకు మంచి–చెడు అనిపించటం లేదు. అన్నింటిపట్ల హృదయం నుంచి ధన్యవాదాలే వెలువడుతున్నాయి. అది కూడా అప్రయత్నంగానే జరుగుతోంది. ఎందుకోగాని నేను 'అతడి' జ్ఞాపకంలో దిగులు చెందాలనే కోరుకుంటున్నాను. కాని నేను గ్రహిస్తున్నది ఏమిటంటే, నాకు ఎప్పుడైనా స్పృహ కలిగినపుడు, కేవలం 'అతడి' జ్ఞాపకం యొక్క జ్ఞాపకం కొరకే ఊహ కల్పించుకొంటాను. ఆ జ్ఞాపకం కలిగించటం కోసమని కేవలం ఒక ఆజ్ఞా పత్రం వంటిది మాత్రమే వస్తుంది. అప్పుడే కొద్దిగా 'అతడి'ని గురించి తెలుసుకుంటాను. అలా కాకపోతే ఎప్పటికీ 'అతని' గురించి తెలుసుకోలేను. అప్పుడప్పుడు ఈ విషయంలో ఎంత కష్టం కలుగుతుంది అంటే, హాం, ఇంత గొప్ప వ్యక్తిత్వం ఎదుట ఉండి కూడా నేను 'వారి'ని గురించి తెలుసుకోలేక పోతున్నాను కదా! అని అనిపిస్తుంది. అయితే నా చేతుల్లో ఏమీలేదు. కళ్ళు ఎప్పుడైతే మూతపడ్డాయో, అప్పటి నుంచి మళ్ళీ తెరుచుకోలేదు. అవును, అప్పుడప్పుడు ఆ తెరుచుకున్న కళ్ళు యొక్క జ్ఞాపకానికి చెందిన చిత్రం నా ఎదుట నుంచి వెళ్ళిపోతున్నట్లు ఉంటుంది. ఎందుకంటారు? బహుశా జ్ఞాపకం యొక్క జ్ఞాపకం మూలంగా నన్ను విశ్రాంతి లేకుండా ఉంచటానికేనేమో. కాని నేను వ్యాకులంగా ఉన్నానో, సంతోషంగా ఉన్నానో కూడా నాకు తెలియదు. లోన బయట. సమస్త ప్రపంచం, నా స్వభావం (Nature) అన్నీ నిశ్శబ్దంగానే ఉన్నాయి. మరి దశ ఏమిటి అంటే, విశ్రాంతి లేదు, మరో మార్గమూ లేదు అన్నట్లుగా ఉంది. 'మాలిక్' ఇవ్వాలనుకున్నా నావద్ద దీపంగాని, వత్తిగాని లేవు. మరి తైలమంటారా, అది ఎక్కడైనా దొరుకుతుందో లేదో కూడా తెలియదు. అయితే నాకు మాత్రం నా చీకటియే నాకు వెలుగుగా ఉంది. నిశ్శబ్దం అనేది నా తపన లాంటిది (పురోగతికి కొరకు). 'మాలిక్' నా వారే అనే దృఢ విశ్వాసమే

నాకు ఇప్పుడు ఉన్న ఆధారం. నేను 'వారి'ని చేరుకోవాలి. ఎక్కడ, ఎలా అనేది తెలియదు. ఇదే నేను నాలో జీవించి ఉన్నాను అనటానికి నిదర్శనం.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 724

లఖీంపుర్,
18.12.1959

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. తమరు కుశలమేనని ఆశిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు ఇది ఏమిటో నాకు తెలియకుండా ఉంది, ఏమిటంటే, సత్యత్వమే (రియాలిటియే) నా స్వరూపంగా అయిపోయిందని అనిపిస్తోంది. అంతేకాదు, సత్యత్వం (రియాలిటి) నా నరనరాల్లోను, అణువణువులోను ఉండటమే కాకుండా, అది నా లోపల, బయట అంతటా వ్యాపించి ఉంది. ఇదే విధంగా దివ్యత్వం నా చుట్టూరా విస్తరించి ఉన్నది. నేను ఏదైతే చెబుతానో, కుటుంబ విషయాలు అయినా సరే, మరియు నా ద్వారా ఏమైతే జరుగుతాయో అన్నీ పూర్తిగా సత్యత్వంలోనే జరుగుతున్నట్లు ఉంది. ఈ దశ, ఈ విధంగా అయిపోయింది. సత్యమే పలకాలని నా ప్రతిజ్ఞగా ఎప్పుడైన ఉన్నప్పటికీ, అప్పుడు కూడా నాకు ఈ విధంగా అనిపించలేదు. అయితే ఇప్పుడు నా స్వంత ప్రతిజ్ఞయే లేదు. ఇంకొక విచిత్రమైన విషయం ఏమిటంటే, అబద్ధం, నిజం నాకు రెండూ సమానంగానే ఉన్న దశగా అనిపిస్తోంది. ఇలా ఎందుకంటే, అసలు నాకు ఎవరిని గురించి ఏమి తెలియదు. ఎప్పటి నుండి అయితే నాకు ఆ 'సిద్ధ దశ' ప్రాప్తించినటువంటి దశ యొక్క అనుభవం కలిగిందో అప్పటి నుండి నాకు ఏమైందో తెలియకుండా పోయింది. నిజం ఏమిటంటే, దశ 'మాలిక్'దిగా ఉంటే, అది 'అతని'కే తెలుస్తుంది. కాని నాదైన ఈ సత్యదశ ఎటువంటిది అంటే, నేను ఒక రాతి విగ్రహంలాగా ఉన్నాను. దానిలో జీవనం మరియు ఆత్మ లేకుండా ఉంటాయి. కళ్ళు చిట్లిపోతున్నాయి. శ్వాస పైది పైకే, క్రిందిది క్రిందే అన్నట్లు ఉంది. (అనగా ఊపిరిసలపనట్లుగా ఉంది.)

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 725

లఖీంపుర్,
25.12.1959

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్య తావూజీగారు నిన్న ఇక్కడకు చేరిపోయారు. ఇక్కడ అందరూ కుశలమే. అక్కడ తమరు కూడా కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నా ఈ దశలో, నా శరీర స్వరూపం ఎలా ఉందంటే, నేను ఒక శిలా విగ్రహంలాగా ఉండి దానికి ప్రాణప్రతిష్ఠ జరగనట్లుగాను, కొంచెం కూడా శక్తి నింపనట్లుగాను ఉంది. ఇప్పుడు నేను పూజ చేయిస్తున్నాను కాని ప్రాణాహుతి ధార (ట్రాన్స్‌మిషన్) ఉన్నట్లుగా అనిపించటం లేదు. నేను ఇతరులతో పూజను జరిపిస్తున్నానో, లేదో కూడా తెలియదు.

ఎందుకంటే, పూజకు ప్రాణాహుతి ప్రాణం వంటిదికాగా అది లేకుండా పోయింది.

2,3 రోజుల నుంచి కుడి కనుబొమ్మ నుంచి పైన శిరస్సు వరకు ఒక నాడి అంతా కాంతితో మిరుమిట్లుగొల్పినట్లుగా అనుభవమయ్యింది. ఇప్పుడు దశ ఎలా ఉందంటే, కళ్ళు తెరిచినా మూసినా భేదం ఏమి లేనట్లుగా ఉంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 726

లఖీంపుర్,
08.01.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని ఆశిస్తున్నాను. నా బలహీనత ఇప్పుడు తగ్గింది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఈ దశలో, నా రోమ రోమంలోను ఒక ప్రపంచం కనిపిస్తోన్నట్లు ఉంది. అదియేనా లేదా మరేదైనా ఉన్నదా అనేది నేను సరిగ్గా వివరించలేకపోతున్నాను. రోమ రోమం ఒక గాజులాగా అయిపోయింది. దానిలో ఒక సరళం (Simple) లేదా (Flawless) దోషరహితమైన లేదా (Humbleness) నమ్రత యొక్క దశయే వ్యాపించి ఉంది. నా స్వరూపం అంతా దానిలాగే అయిపోయింది.

నాకు షుమారు 8,9 రోజులుగా బొత్తిగా నిద్రపట్టడం లేదు. మధ్యమధ్యలో బలవంతంగా ఒక అరగంటపాటు పండుకున్నాను కాని, కళ్ళల్లోగాని, శరీరంలోగాని నేను నిద్రపోయాను అని ఎంత మాత్రం అనిపించటం లేదు. ఇంతకుముందు కుడి కనుబొమ్మపైన ఒక నాడి, కాంతితో మిరుమిట్లు గొల్పినట్లుగా అనిపించేది. ఇప్పుడు ఏమైందో ఏమో కాని మొత్తం శిరస్సు, మెదడుకు చెందిన నరాలు జాగృతమైనట్లుగాను, దానివలన మెదడు రేయింబవలు పని చేస్తోందన్నట్లుగాను ఉంది. ఇది మంచో లేక చెడో నాకు తెలియదు. అంతేకాదు, మొత్తం శరీరం యొక్క నరనరాలు ప్రేరణపొందినట్లుగా ఉంది. అందువలన శరీరంలో నిద్ర చిహ్నాలు ఎప్పుడూ ఏమి ఏర్పడటం లేదు. ఇంక ఇప్పుడు 'మాలిక్'యే నిద్రపుచ్చాలి, అప్పుడే నిద్రపోగలను. నిద్రలేమి వలన రాత్రిపూట కొంచెం కష్టంగా అనిపిస్తుంది, ఎందుకంటే, మెదడులో ఏదో జరుగుతూ ఉంది. కాని పగలయితే కష్టం ఏమి కలగదు. పగలు అయితే ప్రయత్నించినమీదట ఎంతోకొంత సమయం నిద్రపోతున్నాను కాని, రాత్రిపూట ఒక్క నిమిషమైనా నిద్రగాని, దాని అలసటగాని శరీరంలో లేదా మెదడులో లేదా కళ్ళలోకి రానేరాదు. ఇదంతా ఏమిటో నాకు తెలియటం లేదు. ఇప్పుడు Occiptal bone (మెదడు వెనుకభాగంలో ఉన్న పుర్రె ఎముక)లో త్వరత్వరగా తీవ్రమైన బాధ ఆరంభమవుతోంది. అది కొద్దిగానైనా ప్రతి సమయంలోనూ ఉంటోంది. ఈ విచిత్రమైన దశ ఏమిటోగాని, నా రోమ రోమంలోను ఒక్కొక్క బ్రహ్మాండం (Universe) ఇమిడి ఉన్నట్లుగా ఉంది. కాని నా కళ్ళెం పట్టుబిగించబడి ఉంటున్నదే కాని పట్టుసడలటం లేదు (అనగా 'మాలిక్' తన ఆధీనంలో ఉంచుకొన్నారు). ఎందుకో తెలియదు. ఈ బాధ కొంచెం ఎక్కువగానే ఉంది. ఇదంతా ఏమిటో 'తమ'కే తెలియాలి. అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 727

లఖీంపుర్,
09.02.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు కుశలంగానే ఉన్నారని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఈ దశలో, ఎక్కడ ప్రళయం లేదా ప్రకృతి యొక్క అంతం ఉంటుందో అదే నా దశగా అనిపిస్తోంది. అనగా ఏ స్థితిలోనయితే ప్రళయం యొక్క ఆలోచనకు కూడా స్థానం ఉండదో, అదే నా స్థితిగా ఉంది. ఎక్కడైతే ఎటువంటి స్వరూపం ఉండదో అదే నా స్వరూపంగా ఉంది. అనగా ఈ దశ నా (Command) అదుపులో ఉంది, కాని ఈ అదుపు (Command) ఎందుకో నాకు తెలియదు. ఎందుకంటే, రెండు గుప్పిళ్ళు తెరవబడే ఉన్నాయి. నా దశ ఎలా ఉందంటే, దీనిలో ఆరంభం లేదు, అంతం లేదు, సుఖదుఃఖాల అనుభవమూ లేదు. మరి తెలిసింది ఏమిటంటే, అదీ తెలియదు. **తమరు నాకు ఒకసారి ఇలా వ్రాశారు: "తపన తన దారి స్వయంగా వెదుక్కుంటుంది" అని.** అయితే నా స్థితి ఎలా ఉందంటే, తపన తన దారి వెదుక్కుంటూ వెదుక్కుంటూనే స్వయంగా తననే కోల్పోయింది. ఇంకేముంది, ఒక చలనచిత్రంలాగా దాని జ్ఞాపకం ఎప్పుడైనా వస్తుంది. దీనికిమించి నాకు ఇంకేమి హక్కు లేదనిపిస్తుంది.

ఈ దశలో ఎలా ఉందంటే, అశాంతంగా ఉండి కూడా అశాంతి యొక్క అనుభవం కావటం లేదు. నేను ఇక్కడకు వచ్చాను అని చెప్పటం మాట మాత్రంగానే, కాని ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, నేను ఇక్కడ లేను, అక్కడ లేను, తమవద్ద మాత్రమే ఉన్నాను. ఇది మాత్రం ఖాయం, ఏమిటంటే, ఇప్పుడే తమరు నా కన్నులలో నా వెంట వచ్చారు, కాని కొన్ని రోజుల తర్వాత 'మాలిక్' నాకు తమ ఉనికిని ఎక్కడో చూపుతారు. ఎందుకంటే, ఇప్పుడు నేను బలవంతంగా నా కన్నులలో 'తమరి'ని బంధించి ఉంచుకున్నాను. నా మనస్సులో ఏదో లోటు ఉంది, కనుక 'తమరి'ని ఎక్కడైన నివాసం కల్పించాలంటే ఏమి చేయను? ఇప్పుడైతే ఇక్కడ, అక్కడ, ఎక్కడ కూడా తమరి జాడ తెలియటం లేదు. ఇంకా ఏమిటంటే, ఆ జాడ యొక్క జాడ కూడా తెలియటం లేదు. అది కూడా జాడ (అడ్రస్సు) లేకుండా పోయింది. 7వ తారీఖు ఉదయం తమరు నన్ను '$T_1$' పాయింట్ నుంచి వెలికి తీసి '$U_1$' మీదకు చేర్చారు. ఎలా ఉంటుందంటే, ఎప్పుడైతే ఒక పాయింట్ యొక్క యాత్ర సమాప్తమైపోయినట్లు అనిపించిందో, ఎంత ప్రయత్నం చేసినప్పటికీ హృదయం మీద ఏదో భారం మోపినట్లుగా ఉంటుంది. ఉత్సవ సమయంలో కూడా, ఉత్సవం తర్వాత 'తమరు' పాయింట్‌ను దాటించనంతవరకు, ఆ భారం తేలికపడలేదు. పాయింట్‌ను దాటించినంతనే బరువు అంతా తొలగిపోతున్నట్లుగా అనిపించి, ఒక్కసారిగా అంతా తేలికైపోయింది. ఇదేమిటో, ఎందుకో నాకు తెలియదు. తమకే తెలియాలి. అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 728

లఖీంపుర్,
12.02.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. చాలా రోజులుగా తమ నుంచి ఉత్తరం రాలేదు. అందరికీ దిగులుగా ఉంది. దయచేసి తమ గురించిన క్షేమ సమాచారాన్ని శీఘ్రంగా తెలియజేయండి. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి

వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఈ దశ ఎటువంటిది అంటే, దానిలోకి మనస్సు మరియు ఆలోచనలు కూడా చొరబడలేవు. మరపుస్థితిలో (Forgetfulness) ఒక రకమైన స్పృహ (Consciousness) ఉంది. దానితో మరపుస్థితిని (Forgetfulness) అణచిపెట్టి ఉంచుతుంది. మరుపుస్థితి యొక్క జాడ ఎప్పుడు తెలుస్తుంది అంటే, ఏదైనా దెబ్బ తగిలినపుడుగాని, ఇంకా ఎప్పుడైనా పడిపోతూ పడకుండా నిలదీసుకున్నప్పుడుగాని, ఆ సందర్భంలో అంతవరకే అనగా అప్పటివరకే (Unconscious) స్పృహలేనిదానిగా ఉన్నట్లు అనిపిస్తుంది. అయితే ఎప్పుడైతే మళ్ళీ స్పృహ (Conciousness) పూర్తిగా నిలిచి ఉంటుందో అప్పుడింక మరపుస్థితి ఇంక ఉండదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 729

లఖీంపుర్,

22.02.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు కుశలమేనని భావిస్తున్నాను. ఇక్కడ అందరూ క్షేమమే. నా ఆరోగ్యం కూడా ఇప్పుడు బాగానే ఉంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక స్థితిని గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు స్థితి మీద ఒక స్వప్నంలాగ పొగలాంటి తెల్లని మేఘాలు వంటివి చాలా (Simple) సరళమైనవిగా ఉంటోంది. ఈ దశ ఏమిటోగాని, నేను వివాహాది శుభకార్యాలకు వెళ్ళి వస్తున్నాను, కాని నా స్థితి మార్పు లేకుండానే ఉంటున్నది. అయితే ఒక విచిత్రమైన విషయం ఏమిటంటే, ఎప్పుడైనా దెబ్బ తగిలినప్పుడుగాని, గోడకు కొట్టుకున్నప్పుడుగాని ఒక్కసారిగా ఒక రకమైన స్పృహ కలుగుతుంది. అది నాకు బాగుందనే అనిపిస్తోంది, ఎందుకో తెలియదు. అయితే నా మీద ఎటువంటి (Covering) ఆచ్ఛాదనం ఏర్పడింది అంటే, అది (Consciousness) స్పృహ లేకుండా ఉండనివ్వదు. కాని ఆ స్పృహ యొక్క జాడ కేవలం అలా దెబ్బలు తగిలిన సందర్భాలలో మాత్రమే ఒక్క క్షణంపాటు అనుభవానికి వచ్చి మళ్ళీ మాయమైపోతుంది. నిజంగానైతే, నాకు ఎక్కడా స్థానం లేదు, ఇక్కడగాని, అక్కడగాని. నా చిరునామా ఎక్కడా దొరకదు. ఇంకేముంది, తపనయే నా స్వరూపంగా అయిపోయింది. ఎలా అంటే, ఎవ్వరైనా 'కస్తూరీ' అని పిలిచినట్లయితే, ఆ తపనయే స్వయంగా తనకు తోచినట్లు సమాధానం ఇస్తుంది. ఇప్పుడు తపన కూడా నాకు దూరంగా ఏదో కోల్పోయిన వస్తువులాగా అనిపిస్తోంది. నా స్థితి ఏమిటో 'మాలిక్'కే తెలుసు. నేను మాత్రం స్థితిలేని దానను. అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 730

షాజహాన్‌పూర్,

27.02.1960

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరం చేరింది. దక్షిణ భారతదేశంలో సహజమార్గం విస్తరించ నారంభమైనందుకు భగవంతునికి ధన్యవాదాలు తెలుపుతున్నాను. అయితే మద్రాసు, ఇంకా దక్షిణ భారతదేశ ప్రాంతంలోను అభివృద్ధి

ఇప్పటివరకు బాగుండలేదు. మద్రాసులో నన్ను తెలిసినవారు 30 లేదా 40 మంది మాత్రమే ఉన్నారు. ఈ ప్రాంతం కూడా చాలా జటిలమైనదే. ఎవ్వరైనా పత్రికా సంపాదకుడు మన అభ్యాసీ అయితే బాగుంటుంది. ఒక కన్నడ పత్రిక సంపాదకుడు తన ధర్మపత్నితో అభ్యాసీగా చేరారు. ఇద్దరి నుంచి చాలా ప్రేమ పూర్వకమైన ఉత్తరాలు వస్తున్నాయి. సారనాథ్‌గారు "ప్రాణాహుతి" శీర్షికతో కన్నడ భాషలో వ్రాసిన వ్యాసం ఒక్కటి అదే పత్రికలో ప్రచురించబడింది. అది సంపాదకుడిని ఎంతగానో ప్రభావితం చేసింది. ఆయన తరచుగా ఇదే పత్రికకు వ్యాసాలు కన్నడ భాషలో వ్రాసి ఇస్తూ ఉంటారు. ఆ పత్రిక ధార్వాడ్ నుంచి వెలువడుతుంది.

ఒక విషయం ఏమిటంటే, దక్షిణ భారతదేశం ఎంత త్వరగా పురోగమిస్తూ ఉందో అంత నిదానంగా ఉత్తర భారతదేశంలోని అభ్యాసులు ఉన్నతి చెందుతున్నారు. ఈ మాట 'లాలాజీ సాహెబ్' కూడా నాతో చెప్పారు. అక్కడ ముగ్గురు అభ్యాసులు కేంద్రమండలం (సెంట్రల్ రీజియన్) చేరుకున్నారు. ఇద్దరు తమంతట తాముగా చేరుకున్నారు. ఒకరిని నేను స్వయంగా చేర్చాను. ఇప్పటివరకు ఇక్కడ ఒక్కరిని మాత్రమే చేర్చగలిగాను. దక్షిణ భారతదేశంలో నాల్గవ వ్యక్తిగా ఒకరు కేంద్ర మండలానికి చాలా దూరంగా ఉన్నారు. కాని అతడు త్వరగా చేరుకోవటానికి ప్రయత్నం బాగా జరుగుతుంది. అక్కడ ఎన్నో ఉన్నత స్థితుల యొక్క సమాచారం తెలుస్తూ ఉన్నాయి, కాని ఇక్కడ అంతగా లేవు. చౌబేజీ చాలా తెలివైనవారు. దీనికి కారణం ఏమిటో నాకు తెలపమని వారికి నా మాటగా చెప్పు. దీని గురించి నేను నిన్ను అడిగినట్లయితే, (అడగటానికి అభ్యంతరమైతే ఏమీలేదు) నాకు తెలిసినదానినే నీవు వ్రాస్తావని నిన్ను ఈ విషయాన్ని అడగడంలేదు.

'$U_1$' స్థానం మీదకు నీవు చేరిపోయావు. నీ స్థితిని నీవు వివరించిన దాని ప్రకారం, ఇది శూన్య సమాధి స్థానం అనే నిర్ణయానికి వచ్చాను. గురునానక్ ఈ విధంగా వ్రాశాడు –"ఓ నానక్! శూన్య సమాధిలో సంధ్యగాని, ఉషోదయంగాని లేవు" అని. ఇంకా ముందుకు వెళ్ళితే ఏమి ఉంటుంది? ప్రతిదీ కుంచించుకుపోయి లయమైపోవలసి ఉంటుంది. ఇంతవరకు లయ–అవస్థ జరుగుతుంది కాని, అత్యున్నత స్థితిలోనే జ్ఞానం (Wisdom), వివేకం (Intellignece) మరియు ఉద్వేగాలు (Emotions) అన్నీ లయమవుతాయి. కాని అనుభవానికి అయితే రావు. మళ్ళీ దానిలో నుంచి ఏదైతే ఉత్పన్నమవుతుందో, అది ఈ విషయాలన్నింటినీ స్వచ్ఛంగా మారుస్తుంది. కాని అవన్నీ ఒక స్వచ్ఛ రూపంలో వస్తాయి.

ఇప్పుడు నేను నా స్థితిని గమనించినట్లయితే, ఇవన్నీ నాలో లయమైపోయాయో, లేదో తెలియదు. ఎందుకంటే, నేను ఎప్పుడూ ప్రపంచాన్ని పట్టుకు వ్రేళ్ళాడుతున్నట్లుగా ఉంటుంది. ఆధ్యాత్మికతతో నాకు సంబంధం ఉందో లేదో తెలియదు. ఈ విషయాలన్నింటినీ పరిగణలోకి తీసుకున్నట్లయితే, ప్రపంచంలోని సామాన్య మనుష్యులు నాకంటే మంచిగా ఉన్నారనిపిస్తుంది.

అమ్మకు, చౌబేజీలకు ప్రణామాలు. మీ కోటి (పెద్ద భవనం) విషయం ఏమైంది?

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 731

లఖీంపుర్,

28.02.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని ఆశిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశ ఏమిటోగాని, నేను లోపల ఎలా ఉంటాను మరియు ఎలా ఉంచబడతాను అను విషయం, ఎంతగా ఆలోచించినా కూడా జ్ఞాపకం రానంతగా మర్చిపోయాను. ఇదే స్థితి అంటిపెట్టుకుని ఉండటానికి మరియు జ్ఞాపకం చేసుకోవటానికి బహుశా 'మాలిక్' జ్ఞాపకం కల్పిస్తే జ్ఞాపకం రావచ్చు. ఎందుకంటే, నేను ఎటువంటి దశలో హత్తుకుపోయి ఉండాలి అని బాగా జ్ఞాపకం చేసుకుంటున్నాను. అయినా కూడా నాకు స్వయంగా అర్థం కావటం లేదు, ఎంతగా ఆలోచించినా కూడా స్మరణకు రావటం లేదు. ఎప్పుడైనా దాని జ్ఞాపకం మరియు దానిలో హత్తుకుపోయి ఉండటం జరగనపుడు, జ్ఞాపకం మాత్రం ఎలా వస్తుంది! అయినా కాని నాకు ఉన్న దశ ఏదో, అది లోపల అంతా సమానంగా ఉంది. **దశలో బాగానే నిమగ్నమై ఉంటున్నాను. ఎందుకంటే, 'మాలిక్' ఏది ఇస్తే అదే మంచిదిగా ఉంటుంది. అందువల్లనే భక్తురాలు మీరాకు సర్పం మరియు తేలు కూడా మంచివిగానే అనిపించాయి. ఆమె యొక్క ఆ పరమ దశను గురించి ఏమని చెప్పాలి!**

ఒక విచిత్రమైన స్వప్నాన్ని చూశాను, అది మేల్కొని ఉన్న తరహాలోనే ఇప్పటికీ స్పష్టంగా ఉంది. అది ఏమిటి అంటే, ఎవరో వచ్చారు, నేను తలుపులు తెరిచాను. నేను "మీకు ఎవరు కావాలి?" అని అడిగాను. వారు గంభీర స్వరంతో –"ఇక్కడ ఎవరో సంత్ (సెయింట్) ఉన్నారని విన్నాను. వారికి పరమగతి లభించింది. దానితో వారు కూడా పరమ్ (అనగా దివ్యులు) అయిపోయారు" అని అన్నారు. నేను కొంచెం ఆలోచించి చెప్పాను– "నాకు వారు ఎవరో తెలియదు" అని. అకస్మాత్తుగా నా వంచియున్న శిరస్సును పైకెత్తి చూస్తే, ఎదుట 'తమరు' ప్రత్యక్షంగా నిలబడి ఉన్నారు. నేను అప్పుడు వెంటనే 'తమ' చరణాలమీదకు వాలిపోగా తమరు మధ్యలోనే నన్ను లేపి చెప్పారు –"నేను నిన్నే చూడటానికి వచ్చాను" అని. నేను అప్పుడు తమరిని ఇంట్లోకి ఆహ్వానించాలి అని అనుకుంటూ ఉండగానే మెలకువతో కళ్ళు తెరుచుకుపోయాయి. అయితే ఆ దృశ్యం ఇప్పటికీ నా కళ్ళెదుట అలాగే ఉంది, మరి ఎందుకోగాని నా శరీరం గగుర్పాటు చెందుతోంది. లోన, బయట ఒక తెలియనటువంటి ఆనంద దశ నా కణకణంలోను వ్యాప్తమైపోయింది. అది ఏమిటోగాని, ఈశ్వరీయ ప్రకాశం మొదలైనవి నాకు విలువైనవిగా గాని, విశేషమైనవిగా గాని లేవు. తమరు నా ఎదుట కూర్చుని ఉన్నా కూడా నా దృష్టికి ఆనటం లేదు. 'వారు' ఆ పరమప్రియుడు స్వప్నంలో నన్ను మేల్కొల్పే నెపంతో దర్శనం ఇవ్వటానికి నా వాకిట్లో నిలిచారు. నేను 'తమకు' ఎంతగా ధన్యవాదాలు అర్పించాలి. నా నోటి నుంచి ఈ మాటలు మాత్రమే వెలువడుతున్నాయి –"తాహి అనూ ఠీ ఛవి పర్ సంధ్యా బార్–బార్ బలిహార్" అనగా తమ సౌందర్యం ముందు సంధ్య తనను స్వయంగా మాటి మాటికీ అర్పించుకుంటోంది అని. ఇప్పుడు ఏమి జరిగిందో ఏమోకాని, నేను ఇప్పటివరకునైతే 'బాబూజీ'కి మాత్రమే వ్రాస్తూ వచ్చాను మరియు చెబుతూ వచ్చాను. అయితే నాకు ఇప్పుడు ఈ విధంగా ఎవరికి వ్రాస్తున్నానో, ఎవ్వరికి చెబుతున్నానో అంతుబట్టడంలేదు.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 732

లఖీంపుర్,

03.03.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం చేరింది, సమాచారం తెలిసింది. మన మిషన్ అభివృద్ధి చెందుతోందని తెలుసుకొని చాలా సంతోషించాను. దక్షిణ భారతదేశంలోనే కాకుండా సమస్త ప్రపంచంలోను మన మిషన్ వ్యాప్తి చెందాల్సి ఉంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇంతకు యదార్థం ఏమిటంటే, నా దశ ఎలా అనిపిస్తోంది అంటే, 'అతని' జ్ఞాపకంతోగాని మరియు దశతోగాని నేను ఎన్నడూ హత్తుకుపోవటమే లేనపుడు, ఆలోచనలు ఎక్కడ నుంచి వస్తాయి. నేను లోపల ఎన్నడూ ఉండటమే జరగనపుడు, 'అతని' జ్ఞాపకం ఎక్కడి నుండి వస్తుందంటారు? నాకు ఏమి అనిపిస్తోందంటే, ఒక (Stagnant conditon) మొద్దు లేదా కదలని మెదలని దశగా ఉండి, దానిలో ఎన్నడూ ఏమి కలగలేదన్నట్లుగా ఉంది. దానిలోకి రావటం, పోవటం, అలలు, గాలి, స్పందనలు ఏవీ ఎన్నడూ ఉత్పన్నం కాలేదని మరియు ఉత్పన్నం కావు అని అనిపిస్తోంది. ఈ దశ ఎటువంటిది అంటే, ఈ దశకుపైన అయితే ఒక స్థిర దశలాగా బంధించి ఉన్నప్పటికీ, లోలోపల నా గమనం లేదా ఒక రకమైన నిరంతర ఈదులాడటం (Constant swimming) ఉన్నట్లుగా అనిపిస్తోంది. ఈ నిర్బంధం అనేది ఒక (Curtain) ముసుగులాగా ఎలా ఏర్పడింది అంటే, దానిపైన చూస్తే ఏమి ఉండదు, లోపల కూడా ఏమి ఉండదు, అయినా కూడా నేను అక్కడ నడుస్తూ ఉన్నాను. నేను ఎటువైపు నడుస్తున్నాను? అది నాకు కూడా తెలియదు. అవును మరి, బయటి నుంచి చూసేవారి దృష్టి ఈ నిర్భంధానికి లోపల చూడలేరు, ఏమి గుర్తించనూ లేరు.

ఈ దశ ఎటువంటిది అంటే, నేను ఒకసారి తమకు వ్రాసినట్లుగా, ఏ స్థితి కారణంగా నా అన్ని స్థితులు ఇప్పటివరకు కలిగాయో లేదా మార్పు చెందుతూ వస్తున్నాయో, ఆ స్థితులు నా స్వరూపంగా అయిపోయాయి అని. కాని ఇప్పుడు పరిస్థితి ఏమిటంటే, నేను స్థితులన్నింటినీ చూస్తున్నాను కాని, ఏ దశ కూడా నాదిగా అనిపించటం లేదు. నేను అన్నింటికీ వేరుపడే ఉంటున్నాను. లయం కాగలశక్తి నాలో లేదు. అలాగే నా స్వంతం చేసుకోగలిగేది కూడా ఏమీలేదు. నేను ఉపరితలం నుంచి పైకి పూర్తిగా ఎందుకు వచ్చానా అని అనిపిస్తోంది. ఇప్పుడు నేను ఇంకొక విషయం గమనిస్తున్నాను. ఏమంటే, ఇప్పుడు కనిపిస్తూ ఉన్న నా శరీరం కూడా తమ శరీర రూపంలోకే మారటానికి ప్రయత్నిస్తున్నదా అన్నట్లుగా ఉంది. ఇది నాకు సంతోషదాయకమే. ఎందుకంటే, దీనితో నేను అప్పుడప్పుడు తమరిని దర్శిస్తూ ఉండవచ్చు. నా స్వంతం కానక్కరలేదు, నన్ను అంటిపెట్టుకుని ఉండనవుసరం లేదు. ఇంతగా కృప ఉంటే చాలు. ఇప్పుడు చూస్తున్న ఇంకొక విషయం కూడా ఏమిటంటే, చాలా దూరం ఈది, ప్రయాణించి చూస్తూ ఉంటే, నా గమ్యం ఒకే ఒక్క స్థానంగానే చూస్తున్నాను.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

**ఉత్తరం సంఖ్య - 733**

షాజహాన్‌పూర్,
10.03.1960

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరం చేరింది. దానిని చదివిన తర్వాత నాకు చాలా అనందం కలిగింది. మనం ఎంతగా ముందుకుపోతూ ఉంటే అంతగా రంగులన్నీ మిళితమైపోయి, చివరకు ఏ రంగూ మిగలదు. ఏదైనా రంగు మిగిలి ఉంటే, అది తన స్థితిని కోల్పోతుంది. ఇదే స్థితి నీలో నెలకొని ఉంది. వెలుగు ఏమి లేనప్పుడు దానిని చీకటి అనవలసి ఉంటుంది. అయితే ఆ చీకటి అనేది ఎప్పుడో తొలగిపోయింది. ఇప్పుడు అక్కడ ఉండేది ఏమిటి?

డాక్టర్ వరదాచారిగారి నుంచి ఉత్తరాలు వస్తున్నాయి. ఆయన చాలా ఉన్నతంగా ఎదిగారు. కాని ఆలోచనలు, ప్రాపంచిక విషయాలు ఆయనకు భగ్నం కలిగిస్తున్నాయి. ఇంత ఉన్నత స్థితిలో కూడా ఈ సమస్యలు ఎందుకు ఎదురవుతున్నాయో నాకు అర్థం కానందున ఏమని వ్రాయాలి, ఎలా వ్రాయాలి, నాకు ఏమి తోచటంలేదు. ఆయన భగవద్గీతలోని ఒక శ్లోకాన్ని గురించి అడుగుతూ దానిలోని ఒక భాగాన్ని వ్రాశారు. దానితో ఆయన తన స్థితిని

పోల్చుకోవచ్చునని ఆయన అభిప్రాయం. అది ఎనిమిదవ ఆధ్యాయంలో తొమ్మిదవ శ్లోకం. దాని అర్థం వారికి కావలసి ఉంది. ఆ శ్లోకం యొక్క పంక్తి:

**"ఆదిత్యవర్ణం తమసః పరస్తాహ"**

దీనిని ఒక పండితునితో చర్చించినమీదట గీతాశ్లోకం అని తెలుసుకున్నాను. అది ఏమిటో నాకు తెలియనందున నేను ఏమి వ్రాయగలను. దీనికి సమర్థులైనవారు లఖీంపూర్‌లో ఉన్నారు. దీనిని గురించి వెంటనే తెలియజేయాలని సూరజ్ ప్రసాద్‌కు చెప్పు. మాస్టర్ సాహెబ్‌ను కూడా దీని మీద శ్రద్ధపెట్టమనాలి. దీనిని చెప్పలేకపోతే మన పరువుపోతుంది. అమ్మకు, చౌబేజీలకు ప్రణామం.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 734

లఖీంపూర్,

07.03.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నేను గత ఉత్తరంలో వ్రాసినటువంటి (Restraint) నిరోధకం లేక (Veil) ముసుగు అనే వివరణ వాస్తవానికి ఏమిలేదు, కాని ఏదో శక్తి యొక్క సంపూర్ణత నాలో లయం కావటానికిగాను ఒక అల్పమైన తెల్లని పొగలాంటిది నిరోధకంగా ఉంది. నిద్రించేప్పుడు గాఢనిద్ర పట్టకపోయినాగాని, మేల్కొన్న తర్వాత ఏ ఇబ్బందీ లేకుండా నాకు బాగానే ఉంటోంది.

ఇప్పుడు శూన్యత మరియు అచలనమే నా స్వరూపంగా అయిపోయింది. లోపల–బయట, నేను మునకలు వేస్తున్నపుడు, అంతటా శూన్యత్వమే వ్యాపించి ఉన్నట్లుగా గమనిస్తున్నాను. ఏదైనా మాట్లాడటానికి, చదవటానికి, వ్రాయటానికి మనస్సొప్పటం లేదు. మౌనంగా, చలనం లేకుండా 24 గంటలు కూర్చుండిపోవాలనే అనిపిస్తుంది. నేను ఏమైనా పని–పాటలు చేసినాగాని, స్థితి మాత్రం పూర్తిగా మౌనంగాను, స్థిరంగాను ఉంటోంది. లోపలి భాగమే పైకి వచ్చినట్లుగా అనిపిస్తోంది. ఇప్పుడింక అడుగు భాగం లేదు, ఉపరితలం లేదు. నేను స్వయంగా ఖాళీగా కూర్చుని, కళ్ళు మూసుకుని ఉంటే, శరీరం నిర్జీవంగా అయిపోతోంది.

5వ తారీఖున రాత్రి అంతా, నేను తమతోపాటు దక్షిణ భారతదేశం అంతటా పర్యటన చేస్తూ ఉన్నట్లుగాను, ఆ సమయంలో తమరు ఏది పురమాయిస్తే అది నేను చేసినట్లుగాను, కాని నేను ఏది చేశానో, ఏది చేయలేదో తెలియనట్లుగాను అనిపించింది. ఏదైనా చేసి ఉన్నా అది నిశ్చల దశలోనే చేశాను. 6వ తారీఖున రాత్రి, ఒక విచిత్రమైన కలకాంచాను. దానిలో **విశ్వామిత్రుడు, అత్రి మొదలైన 8,10 మంది ఋషులు నిలబడి ఉండగా తమరు నాతో, "బిటియా! వీరికి సహజమార్గం గురించి చెప్పి పూజ చేయించు" అని చెప్పారు. నేను షుమారు అర్థగంట వరకు ఏదో చెప్పి తర్వాత పూజ చేయించాను. దానితో వారు సంతోషపడి అప్పుడు వారు నా మీద పుష్పాలను వెదజల్లారు. కాని అవన్నీ 'తమ' మీదనే వెదజల్లబడినట్లుగా నేను చూశాను. ఒక్క పుష్పం కూడా నా మీద పడలేదు. ఇది ఎంతో ఆశ్చర్యంగా ఉంది.**

ఈ (Perfect Calmness) సంపూర్ణమైన మౌన స్వరూపంలో కూడా నాకు ఇష్టంగాని, అయిష్టంగాని ఏమి లేవు. ఈ సంపూర్ణ (Lifeless) నిర్జీవస్థితిలో కూడా ఆనందంగాని, ఆనందం లేకుండాగాని లేదు. ఈ '$V_1$' పాయింట్

యాత్ర అంతా పూర్తిగా (Lifeless) నిర్జీవమైనదిగానే ఉంది. కాని రాత్రిపూట స్వప్నంలో తప్పకుండా కొంత బాగున్నట్లుగా ఉంటుంది. కాని ఆ బాగుండటం ఏమిటో నాకు తెలియదు.

ఇక్కడ ఒక విషయం గమనిస్తున్నాను. ఏమిటంటే, ఏదో ఒక అజ్ఞాతమైనది నన్ను పూర్తిగా నిర్జీవం కాకుండా (అనగా మరణించకుండా) లేదా నా దశలో లయం కాకుండా నిరోధిస్తోంది. అలాకాకపోతే, నా కణకణం, లోన–బయట, మరియు శరీరం కూడా చెల్లాచెదురైపోయి నా దశలో లయమైపోయేది. ఇది నాకు తెలుసు, అయినా కూడా నాకు చెందిన నా నిర్బంధం లేదా నివారణ అన్నది నా 'మాలిక్' వల్లనే! అందువలన నాకు అది ఇష్టమే. నా మీద ఎవ్వరైనా నిందలు మోపినా, పుష్పాలు జల్లినా నాకు మంచి చెడులు ఏమి అనిపించటం లేదు. ఈ నిరోధమే (అడ్డగింపే) నన్ను నా దశలో లయమైపోకుండా కట్టడి చేసింది. నేను దీనితో ఓడిపోయాను, లేకుంటే నన్ను ఎంతమాత్రమైనా అడ్డగించగల శక్తి ఏదీలేదు. సుప్తచేతనా మనస్సు (Sub-Conscious mind) యొక్క కణకణం చిన్నాభిన్నమైపోయినట్లుగాను, చెదరిపోయినట్లుగాను అనిపిస్తోంది. ఆ కణాలన్నింటి నుంచి ఆలోచనలు అన్నీ వెళ్ళిపోయి అంతా శూన్యమైపోయినట్లుగాను లేదా ఖాళీ అయిపోయినట్లుగాను ఉంది. ఇప్పుడింక మనస్సే లేకపోయాక నేను ఇంకేమి చేయగలను! బహుశా అందుకే ఈ (Lifeless) నిర్జీవ దశయే నా స్వరూపమైపోయింది.

నా లోపల దశ ఈ విధంగా ఉంది:

**"కబిరా ఖడా బాజార్ మెం, సబ్‌కీ మాంగె ఖైర్।**

**న కాహూసె దోస్తీ, న కాహూ సె బైర్॥"**

అనగా కబీరు అందరి క్షేమం కోసం ప్రార్థనచేస్తూ బజారులో నిలిచి ఉన్నాడు. అతనికి ఎవరిపట్ల స్నేహం లేదు, విరోధమూ లేదు, అని.

ఇది పూర్తిగా లూటీ అయిపోయిన దశగా ఉంది. అంతేకాదు, శరీరం యొక్క కణాలు అన్నీ లూటీ చేయబడినట్లుగా అయిపోయింది. కాని నాది ఎటువంటి నమ్రత మరియు దీనదశగా ఉందంటే, నా నుంచి పోయింది ఏమీలేదు, వచ్చిందీ లేదు. ఇంకేముంది, గత్యంతరంలేక నేను దశను పూర్తిగా చూస్తున్నాను. కాని ఇందులో 'నాది' అనేదిగాని, 'నేను' అనిగాని ఏమీలేవు. నా దశ ఎలా ఉందంటే, "కబిరా ఖడా బాజార్ మెం..." అని కబీర్ చెప్పినట్లుగానే ఉంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 735

షాజహాన్‌పూర్,

18.03.1960

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరం అందింది. చాలా సంతోషమైంది. సూరజ్ ప్రసాద్‌గారి ఉత్తరం ద్వారా మీరందరూ బాగా ఆలోచించి వ్రాసిన సమాధానం చాలా బాగుంది. మాస్టర్ సాహెబ్‌గారి ఉత్తరం అందిన తర్వాత దానినే వ్రాసి పంపుతాను.

డాక్టర్ వరదాచారిగారి కొరకు నీవు చేస్తున్న ప్రార్థన సరిగ్గానే ఉంది. ఆయన కోసం నేను చాలా శ్రమించాను. ఇప్పటికీ శ్రమిస్తున్నాను. దానిని నా బాధ్యతగా తీసుకున్నందువలన ఆ పని చేస్తూనే ఉన్నాను. అయినప్పటికీ ఆలోచనలు కలుగతూనే ఉన్నాయి, ప్రాపంచిక విషయాల వలన దిగులు తప్పటం లేదు. ఆయనకు సంతృప్తి కలగటానికి ఏమి చేయాలో నాకు తెలియడం లేదు. సహజమార్గం నుంచి ఆయన ఏదో ఆశిస్తున్నాడని నేను అనుకోను కాని,

సహజమార్గంలో పెద్దగా తత్వం (సారం) ఏదీ లేదని ఆయన భావించకూడదు అని నా భావన. ఈ సందర్భంలో నీవు ఇచ్చిన వ్యాఖ్యానం, **"స్వర్గంలో ఉండి కూడా మనం నరకం గురించి ఆలోచిస్తున్నామంటే అప్పుడు స్వర్గం కూడా నరకంగానే అవుతుంది"–** చాలా బాగుంది. నీ యొక్క ఈ వ్యాఖ్యానాన్ని నీ పేరుతోనే నా ఉత్తరంలో వ్రాసి పంపుతాను.

"వారి (వరదాచారిగారి) అలోచనలను, ఉన్నతి యొక్క కోణంలో చూసినట్లయితే వాటిని సంస్కరింపవచ్చును కదా!" అని నీవు వ్రాశావు. నేను ఏ దృష్టిలో చూడాలని నీవు భావిస్తున్నావో నాకు అర్థం కాలేదు. నాకు జ్ఞాపకం ఉన్నంతలో నీవు '$U_1$' స్థానం మీద ఉన్నావు. దీనిని నిర్మలీకరించి '$V_1$' స్థానంమీదకు త్వరగా చేర్చుతాను. నీకు కూడా ఆలోచనలు వస్తున్నాయా? ఒకవేళ వస్తూ ఉంటే అవి అధికంగానా లేక అల్పంగానా? కేసర్ మంచి ఉన్నతిని పొందుతూ ఉంది.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 736

లఖీంపుర్,
18.03.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం అందింది. సమాచారం తెలిసింది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నా దశ ఏమిటో తెలియకుండా ఉంది, అది ఏమిటంటే, లోన, బయట ఒక (Balance) సామ్య మరియు (Emptiness) ఖాళీ దశ ఏర్పడింది. దానితో కళ్ళు మూసినా, తెరచినా భేదం ఉండటం లేదు. కణ కణం, అణువణువు అన్నీ స్వయంగా వాటిలోనే లయమైపోయినట్లుగా ఉన్నాయి. ఎటువంటి అవుసరానికిగాని, కోరికకుగాని, మనస్సుకు సంబంధించిన దేనికైనాగాని ప్రవేశం ఏదీ దక్కటం లేదు. అంతా ఖాళీగా అయిపోయింది. నాతోనే కలిసిపోయిన దశ ఉంటున్నట్లుగా చూస్తున్నాను. ఏదైనా దశ ఉందంటే, బాగా దృష్టిపెట్టి వెదికితేతప్ప దాని ఆచూకీ తెలియనట్లుగా ఉంది.

ఇంతకుముందైతే దశయే స్వయంగా నా ఎదుట నిలిచేది, మరి ఇప్పుడు నేను దానిని వెదుక్కుంటూ ఉన్నాను. అప్పుడు కాని దాని జాడ తెలియటం లేదు. అయినా కూడా నేను దానిని పట్టించుకోవటం లేదు. ఇది మాత్రం ఖాయం, ఏమిటంటే, 'మాలిక్' యొక్క స్మరణ కోసం నన్ను తపనలో ఉంచుతున్నది. అది ఎంతకూ రావటం లేదు. అంతేకాదు, జ్ఞాపకం యొక్క జ్ఞాపకమైనా వస్తుందా అంటె అదీలేదు. అది ఏమిటో తెలియటం లేదు. నిదానంగా కాలే వస్తువులాగా నా పురోగతి చాలా మందకొడిగా ఉంది. ఇది ఒక కీలుబొమ్మలాంటి దశ, నాతో ఏ పనైనా చేయించుకోవచ్చు. నివేదన (Submission) అనేది నా (Nature) స్వభావంగా అయిపోయింది. అయినా కూడా దశ ధారాళమైనదిగా ఉండి స్వాధీనంలో లేకుండా ఉంది. దీని అంతూ పొంతూ తెలియకుండా ఉంది. నాకు ఏమయ్యిందో ఏమోకాని, ఆలోచన లేదా నిరాలోచన (ఆలోచన లేకుండా) యొక్క జ్ఞానం కూడా లేకుండా పోయింది. వినటానికి రెండూ ఒక్కటిగానే అనిపిస్తున్నాయి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 737

లఖీంపుర్,
24.03.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం అందింది. చదివి ఎంతో సంతోషించాను. ఇక్కడ అందరూ క్షేమమే. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నా దశ ఎలా ఉందంటే, ఏదో ప్రవాహం ఎడతెగకుండా ప్రవహిస్తున్నట్లుగా ఉంది. అయితే అది ఎప్పుడు తెలుస్తుందంటే, ఎప్పుడైతే దశకు వెలుపల తొంగి చూస్తానో లేదా ఎవరైనా బయట ప్రవాహం ఉధృతంగా వస్తోంది, కాని నేను లోపల బంధించబడిపోయాను అని చెప్పినప్పుడు. అయినాగాని, నామీద దాని ప్రభావం ఉండదు. అది ఆలోచనల ప్రవాహమే కావచ్చు, మరేదైనా కావచ్చు. నాకయితే ఆలోచన లేదా నిరాలోచన యొక్క ఊహా జ్ఞానం కూడా లేకుండా పోయింది. ఆ ప్రవాహం యొక్క ఉరవడి ప్రభావం మెదడువరకు చేరుతుంది, కాని మెదడును దాటి నా దశ పూర్తిగా స్పృశించలేనిదిగానే ఉంటుంది.

అణకువ (Submission) అనేది నా (Nature) స్వభావంగా అయిపోయింది. అయినా కూడా దశ (Un-restrained) అడ్డులేనిదిగాను, (Without any control) అదుపు లేనిదిగాను ఉంది. నా దశ ఎలా ఉందంటే, ఇంటికి బయట ఎప్పుడూ తొంగి చూడనట్లుగా అనిపిస్తోంది. ఆ స్థితి (Deserted) ఎడారిలాగా కావచ్చు లేదా (Empty) ఖాళీగానైనా ఉండవచ్చు. ఇంకేముంది, ఇంటితో కలిసిమెలిసి ఉన్న దశయే నా స్వరూపంగా అయిపోయింది. ఇల్లు లేదా నివాసం అని పేరుకు మాత్రం చెప్పాను కాని ఈ స్థితి అను ఇల్లు మరియు బయట అంతా ఒక్కటే. అక్కడ (Understanding) అవగాహన అనేది పనికిరాదు. కనుక దానిని నేను ఏమని, ఎలా తెలియజెప్పగలను. కణకణం, అణువణువు స్వయంగా వాటిలోనే లయమైపోయాయి అని చెప్పవచ్చు. ఆలోచనలు లేదా మాటలు కూడా స్వయంగా వాటిలోనే లయమైపోయాయి. లేదంటే, తను అనేది తనలోనే లయమైపోయిందని చెప్పవచ్చు. నేను ఇప్పటికీ నా దశను సరిగ్గా చెప్పలేకపోతున్నాను. అందుచేత నాతో కలిసిమెలిసి ఉన్న దశయే నా స్వరూపంగా అయిపోయింది అని మాత్రం చెబుతున్నాను.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 738

లఖీంపుర్,
25.03.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నిన్ననే తమకు నేను ఒక ఉత్తరం వ్రాసి పంపించాను. అది తమకు చేరి ఉండవచ్చు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

ఇది ఎటువంటి దశ అంటే, మనస్సు, మనస్సులోనే లేదా స్థితిలో లయమైపోయినట్లుగా ఉంది. గతి (పురోగమనం) దానిని అతిక్రమించి మరేదోగా అయిపోయింది. బహుశా ఇందుకే, గతి (గమనం) లేక ఆలోచనలు లేదా అభిప్రాయాలు ఏవైతే కలుగుతున్నాయో, వాటిలో మార్పు చెందుతూ కూడా అది నిరంతరం అలాగే ఉంటున్నట్లుగా ఉంది. ఎందుకంటే, మనస్సుకు బాగుండటం అనేది, కొంచెం బాగుండటం అనేది ఆత్మిక స్థితిలోనే

ఉన్నా కూడా కొంత ఆటంకం కలుగుతుంది. ఈ ఆనందం యొక్క అనుభూతి వలన స్థితిని సమానంగా ఉండనివ్వటం లేదు. కాని దానిని దాటి ఏ స్థితి  ఉన్నా కాని అది నిరంతరాయంగానే ఉంటుంది మరియు దానికింక ఏ స్థానం మిగలనట్లుగా అనిపిస్తుంది. లోపలి మట్టం కూడా పైకి వచ్చేసి స్థిరంగా ఉండిపోయింది. ఈ రహస్యం కూడా నాకు ఇప్పుడే తెలిసింది, అలా కాకపోతే ఇప్పటివరకు నాలో ఎటువంటి ఆటంకం కలగదు అనే అనుకునేదానను. ఆ స్థితి కేవలం చలించకుండా నిరవధికంగానే ఉంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 739

లఖీంపుర్,

30.03.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నేను పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా పంపిన ఉత్తరం తమకు చేరిందని అనుకుంటున్నాను. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు నా దశ ఎలా ఉంది అంటే, ఆలోచనలు వచ్చినా గాని, రాకపోయినా గాని ఆంతరిక స్థితి నాకు అనుభవం కావటం లేదు. దాని జ్ఞానమే నాకు లేకుండా పోయిందని అనిపిస్తోంది. దానిని ఊహించలేక పోతున్నాను కూడా. ఒకవేళ దశను 'శ్రీ బాబూజీ'కి వ్రాసినా గాని అది నా అనుభవానికి రావటం లేదు. ఈ దశ ఎలా ఉందంటే, నా స్వంత (Nature) స్వభావమే ఏమి లేనట్లుగా ఉంది. పూర్తి (Submission) నివేదనయే నా స్వరూపంగా అయిపోయింది. అయితే అది కూడా నాదికాదు, దానంతట అదే ఆ విధంగా అయిపోయింది. నా దశ ఎలాంటిది అంటే, అసలు నా దశయే లేదన్నట్లుగా ఉంది. దశ మార్పు చెందుతూ కూడా మార్పు లేనట్లుగానే అనిపిస్తోంది.

బాబూజీ, ఇది ఏమిటో తెలియకుండా ఉంది. అది ఏమిటంటే, 'శ్రీ బాబూజీ'తో నాకు సంబంధమే లేదనిపిస్తున్నట్లు ఈ దశ ఉంటోంది. నేను మాటి మాటికీ ప్రయత్నిస్తూ ఉన్నా కూడా ఒక నిముషం తర్వాత ఉన్నది ఉన్నట్లుగా ఉంటున్నాను. తమరు నాతో ఒకసారి చెప్పారు: "నీ ఉన్నతి దానంతట అదే జరుగుతోంది. నేను నిన్ను ఆధ్యాత్మికంగా ఎవరి మీదా ఆధారపడేట్లుగా చేయలేదు" అని. ఈ విషయం ఎప్పుడూ స్ఫురించలేదు. ఈ రోజుకు కూడా నా ఆలోచన దానివైపు మళ్ళలేదు. నాకు ఏమైందో ఏమో తెలియటం లేదు. అయినా గాని నేను తమ చరణాలనే ఆశ్రయించుకుని ఉన్నాను. తమరు మాత్రమే నన్ను చూడాల్సి ఉంటుంది. ఆధ్యాత్మిక రంగంలో పురోగతికి సంబంధించి ఎప్పుడూ ఇతర మార్గాలను అనుసరించను. నేను ఎవరితోనూ సంబంధం కలిగి ఉండనపుడు, దానిని ఎక్కడ కల్పించుకోవాలి, ఎలా కల్పించుకోవాలి. ఏమైనాగాని నేను 'తమరి'కి చెందినదాననే, 'తమరి'కే చెంది ఉంటాను కూడా. బహుశా మనస్సు, ఆలోచనలు నన్ను వీడిపోయి ఉంటాయి. అవే నాకు తమతో సంబంధం కల్పించి ఉండటానికి నావద్ద ఉన్న సాధనాలు (Instruments). అయినా కూడా నేను తమకే చెంది ఉన్నాను.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 740

లఖీంపుర్,

03.04.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు పూజ్య తావూజీగారిని ఉద్దేశించి వ్రాసిన ఉత్తరం వచ్చింది. దాని ద్వారా తమ సమాచారం తెలిసింది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశలో నాకు ఈ విధంగా అనిపిస్తోంది: నా లోన, బయట ఏమయ్యిందో కాని, లోన-బయటనే కాకుండా అంతటా కూడా పవిత్రత మరియు ఈశ్వరీయ ధార లేదా ఈశ్వరీయ నామమైనా గాని, ఎక్కడా వాటి ఉనికియే అనుభవం కావటం లేదు. నా దశ (Strange) విచిత్రమైనదిగాను, (Surprising) విస్మయం గొల్పేదిగాను ఉంది. అలా ఆశ్చర్యంగానే కాకుండా నేను దానిని కూడా మర్చిపోయి ఖాళీగా పచార్లు చేస్తున్నాను. నాకు ఎప్పుడూ ఏ పని లేనట్లుగాను, ఇప్పుడు కూడా పని ఏదీ లేదన్నట్లుగాను ఉన్నాను. నేను ఏమి చేయాలో తెలియటం లేదు. బహుశా ఎటువంటి పనిపాటలు లేకపోవటంవల్లనేమో, నాలో ఏ ఆనందం మరియు ఉత్సాహం ఉండేవో, అవి పూర్తిగా లేకుండాపోయాయి. ఇంకా ఏమిటంటే, స్థితిలో ఒక రకమైన (Melancholy) ఉదాసీనత మరియు (Emptiness) ఖాళీతనం నెలకొని ఉన్నాయి. ఒకవేళ నేను దీనిమీద మనస్సు నిలపటానికి ప్రయత్నించకపోయినట్లయితే ఈ ప్రపంచంలో ఒక్క క్షణమైనా జీవించి ఉండటానికి కష్టమవుతుంది. నా మనస్సు ఊరట చెందటానికి తగిన ఆహ్లాదం కాని, ఏ ప్రదేశం కాని, ఈ ప్రపంచంలో లేవు. మాటిమాటికీ స్థితి ఎలా ఉదాసీనంగా అయిపోతున్నదంటే, దానిని కనుక మరల మరల ఊరటపర్చటానికి ప్రయత్నించకపోయినట్లయితే ప్రపంచంలో ఒక్క క్షణమైనా జీవించి ఉండటం దుర్లభమవుతుంది. ఈ విషయం ఏమిటోగాని, పవిత్రత, ఈశ్వరప్రాప్తి మరియు ఆంతరిక ఆనందం -వీటి యొక్క అదృష్టం కొంచెం అయినా లేకుండా పోయాయి. ఈ శరీరం ప్రాపంచికమైనది, దీనిలో ప్రాపంచికతయే కూరుకుపోయి ఉంది. ఆధ్యాత్మిక ప్రపంచం, (భౌతిక) ప్రపంచం యొక్క జాడ నాలో ఎక్కడా దొరకటం లేదు. ఇటువంటి పనిపాటలు లేనిది మరియు చైతన్యంలేని (Inactive) దశయే నా లోపల, బయటనే కాకుండా అంతటా వ్యాపించి ఉంది. దానివలన ఒక (Deep sadness) గాఢమైన ఉదాసీనతయే అంతటా వ్యాపించి ఉంది. మాటి మాటికీ ప్రయత్నించినాగాని అది నాది అన్నట్లుగా, తొలగించినా తొలగిపోవటం లేదు, నిలువరించినా నిలవటం లేదు. ఇంకను, దాని ప్రవాహం వంటిదే దిగివస్తూ ఉంది. పైప్రపంచం యావత్తు క్రిందికి దిగి వస్తున్నట్లుగాను, అలా దిగివచ్చి నాలో వ్యాప్తమైపోయేట్లుగాను, కిక్కిరిసి నింపినట్లుగాను అనిపిస్తోంది. మంచిదే, నాకు మాత్రం ఎందుకు ఈ చింత, అది 'మాలిక్'కే తెలియాలి. ఈ ప్రపంచంలో నా మనుస్సును ఊరడించటానికి 'వారి' శక్తికే సాధ్యం. కేవలం 'వారే' చేస్తారు. అలా కాకపోతే, నేను స్వయంగా ఊరట చెందటానికిగాని, నన్ను మోసపుచ్చుకోవటానికిగాని లేదా మర్చిపోవటానికిగాని నాలో శక్తి ఏది మిగిలి లేదు. నేను (Inactvity) చైతన్యం లేకుండా, (Idleness) సోమరితనం మరియు (Sadness) ఉదాసీనతతో నిండిపోయి ఉన్నాను లేదా ఇదే నా స్వరూపంగా అయిపోయింది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 741

షాజహాన్‌పూర్,

16.04.1960

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీవు ఏప్రియల్ 13వ తేదీన మధ్యాహ్నం 1 గం॥కు '$V_1$' స్థానం మీదకు చేరావు. స్థితిలో ఎంతోకొంత మార్పు ఉండి ఉంటుంది.

అమ్మకు, చౌబేజీకి ప్రణామం.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 742

లఖీంపూర్,

15.04.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు షాజహాన్‌పూర్‌కు చేరి ఉంటారని అనుకుంటున్నాను. ఇక్కడ అందరూ కుశలమే. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

ఇప్పుడు స్థితి యొక్క (Melancholy) ఉదాసీనత లేదా (Emptiness) ఖాళీతనం లేకుండా పోయాయి. ఇప్పుడు మళ్ళీ కొంచెం సంతృప్తి లేదా అటువంటిదే అయినది దశలో ఉంటుంది. నేను అందరితో చెప్పినటువంటి నివేదన (Submission) దశ ఇప్పుడు ఎందుకోగాని జాడ లేకుండా పోయింది. నేను తక్షణమే వెళ్ళి నా 'మాలిక్'ను పొందాలని అనుకుంటున్నాను. ఆలస్యాన్ని సహించలేకపోతున్నాను, కాని చేతులు కాళ్ళలో శక్తి లేదు. అయినప్పటికీ నేను నన్ను ఒక నిర్భాగ్యురాలిగా అనుభూతి చెందలేకపోతున్నాను. ఎందుకంటే, నా లోపల నాకు తెలియని శక్తి ఏదో ఉంది. ఒకవేళ 'మాలిక్' దానిని మూర్ఛపు పట్టుదల అన్నట్లయితే దానిని నేను సహించను. ఎందుకంటే, వినమ్రతయే నా స్వరూపంగా అయిపోయింది కనుక. ఇప్పుడు మనస్సుకు విహరించే స్థలం దొరికింది. అందువలన సంతోషంగా ఉంది. బహుశా అందుకే ఆ గాఢమైన ఉదాసీనత ఇప్పుడు కొంత తగ్గింది. నేను తమకు ఒక ప్రవాహం వంటిది దిగి వస్తున్నట్లు వ్రాశాను. అది ఉదాసీనతకు చెందినది కాదు, కాని ఒక దశకు మరియు శక్తికి చెందినది. ఆ శక్తి ఏమిటో తెలియదు. అది ఎక్కడికి వెళ్తున్నదో, ఏమి చేస్తున్నదో కూడా తెలియదు.

ఇంకొక విషయం ఏమిటంటే, ఈ ప్రవాహం అనేది 'మాలిక్' యొక్క ప్రపంచాన్ని నాలోనికి ప్రవేశపెట్టబడుతూ ఉంది. అది నేను ఆపినా ఆగదు, స్థిరంగా ఉండదు. **ఒకసారి తమరు (బాబూజీ) చెప్పారు, "బిటియా! నా శక్తి వంటిది ఈ ప్రపంచంలో ఒక్కటే ఉంటుంది"** అని. అందువలన, నాకు 'మాలిక్'కు చెందినది ఏదీ పొందాలని లేదు అని నిజంగానే చెప్తున్నాను. నాకయితే కావలసింది 'అతడు' మాత్రమే. 'వారే' నా జీవన సర్వస్వం మరియు ప్రియతముడు. 'వారు' ఎప్పుడు నా వారుగా అవుతారు? నేను ఎప్పుడు వారిని ప్రాప్తింపచేసుకోగలను? ఎందుకో తెలియదుగాని, ఆ (Strangeness) విస్మయంగొల్పే దశ మరియు (Submission) నివేదన పూర్వకమైన దశ, ఏదైతే అందరిపట్ల ఉంటూ ఉండేదో, అది ఇప్పుడు లేదు.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 743

లఖీంపుర్,

29.04.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం చేరింది. తమ కృప ఈ దీనురాలుపై సదా ఇదే విధంగా ఉండాలనేదే నా ప్రార్థనగా ఉంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఎంత శుష్కించిపోయిన (ఎండిపోయిన) దశగా ఉంది అంటే, అది శుష్కించిపోతే మరణించినది లేక రాలిపోయిన దశ అన్నట్లుగా ఉంది. ఎందుకంటే, నాలో ఇప్పుడు (Simplicity) సరళత్వం, (Easiness) సాదాతనం, (Humbleness) వినమ్రత ఏమీ లేకుండా పోయాయి. అలా సమాప్తమైపోవటమే కాకుండా, ఎందుకో తెలియదుగాని వాటి నామరూపాలు కూడా గాలిమాటలు అన్నట్లుగా దశ నుండి తొలగిపోయాయి. అయినప్పటికీ ఇవి నాకు ఇష్టంగా ఉన్నాయి. కనుక నేను వీటిని రప్పించటానికి ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా ఉంది. ఎందుకోగాని, ఈ విధంగా అనిపిస్తోంది. ఏమని అంటే, ఆధ్యాత్మికతతోపాటుగానే, ఆధ్యాత్మిక శిక్షణ యొక్క ప్రభావం కూడా నామీద లేకపోయినట్లుగాను, అది నాకు పట్టనట్లుగాను ఉంది. నాకు ఎందుకు ఇలా అయిపోయింది? నాకేమీ అర్థం కావటం లేదు.

ఇంకొక విషయం ఏమిటంటే, తపన అనేది నాకు తెలిసో, తెలియకనో ఒక అంగంగా అయి ఉండేదో, అది ఇప్పుడు నన్ను వదిలి వెళ్ళిపోయింది. ఇప్పుడు అది కూడా నా వశంలో లేదు; లేదా ఇంకొక విధంగా చెప్పాలంటే, అది నన్ను వీడిపోయింది, మరి నేనేమీ చేయలేకపోయాను.

ఇంక స్థితి ఏమిటి? నునుపైన కుండ వంటిది (అనగా దానిమీద ఏదైనా జారి పోతుంది). ఇంక స్థితి కూడా లేకపోయి స్థితిలేని స్థితియే మళ్ళీ ఏర్పడింది. 'మాలిక్' జాడ కూడా తెలియకుండా పోయినపుడు, ఏదైనా చెప్పాలంటే, ఎవరితో చెప్పుకోవాలి? చెప్పాలనుకున్నాగాని ఏమి చెప్పాలి? మాట రావటం లేదు. నావద్ద ఏమీ లేకపోయాక నేను దేనిని గురించి చెప్పాలి? ఇంతే కాదు, ఈశ్వరీయ సంబంధమైనవిగాని, ఆత్మ సంబంధమైనవిగాని ఏవైనా విషయాలు, ఎప్పుడూ నా ఎదుట ఎన్ని చర్చించబడుతున్నా కూడా, అవన్నీ నాకు తెలియని మాటలుగానే నా దశలో అనిపిస్తోంది. చెప్పేవి మంచి మాటలే అయినా గాని నేను తెలుసుకోవాలని అనుకున్నా ఏమి తెలుసుకోవాలి? నాకు అర్థం కాని విషయం ఇంకొకటి ఏమంటే, ఒకవేళ ఎవరైనా నాతో మాట్లాడుతూ ఉన్నట్లయితే, అప్పుడు పూజకు సంబంధించిన ఆలోచనలు వస్తున్నాయి. అవి ఎక్కడ నుండి వస్తున్నాయో తెలియక నేను స్వయంగా ఆశ్చర్యానికి గురవతూ ఉంటాను. ఇంకా ఏమిటంటే, ఆ మాటలు ఆగిపోగానే ఆలోచనలు యథాప్రకారంగా అయిపోతాయి. ఇప్పుడు నిద్రలోను, స్వప్నంలోను కూడా ఎప్పుడూ 'మాలిక్' యొక్క అనుభూతిని పొందలేకపోతున్నాను. అప్పుడు శాంతంగా ఎలా ఉండగలను! అసలు నాలో అనుభూతియే లేదన్నట్లుగా నాకు ఇప్పుడు అనిపిస్తోంది. ఎప్పుడైతే 'మాలిక్'కు చెందిన పనులమీదకు దృష్టి మరల్తుందో అప్పుడు అనుభవం మరియు శక్తి అన్నీ కూడా ఎక్కడి నుండో వచ్చి అందుకు తగ్గట్లుగానే వ్యవహరిస్తాయి. ఆ తర్వాత నేను యథాప్రకారంగా అయిపోతాను. ఇంకా ఏదైనా ఉన్నాగాని, నేను మాత్రం 'మాలిక్' యొక్క అన్వేషణలోనే వేసారిపోతున్నాను. అయినా గాని, ఒక్క క్షణమైనా 'అతడు' తన అనుభూతిని ఎప్పుడూ కల్పించటం లేదు. తెలిసినా, తెలియకపోయినా నేను శుష్కించి పోయి ఖాళీగానే తిరుగుతున్నాను. 'అతడు' మాత్రం దూరంగా గాని, దగ్గరగా గాని అనుభవానికి రావటం లేదు.

ఇప్పుడు, నిద్ర నాకు నిద్రగా రావటం లేదు. మరి ఏముంటుందో తెలియదు. దానిని నేను కొద్దిగా గ్రహించగలిగినా గాని, వ్రాయనలవి కావటం లేదు. ఇప్పుడు దశ ఎలా ఉందంటే, ఆకులు రాలు కాలం (శిశిర

ఋతువు) తర్వాత చిగురించటం కోసం కళ్ళు ఆశగా చూస్తుంటాయి. కాని ఇప్పుడు నాలో ఆశ, నిరాశలకు కూడా స్థానమే లేకుండా పోయింది. ఆధ్యాత్మిక శిక్షణ కూడా నాలో ఎందుకు లేకుండా పోయిందో అర్థం కావటం లేదు. ఏది ఉంటే, అదే ప్రాప్తం అనుకుంటాను. కాని 'మాలిక్' ఎక్కడ? నేను 'అతడి'ని ఎలా పొందగలను? నాలో ఇప్పుడు ఆ తపన కూడా లేదని తెలిసినప్పటికీ, ఏదో తెలియనిది వచ్చి క్షణం మాత్రంగా స్వచ్ఛత కల్పించి, మళ్ళీ యధాతథంగా విడిచి వెళ్తుంది. ఈ తెలియనిది ఏమిటో నేను తెలుసుకోలేకపోయాను. ఎందుకంటే, అసలు నాలో స్థితి అంటూ లేకుండా ఉంటే, ఆ స్థితి యొక్క కారణం మాత్రం ఎక్కడ అనుభవమవుతుంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 744

లఖీంపుర్,

02.05.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందని అనుకుంటున్నాను. నా ఆరోగ్యం బాగుపడింది. 'మాలిక్' కృపతో నా బలహీనత నుంచి చాలా త్వరగా కోలుకున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు దశను గురించి నేను ఏమైతే చెబుతున్నానో అది కొంతవరకు జరుగుతోంది. అందువలన దశ యొక్క వాస్తవికతలో (రియాలిటిలో) కొంత తరుగు ఉంటోంది. అది ఎంతవరకునంటే, దాని అనుభవం కూడా దానికి కొంత జోడింపు (తోడు) కల్పిస్తోంది. అదే జోడింపు (జత కలగకపోతే) లేకపోతే నేనేమి చెప్పగలను. నాకు ఏమయ్యిందో తెలియదు కాని, నా పరమ ప్రియుడు 'శ్రీ బాబూజీ' రంగు, రూపం, స్వరం, వాణి అన్నీ మరచిపోయి ఉంటే, నేను ఎక్కడని వెదకను, 'అతడి'ని ఎలా పట్టుకోగలను? ఏమైనా కానివ్వండి, 'తమరు' ఎలా ఉన్నా, ఎక్కడ ఉన్నా నావారే, నేను తమరిని వెదుకుతాను. నేను తమ ఫోటోను గంటల తరబడి చూస్తున్నాను. అయినాగాని ఫోటో ఎవరిదో గుర్తించలేకపోతున్నాను. అప్పుడు ఎవరైనా గుర్తుచేస్తే చాలా సిగ్గుపడుతున్నాను.

ఇప్పుడు ఈ దశ ఎటువంటిది అంటే, ఒకవేళ (Servile) సేవకత్వం అంటూ ఉంటే, అది కూడా (Captivity and closure) ఖైదు మరియు బంధింపు నుంచి స్వతంత్రమైపోయింది. ఇంక నా దగ్గర ఏమీ లేదు. నా దశ అయితే పూర్తిగా ప్రాపంచికపు సాధారణ మానవునిలాగ ఉంది, కాని ఈ మాత్రమైనా నా ఎరుకలో ఉండాలి, అయితే అంత కూడా లేదు. కాని ఈ జ్ఞానంతో నాకు తెలియని దశగానే ఉంటోంది. ఈ (Closure) బంధింపు నుంచి కూడా దశ స్వతంత్రంగానే ఉంటోంది. స్వతంత్రపు బంధనం (Closure of freedom) నుంచి కూడా స్వతంత్రంగా ఉంది. ఈ దశను గురించి, ఏమైనా చెప్పినా, చెప్పకపోయినా దానిని గురించి పట్టించుకోనవసరం లేదు. పట్టించుకోవలసిన విశేషతా లేదు, రెండూ సమానమే.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 745

లఖీంపుర్,
14.05.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు ఆరోగ్యంగా ఉన్నారని భావిస్తున్నాను. పూజ్య మాస్టర్ సాహెబ్‌గారు అక్కడకు చేరి ఉండవచ్చు. తమకు వారి ద్వారా మంచి విశ్రాంతి లభించగలదు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఇప్పుడు ఈ దశలో, కళ్ళకు దశ కూడా కనిపించటం లేదు. ప్రయత్నించినా కూడా కళ్ళూ, దశ ఒక్కటిగానే ఉంటున్నాయి. ఏమి అర్థం కాకపోతే ఏమి వ్రాయగలను? నా చేతుల్లో ఏమీ లేదు. ప్రియతముడైన 'మాలిక్' దర్శనం మరియు కలయిక కోసం తీవ్రమైన తపనతోను మరియు ఆశతోను తిరుగుతున్నాను. కాని 'వారి' దర్శనం పొందటానికి నేత్రాలలో వెలుగు లేకుండా ఉంది. నేత్రాలు ఇప్పుడు ఏమీ చూడలేకపోతున్నాయి. ప్రపంచంలోని సాధారణ జనజీవనపు దశలాగానే నా దశ ఉంది. దీనితో ఆహార పానీయాదులు, పనులు వగైరా చేయటంతోనే రోజులు గడుస్తున్నాయి. కాని 'మాలిక్' జ్ఞాపకం యొక్క జాడ కూడా తెలియటం లేదు. నా యొక్క స్థూల, సూక్ష్మాలన్నీ ఏకమైపోయాయి. సూక్ష్మాతి సూక్ష్మ ప్రయత్నంతో కూడా నా దృష్టి 'మాలిక్'ను చేరలేకపోతోంది. అటువంటి పరిస్థితిలో రోజంతా సోమరిగాను, ఖాళీగాను తిరగటంతప్ప, ఏ మంచి ఆలోచన చేయగలను. కాని నేను సంతోషంగా ఉన్నాను. ఎందుకంటే, ఇలా ఉంటేనే 'మాలిక్'కు కూడా సంతోషం, కనుక ఇలాగే ఉంటాను. ఇంకొక రకంగా చెప్పాలంటే, ఇప్పుడింక స్థూలం, సూక్ష్మం ఏవీలేవు. అన్నీ యథాతథంగా జరిగిపోతున్నాయి. ఇప్పుడు మార్పు కూడా ఏమీలేదు. ఉన్నదానితోనే సంతోషంగా ఉన్నాను. నాకు అమృతం, విషం రెండూ ఒకే రకంగా ప్రియమైనవే. ఇంకా ఏమిటంటే, ప్రియం–అప్రియం, సుఖం–దుఃఖం, శాంతి–అశాంతి అన్నీ నాకు సమానమే. చైతన్యం, సుప్తచైతన్యం (Consciousness, Sub-Consciousness), ఆత్మ–పరమాత్మ, నేను–నీవు, ఇవేవీ నాకు లెక్కలోకి రావు. అన్ని ప్రశ్నలు సమాప్తమైపోయాయి. ఎక్కడా గ్రంధి (knot) అనేది కూడా లేదు. ఉల్లాసం కాని, ఉప్పొంగిపోవటం కాని లేవు. ఏ సముద్రంగాని, మైదానంగాని లేవు. ఇప్పుడు నాకేమీ అనుభవం కావటం లేదు. ఇంకేముంది, ఎందుకూ పనికిరాని ఖాళీ, అచైతన్య దశతో ఇప్పటివరకు అన్ని రోజులు గడిచిపోయాయి. ఇంక నాకేమీ అనుభవం కాకపోతే నేను ఏమి వ్రాయాలి? ఇప్పటివరకు పైన నేను వ్రాసినది దశను గురించి కాదు, ఉన్న పరిస్థితిని గురించే, ఇదికాదు, అది కాదు అని మొదలైనవి వ్రాశాను. నా దశ ఏమిటో తమకే తెలుసు. ఏదైనా తమరు చెబితే నేను అర్థం చేసుకోగలను, లేకపోతే అదీలేదు.

ఇప్పుడు నా దశ ఎలా ఉంది అంటే, 'తమరు' వ్రాశారు, ఏమని అంటే, "నీ స్థితికి ఈశ్వరునికి ధన్యవాదాలు" అని. కాని నాకు ఆశ్చర్యం కలిగిస్తున్నది ఏమిటంటే, వాస్తవంగానే నా దశ 'మాలిక్'కు ధన్యవాదాలు అర్పించదగినదిగా ఉన్నపుడు, తమరు ఇలా వ్రాసి ఉండలేదు. మరి ఇప్పుడైతే, నా 'మాలిక్' గురించిన ఆలోచన యొక్క ఆలోచనను కూడా హరించివేసినపుడు 'వారి'కి ధన్యవాదాలు అర్పించాల్సి ఉంటుంది. అది 'వారి' ఇష్టం. నాలో కలిగిన స్థితి ఏదైతే ఉన్నదో లేదా జరుగుతూ ఉన్నదో, దానిని వివరించటానికి తగిన శబ్దాలు లేకపోయాయి. అందుబాటులో ఉన్న శబ్దాలతోనే దాని వివరణ తమకు సమర్పించగలుగుతున్నాను.

ఏదో ఒక (Check) అవరోధం ఉన్నట్లుగా నేను చూస్తున్నాను. అది నన్ను నా 'శ్రీ బాబూజీ'లో శీఘ్రంగా లయమైపోకుండా ఆటంకపరుస్తోంది. అలాకాకపోతే నన్ను అడ్డగించగల శక్తి అంటూ ఏదీలేదు. ఈ అవరోధం (Check) కూడా నాకు ఇష్టంగానే అనిపిస్తోంది, ఎందుకో తెలియదు. ప్రియతముడు, 'మాలిక్' కొంచెం దూరంలోనే

ఉన్నారు. అదే నన్ను అశాంతపరుస్తోంది. ఇప్పుడు దశ ఎలా ఉంది అంటే, కస్తూరీ లేదా 'బాబూజీ' అను పేర్లు రెండూ నాకు వ్యర్థంగానే అనిపిస్తున్నాయి. ఎందుకంటే, ఈ పేర్లతో నేను ఎవరినీ గుర్తించలేకపోతున్నాను. ఇప్పుడింక 'తమ'రే నన్ను తమ దరిజేర్చుకోవాలని అనుకుంటే దరిజేర్చుకోండి. అది కూడా తమకు దయ కలిగితేనే, లేకపోతే నా చేతుల్లో ఏమీలేదు, రెండు పిడికిళ్ళు తెరవబడి ఉన్నాయి (నా వలన కాదు అని అర్థం). హృదయంలో ఎక్కడా 'మాలిక్' గురించిన జ్ఞాపకం ప్రోగుచేసి ఉండలేదు. గమనం కూడా చాలా నిదానంగా ఉండటం వలన నేను దిగులుగా ఉన్నాను. అయితే నేను ఏమిటో, ఎవరినో కూడా తెలియటం లేదు. అది ఏమిటో తమకే తెలియాలి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 746

లఖీంపుర్,

27.05.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని భావిస్తున్నాను. మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా తమ సమాచారం తెలిసింది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశలో ఎక్కడా, ఎటువంటి గ్రంధి లేదా బంధనం యొక్క జాడ తెలియటం లేదు. స్వతంత్రత యొక్క సంకేతం కూడా లేదు. ఆత్మిక దశ యొక్క జాడ కూడా దరిదాపుల్లో కనిపించటం లేదు. నా జీవిత భారం తమ మీదనే ఉంది. మరి ఎందుకో, ఎటువంటి భారంగాని, తేలికదనంగాని ఎక్కడా, ఎప్పుడూ అనుభవం కావటం లేదు.

19వ తారీఖు రాత్రి షుమారు 11.30 లేదా 12.00 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా ఏమి అనిపించిందంటే, 'తమరు' వచ్చి నన్ను తమ ఒడిలోకి చేర్చుకుని ఏవోవో మాటలు చెబుతున్నట్లుగా ఉంది. అప్పుడు నేను ఒకసారి, "బాబూజీ, తమరు నా బరువుతో అణగిపోతున్నారని అనుకుంటాను" అని అనగానే తమరు నవ్వసాగారు. అయితే ఆ క్షణం నుంచే నా ఆలోచన అనగా నా బరువుతో తమరు అణగిపోతున్నారు అన్నది ఒక్కసారిగా తొలగిపోయింది. నేను లేచి కూర్చున్నాను. ఇప్పుడు నాదంటూ ఏమీలేదు. నా శుష్కించిన దశతోనే 'మాలిక్'ను చేరాలని అనుకుంటున్నాను. అంతేగాని మరో కోరిక లేదు. ఇప్పుడు నా వద్ద ఎటువంటి ప్రశ్నగాని, విన్నపంగాని, మరియు పరిష్కారంగాని, సమాధానంగాని ఏమీలేవు. అంతా తమకే తెలియాలి. ఏదైనా ఉందంటే, అది నా 'మాలిక్' గురించే. హృదయమైతే మునిగిపోయింది. కాని హృదయానికి హత్తుకుపోయిన ఈ అనుబంధం, నాలో ఏ మూలనో ఉండి నన్ను వేధిస్తూనే ఉంటోంది. ఇప్పుడు ఉన్నతి నందుతున్నాను. ఈ నడక లేదా నడక లేకపోవటం గురించిన అనుభూతి కలగటం లేదు. ఇప్పుడు ఉన్నది ఇదే దశ– "బినా భక్తి తారొ, తబ్ తారిబొ తిహా రొ హై" అనగా భక్తి లేకుండానే నేను ముక్తి పొందగలిగినట్లయితే అది నీ దయవల్లనే, అని. అయితే ఇప్పుడు అది కూడా లేదు. ఎందుకంటే, నాకు లయం చెందాలనే కోర్కె కూడా లేదు.

బాబూజీ, ఈ దశ ఏమిటోగాని, నేను 'తమ' యొక్క ప్రతిపనిలోను తమరిని వెన్నంటియే ఉన్నట్లుగా అనిపిస్తోంది. నాకు ఆ పనులు గురించి ఏమి తెలియనప్పుడు, నేను స్వయంగా ఏమి చేయటం లేదు. తరచుగా ఇంతవరకే పనిని గురించి దానంతట అదే కనిపిస్తోంది. నాలోపల కొంత అలసట వంటిది అనుభవమవుతోంది, ఎందుకో తెలియదు. బహుశా ఈ కారణంచేతనే ఇప్పుడు తరచుగా నేను ఉదాసీనంగా ఉంటున్నానని జనం అంటున్నారు, అయితే నాకు ఆ విషయం కూడా తెలియదు. నా అనుభవం ఇప్పుడు నాకు తోడుగా ఉండటం లేదు. ఇప్పుడు తమకు నేను

ఈ ఉత్తరం వ్రాయటమనేది నా స్థితిని జ్ఞాపకం చేసుకోవటాన్ని జ్ఞాపకం చేస్తోంది.

నాకు తెలియని ఇంకొక విషయం ఏమిటంటే, రాత్రిపూట నిద్రలో నాకు కలిగే ఈ ఆనందం, పగలుగాని, రాత్రిగాని నేను ఎంతగా పూజ చేసినా, చేయించినాగాని ఇంత ఆనందం లభించటం లేదు. గాఢనిద్రలో కాకుండా, ఎంత తక్కువసేపు అయినాగాని స్థితి నీరసంగానే ఉంటుంది. అయితే ఈ నీరసంలో కూడా ఒక అజ్ఞాతమైనది, గుర్తించలేనట్టి తపన వంటిది ఏర్పడి ఉంటుంది. నేను ఎంత ప్రయత్నించినాగాని, ఎంత పూజచేసినా గాని, ఎంతగా 'అతని' గురించి మాటలు చెప్పినాగాని 'మాలిక్' యొక్క జ్ఞాపకం ఎప్పుడూ కలగటంలేదనే నాకు అనిపిస్తోంది. ఇది నాకు బాధగా ఉంది. పూజ మరియు అభ్యాసం (సాధన) అన్నీ వృథాయే! 'మాలిక్'కు ఇదే ఇష్టమని అంగీకరించటం వలన హృదయం కొంత ఊరట చెందుతుంది కాని, అంగీకరించదు. ఇటువంటి హృదయానికి నా దగ్గర మందు అంటూ ఏమీలేదు. నా వ్యాధి దగ్గరకుగాని, నా హృదయం వరకుగాని నేను చేరలేకపోయినప్పుడు దానికి మందు ఏమి ఉంటుంది? ఈ నిజం కేవలం కొంత ఊహా మాత్రంగానే ఉంటుంది. దానిని వేదన అని చెప్పవచ్చు, మందు అని చెప్పవచ్చు లేదా హృదయంగాను అర్థం చేసుకోవచ్చు. 'మాలిక్' నన్ను ఏమి చేసినా లేదా ఎలా చేసినా గాని, ఈ దోషం నా మనస్సుకు జీర్ణం కాదు. ఇప్పుడింక అంతా తమకే తెలియాలి. నేనయితే ఓటమి చెందాను.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 747

షాజహాన్‌పూర్,
12.05.1960

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరం, కేసర్ వ్రాసిన ఉత్తరమూ ఈరోజు చేరాయి. నీ ఉత్తరానికి నేను ఏమని జవాబు వ్రాయాలి? నీవు ఉన్న స్థితి ఏదో అది బాగుంది. అందుకు 'మాలిక్'కు ధన్యవాదాలు. నేను నీవు '$U_1$' స్థానం మీదనో లేక '$V_1$' స్థానం మీదనో ఉన్నావని వ్రాశాను. నీవు ఉన్నతి చెందుతున్నకొద్దీ, దశలన్నీ ముగిసిపోయాయి. చివరకు మిగిలేది ఏమిటో, ఎవరిలోనైతే ఆ స్థితి కలుగుతుందో 'వాని'కే తెలియాలి. దానిని మాటల్లో చెప్పలేము.

అమ్మ, చౌబేజీలకు ప్రణామం.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 748

లఖీంపూర్,
15.06.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం అందింది. సమాచారం తెలుసుకున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

ఈ దశ ఏమిటోగాని, అన్ని సుఖాలు, ఆనందం అంతమై పోయినట్లుగా అనిపిస్తోంది. ప్రాపంచిక మరియు ఆధ్యాత్మిక ఆనందాలు అన్నీ అనంత సాగరంలో విలీనమైపోయినట్లుగా అనుభవమవుతోంది. ఇప్పుడు నేను ఉదాసీనతను హద్దుగా పెట్టుకుని ఒక బంజరు కంటె కూడా పాడుబడిపోయిన స్థితిలో నిలిచి ఉన్నాను. దీని వలన

ఏమి చేయలేక పోతున్నాను. ఎవ్వరైనా నాతో ఒక్కసారి మాట్లాడకపోయినట్లయితే అలాంటి వారితో నాకు జీవితాంతం మాట్లాడే అవకాశం లేకపోతుంది అన్నట్లుగా ఉంది. కాని ఇప్పుడు దశ నాకు అతీతంగా ఉంది. దానిని నిర్వహించాలన్నా కష్టమే అన్నట్లుగా ఉంది.

ఇప్పుడు దశ ఉప్పులేని భోజనంలాగా (అనగా రుచి లేకుండా) ఉంది. అయినా గాని, స్థితి స్థిరంగానే ఉంది. అన్నీ తలకెత్తుతున్నాయి అనగా గ్రహింపుకు వస్తున్నాయి. నేను ఈ విధంగా ఆలోచించినా ఆలోచించకపోయినా దశ దానంతట అదే కలుగుతోంది. అయినా కూడా ఆంతరికంలో ఏదో ఒక మూల ఒక చైతన్యం ఉంటోంది. వసంతం గురించి ఏమని చెప్పను, కనీసం శిథిలత్వం కూడా నామీద ఎటువంటి ప్రభావం చూపటం లేదు. ఉదాసీనత (Sadness) కూడా నా మీద ఎటువంటి ప్రభావం చూపలేకపోతోంది. ఒక (Condition of lonliness) ఒంటరితనపు దశయే నా స్వరూపంగా అయిపోయింది. అయినా కాని ఆ ఒంటరితనం నాకేమి సమస్యగా లేదు. అదేమిటో 'మాలిక్'కే తెలియాలి.

జనంలో కలిసిపోయి ఉన్నా కూడా ఆంతరికంలో ఆనందంగాని, ఉత్సాహంగాని ఎందుకు ఉత్పన్నం కావటం లేదో తెలియటం లేదు. అప్పుడప్పుడు స్థితి లోలోపలనే ఎందుకు వ్యాకులత చెందుతున్నదో తెలియటం లేదు. నా దశ ఎలా ఉందంటే, నా మీద వసంతంగాని, శిథిలత్వంగాని ప్రభావం చూపటం లేదు. శూన్యత కూడా అనుభవం కావటం లేదు. దశ, ఉప్పులేని భోజనంలాగా అనగా చప్పగా ఉంది, అయినా ఫర్వాలేదన్నట్లుగా ఉంది. నాకు మాట్లాడటం గాని, ఏ పనినైనా చేయటం గాని తెలియనట్లుగానే ఉంది. జీవితాంతం వరకు నాకు ఎవరూ ఏ పని చెప్పకపోయినాగాని, మాట్లాడకపోయినా గాని నేనేమీ చేయలేను అన్నట్లుగా అనిపిస్తోంది. నాకు ఏమీ తెలియదు. మాట్లాడే తెలివితేటలు కూడా లేవు. ఎవరిపట్ల నాకు ప్రేమ కూడా కలగటం లేదు. ఆఖరికి నా ప్రియతముడైన 'మాలిక్'పట్ల కూడా! ఇలా ఎందుకో తెలియదు. అందువలన స్థితిలో ఎలాంటి ఆనందంగాని, ఉత్సాహంగాని ఉత్పన్నం కావటం లేదు. **ప్రపంచంలోని ప్రతి మానవుడు నాకు గురుతుల్యుడుగా అనిపిస్తున్నాడు.** అయినా కూడా నా లోపల ఎవరిపట్ల ప్రేమ జనించటం లేదు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 749

లఖీంపుర్,
25.06.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు తావూజీ నుద్దేశించి వ్రాసిన ఉత్తరం చేరింది. విని సంతోషించాను. ఇక్కడ అందరూ కుశలమే. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

అన్ని స్థితులను చూస్తూ ఉన్నా కూడా ఏమి చూడనటువంటిదిగా ఈ దశ ఉంది. అదేమిటో అర్థం కావటం లేదు. అన్ని దశలు తెరువబడి ఉన్నా కూడా వాటిమీద ఏదో ఆవరణ లేదా ముసుగు వంటిది ఉన్నట్లుగా నాకు అనిపిస్తోంది. ఎందుకో తెలియదు. లోపల మాత్రం దశ స్వచ్ఛంగాను, పూర్తిగా తెరవబడి ఉన్నట్లుగాను ఉంటోంది. పాయింటు దాటి వెళ్ళినపుడు దానిమీద ఏదో తెరవేసి ఉన్నట్లుగా అనిపిస్తోంది. ప్రతి మానవుని దశ (సత్సంగీయుని దశతోసహా) నాకు పూజనీయంగా అనిపిస్తోంది. అదేమిటో అర్థం కావటం లేదు. ఇంటి నుంచి షాజహాన్‌పూర్ వెళ్ళటానికి ఎంతో తపన ఉన్నప్పటికీ, అక్కడకు వెళ్ళిన తర్వాత, అది మామూలు విషయంగానే ఉంటోంది. ప్రత్యేకత ఏమిలేనిదిగా అనిపిస్తోంది. అదేమిటోగాని, నాలో శక్తి లేకుండా పోయింది, అది మంచికైనా లేదా చెడుకైనా గాని.

మనస్సులో భక్తి పెంపొందించుకోవటానికి శక్తిగాని, ప్రేమను పొందే శక్తిగాని ఏమీలేవు. అలాగే జ్ఞాపకం చేసుకునే శక్తిగాని, మరచిపోయే సామర్థ్యంగాని లేకపోయాయి. 'మాలిక్' విషయంలో కూడా ఇలాగే ఉంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 750

లఖీంపుర్,

01.07.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు అంది ఉండవచ్చు. ఇప్పుడు తమ ఆరోగ్యం బాగుందని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నా పరిస్థితి ఇప్పుడు ఏమైందో ఏమోకాని, ఎవ్వరైనా క్రొత్త వ్యక్తి పూజ కొరకు నావద్దకు వచ్చినపుడు నేను మౌనంగా కూర్చుండిపోతున్నాను. నాకు మాటలు రావటం లేదు. ఆ సందర్భంలో నేను ఎలా జాగృతమై సచేతనంగాను, తీక్షణంగాను స్పందించాలో నాకు అర్థం కావటం లేదు. అపుడు తమరిని ప్రార్థించాలనే జ్ఞాపకం కూడా లేకుండా మౌనంగా ఉండిపోతున్నాను. నేను ఇంతమాత్రంగా కూడా చేయలేకపోతున్నాను. ఈ దశ ఇటువంటి పనికిరానితనంగా ఉంది. పూజ కొరకు వచ్చిన వారు స్వయంగా వారే ఒకటి రెండు మాటలు వరుసగా ఏదైనా మాట్లాడినపుడు మాత్రమే కొంచెం చైతన్యం కలిగి ఏదో మాట్లాడగలుగుతున్నాను.

ఇప్పుడు ఈ దశలో ఎలా ఉందంటే, నేత్రాలలో నా బాబూజీని చూడగల శక్తి కూడా లేదు. అలాగే చూడలేని సమర్థతా లేదు. అసలు ఏ విషయం అనుభవంలోకి రావటం లేదు. ఈ ప్రపంచాన్ని జ్ఞాపకం చేసుకొను శక్తిగాని, మరచిపోయే సామర్థ్యంగాని లేవు. లోన, బయటకు చెందిన అణువులన్నీ దశలో ఇదివరకు ఉన్నవి ఉన్నట్లుగానే ఉండిపోయాయి. నేను 'మాలిక్' వద్దకు చేరి ఉన్నతి పొందే శక్తిగాని, పురోగతిని సఫలం చేయగల శక్తిగాని, సామర్థ్యంగాని నాకు లేవు. 'మాలిక్'ను చేరగల శక్తిగాని, 'వాని'తో వేరుపడి ఉండే సామర్థ్యంగాని లేవు. రెండు చేతులు తెరవబడి ఉన్నాయి. హృదయమే కాకుండా, లోన, బయట అన్నీ కూడా తెరవబడి ఉన్నాయి. ప్రతి కణం ఒక సాధారణ స్వాభావిక అవస్థ (Simple nartural condtion) యొక్క రూపంగా అయిపోయాయి. ఈ రోజు ఉదయం 7 గంటలకు 'తమరు' దయతో నన్ను '$U_1$' పాయింట్ దాటించి '$V_1$' పాయింట్ మీదకు చేర్చారు. శరీరం యొక్క ప్రతి అణువు ఒక స్వాభావిక స్థితిని పొందింది. అదేమిటో తెలియదుగాని, స్థితి ఆ విధంగా ఖాళీగా ఉంటూనే ఉంది. కాని ఎప్పుడైనా దాని లోతుకు వెళ్ళినపుడు మాత్రం జనమందరిపట్ల నా దశ తలొగ్గియే అనగా వినమ్రంగానే ఉంటున్నది. అదేమిటో తెలియదు. అందరూ నాకు పూజ్యులుగానే అనిపిస్తున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 751

లఖీంపుర్,

18.07.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు కుశలమేనని భావిస్తున్నాను. ఇక్కడ కూడా అందరూ కుశలమే. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు స్థితి అంతా నిశ్శబ్దంగాను, ప్రశాంతంగాను ఉంది. లోన-బయట అంతట, యావత్తు శరీరం యొక్క అణువణువూ నిశ్శబ్దంగా ఉండిపోయాయి. ఇప్పుడు ఈ దశను లేదా గమనాన్ని ప్రశాంతంగా ఉందనిగాని, నిశ్శబ్దంగా ఉందనిగాని చెప్పటం దోషమనిపిస్తోంది. అన్నివైపులా నిశ్శబ్దమే ఆవరించి ఉంది. కాని నేను నిశ్శబ్దంగా కూర్చోవటానికి ఎంతమాత్రం ఇష్టపడటం లేదు. ఏ విధంగానైనాగాని నేను 'మాలిక్'ను చేరుకోవలసి ఉంది. అది నా 'మాలిక్' చేతుల్లోనే ఉన్నాగాని, 'వారు' నాపట్ల దయచూపుతారన్న విశ్వాసం నాకు ఉంది. నేను ఒకసారి తమకు, మనస్సు కూడా దేనిలోనో కలిసిపోయి అంతమైపోయింది అని వ్రాశాను. కాని ఇప్పుడు అలా లేనట్లుగా నేను చూస్తున్నాను. ఎందుకంటే, మనస్సు ఇప్పుడు నాకు ఏదో జ్ఞాపకం కల్పిస్తోంది. దేనిని జ్ఞాపకం చేస్తూ ఉన్నదో నాకయితే తెలియదు. కాని ఈ జ్ఞాపకం అనేది నాకు బాగుందనిపిస్తోంది. ఇది ఉత్సాహాన్ని కలిగిస్తోంది. ఈ బాగుందని అనిపిస్తున్నది ఏమిటో నాకు బొత్తిగా తెలియదు. ఎవరినైతే నేను మర్చిపోయి ఉన్నానో, ఎవరైతే నాకు జ్ఞాపకం రావటంలేదో, 'అట్టివారు' నా 'శ్రీ బాబూజీ'నే అయి ఉంటారు. ఎందుకంటే, తమరు కాకుండా మరేదైనా నాకు ఇష్టం అని ఎందుకు చెప్పలేకపోతున్నానో అర్థం కావటం లేదు. నేను స్వయంగా నా ఆధ్యాత్మిక పురోగతితో సంతోషంగా లేను. ఎందుకంటే, మనస్సుకు విశ్రాంతి లేకపోయాక నేను మాత్రం ఏమి చేయగలను!

ఇప్పుడు ఈ దశ ఏమిటోగాని, దానిలో ప్రకృతికి (Nature) చెందిన సమాచారమైనా తెలియటం లేదు. అసలు అది ఉందో, లేదో కూడా తెలియదు. దానితో అవసరం ఉందో, లేదో తెలియదు. ఇది అంతటా ఉన్నదా లేదా నా వరకు మాత్రమేనా అని కూడా తెలియదు. అంతటా నిశ్శబ్దమే అలముకుంది. స్థితిగాని, నా పురోగతిగాని ఇలాగే ఉన్నట్లయితే నేను పూర్తిగా వ్యర్థంగా అయిపోతాను. నేనయితే, మెదడును (బుద్ధిని), హృదయాన్ని స్వయంగా నడిపిస్తున్నాను. అలాకాకపోతే అంతా సద్దుమణిగిపోతుంది. అయితే మరొక వాస్తవం ఏమిటంటే, ఆ విధంగా నడిపించటం కూడా నా వశంలో లేదు. కాని ఇది కూడా 'మాలిక్' యొక్క కృప మరియు వారి విధానం మీదనే ఆధారపడి ఉంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 752

లఖీంపుర్,

28.07.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. చాలా రోజులుగా తమవద్ద నుండి ఉత్తరం రాలేదు. అందుచేత దిగులు చెందుతున్నాను. దయచేసి తమ గురించిన సమాచారం వెంటనే ఉత్తరం ద్వారా తెలుపగలరు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ విషయం ఏమిటోగాని, నేను స్వయంగా మాట్లాడుతూ ఉండి కూడా మౌనంగానే ఉన్నట్లుగా అనుభూతి చెందుతున్నాను. పాటలు పాడుతున్నపుడు కూడా ఈ విధంగానే అనుభవమవుతోంది. రక్త నాళాల్లోను, నరనరాల్లోను ఎటువంటి ధ్వనిగాని, చలనంగాని గ్రహింపుకు రావటం లేదు. అసలు చలనం లేకపోయాక ఇంక తెలిసేది మాత్రం ఏమి ఉంటుంది? నేను పని ఏమి చేయకుండా ఉన్నప్పటికీ, సోమరిగా ఉండటమే లేదని చెప్పవచ్చు. స్వయంగానే నేను ఏదో పనిలో నిమగ్నం చేసుకుంటున్నాను, అయినా కూడా అన్ని స్థితులను చూస్తూ ఉండి ఏమి చూడనట్లుగానే నా దశ ఉంది. ఆధ్యాత్మికతవైపుగాని, ప్రాపంచికం వైపుగాని నావద్ద కేవలం ఒక్క ఊహ మాత్రమే తోడుగా

ఉంటోంది. ప్రతి విషయంలోను ఈ ఊహ మాత్రమే ఉపయోగపడుతూ ఉంది.

నాకు అర్థంకాని విషయం ఒకటి ఏమిటంటే, నేను సర్వదా తమ పనిలోనే తమ వెంటే అనుసరించి ఉంటున్నాను. తమ పనిగాని, ఉనికిగాని, గమనంగాని ఏమి తెలియకున్నా, నేను సహజంగానే తమను వెన్నంటి ఉంటున్నాను. తమరు ఏమి చేస్తున్నారో, ఏమి చేయటంలేదో నాకయితే తెలియదు. కాని నా తనువు, మనస్సు యొక్క ఆంతరిక శక్తి అంతా కూడా తమతోనే అనుసంధానమై ఉంది. 'తమ'లోనే నేను ఏకమై ఉన్నాను. ఎందుకంటే, ప్రతిదీ తమవైపే ఆకర్షించబడుతున్నట్లుగా నేను చూస్తున్నాను. ఈ ఆకర్షణ గురించి నాకు తెలియకపోయినాగాని, స్పృహలేనితనంలో కూడా ఎప్పుడైనా స్పృహ అనేది తళుక్కుమన్నప్పుడు ఈ విధంగా గ్రహింపుకు వస్తుంది. వాస్తవంగా చెప్పాలంటే, కృపావంతులైన తమరు, నన్ను తమకు చెందినట్లుగా స్వీకరించి ఉండకపోతే నేను జీవించి ఉండటం కూడా అసాధ్యమే. నేను తమరిని హత్తుకుని ఉండే సామర్థ్యం కూడా నాలో లేదు. నేను ఇంకెవరినైనా నావారుగా భావించానేమో నాకు తెలియదు. నాకు ఏమీ తెలియటం లేదు. నేను సదా స్పృహలోనే ఉంటూ ఉన్నా కూడా, ఎప్పుడైనా ఎవ్వరైనా సత్సంగానికి చెందిన సోదరుని పేరు వినవచ్చినపుడు, నా స్వంత మనుషుల పేరు విన్నట్లుగా ఉంటుంది. ఇవన్నీ విచిత్రమైన, అసాధారణమైన మాటలుగా ఉంటాయి. వాటిని గురించి నాకేమీ తెలియదు. నేనేమీ అర్థం చేసుకోలేను. కాని ఉన్న విషయాలు వ్రాస్తున్నాను, అంతే.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 753

లఖీంపుర్,

10.08.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందని అనుకుంటున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశ ఏమిటోగాని, నేనైతే ముందుకు పోతున్నాను. నేను 'మాలిక్'ను చేరుకోవాల్సి ఉంది. ఇప్పుడు నాకు ఎంతమాత్రమూ అనుభవం కావటం లేదు. అంతేకాదు, నేను ఇప్పుడు ఈ భౌతిక ప్రపంచంలో కూడా నేను ఎప్పుడైనా సంచరిస్తున్నానా లేదా అనేది కూడా తెలియటం లేదు. ఇప్పుడు నా దృష్టి యొక్క హద్దు కూడా తొలగిపోయినందున నయనాలు తెరవబడి ఉన్నాయో లేక మూతపడి ఉన్నాయోగాని, అంతా సమానంగా ఉన్నట్లుగా అనిపిస్తోంది. ప్రకాశమైనా, అంధకారమైనా అంతా ఒకటిగానే ఉంటోంది, కాని హద్దు అనేది కూడా నా లోపల, బయట ఏమి లేకుండా పోయింది. అలాగని హద్దులేని దశగాను అనిపించటం లేదు. లోన–బయట, సుఖదుఃఖాలు, (కష్టం) శ్రమ–విశ్రాంతి అనేవి కేవలం ఒక మసక రూపం ఆంతరికంగా లేదా బాహ్యంగా దాల్చి ఉంటున్నాయి.

నేనయితే ఈ అంచనా లేదా ఊహ కూడా తెలియనిదానిగా ఉంటున్నాను. ఒకప్పుడు నేను ఒక దివ్య ప్రవాహం వంటిది దిగి వస్తున్నట్లుగా తమకు వ్రాసి ఉన్నాను. ఇప్పుడయితే అణువణువు, కణకణం ఆ దివ్యప్రవాహం యొక్క రూపంగానే అయిపోయింది. ఆ సంపూర్ణ శక్తి భాండారం చలించనిది, కదలని రూపంగా అయిపోయింది. అంతే కాకుండా, నా అణువణువు, కణకణం అప్పుడు చెల్లాచెదురై వెదజల్లబడినట్లు ఉంది. నా నరనరమూ ఒక (Uniform) ఏకరూపంగా కాకుండా, స్వయంగా అన్నీ ఒక (Homogenous conditon) సమస్థాయికి చెందినట్లుగా అయిపోయాయి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 754

లఖీంపూర్,

20.08.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నిన్న విష్ణుగారు ఇక్కడకు వచ్చారు. వారి ద్వారా తమ సమాచారం తెలిసింది. తమరు ఆరోగ్యంగా ఉన్నారని తెలిసి సంతోషించాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నిన్న రాత్రి ఒంటి గంటకు, నేను మద్రాసువైపుకు మిషన్ వ్యాప్తి కొరకు దృష్టిని కేంద్రీకరించినపుడు, ఒక గాఢమైన పొగమంచు వంటిది మసకగా వ్యాపించి ఉన్నట్లుగా అనిపించింది. నేను దానిని 'మాలిక్' యొక్క కృపతోను, శక్తితోను శుద్ధిచేయ ప్రయత్నించసాగాను. చాలా గంటల తరబడి ప్రయత్నించాక ఉదయం 8 గంటలకు అది శుభ్రం కావించబడినట్లుగా నాకు విశ్వాసం కలిగింది. అప్పుడు నాకు చాలా సంతోషం కలిగింది. కాని దాని మూలకారణం ఏమిటో, ఎందుకు అలా జరిగిందో నాకు తెలియలేదు. తలనొప్పి కారణంగా, సరైనది కనుగొనటానికి దాని మీద ఇంకా శ్రద్ధ నిలపలేకపోతున్నాను. అది నా దృష్టికి వచ్చినపుడు, అసలు ఇదేమిటి అను ఆలోచన నా మనస్సులో కలగలేదు. దానిని సరిదిద్దటం మీదనే నా సంకల్పం కేంద్రీకరించబడింది. నా '$V_1$' యాత్ర ముగిసిపోయింది. అందుచేత స్థితికొరకు ఇప్పుడు ముందుకు నడవటానికి స్థానం దొరకటం లేదు. అయినా కూడా మనస్సు యొక్క దృష్టి ఊర్ధ్వంవైపుకే పూర్తిగా నిమగ్నమై ఉంటోంది. అయినా కూడా అది 'మాలిక్' యొక్క ప్రతిశక్తిలోను, ప్రతిపనిలోను నిమగ్నమై ఉన్నట్లుగానే అనిపిస్తోంది. నాలో స్వయంగా శక్తిగాని, సామర్థ్యంగాని, భక్తిగాని, ఏదైనా ఆచరించటానికిగాని మరియు ఇచ్చిపుచ్చుకోవటానికిగాని ఏమీ లేకుండా ఉన్నాయి. అయితే మాత్రం, 'మాలిక్' వాటిని ఇస్తూ వెళ్తున్నారు, నేను వాటిని స్వీకరిస్తూ ఉన్నాను 'వారి' కృపతోనే. అయినాగాని, నిర్వహించేది, చక్కబెట్టుకొనేది కూడా 'అతడే'. నన్ను ఎవరైనా ఏ పనినైనా చేయమని ఆదేశించక పోయినట్లయితే, జీవితాంతం ఏ పని చేయటానికి నాలో సామర్థ్యం కలగదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 755

లఖీంపూర్,

31.08.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందని భావిస్తున్నాను. ఇక్కడ నేను 2,3 రోజులుగా టాన్సిల్స్ వాపు మూలంగా అనారోగ్యంగా ఉన్నా, ఇప్పుడు బాగానే ఉన్నాను. దీనిని గురించి విచారించవద్దు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు నా పాయింట్లు వగైరాలన్నీ వ్యాపించిపోయి 'మాలిక్'లో లీనమైపోయాయి. ఇప్పుడింక నాలో ఎటువంటి పాయింట్లు కూడా అనుభవానికి రావటం లేదు. అందుచేత అవన్నీ 'మాలిక్'లోనే లీనమై పోయాయి అని

గ్రహిస్తున్నాను. ఇప్పుడు నా స్థితి ఏమిటోగాని, ఒకవైపు నేను ఇప్పుడు ఏ వలయంలోను, ఏ పాయింట్‌తోను సంబంధించి లేను, ఎటువంటి బంధనమూ లేదు అని, మరొకవైపు నేను '$V_1$' యాత్ర పూర్తి చేసుకున్నాను. ఇవి రెండూ వాస్తవమే. ఈ స్థితి ఏమిటో 'మాలిక్'కే తెలియాలి.

ఇది ఏమిటోగాని, స్థితి మొత్తం మీద, తేలికపాటి మసక వంటిది, మరపువంటి దశ వ్యాపించి ఉంది. అది ఏమిటో తెలియదుగాని, ఒక తపన ఎటువంటిది అంటే అది సదా నెలకొని ఉంటోంది. కాని అది ఏమీ కోరటం లేదు. ఇంకేముంది, నేను మాత్రం దాని మూలంగా ఉదాసీనంగా ఉంటున్నాను. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 756

లఖీంపుర్,

07.09.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నారాయణ దద్దాగారి ద్వారా తమ సమాచారం తెలిసింది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

2.09.1960వ తేదీ రాత్రి పూజ చేస్తుండగా అకస్మాత్తుగా నా పాలభాగమంతా ఒక అపూర్వమైన జ్యోతితో మిరుమిట్లు గొల్పింది. ఆ వెంటనే అదృశ్యమైపోయింది. అస్థికలు, మాంసం ఏవీ లేకుండా పోయాయి. తీవ్రమైన కదలిక (Vibration) ఉండటంతో చీమలేమో అని భావించి చాలాసార్లు తుడిచివేయటం ప్రారంభించాను. కాని అలా కాకుండా మరేదోగా అనిపించింది. అటువంటి కదలికయే శిరస్సు మొదలుకొని వీపంతా ఉంది. వెన్నెముకలోని ఎముకలన్నీ వదులైపోయినట్లుగాను, ఆ తర్వాత అవి ఎక్కడా లేకుండా పోయినట్లుగాను అనిపించింది. అనగా వీపు అంతటా (Softness) మృదుత్వం వ్యాపించి పోయింది. శరీరం యొక్క కణకణం ఆ మృదుత్వ రూపాన్నే దాల్చినట్లుగా అయ్యింది. వీపు యొక్క ఎడమ భాగంలో ఆ సంచలనం ఎక్కువగా ఉంది. అదే సంచలనం నరనరాలతోసహా శరీరం అంతటా ఉంటోంది. అది ఒక్కొక్కసారి గ్రహింపుకు వచ్చేట్లుగాను, మరొక్కసారి తెలియకుండాను ఉంటోంది. శిరస్సు వెనుక అది బాగా ఎక్కువగా ఉండి, దానిపై దృష్టి నిలపగానే అది మరింత తీవ్రమవుతూ ఉంది. నామట్టుకునేను తెలిసి కూడా ఏమీ చేయలేదు, కాని 'మాలిక్' ఏమి చేశారో 'వారి'కే తెలియాలి.

నా దశ పూర్తిగా ఖాళీగా అయిపోయింది. మృదుత్వపు ఛాయ కూడా లేకుండా త్రాగి వేసింది. ప్రతి కణమూ లోన, బయట కూడా ఆ (Softness) మృదుత్వం యొక్క రూపాన్నే ధరించినట్లుగా అయిపోయింది. దీనిని ఆ మృదుత్వమే నా స్వరూపంగా అయిపోయింది అని చెప్పితే బాగుంటుందని అనుకుంటాను. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఇటువంటి దశ కలిగి ఉండి కూడా నాకు మరిదేనితోనూ సంబంధం లేకుండా ఉంది. దశలన్నీ నావే కాని, నేను దేనికీ చెంది ఉండలేదు. నేను మాత్రం నా 'మాలిక్'కు చెందిన దాననే.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 757

లఖీంపుర్,

11.09.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు కుశలమేనని భావిస్తున్నాను. నా ఆరోగ్యం ఇప్పుడు పూర్తిగా బాగయ్యింది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, అదేమిటోగాని, 3,4 రోజుల నుండి లోన, బయట శరీరమంతటి కణకణాల్లోను, చీమలు వంటివి కుట్టినటువంటి స్పర్శ స్వల్పంగా అనుభవమవుతోంది. ఇంతకుక్రితమైతే ఇటువంటి అనుభవం కొంచెం కంపనం వంటిది లేదా విశ్రాంతి వంటిది హృదయానికి అనిపించేది, కాని ఇదే అనుభవం 2,3 నిమిషాలు నిరవధికంగా ఉన్నట్లయితే హృదయం గాబరా చెందుతోంది. అందువలన 'మాలిక్' నన్ను ఇటువంటి అనుభవం కలగ్గానే నేను ఏమైపోయానో తెలియనట్లుగా మాయ చేసారు. ఈ విధంగా కోల్పోవటమనే దానికి అర్థం ఇప్పుడు నన్ను నాలోనికి తీసుకు రావటానికేనని అనగా మళ్ళీ ఇంద్రియ జ్ఞానం కలిగించటానికేనని అనిపిస్తోంది. ఇప్పుడు అంతా తారుమారైపోయింది. ఇప్పుడు నా దశ (Softness) మృదుత్వాన్ని, (Humility) నమ్రత యొక్క హద్దును కూడా మింగేసింది. తరచుగా నేను తమకు వ్రాసి ఉన్నట్లుగా ఉన్న దశ, ఏమిటంటే, చూస్తూ ఉండి కూడా చూడనట్లుగా ఉంటుందన్న దశలాగా ఇది ఉంది. ఇప్పుడు నేను వ్రాస్తున్నటువంటి దశగాని, అనుభవం కాని, అసలు నేను నా దశను గురించి వ్రాస్తున్నాను అని కాని, నా అనుభవం అనిగాని అనిపించకుండా మరెవరి దశనో లేక అనుభవాన్నో వ్రాస్తున్నట్లు ఎందుకు అనిపిస్తున్నదో తెలియటం లేదు. ఇప్పుడు (System) వ్యవస్థ అంతా తారుమారైపోయి, ఏదో క్రొత్తగా అనిపిస్తోంది. అయితే నాకు దీనిలోని క్రొత్తదనం అనుభూతికి ఏమీ రావటం లేదు. ఇప్పుడు ఇంతగా వ్రాస్తున్నా కూడా నా దశ యధాతధంగానే ఉంటోంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 758

లఖీంపుర్,

19.09.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు కుశలమేనని భావిస్తున్నాను. ఇక్కడ కూడా అందరూ కుశలమే. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

తమరు నన్ను '$V_1$' పాయింట్‌ను దాటించి '$W_1$' పాయింట్‌కు చేర్చారు. అందుకు తమకు ఏమని ధన్యవాదాలు చెప్పాలో నాకు మాటలు దొరకటం లేదు. ఇప్పుడు నా దశ సంస్కరించబడింది. నాకు ప్రతి ఒక్క దానిపట్ల వ్యామోహం మరియు దృష్టి ఉన్నా కూడా అందులో లేశమాత్రంగానైన మాయ లేదు. స్థితి ఎంత నిశ్చలంగా ఉందంటే, దానికి బాహ్యాంతర అంశాలు (factors) ఏవీ కూడా తాకనట్లుగా ఉంది, నామీద వాటి ప్రభావం ఉన్నా కూడ! నేనయితే పూర్తిగా ఒక సాధారణ మానవునిలాగానే ఉన్నాను. అయినా కాని నా నిశ్చలస్థితిని ఏవీ కూడా స్పర్శించనట్లుగానే అనుభూతి చెందుతున్నాను, అలా ఎందుకో తెలియదు. నేను ఎలా ఉన్నాగాని, 'తమ'కే చెంది ఉన్నాను. పాయింట్ దాటినమీదట లోపల అశాంతిలో కొంత శాంతి కలుగుతున్నట్లు లేదా విశ్రాంతి కలుగుతున్నట్లుగా అనుభవమవుతోంది.

కాని మాటిమాటికీ 'తమరి'ని చేరాలను స్థితి కలుగుతోంది. నాలో సర్వదా ఉంటున్నటువంటి ఆనందానుభూతి ఇప్పుడు ఎప్పుడూ కూడా కలగటం లేదు. అదేమిటో దైవానికే తెలియాలి.

ఇంకొక విషయం ఏమిటంటే, నా దశ ఎటువంటిదైనా కానివ్వండి, దానితో కూడా శాంతి లభించటం లేదు. ఒక విధంగా చెప్పాలంటే, శాంతి, అశాంతి రెండూ లేవు. అదే విధంగా శాంతి అనేది ఎప్పుడూ అనుభవం కావటంలేదు. అలాగే లోన, బయట ఎప్పుడూ (Disturbance) భంగం కలగటం లేదు. ఒకవైపు అయితే దశ పూర్తిగా ఆధిపత్యం (Masterly) కలిగి ఉంటున్నది, మరోవైపు (Humble) వినమ్రంగా ఉంటోంది. దానివలన అసలు నా స్థితి ఏమిటో తెలుసుకోలేకపోతున్నాను. ఇటువంటి ద్వైతస్థితియే ఉంటున్నది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 759

షాజహాన్‌పూర్,

10.10.1960

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరం చేరింది. నీ వ్యాప్తి శూన్య ప్రదేశంలో జరుగుతున్న కారణంగా నీ పురోగతి నెమ్మదిగా ఉంది. అందుచేత నీ స్థితిలో అశాంతి కలుగుతున్నట్లుగా తెలుస్తోంది.

ఇక్కడ, ఒకటి ఆక్టోబర్ 1న, రెండవది అక్టోబర్ 2న రెండుసార్లు వరదలు వచ్చాయి. ఇంటి చుట్టూతా 2 నుంచి 3 అడుగుల లోతు వరకు నీరు వచ్చింది. అది గేటు నుంచి లోపలకు 10–12 అడుగల దూరం వరకు వచ్చింది. అంతకుమించి ముందుకు రాలేదు. అది గదిలోనికిగాని, హాలుకు ఎదురుగా ప్రాంగణంలోకిగాని ప్రవేశించలేదు. పొలంలో పంటలన్నీ పాడైపోయాయి. ఇప్పుడైతే నీరు ఇంటి చుట్టూ తగ్గిపోయింది, అది క్రమంగా తగ్గిపోతూ ఉంది కనుక ఆదుర్దా చెందాల్సిన అవుసరం లేదు.

ఇక్కడ అంతా క్షేమం. అమ్మకు, చౌబేజీకి ప్రణామం. నీ సోదర సోదరీలకు ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 760

లఖీంపుర్,

09.10.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందని భావిస్తున్నాను. ఈ రోజు తావూజీ లక్నోకు వెళ్తున్నారు. అక్కడి నుండి తమవద్దకు వస్తారు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

దశను గురించి ఏమని వ్రాయాలి! నా ఆధ్యాత్మిక పురోగమనం ఎంత మందకొడిగా ఉందంటే, దానిమీద స్వయంగా నాకే చికాకుగా అనిపిస్తోంది. ఎందుకోగాని, ఇప్పుడు ఏదైనా అనుభూతి చెందాలని అనిపించటం లేదు. నేను నా 'మాలిక్' వద్దకు చేరాలి అను తపనయే ఉంటోంది. అయినా కూడ, ఒక రకమైన దశ నన్ను అంటిపెట్టుకుని ఉన్నట్లుగాను, అది స్థిరంగా లేకుండా చాంచల్యంగా ఉన్నట్లుగాను నేను చూస్తున్నాను. ఎందుకోగాని నా స్థితికి నిర్మలీకరణ అత్యవసరమని అనిపిస్తోంది. దీని మూలంగా నా మనస్సులో బహుశా చికాకు కలుగుతున్నట్లుగా ఉంది.

ఏది ఏమైనాగాని, నాకయితే **నా జీవితపు పరమ నిధియైన 'తమరి'ని నా జీవితంలో సాధించుకోవాలని ఉంది. అలా జరిగితీరుతుంది, లేకుంటే నేను జీవించలేను.**

ఇప్పుడు నా స్థితి, స్థితిరహితం. ఇప్పుడు స్థితిని కూడా అర్థం చేసుకోలేకపోతున్నాను. స్థితి ఎప్పుడైనా గాఢస్థితికి చేరుకుంటుందా లేక పైపైనే ఉంటుందా అనేది కూడా ఊహకు అందటం లేదు. నేనైతే భౌతిక ప్రపంచపు ఒక సాధారణ జీవిలాగానే ఉన్నాను. ఇప్పుడు ఈశ్వరుని పొందాలను కోరిక ఉన్నదో లేదో తెలియటం లేదు. 'మాలిక్', తన ఉనికి యొక్క జాడ నాకు తెలియనివ్వటం లేదు. మరి నేను కూడా నా ఉనికి తెలియనిదానిలాగానే ఉన్నాను. 'మాలిక్' గురించిన కోరిక లేకుండా ఉన్నాను. ఇప్పుడు నా ప్రాపంచిక మరియు ఆత్మిక వాంఛలు కూడా ఎక్కడికో తరలిపోయాయి. కలం అయితే నా చేతిలో ఉంది, కాని వ్రాయటానికి విషయం ఏదీలేదు. సాధనపట్ల కూడా నా దృష్టి ఉండటం లేదు. నా హృదయపు ఖాళీ స్థానం నా 'శ్రీ బాబూజీ' యొక్క ప్రేమతో పొంగిపొరలకపోతే, మరి నేనింక ఏమని ఆలోచన చేయగలను. యదార్థం ఏమిటంటే, నేను హృదయపూర్వకంగా నా ప్రభువును ప్రేమించలేదేమోనని అనిపిస్తుంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 761

లఖీంపుర్,

12.10.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు కుశలంగా ఉన్నారని భావిస్తున్నాను. నా ఆరోగ్యం కూడా ఇప్పుడు బాగుంది. తమరు చెప్పిన విధంగా నా ఆరోగ్యం మీద శ్రద్ధపెట్టి ఉంటున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఈ దశ ఏమిటోగాని, ఇది అత్యంత సాధారణమైనదిగా ఉంది. నౌకరుల భార్యబిడ్డలతో మాట్లాడుతూ ఉంటే, వారికి నాకు తేడా ఏమిలేనట్లుగా అనిపిస్తోంది. లోన, బయట అంతా ఒకటిగా అయిపోయింది. పారిశుద్ధ్య పనివారల పిల్లలతో మాట్లాడుతున్నప్పుడు నేను వారిలాగానే అయిపోతున్నాను. అలాగే ఎవరైనా సంత్ మహాత్ముల గురించి మాట్లడుతున్నప్పుడు, నేను కూడా వారి కంటె ఉన్నతంగా ఉంటున్నాను. ఇంతకూ అసలు విషయం ఏమిటంటే, ఆఖరికి నేను ఎవరినో నాకు తెలియకుండా ఉంది. ఇంక నా స్థితి అంటూ ఏమీలేదు. స్థితి, స్థితిరహితంగా ఉంది. ఇంద్రియాలు నిలకడగా ఉండిపోయి, తెలివిమాలినవిగా అయిపోయాయి. ఒక విషయం ఏమిటంటే, స్థితి ఎంతవరకు వ్యాపించి ఉందో తెలియటం లేదు. ఎలా వ్యాపించిందో అలానే వ్యాపించి ఉంది. దానిని గ్రహించుదామనుకుంటే, అది సంకోచించి (సూక్ష్మంగా అయి) నా ఎదుటకే రావటం లేదు. ఇంకా అర్థంకాని విషయం ఏమిటంటే, ఇంతకుపూర్వం నేను, 'తమరి'ని చూస్తూ ఉంటే, తమలోనే నేను పూర్తిగా లీనమైపోయినట్లుగా గమనిస్తూ ఉండేదానను. అలాగే నాకు స్పృహ కలిగినంతనే 'తమరు' నాలోనే వ్యాపించి ఉన్నట్లుగా అనుభూతి చెందుతూ ఉండే దానను. అప్పుడు లోపల చాలా బాగుందని అనిపించేది. అయితే ఇప్పుడు అవన్నీ ఏమైపోయాయో, ఎక్కడకు పోయాయో తెలియటం లేదు.

అసలు విషయం ఏమిటంటే, సాధన లేదా ధ్యానం అనేవి నాకు సాధ్యపడటం లేదు. లోపల ప్రేమగాని, తపనగాని ఉప్పొంగటం లేదు. బహుశా అందుకే అవన్నీ మటుమాయమైపోయాయి అని అనుకుంటాను. స్థితిమాత్రం

అత్యంత నిర్మలంగా ఉంది, అది కూడా 'మాలిక్' కృపవల్లనే. నాలోని వృత్తులన్నీ ఎక్కడో లీనమైపోవటమో లేదా లుప్తమైపోవటమో జరిగింది. ఎక్కడా, ఎటువంటి (Faculties) వృత్తులు, (Tendencies) ప్రవృత్తులూ లేకుండా పోయాయి. ఇదంతా ఏమిటో తమకే తెలియాలి. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 762

లఖీంపూర్,
23.10.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు తావూజీకి వ్రాసిన ఉత్తరం చేరింది. సమాచారం తెలిసింది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నా దశ ఎటువంటిది అంటే, నేను చేతులు చాపుకునే వచ్చాను. అలా చేతులు చాపుకుని, ఖాళీగా ఉన్న దశలోనే ఉండిపోయాను. గుప్పిళ్ళు పూర్తిగా బిగింపు లేకుండా తెరుచుకొనే ఉన్నాయి. లోపల ఎటువంటి శక్తి, సామర్థ్యాలు లేవనిపిస్తోంది. నేను గనుక వాటిని జాగృతంచేసి ప్రేరేపించక పోయినట్లయితే, అంతవరకు ఎటువంటి దశ కలగనేరదు. ఇప్పుడు నా లోపలనే కాకుండా, లోన–బయట, కణకణం తరచుగా నిద్రిస్తాయి అన్నట్లు ఉంది. నేను స్వయంగా మేల్కొల్పితే కొంత చైతన్యం వస్తుంది కాని మళ్ళీ నిద్రిస్తాయి. నా 'మాలిక్' నన్ను ఎందుకు చక్కబెట్టడంలేదో తెలియటం లేదు. దోషం నాదేనని వారు చెప్పినప్పటికీ నేను దానిని అంగీకరిస్తాను. ఎందుకంటే, వారు నా జీవన సర్వస్వంగా ఉండి కూడా వారిని నేను జ్ఞాపకం చేసుకోవటం లేదంటే నేను దోషినై ఉన్నాను. నేను గత్యంతరం లేనిదానిగా ఉన్నాను. నాలో నా ప్రియతముని జ్ఞాపకం చేసుకునే సామర్థ్యం లేకపోయినందున నేను నిర్దోషిని కూడా. 'అతడు' ఎంత మంచివాడు, ఎంత ప్రియాతి ప్రియమైనవాడు, మధురమైనవాడు అంటే, నా వంటి నీచ కుమార్తె యొక్క ఆలోచనలోగాని, జ్ఞాపకంలోగాని 'అతడు' లీనమై ఉండకపోయినా గమనించటం లేదు. అయినా 'వారు' నావారు, నేను 'వారి'కి చెందియే ఉన్నాను.

ఇప్పుడు ప్రాణిమాత్రులు ఎవ్వరైనగాని నాకు పరమపూజ్యులుగా కనిపిస్తున్నారు అంటే, అది నా స్థితి నమ్రత (వినయం) యొక్క స్వరూపంగా అయిపోవటమేనని నేను అనుభూతి చెందుతున్నాను. నా లోన, బయట, నా (స్థితి మీద కాదు) స్వరూపం అంతటా ఒక తేలికపాటి తెల్లని మేఘం వంటి పొగ వచ్చి వెంటనే తొలగిపోతోంది. ఈ పొగ అను శబ్దం స్థితికి సంబంధించినంతవరకు చాలా బరువైనదిగాను, ఘనమైనదిగాను తలపిస్తున్నప్పటికీ, వ్రాయటానికి తగిన శబ్దం స్ఫురించకపోవటం వలన అలా వ్రాయాల్సి వచ్చింది. హృదయంలో ఇటువంటి వినమ్రత ఉన్నప్పటికీ, శిరస్సుకు మాత్రం ఎవరి ఎదుట వంగి ఉండటం తెలియదు. 'తమరు' నా ఎదుట ఉండాలని, నేను హృదయ పూర్వకంగా తమరిని ప్రేమించగలగాలని, తమరిని నా హృదయంలో నిలుపుకోవాలి అనే స్ఫూర్తితోను, కోర్కెతోను నేను పూజ (ధ్యానం) ప్రారంభించాను. అదే ఉత్సాహం, స్ఫూర్తి, కోర్కె అంతగా నాలో ఏర్పడిపోయాయి. అనగా దశలో అప్పుడుగాని, ఇప్పుడుగాని ఎంత మాత్రం భేదం లేనట్లుగా నేను చూస్తున్నాను. ఇంకేముంది, ఏ విషయంలోనైనాగాని ఏదైనా ఉంటే అది నాలో ఉందో లేక 'మాలిక్'లో ఉందో నాకు తెలియదు. అది నా స్థితిలో ఉన్నా లేక 'మాలిక్'లో ఉన్నాగాని, రెండూ నాకు సమానంగానే కనిపిస్తున్నాయి. ఇంకేం చెప్పను?

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 763

షాజహాన్‌పూర్,
02.11.1960

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరాలన్నీ చేరాయి. నీకు ఇప్పుడు మంచి స్థితి నడుస్తోంది. నేను ఇక్కడి సత్సంగీయుల (అభ్యాసుల) స్థితులను గమనిస్తూనే ఉంటాను. కాని ఎందుకో తెలియదు కాని, నా హృదయం (Sub-consciously) సుప్తచేతనంగా దక్షిణ భారతదేశవాసులపైనే మొగ్గుచూపుతూ ఉంటుంది. నేను నవంబరు 15వ తేదీ గం. 4.30 ని॥లకు సాయంత్రం రైలులో ఢిల్లీ వెళ్ళుతున్నాను. మళ్ళీ అక్కడి నుండి నవంబరు 17వ తేదీ సాయంత్రం దక్షిణ భారతదేశానికి బయలుదేరతాను. తిరుగు ప్రయాణం జనవరి 15,16 తేదీలలో ఉంటుంది. 1961 జనవరి 20వ తేదీ నుంచి మిషన్ వార్షికోత్సవాలు ప్రారంభమవుతాయి. బసంత్ పంచమి జనవరి 21న జరుగుతుంది.

నీవు కేసర్‌ను రాత్రిపూట కొంచెంసేపు భగవంతుడ్ని ప్రార్థించి, దక్షిణ భారతదేశంలోని జనులందరు మన మిషన్‌లో సభ్యులుగా చేరుతున్నట్లుగా దృష్టిపెట్టమని జాబు వ్రాయి. నీ ఆరోగ్యం బాగుపడినపుడు నీవు కూడా ఇదే విధంగానే కొంచెంసేపు చేయి. నీకు ప్రోగ్రాం పంపిస్తున్నాను. అమ్మకు, చౌబేజీకి ప్రణామం.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 764

లఖీంపుర్,
30.10.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. రేపు నారాయణ దద్దాగారు కూడా తమ వద్దకు చేరతారు. వారి ద్వారా తమకు ఇక్కడి మా గురించిన జ్ఞాపకాలు మరొకసారి తాజాగా వస్తాయి. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నేను ఇప్పుడు ఎటువంటి స్థితి లేకుండానే ఖాళీగానే నడుస్తున్నాను. అసలు నాకు ఇప్పుడు ఆలోచనలు వస్తున్నాయా లేక ఆలోచనలు లేకుండానే తిరుగుతున్నానో గ్రహించలేకపోతున్నాను. దశ మాత్రం ఒకే రకంగా నడుస్తోంది. నేను అన్ని పనులు చేస్తున్నప్పటికీ ఖాళీగానే ఎందుకు నడుస్తున్నానో తెలియటం లేదు. అంతేకాకుండా, నేను శాంతంగా ఉన్నానో లేక అశాంతిగా ఉన్నానో కూడా తెలియటం లేదు. స్థితి ఎటువంటిదని చెప్పాల్సివస్తే, సామాన్యత లేక సరళత్వమే స్వయంగా దిగివచ్చిందని, అదే నా స్వరూపంగాను మరియు స్థితిగాను తయారైపోయిందని చెప్పాలి. ఇప్పుడు పోయేది, వచ్చేది ఏమీలేవు, కాని నేను చెప్పాలంటే ఏమి చెప్పాలో నాకు అర్థం కావటం లేదు. బహుశా స్థితి ఇంత తేలికైనదిగా ఉన్నప్పటికీ నా స్వభావంలో మార్పు ఎందుకు వచ్చిందో తెలియదు. తృటిలో ఉద్రేకం, వెంటనే మామూలు స్థితి కలుగుతున్నాయి. ఇవేమీ నా ఆధీనంలో లేకుండా పోయాయి.

ఇప్పుడు నాలో విరహం యొక్క వ్యధగాని, కలయిక యొక్క ఆనందంగాని లేవు. మరైతే దశ ఏమిటి? పురోగమనం అయితే సాగుతూనే ఉంది, కాని అడుగడుగునా నిరోధించబడుతూనే ఉంది. అందుచేత పురోగమించే అవకాశమే రావటం లేదు. మరి ఏమి చేయాలి? ఎలా చేయాలి? నా 'శ్రీ బాబూజీ'ని ఎలా పొందగలను? ఎప్పుడు, ఎలా 'వారి' అనుపమానమైన మనోహర రూపాన్ని దర్శించుకొని కృతార్థురాలనవుతాను. ఎందుకంటే, నడక సాగటం లేదు మరి. అయినా గాని 'వారి'ని పొందాల్సియే ఉంది. ఎందుకంటే, 'వారు' నావారు, నేను 'వారి' దానను. దశ

ఏమైపోయింది అంటారా, అంధకారం నన్ను మ్రింగి వేసిందా లేక నేనే అంధకారాన్ని, ప్రకాశాన్ని అన్నింటినీ మ్రింగేసి కూర్చున్నానా అన్నట్లుగా ఉంది. నాకు మార్గం ఏదీ కనిపించటం లేదు, ఎక్కడా మార్గదర్శకుడూ కనిపించటం లేదు. ఎలా చేరుకుని 'వారి'ని పొందగలనో అర్థం కావటం లేదు. ఇదివరకు నేను షాజహాన్‌పూర్ వెళ్ళాలని భావించినప్పుడు, 'తమరు' నన్ను కలుస్తారని, ఎంత ఆనందంగా ఉంటుందో కదా అని, అలాగే 'తమరు' కూడా ఎంత సంతోషిస్తారో కదా, అని అనిపించేది. అయితే ఇప్పుడు షాజహాన్‌పూర్ వెళ్ళాలి అని ఆలోచన చేసినాగాని, లోపల ఏదో కొంచెం బాగుంటుందని అనిపిస్తుందే కాని, కలవాలి అను ఉత్సాహంగాని, తలంపుగాని, దృష్టికి రావటం లేదు. అప్పుడు ఒక్కసారిగా 'తమరు' అక్కడ ఉన్నారా, లేక దక్షిణ భారతదేశం వెళ్ళిపోయారా అను ఆలోచన కలుగుతుంది. అయితే మళ్ళీ ఇలా అనిపించటం లేదు. అంతా 'తమ'కే తెలియాలి.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 765

లఖీంపుర్,
12.11.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం అందింది. చదివి సంతోషించాను. తమరు మిషన్ పనిమీద దక్షిణ భారతదేశం వెళ్తున్నట్లుగా తెలిసింది. నాకు, కేసర్‌కు తమరు అప్పగించిన పనిని తప్పకుండా చేస్తాము. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నా దశ ఎలా ఉందో చూడండి. తమరు దశ బాగానే కొనసాగుతోందని వ్రాస్తున్నారు, కాని నా స్థితి అయితే, నేను శ్రమించటమే లేదన్నట్లుగాను, ఎంతమాత్రం నా 'మాలిక్' యొక్క జ్ఞాపకం కూడా రావటం లేదన్నట్లుగాను ఉంటోంది. అంతేగాకుండా నేను 'మాలిక్'ను జ్ఞాపకం చేసుకుంటున్నా కూడా జ్ఞాపకం చేసుకుంటున్నట్లుగా నాకు అనిపించటం లేదు. బహుశా అందువల్లనేమో, ఇంతకుముందు ఎప్పుడూ నా నుండి నా చుట్టూరా పవిత్ర కిరణాలు వ్యాపిస్తూ ఉన్నట్లు ఉండేది, ఇప్పుడు అవి కూడా నాలో లీనమైపోయినట్లుగా అనిపిస్తోంది. సాధనకు సంబంధించిన అన్ని కోణాల నుంచి (అనగా ధ్యానం, నిర్మలీకరణ, ప్రార్థన) నేను ఏమీ పొందలేకపోతున్నాను. అన్ని అంశాల నుంచి కూడా నేను ఏమీ పొందలేకపోతున్నాను అనగా శూన్యం (Nil). ఒక విషయం ఏమిటంటే, తమరు నాకు అప్పగించే పని ఏదైనా కానివ్వండి, ఆ విషయంలో తమ హృదయంలో ఎంతోకొంత వెసులుబాటు (Margin) ఉంటుంది. అందుచేత తమరే కేంద్రంగా ఉన్నట్టి నా అపారశక్తిలో కూడా ఎప్పుడైనా గాని, కొంత వెసులుబాటు (Margin) ఉంటున్నది. నా శరీరం బలహీనంగానే ఉన్నప్పటికీ, నా మనస్సు మరియు హృదయానికి తమ కేంద్రం నుంచే అనగా తమరి నుంచే శక్తి లభిస్తోంది. అటువంటప్పుడు దానిలో బలహీనత ఎలా ఏర్పడగలదు! నా మనస్సు సుప్తచేతనంగా (Sub-consciously) ఎక్కడో పనిలో నిమగ్నమై ఉంటుంది, కాని అది ఎక్కడ ఏ పనిలో నిమగ్నమై ఉందో మాత్రం నాకు తెలియదు. నేను వ్రాస్తున్నది ఏదైనాగాని, అది నా స్థితి గురించో లేక 'తమరి'ని గురించో నాకేమీ తెలియదు.

ఇప్పుడు దశ ఎలా ఉందంటే, మనస్సు మరియు కోర్కెలతో శరీరానికి సంబంధమే లేనట్లుగాను, నా కణకణం యొక్క సంబంధం కూడా నా నుంచి తొలగిపోయినట్లుగాను అనిపిస్తోంది. నా లోపల, బయట కూడా ఇదే దశగా ఉండి, ఏది కూడా దేనితోనూ ఎవ్వరికీ సంబంధం లేనట్లుగా అనిపిస్తూనే ఉన్నా, అన్ని పనులు సక్రమంగానే జరిగిపోతున్నాయి. అన్ని (Relations) సంబంధాలు మరియు (Attachments) అనుబంధాలు ఒక (Balnced conditon)

సమతుల్య స్థాయికి వచ్చి, వ్యాపించిపోయినట్లుగా  ఉంది. ఇది గతంలోను ఉంది, ఇప్పుడూ ఉంది, భవిష్యత్తులోను శాశ్వతంగా ఉంటుంది. స్వయంగా దాని (Importance) ప్రాముఖ్యతగాని, (Speciality) ప్రత్యేకతగాని ఏమిలేదు. నాకేమి జరిగిందో తెలియదు. స్వయంగా నాలో విశిష్టత ఏమి లేదు. బహుశా అందుకనో ఏమో, నేను ఈశ్వరుడు మరియు 'మాలిక్' మొదలైనవి చెప్తూ ఉన్నాను మరియు 'వారి' శరణమర్థించి ఉంటున్నాను. నాకు ఇప్పుడు ఎవరి యొక్క ఎటువంటి (Importance) ప్రాముఖ్యత లేదా (Speciality) ప్రత్యేకత యొక్క అనుభవం కలగటం లేదు. ఇంకేముంది, ఏది ఎలా ఉన్నాగాని 'మాలిక్' నావారు, నేను 'వారి' దానను, నాలో సద్గుణాలు ఏమీ లేకపోయినా కూడా. ఇది నా స్థితియో లేక స్థితి యొక్క స్థితియో లేదా నా స్థితిలేని స్థితియో తెలియదు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 766

లఖీంపుర్,

12.11.1960

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. సోదరుడు పుత్తీబాబు ద్వారా తమ సమాచారం తెలిసి సంతోషించాను. వారి ద్వారా తమ ఆరోగ్యం మరియు ఇతర విషయాలు తెలిసి ఆనందమైంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బాబూజీ, ఆధ్యాత్మికంగా అత్యున్నత స్థానానికి చేరిన తర్వాత మానవునికి విశ్రాంతి మరియు మార్గం యొక్క అంచనా సాధ్యపడుతుందని 'తమరు' చెప్తూ ఉంటారు. మరి నా పరిస్థితి ఏమిటో తెలియకుండా ఉంది. ఎందుకంటే, 'చేరిక' అను శబ్దమే నాకు అంతుబట్టకుండా ఉంది. నేను దాని అట్టడుగుకు దూసుకుపోయినా కూడా నాకేమి దొరకటం లేదు. అటువంటప్పుడు నేను 'మాలిక్'ను చేరు మార్గాన్ని ఎలా పొందగలుగుతాను. ఆ మార్గమే నాకు చేరువకానపుడు అక్కడికి చేరటం ఎలా సాధ్యపడుతుంది? ఆధ్యాత్మికతలో ఇంకను నాకు అడుగు పెట్టటమే సాధ్యపడనపుడు, నేను అక్కడికి చేరటం ఎలా జరుగుతుంది? నాలోని తపన ఏదైతే నాకు నా స్థితి యొక్క జాడ తెలుపుతూ ఉండేదో, అలాకాదుగాని, ఏదైతే స్వయంగా తన జాడ తెలియజేస్తూ ఉండేదో, అదంతా స్వయంగా 'మాలిక్'లో కలిసిపోతోంది అన్నట్లుగా ఉంది. దీనిని గురించి 'మాలిక్'కు మనవి చేసుకోవటానికి వెళ్ళాను కాని, ఆ మనవి ఏమిటో జ్ఞాపకం రావటం లేదు. ఎంత ప్రయత్నించినా కూడా నాలో దాని జ్ఞాపకం రావటం లేదు. లోన, బయట అంతా నిద్రపోయినట్లుగా ఉంది. నా లోపల, బయట కణాలన్నీ నిద్రపోయి, మేల్కొనటం లేదు. అయితే నేను ఎప్పుడైనా, దేనికైనా తగిలినా, కొట్టుకున్నా ఒక్క క్షణకాలం జాగృతి వంటిది కలిగి మళ్ళీ స్పృహ కోల్పోవటం జరుగుతుంది. జాగృతివల్లనే నాలోని ఆ తపన, ఆ పవిత్ర జ్ఞాపకం, ఆ మనోహర రూపం అన్నీ సచేతనమవుతాయని నాకు తెలుసు. అయితే, నాకు నా స్వంత రహస్యాలు అనగా ఏమి జరుగుతున్నది అనేది తెలియటం లేదు. ఇదంతా తమకే తెలియాలి. అమ్మ తమకు ఆశీర్వాదాలు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 767

బరేలీ,
02.09.1961

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇలా ఎందుకు జరుగుతున్నదో కాని, తమరు నాకు అప్పగించిన పని గురించి నాకు ఎప్పుడూ అదే ధ్యాసగా ఉండటం వలన నా దశను గురించిన అవగాహన కల్పించుకొను జ్ఞాపకం కూడా ఉండటం లేదు.

నా దశ ఎలా ఉందంటే, ఏ ప్రాణాహుతివల్లనైతే నా హృదయానికి సమాచారం మరియు ప్రేరణ కలిగాయో అటువంటి ప్రాణాహుతియే నాకు బాగున్నట్లుగా అనిపిస్తోంది. నాకు విశ్రాంతి కూడా కలుగుతోంది. ఇంతకుపూర్వమైతే 'మాలిక్' యొక్క జ్ఞాపకం కలగనట్లయితే హృదయం చాలా అశాంతికి గురయ్యేది. అది ఎంతగానంటే, చేప కనుక నీటి నుంచి బయటపడినట్లయితే ఏ విధంగా అది విలవిల లాడుతుందో ఆ విధంగా చాలా అశాంతికి గురవుతూ ఉండేది. కాని ఇప్పుడు 'మాలిక్'ని జ్ఞాపకం చేసుకోవాలి అని జ్ఞాపకం వచ్చినపుడు నీటి నుంచి బయటపడ్డ చేపలాగానే భయకంపితమైపోతోంది. ఇప్పుడు పాయింట్ యొక్క యాత్ర పూర్తయినట్లుగా అనిపిస్తోంది. అయితే నా శ్రమవలన అది ఫలించటం లేదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు తెలుపుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 768

బరేలీ,
16.09.1961

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందని అనుకుంటున్నాను. ఇక్కడ అందరూ కుశలమే. తమరు కూడా కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఉన్న స్థితి ఏమిటంటే, నేను 'మాలిక్'ను జ్ఞాపకం చేసుకోవాలని తలంపు వచ్చినపుడు, ఒక ప్రార్థన వంటి స్థితి పొందుతున్నాను. అయితే ఆ ప్రార్థన ఏమిటో నాకు తెలియకుండా ఉంది. దానిని గురించి బాగా ఆలోచించటానికి ప్రయత్నిస్తున్నప్పటికీ, ఏ ఆలోచనా స్ఫురించటం లేదు. ఇంతకుపూర్వం ఏదో ప్రార్థన చేసి ఉంటాను, కాని దానిని ఇప్పుడు మర్చిపోయానని అనుకుంటున్నాను. బహుశా స్థితి నిలిచిపోయిందో ఏమో, అది 'మాలిక్'కే తెలియాలి. నా తనువు, మనస్సు, ధ్యానం మరియు ప్రార్థన –వీటన్నింటికీ ఒకే ఒక కేంద్రం 'తమ'రే. వాస్తవంగా తమరే నా చైతన్యం.

ఇప్పుడు నా దశ ఎలా ఉందంటే, దశను స్వయంగా మనస్సే అర్థం చేసుకోలేకపోతోంది. ప్రయత్నించినా సఫలం కావటం లేదు. అప్పుడప్పుడు సహజంగానే అది గ్రహింపుకు వస్తూ ఉంటోంది, దానిని నేను వ్రాస్తున్నాను. అందువలన 'తమ'కు ఉత్తరం వ్రాయటానికి చాలా ఆలస్యమవుతోంది. ఎలా వ్రాయాలో, ఏమి వ్రాయాలో అర్థం కావటం లేదు.

బాబూజీ, దశ అనేది ఇప్పుడు గ్రహింపుకు రావటం లేదు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా తమ వద్దకు వెళ్ళినపుడు '$W_1$' పాయింట్‌కు సంబంధించిన యాత్ర పూర్తయిపోయింది. అందువలన ముందుకు వెళ్ళటానికి

ఎదుట మైదానమే లేకుండా ఉంది. మనస్సు తరుచుగా పూర్తిగా కృశించిపోయి ఉంటున్నది. ఇంతకుపూర్వం నేను, ఫనాయియత్ (లయావస్థ) కూడా లయమైపోయినట్లుగా అనిపిస్తోంది అని వ్రాశాను. కాని ఇప్పుడు నాకు ఎటువంటి దశ కూడా అనుభవానికి రావటం లేదు. అందువలన 'తమ'కు ఏమి వ్రాయగలను? మనస్సు విచారంగా ఉంటోంది. ఎందుకు ఇలా అయిపోయిందో గ్రహించలేకపోతున్నాను. పట్టదల, విశ్వాసాల హద్దు తెగిపోయి, 'మాలిక్' ఆజ్ఞానుసారంగా నాలో ఎటువంటి శక్తియైనా సమకూరుతూ ఉంది. అందువలన నేను చెప్పగలిగింది ఏమిటంటే, 'మాలిక్' యొక్క ఆజ్ఞ మరియు సంకేతమే నాకు శక్తి కేంద్రంగా ఉంది.

ఈ దశ నేను ఆధ్యాత్మిక దశ అని చెప్పలేను. దానికి బదులుగా ఒక పరిపక్వ దశయే నాలో లీనమైపోతున్నది. ఈ విషయం నేను తమకు గతంలో కూడా వ్రాశాను. అయితే అది ఇప్పుడు పూర్తిగా మృదువైన దశగా అనిపిస్తోంది. ఈ మృదువైన దశయే నా స్వరూపంగా అయిపోయింది. ఇటువంటి శుష్కించిపోయి, నీరసించిన దశ కారణంగానే లేఖలు, మరేమైనా వ్రాయాలంటే, నాలో ఆలోచనలు కలగకపోతే నేను ఏమి వ్రాయాలి? నా శరీరం, మనస్సు అన్నీ కూడా నా 'శ్రీ బాబూజీ' యొక్క స్వరూపమే. ఈ దశ సహజంగానే తెలిసో, తెలియకనో కూడా దశలో కలిసిపోయి, లీనమైపోయింది. ఇప్పుడు ఇంకేమి ఆలోచన కలగటం లేదు. ఆలోచనల మూలస్థానమే లేకుండా పోయిందని అనిపిస్తోంది. ఎవ్వరైనా ఉత్సాహంగా మాట్లాడుతున్నట్లయితే, అప్పుడు నాలో కూడా అటువంటి ఆలోచనలు ఉత్పన్నమవుతూ ఉంటాయి. ఆ తర్వాత అవి తొలగిపోతాయి. ఆలోచన ధారలాగ దానంతట అదే నాలో ఏర్పడినప్పటికీ, దానితో సంబంధం కొంచెం కూడా లేకుండా ఉంటుంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 769

బరేలీ,

20.09.1961

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. చాలా రోజులుగా తమవద్ద నుంచి ఎటువంటి సమాచారం తెలియరాలేదు. దాని గురించి విచారిస్తున్నాను. దయచేసి శీఘ్రంగా తమ సమాచారం తెలియజేయగలరు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నాలో ఇప్పుడు ఆలోచనా శక్తికి చెందిన విషయంగాని, ఎలాంటి స్థితిగాని పేరుకైనా లేకుండాపోయాయి. నాలో శక్తిగాని, బలహీనతగాని అనుభవం ఏమి కావటం లేదు. శరీరం మాత్రం తేలికైపోయి కదలాడుతోంది. దానితో నాకు సంబంధం ఉన్నట్లుగా అనుభవం కావటం లేదు. దశలో ఏదో తేలికపాటి మార్పు లోపల ఉన్నట్లుగా ఉంటుంది, కాని నేను మాత్రం యధాతధంగానే ఉంటున్నాను. ఎప్పుడూ మార్పు రావటమే లేదు.

బాబూజీ, ఎందుకోగాని, ఇప్పుడు నాకు నా దశపట్ల సంతోషంగాని, సంతృప్తిగాని కలగటం లేదు. అనుక్షణం హృదయం తపించిపోతోంది. అలాగే నా లోపల, బయట ఎటువంటి ఆటంకం ఏమి లేనట్లు ఉంది. శరీరం యొక్క కణకణం శాంతి మరియు సహజావస్థలో స్థిరమైపోయినట్లుగా ఉంది. కాని హృదయం మాత్రం పరితపిస్తోంది, ప్రశాంతంగా ఉండనివ్వటం లేదు. నేనైతే 'తమరి'ని చేరాల్సి ఉంది. ఇది హృదయానికి ఒక స్వాభావికమైన పట్టుదలగా అయిపోయింది. ఇప్పటివరకు దశ ఎలా ఉందంటే, దృశ్యం మారిపోతూ ఉంటుంది కాని స్టేషన్ (అనగా స్థలం) ఉన్నది ఉన్నట్లుగానే ఉంది. అయితే ఇప్పుడు ఈ విధంగా అనగా ఏ స్థితి కారణంగానైతే స్థితి కలుగుతూ

ఉండేదో, అదే నిశ్చలమైన స్థితి నా కణకణంలోకి చొచ్చుకుపోయింది అని చెప్పవచ్చు. ఇప్పుడు నేను ముందుకు వెళ్ళటానికి ఏ స్థానం లేకుండా ఉంది. ఇప్పుడు 'తమ'రే తమ కుమార్తెను చక్కదిద్దుకోవాలి. నేను దశకు సంబంధించి స్వాభావికం లేదా సహజం అను శబ్దం ప్రయోగిస్తున్నాను. కాని నా దశ దాని కంటె కూడా తేలికైనదిగాను, మాటల్లో చెప్పలేనటువంటిదిగాను అనిపిస్తోంది. 'తేలిక' అను శబ్దం కూడా చెప్పటానికైతే చెప్పానుగాని, లేకపోతే ఈ తేలిక అను పదం శరీరానికి తగినదిగా ఉంటుంది. ఎందుకంటే, ఇప్పుడు శరీరం కూడా ఎందుకోగాని బాగా సూక్ష్మంగా అయిపోయింది. అది ఏమిటో తమకే తెలియాలి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 770

బరేలీ,

20.09.1961

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నిన్న తావూజీని ఉద్దేశించి వ్రాసిన తమ ఉత్తరం చేరింది. సంగతులు తెలిశాయి. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నా హృదయం ఉదాసీనత యొక్క సముద్రంలో మునిగిపోయి, ఎంత లోతుకు వెళ్ళాలో వెళ్ళి, తిరిగిరానట్లుగా ఉంది. అయినా కూడా నాకు (Detachment) వేర్పాటుగాని, మరేదైనా గాని అనుభవం కావటం లేదు. ఎప్పుడైనా, ఏదైనా తగిలినప్పుడు లేదా హృదయం యొక్క ఎరుక కలిగినపుడు ఆ ఉదాసీనత తెలుస్తుంది. స్థితి కూడా ఎక్కడి నుండి అయితే కలుగుతుందో మళ్ళీ వెంటనే అక్కడికే చేరిపోతుంది. అంతేకాదు, దశ నా ఎదుటకు వచ్చిందే అనుకోండి, వెంటనే దానిని నేను మర్చిపోతున్నాను. నా నిద్రస్థితి కూడా ఇలాగే ఉంది. దానికి భంగం కలిగినట్లుగా ఉంటోంది. గాఢనిద్ర అనేది అనుభవం కావటం లేదు. నాకయితే ఇప్పుడు (Self-surrender) ఆత్మ శరణాగతి వంటి ఆధ్యాత్మిక అభ్యాసానికి చెందిన మాటలు ఏవీ అనుభవానికి రావటం లేదు. సద్గుణాలను నేను చూస్తూ వాటిని నాలో అలవర్చుకునే ప్రయత్నం చేస్తున్నా కూడా నాకు అవేమీ సాధ్యపడటం లేదు. నాలో ఎటువంటి గుణాలుకాని, విషయాలుకాని లేనప్పటికి నేను మాత్రం విధేయురాలనుగానే ఉన్నాను. ఇప్పుడు నాలో తయారు చేసే శక్తిగాని, చెరుపుచేసే సామర్థ్యంగాని లేవు. ఎలా జరగాలో అలాగే జరుగుతోంది. దానిలో ఏదైనా నేను నా తరఫున జోక్యం కల్పించుకోవాలన్నా అది జరగదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు తెలుపుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 771

బరేలీ,

14.10.1961

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నిన్న నారాయణ దద్దాగారు వచ్చారు. వారి ద్వారా సమాచారం తెలిసింది. తమకు శ్వాస ఇబ్బంది మళ్ళీ తిరగబెట్టినట్లుగా తెలిసి చాలా బాధ కలిగింది. ఈశ్వరుడు తమరిని శీఘ్రంగా

ఆరోగ్యవంతులయ్యేట్లుగా చేయుగాక! 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు స్థితి ఎలా ఉందంటే, 'మాలిక్'కు చెందిన ఏ పని అయినా, తీవ్రంగా 2,3 నిమిషాలకు మించి చేయలేకపోతున్నాను. మాటిమాటికీ దృష్టి నిలిపి చేస్తున్నాను. అలా కాకపోతే 2,3 నిమిషాలకు మించి చేయలేకపోతున్నాను. ఇదే విధంగా పూజ చేయిస్తున్న సందర్భంలో కూడా ఉంటోంది. నిర్మలీకరణ సంగతి అటుంచి, నేను దానిని చాలా తేలికగా దృష్టిపెట్టి చేస్తున్నాగాని, పూజ 2,3 నిమిషాల కంటె ఎక్కువసేపు చేయలేకపోతున్నాను. హృదయం గాబరా చెందుతోంది. నేను ఇప్పుడు దృష్టి నిలిపి ఏ పని చేయటం లేదు.

సాధనా ఫలితంగా మనస్సు యొక్క ఏకాగ్రత (Concentration) మరియు స్థిరత్వం (Stability) సమకూరుతాయి. కాని నా విషయానికి వచ్చేసరికి అది వ్యతిరేకంగా ఉంది. ఒకవేళ ఎప్పుడైనా ధ్యానంలో ఒక్క నిమిషంపాటు మనస్సు పూర్తిగా ఏకాగ్రత లేదా స్థిరత్వం పొంద సాగితే శరీరం సమాప్తమైపోతున్నట్లుగా (మరణం) అనిపిస్తుంది. అప్పుడు వెంటనే ఏదో శక్తి కొంత ఆటంకం (Disturbance) కల్పిస్తుంది. నాకు ఇప్పటికీ, నాలో శాంతిగాని లేక సంతృప్తిగాని కలగలేదు. ఏదో బాధ నిరంతరం బాధిస్తూనే ఉంది. ఇంకొక ఆశ్చర్యం ఏమిటంటే, నా వాస్తవిక దశ మరియు జీవనసరళి ఎప్పుడూ ఉండే ఆ స్థిరదశగానే ఉంది. దానిలో నేను ఒక్క నిమిషం కూడా ఉండలేకపోతున్నాను. ఏదో శక్తి నన్ను అక్కడి నుండి గుంజుతూ ఉంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 772

బరేలీ,

23.11.1961

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు ఆరోగ్యవంతులయ్యారని భావిస్తున్నాను. ఇక్కడ కూడా అందరూ క్షేమమే. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నా దశ మరియు జీవనసరళి ఒక స్థిరమైన శాశ్వత దశయేనని అనిపిస్తోంది. అయితే ఏదో శక్తి నన్ను లాగి పట్టుతోంది. అయితే ఆ లాగుతున్న దాని దిశ పైవైపుగా అనగా ఊర్ధ్వంగానే ఉంటోంది. **ఒక సాధారణ సాంసారిక జీవిలాగా, ప్రాపంచిక కార్యాల్లోనే నిమగ్నమై ఉంటున్న ప్రవృత్తి కలిగిన నా వంటి బాలికకు, ప్రదానం చేస్తున్న 'మాలిక్' కృప ఎంత మహత్తరమైనదో కదా!** ఎంత కల్పించకున్నా కూడా 'మాలిక్' యొక్క స్మరణ కలగటం లేదు. దానిని కూడా తమ కమలహస్తం ద్వారా తెలియకుండానే తమవైపు లాగి పట్టుతున్నాయి. అంతేకాదు, ఈ దశ ఏమిటోగాని, నాకు అద్భుతమైన దశగా అనిపిస్తోంది. దానిలో నేను చొచ్చుకుపోతున్నట్లుగా అనిపిస్తోంది. ఈ విషయాలు ఏమిటో 'తమ'రే చెప్పాలి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 773

బరేలీ,

16.12.1961

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఆరోగ్యం ఇప్పుడు బాగుండటం లేదు. కాని తమరు విచారించవద్దు. మందులు వాడుతున్నాను. త్వరలోనే బాగవుతుంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశలో ఏమిటోగాని, నేను ఎక్కడికి వెళ్ళినా కేవలం అన్నీ (Negative) వ్యతిరేకంగానే (లేదు అన్నట్లుగానే) అనిపిస్తోంది. మనస్సు సానుకూలంగా (Positive) నా ప్రియతముని అత్యంత అధికంగా కోరుకుంటోంది, 'మాలిక్' కోసం తపన చెందుతోంది. కాని కేవలం (Negative) వ్యతిరేకంగా మరేమీ పొందటం లేదు. తరచుగా నేను మనస్సును తప్పకుండా ఆచి తూచి నిర్ణయించుకోవటానికి ప్రయత్నమైతే చేస్తున్నాను. ఏమని అంటే, నా ప్రభువును కలిసే ప్రయత్నంలో నా లోపం ఏమి ఉండకూడదు అని. అయితే లోపల ఇప్పుడు స్థితియే వ్యతిరేకంగా (Negative) ఉంది. అప్పుడప్పుడు నాలో (Negative) స్థితియే ఉంటోంది. కాని అది స్వయంగా (Balance) సమతుల్యానికి వచ్చి స్థితిలో ఎలా విలీనమైపోతుందో 'మాలిక్'కు తెలుసు. అయినా కూడా నా ధ్యానం ఇక్కడా సాగటం లేదు. నా 'మాలిక్'యే నా లోపల కూర్చుండి స్వయంగా ఎంతోకొంత చేస్తున్నారు. స్థితి యొక్క వినమ్రత, కరిగిపోవటం మరియు కలిసిపోవటం వంటివి ఏవైతే స్వతస్సిద్ధంగానే లోపల ఉంటూ ఉండేవో, ఇప్పుడు అవన్నీ కనుమరుగై పోయాయి. శరీరంతో నా మిషన్ మరియు నా 'శ్రీ బాబూజీ' యొక్క సేవయే జరుగుతోంది. ఇటువంటి భావాలే వాటంతట అవి లోపల కలుగుతూ ఉండేవి. మరి ఇప్పుడు ఏమైపోయిందో ఏమోగాని, ప్రయత్నించినా కూడా నాకు వ్యతిరేకతయే అనుభవమవుతోంది. ప్రతి ప్రయత్నానికి, ప్రతి ఆలోచన యొక్క మూలంలోను వ్యతిరేక సమాధానమే వస్తోంది. ఇంకొక ఆశ్చర్యకరమైన విషయం ఒకటి ఉంది. ఏమిటంటే, సాధారణంగా అన్ని రకాల సాధనలలోను ఏకాంతానికి అధిక ప్రాధాన్యం ఇవ్వబడింది, ఇవ్వబడుతూ ఉంది. కాని నా విషయానికి వస్తే నాకు అనుభవమవుతున్న విచిత్రం ఏమిటంటే, ఏకాంతంలో మనస్సు విసుగుదల చెందుతున్నట్లుగా ఉంటుంది. అందరిలో ఉన్నప్పుడు బాగున్నట్లు అనిపిస్తుంది. ఈ బాగు అనిపించేది ఏమిటో, ఎందుకో, ఈ భేదం నాకు అర్థం కావటం లేదు. ఇది తమకే తెలియాలి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 774

బరేలీ,

24.12.1961

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు తావూజీకి వ్రాసిన ఉత్తరం చేరింది. దాని ద్వారా తమకు స్వస్థత చేకూరినట్లుగా తెలిసి సంతోషం కలిగింది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

ఇది ఏమిటో తెలియకుండా ఉంది, ఏమిటంటే, ఇదివరకైతే దశ, దశగా అనిపించేది కాని ఇప్పుడు దశ ఏదీ దశగా అనిపించటం లేదు. అనగా ఇప్పుడు నా నుంచి ఎటువంటి గుర్తింపు (Mark) ఉండటం లేదు. కాని నా అలవాటు లేదా స్వభావరీత్యా ఇది తేడాగా ఉన్నట్లు అనిపించటం లేదు. అదే విధంగా దశ కూడా ఒక సహజమైనదే కనుక దానిపట్ల నాకు ప్రాధాన్యతగాని, విభేదించటంగాని లేవు. అందువలన ఇప్పుడు దశను అధ్యయనం చేయటమంటే,

అంత తేలికైన విషయం కాదు, విశేషమైన విషయమూ కాదు. ఇప్పుడు ఒక విచిత్రమైన (Indifference) ఉదాసీనతయే నా స్వభావంగా అయిపోయింది. అది స్వాభావికం, సాధారణమైనది. అయినా కూడా దానిని 'ఉదాసీనత' (Indifference) అని చెప్పటం సరైనది కాదనిపిస్తోంది. అయితే ఒక (Stable condition of negligence) నిర్లక్ష్యపు స్థిర దశయే స్థిరంగా ఉంటున్నది. ఒక రకంగా (Nothingness) శూన్యం మరియు (Balanced state) సమస్థితి పొందుతూ ఉన్నప్పుడు దానిని (Conditon of Stable) స్థిరదశ అని చెప్పటం కూడా సబబుగా అనిపించటం లేదు. ఇప్పుడు ఆంతరిక దృష్టికి విరుద్ధంగా, శాశ్వతంగా శూన్యమైనట్టి దృష్టి ఒకటి ఉంటోంది. నా దృష్టికి ఎప్పుడైనా స్పృహ కలిగినపుడు పరిశీలిస్తే బాహ్యాంతరాలు రెండూ కనిపించకుండా, పూర్తిగా శూన్యమే అనుభవమవుతోంది. మనస్సు యొక్క దృష్టి కూడా ఈ దశనే పోలియున్నట్లుగా ఉంది. దృష్టి శూన్యంగా ఉన్న విధంగా, నా వ్యవస్థ (System) అలా లేనట్లుగా ఎందుకు అనుభవమవుతుందో తెలియటం లేదు. వ్యవస్థ అనేది, దశ లేదా దృష్టి కంటె కొంచెం భారంగా ఉండటంచేత, ఆ పవిత్రమైన శూన్యత యొక్క ఆనందం శీఘ్రంగా అంతటా వ్యాపించటం లేదు లేదా చొచ్చుకుపోవటం లేదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 775

బరేలీ,

17.04.1962

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. చాలా కాలంగా తమ సమాచారం తెలియరాలేదు. దిగులు చెందుతున్నాను. దయచేసి తమ గురించిన సమాచారం శీఘ్రంగా వ్రాయండి. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

ఈ విషయం ఏమిటోగాని, తమవద్దకు వచ్చి వెళ్ళిన తర్వాత మలాం పూసినప్పటిలాగా అనుభవమవుతోంది. హృదయానికి చాలా విశ్రాంతి కలుగుతోంది. పూజ నా ద్వారా జరగటం లేదు అయినప్పటికీ నేను తప్పకుండా పూజలో కూర్చుంటూనే ఉన్నాను. ఇప్పటివరకు మనస్సులో ఒక చిత్రమైన పట్టుదల ఉండేది. అప్పుడు దానితో మళ్ళీ ఒక విధమైన మరపువంటి స్థితి కలిగేది. కాని ఇప్పుడు అది లేదు. ఇప్పుడు బలహీనతగాని, పట్టుదలగాని లేవు. నేను పూర్తిగా లూటీ అయిపోయాను. నేను ఖాళీగా, మాట పలుకు లేకుండా తిరుగుతున్నాను. నా మౌనాన్ని, (Simple) సాదా మరియు ఖాళీ స్థితిని దాచిపెట్టి ప్రపంచంతో కలిసిమెలిసి ఉండటానికి ప్రయత్నిస్తున్నాను. వ్యవస్థ అంతా శిధిలంగా, ఎడారిలాగా ఉంది. ఇప్పుడు ఆధ్యాత్మికమైన మరియు ప్రాపంచికమైన కోర్కెలు లేవు. వాటి ప్రభావం లేదు. నేను శిధిలంగా అయిపోయాను.

నాకు ఇప్పుడు '$X_1$' పాయింట్ మీదకు చేరిపోయినట్లుగా అనిపిస్తోంది. అది ఏమిటోగాని, జబ్బుపడిన తర్వాత నేను చాలా తేలికైపోయినట్లు అనిపిస్తోంది. ఇంకా ఏమిటంటే, నేను ధ్యానం వంటి వాటిలో కూర్చున్నప్పుడు అన్ని ఉద్దేశ్యరహితంగా ఉంటున్నాయి. సాంసారిక బాధ్యతలు జరుగుతున్నట్లుగానే, ధ్యానం ఇత్యాదులు జరుగుతున్న పరిస్థితిగా ఉంది. అంతేకాదు, ఇదే విధంగా నా జీవనం కూడా నిరర్థకంగా ఉంది. నా జీవితం మిషన్ సేవ కొరకే ఉద్దేశించబడింది అని భావిస్తూ ఉంటాను కాని, హృదయపూర్వకంగా సేవను నిర్వహించలేకపోతున్నానో ఏమో తెలియటం లేదు. ఈ మాటలు కేవలం ఉత్తేజితం కావటానికే అన్నట్లుగా ఉంటోంది, కాని ఆ తర్వాత అణగారిపోతుంది. షుమారు 12,14 రోజులుగా నాభికి ఎగువన 6,7 అంగుళాల పొడవున ఒక జానెడు దూరం వరకు తీవ్రమైన

అదురుడు, సరసరమని ప్రాకటం వంటివి అనుభవమవుతున్నాయి. అప్పుడప్పుడు నేను చేతితో నొక్కిపట్టుతున్నాను.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన<br>
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 776

బరేలీ,<br>
28.05.1962

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు కుశలమేనని భావిస్తున్నాను. ఇక్కడ నా ఆరోగ్యం కూడా బాగానే ఉంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక స్థితిని గురించి వ్రాస్తున్నాను.

నా దశ ఇప్పుడు ఎంత తేలికగా ఉందంటే, నేను దానిని పట్టుకుని కూడా దానిలో ఒకటిగా అయిపోయి నడవలేకపోతున్నాను. అయితే ఆలోచనా పరంగానైతే ఆ స్థితి రూపమైన నా 'శ్రీ బాబూజీ'తోనే అంటిపెట్టుకుని ఉండే ప్రయత్నం చేస్తున్నాను. అపుడు తమరు "ప్రయత్నం ఎప్పుడూ వ్యర్థం కాదు" అని అన్నారు. తమరి ఈ మాట నాలో పాతుకుపోయింది.

ఎందుకోగాని, నాకు బరేలీలో కూడా ఈశ్వరీయ శక్తి మరియు ఈశ్వరీయ ధారను ప్రవహింపజేయగలనని అనిపిస్తోంది. ఏదో స్వచ్ఛమైన దశ నా లోన, బయట, అన్నివైపులా వ్యాపించి ఉన్నట్లుగాను, దాని అడుగున (అనగా దానికి ఆధారమైన దానిలో) నాకు తమ ఉనికియే ఉన్నట్లుగాను అనుభవమవుతోంది. జనమంతా, సర్వం ఈశ్వరమయం అన్నట్లుగా అనగా అంతటా ఈశ్వరుడే వ్యాపించి ఉన్నాడు అని చెబుతుంటే, నాకు మాత్రం ఎందుకోగాని ఆ వ్యాపించి ఉండటం (వ్యాప్తి) అను మాట చాలా వికృతంగా అనిపిస్తోంది. నాకు కేవలం ఒక స్వచ్ఛమైన అద్దంలాగా వ్యాపించి ఉండి, దానిలో కేవలం నా ప్రతిబింబం మాత్రమే కనిపిస్తూ ఉంది. దానిలో ఇంకేమీ కనిపించటం లేదు. నా మాటల్లో జీవం లేదన్నట్లుగా అనిపిస్తోంది.

మరైతే దశ ఏమిటి? అని ప్రశ్నిస్తే దానిని ఏ తత్వంతోను పోల్చశక్యం కాదు. ఆకాశతత్త్వం కూడా దశకు వికృతంగానే అనిపిస్తోంది. ఒకే ఒక్క మాట చెప్పటంలో దశ యొక్క అంతు చిక్కుతుంది, అదేమిటి అంటే, అది 'శ్రీ బాబూజీ'ది అని. తమ దయతో '$X_1$' పాయింట్ యొక్క యాత్ర ఆరంభమైనట్లుగా అనుభవమవుతోంది. అయితే ఇటువంటి స్థితి కలిగి ఉండి కూడా నా మనస్సు ఈ ప్రపంచంపట్ల అత్యధికమైన విరక్తిగానే ఉంటోంది. నిజం చెప్పాలంటే, నేను మనస్సును మరపింపజేస్తున్నాను. అలా కాకుంటే, ఈ భౌతిక ప్రపంచంలో జీవించటం దుర్లభమవుతుంది. మనస్సు దేనినైనా తనలో జీర్ణించుకోవటానికి అధైర్యపడుతోంది. బుద్ధి కోల్పోయినట్లుగా (Absent-minded) ఉంటోంది. దృష్టి శూన్యంగా ఉంటోంది. మన మిషన్ యొక్క లేఖలు వగైరా వ్రాయటంలోను, దానిని అభివృద్ధి చేయటానికని ప్రార్థన చేస్తున్నంతసేపూ చాలా బాగున్నట్లు ఉంటుంది. అలాకాకపోతే ఇంటిలో అందరి మధ్యన ఉన్నాగాని నా మనస్సు ఏదో కోల్పోయినట్లు అధైర్యంగా ఉంటుంది.

కుండలిని యొక్క పని తీరు ఎటువంటిది అంటే, అది జీవుడిని బ్రహ్మంతో యోగం కల్పించటంలో మధ్యవర్తిగా ఉన్న శక్తి, అది సహస్రదళంలో నెలవై ఉంటుంది. అది కూడా మానవునికి గురువు శక్తి ద్వారా తన శక్తితో చేరగలిగిన అంతిమ స్థానంగా ఉంటుంది. అక్కడి నుండి తన కంటె ఉన్నతంగా ఎగసిపోతుంది. ఆ తర్వాత గురువు యొక్క శక్తియే అతడిని ముందుకు నడిపిస్తుంది. శిష్యుని యొక్క శక్తి లేదా దీక్ష కేవలం దానిలో యోగించి ఉంటుంది. అందువలన కుండలినిని జాగృతం చేశాక ప్రాణుల చూపు పైపైపుకే ఉంటుంది. కుండలి ఉండే స్థితి అధోముఖంగా

అనగా క్రిందివైపుగా ఉండటంచేత, ఒకవేళ మనస్సు ఊర్ధ్వముఖంగా సారించటం జరగకముందే (అనగా పైవైపుకు సారించకుండా) మేల్కొన్నా లేదా మేల్కొల్పబడినాగాని మానవుని నడవడి (వృత్తి) ఊర్ధ్వంగా (పైవైపుకు) కాకుండా అధోముఖంగా (క్రిందివైపుగా) అయిపోతుంది. యోగ్యుడైన సద్గురువు ఎప్పుడైతే మనస్సును బ్రహ్మాండ మనస్సుగా తయారుజేస్తారో అప్పుడే దీనిని (కుండలిని) జాగృతం చేస్తారు. నా గ్రహింపుకు వచ్చిన దానిని నేను వ్రాశాను, మిగిలినది తమకే తెలియాలి, తమ నైపుణ్యానికే తెలియాలి. (ఉదాహరణకు ఒక చెంబును దాని మూతివైపు బోర్లించితే అధోముఖంగాను, దానిని త్రిప్పి మూతిని పైకి వచ్చేటట్లు నిలిపితే ఊర్ధ్వముఖంగాను, శక్తి అనేది దానిలో అమర్చబడి ఉన్నట్లుగాను భావించుకోవచ్చు.)

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 777

షాజహాన్‌పూర్,
20.06.1962

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

ఆశీర్వాదాలు. నీ ఉత్తరం చేరింది. డాక్టర్ వరదాచారిగారు, నీకు త్వరలోనే మందులు పంపనున్నట్లుగా నాకు ఉత్తరం వ్రాశారు. బహుశా అవి నీకు చేరే ఉంటాయని అనుకుంటున్నాను.

నీవు నీ స్థితిని గురించి వివరించలేకపోతున్నావు. అదే విధంగా నీ స్థితిని అభివర్ణించటానికి నాకు మాటలు దొరకటం లేదు. దీని అర్థం ఏమిటంటే, నీవు స్వచ్ఛమైన స్థితిలో ఉన్నావు అని. ఆ తర్వాత నుంచి దివ్యశబ్దం ప్రారంభమవుతుంది.

పిన్నలకు ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 778

బరేలీ,
02.08.1962

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు క్షేమంగానే ఉన్నారని భావిస్తున్నాను. డాక్టర్ వరదాచారిగారు పంపిన మందు అందింది. ఇప్పుడు నా ఆరోగ్యం బాగానే ఉంది. చింతించవద్దు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నేను స్వప్నంలో ఏవో గ్రహాలు (Planets) ఎగురుతూ పోతున్నట్లుగా చూశాను. అందులో ఒక గ్రహం (Planet) బద్దలైపోయి, అంతటా అగ్ని వ్యాపించినట్లుగా ఉంది. ఆ తర్వాత దాని నుంచి నీరు అన్నివైపులకు వ్యాపించిపోయింది. ఈ స్వప్నంలో మొదట, తమరు నాకు ఏదో గొప్ప శక్తిని అనుగ్రహించినట్లుగా చూశాను. నేను దానిని స్వంతం చేసుకున్నాను. ఆ శక్తిని గురించి 'తమరు' నాకు ఏవో మాటలు చెప్పారు. వాటిని నేను అర్థం చేసుకున్నాను. మళ్ళీ ఆ గ్రహానికి సంబంధించిన దృశ్యాన్ని చూశాను. ఉదయం ఆ శక్తిని గురించిన విషయాలు, తమరు నాకు బోధించిన వాటిని ఎంతగా జ్ఞాపకం చేసుకోవటానికి ప్రయత్నించినా గాని ఫలితం లేకపోయింది.

బాహ్యంగా నేను నా 'శ్రీ బాబూజీ'ని ధ్యానం చేస్తూనే ఉన్నాను. అయితే నేను 'వారి' పవిత్ర రూపాన్ని అనుభూతి చెందలేకపోయాను. తమరు నా వెంటే ఉన్నారను ఆలోచన కూడా కలిగే ఉన్నాను. అయినా కూడా ఇప్పుడు బయట నా ఎదుట ఆ పావన రూపం అదృశ్యంగానే ఉంది. ఎంతగా దృష్టి నిలిపినప్పటికీ నాకు కనిపించకపోయేసరికి నేను ధ్యాసపెట్టకపోయినా విశేషం ఏమి లేనట్లుగానే ఉంది. ఇప్పుడు పూజను గురించిన అనుభూతిగాని, ఆలోచనగాని నాలో ఉండటం లేదు. ఆలోచన యొక్క ఆలోచనను కేంద్రీకరించి ఉంచినట్లయితే నా స్థితి ఏమిటో తెలియనట్లుగా ఉంటోంది. ఇంతకుముందు భక్త మీరా భజనలు, కబీర్ ఇత్యాదుల పాటల్లో నాకు కొంచెం తన్మయత్వం కలుగుతూ ఉండేది. మనస్సుకు పాడాలని కూడా అనిపించేది. కాని ఇప్పుడు ఆ భజనలను చేయాలని, పాటలు పాడాలని మనస్సుకు అనిపించటం లేదు, తన్మయత్వం కలగటం లేదు, ప్రేమ ఉండటం లేదు. అవన్నీ పూర్తిగా శుష్కించిపోయిన కీర్తనలుగా అనిపిస్తున్నాయి. అందుచేత వాటిని పాడటానికి కూడా నాకు మనస్కరించటం లేదు. నేను పాడకపోయినా నాపై ఎటువంటి ప్రభావం లేదు. ప్రకృతి నా నుంచి ఏదో విధ్వంసక కార్యం (Destruction work) వంటిది ఆశిస్తున్నదా అని అనిపిస్తోంది. ఇటువంటి విషయాలే ఎదురవుతున్నాయి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 779

బరేలీ,

02.09.1962

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందని అనుకుంటున్నాను. ఇక్కడ అందరూ కుశలమే. తమరు కూడా ఆరోగ్యంగానే ఉన్నారని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

తమరు దయతో '$X_1$' పాయింట్‌ను దాటించి '$Y_1$' పాయింట్ మీదకు చేర్చారు. అందుకు ధన్యవాదాలు తెలపటానికి నావద్ద మాటలు లేవు. 'తమ' దగ్గర నుండి వచ్చాక శరీరం అత్యంత స్వచ్ఛంగా ఉంది. ఇప్పుడు ఎటువంటి భావాలు కూడా తలెత్తటం లేదు. భావాల యొక్క హద్దు కూడా అంతమైపోయినట్లుగా ఉంది. అయితే నా మనస్సు మాత్రం కొంత వేదన చెందుతున్నట్లు ఉంటోంది. ఈ వేదనయే నా ప్రాణాలకు ప్రాణం పోస్తూ, శరీరం దృఢంగా ఉంది. 'మాలిక్' పనిలో ఎప్పుడు కూడా అసంపూర్ణత కలగటం లేదు. ఎప్పుడైతే తమరు అస్సాం వెళ్ళాలని నిర్ణయం తీసుకున్నారో అప్పటి నుండి మిషన్‌పట్ల ఆకర్షణ కలుగుతున్నట్లుగా నేను చూస్తున్నాను. నేను నా 'శ్రీ బాబూజీ' నయనాల్లో ఇమిడిపోయి లీనమైపోయినట్లుగా అనుభూతి కలుగుతోంది. అదేమిటో నాకు తెలియదు. 'మాలిక్' యొక్క శూన్య నేత్రాల్లో ఇప్పుడు నా ఉనికి కనిపించటం లేదు. ఎందుకంటే, నా దృష్టి కూడా శూన్యమైపోయింది అన్నట్లు అనుభూతి చెందుతున్నాను. ఇప్పుడు దశ అయితే శూన్యాతి శూన్యంగా అయిపోతూ నడుస్తూ ఉంది.

బాబూజీ, ఇప్పుడు నా స్థితి ఏమిటంటే, స్థితియే లేనట్లుగా ఉంది. ఎటువంటి ఆవేశం, భావం, గుణం కూడా నా లోపల ఉత్పన్నం కావటం లేదు. ఇంతకుపూర్వమైతే అన్నీ ఏకమైపోయినట్లుగా అనిపించుటవంటి స్థితి ఉండేది. ప్రాణులన్నీ ఒకే విధంగా సమానంగానే అనిపించేవి, కాని ఇప్పుడు వేటికవే అన్నట్లుగా ఉంది. అంతేకాని ప్రత్యేకత ఏమి అనిపించటం లేదు. నా 'శ్రీ బాబూజీ' యొక్క గొప్పదనం, ప్రత్యేకతలను మరి మరి స్మరించుకుంటూ హత్తుకుపోయే ప్రయత్నం చేస్తున్నాను. అయినాగాని దశలో ఎటువంటి మార్పు రావటం లేదు. అన్నీ కూడా సహజం, స్వాభావికమైన మాటలే అన్నట్లుగా ఉంది. ఎటువంటి భావాలు కలగకపోగా అన్నీ ఉన్నవి ఉన్నట్లుగానే ఉంటున్నాయి. దశలో

ఎటువంటి మార్పు కలగటం లేదు. అది యథాతథంగానే నడుస్తోంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు తెలుపుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 780

బరేలీ,

29.09.1962

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. చాలా రోజులుగా తమ ఉత్తరం రాలేదు, కారణం ఏమిటి? దయచేసి తమ ఆరోగ్యం గురించి శీఘ్రంగా తెలియజేయండి. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను. ఇప్పుడు స్థితి ఏమిటంటే, స్థితి ఏమీ లేకపోవటమే. ఆలోచించినా అంతుబట్టడం లేదు, అనుభవానికి రావటం లేదు. యదార్థం ఏమిటంటే, గ్రహించటానికి యోగ్యత అంటూ ఉంటే, అప్పుడు గ్రహింపుకు వస్తుంది లేదా గ్రహింపు శక్తి ఉంటే కదా గ్రహింపుకు వచ్చేది! ఇప్పుడు అర్థం కాకపోవటం ఉందా అంటే అలా అనిపించటం లేదు. కనుక దశ ఎలా ఉందో అలానే ఉంది అని చెప్పాల్సి ఉంటుంది. కస్తూరీ ఎలా ఉండేదో, అలాగే ఉంది. తేడా ఏమీ లేదు. నా స్పృహ లేదా తెలివి అంతా మళ్ళీ తిరిగివచ్చినట్లు ఉంది. ఒక చిన్న విషయం ఏమిటంటే, పూజలో కూర్చుండకపోయినా కూడా, ఎవ్వరైనా 'ఆపండి' అని అన్నపుడు లోలోపల ఏదో గగుర్పాటు (Shock) వంటిది కలుగుతుంది. అయితే నా మీద దాని ప్రభావం ఏమి ఉండదు. నాలో కొంత అశాంతి, ఎక్కడ అంటే, లోన, బయట, నరనరాల్లోను లోలోపలనే వ్యాపించి ఉంటోంది. ఎందుకంటే, పూజ చేస్తున్నా కూడా 'మాలిక్' అందుబాటులో లేనట్లుగా దూరంగా ఉన్నట్లు ఉంటుంది. దీనిని గురించి ఆలోచించే ప్రసక్తి లేకపోయినాగాని, లోలోపల ఏదో తపన నన్ను శాంతంగా కూర్చోనివ్వదు. నా 'శ్రీ బాబూజీ', ఇప్పుడైతే నాకు శాంతి, అశాంతి అన్నీ ఒకటిగానే అనిపిస్తున్నాయి. అంతేగాకుండా, బాధకు మందు మరియు మందువలన బాధ కూడా ఒకటిగానే అనిపిస్తున్నాయి. దశ ఇప్పుడు పూర్తిగా సాదాగా ఉంది. ఇప్పుడింక లోన, బయట అంతా ఒకటిగానే అయిపోయాయి. ఎటువంటి కృత్రిమం లేదు. అంతేగాకుండా నాకు నేనుగా అయ్యాననిగాని, నన్ను ఎవరైనా తయారుచేశారు అనిగాని అనిపించటం లేదు. నాకు ఎవరైనా తల్లి అనిగాని, తండ్రి అనిగాని అనిపించటం లేదు.

బాబూజీ, ఇది ఏమిటో తెలియకుండా ఉంది, ఏమిటంటే, మనస్సు మాత్రమే (Pensiveness) ఉదాసీన రూపం దాల్చకుండా, లోన, బయట, శరీరం యొక్క కణకణం నుండి కూడా ఉదాసీనతయే వెలువడుతున్నట్లుగా అనిపిస్తోంది. హృదయం బిగపట్టుకుని తనలోనే మునిగి ఉంటోంది. శరీరం యొక్క కణకణం ఛిన్నాభిన్నమైపోతున్నాయి. ఎంత గాఢమైన స్థితి ఉంది అంటే, శరీరం అంతా కూడా ప్రాణం పోయినట్లుగా అనిపిస్తోంది, అయితే ఏదో శక్తి నన్ను, నాలో నేను పూర్తిగా మునిగిపోకుండా బయటకు లాగిపట్టుతోంది. అది కనుక నన్ను ఆ విధంగా బయటకు గుంజకపోయినట్లయితే, పూర్తిగా మునిగిపోయి నా ప్రాణాలు పోయి ఉండేవి. ఈ ఘోరమైన ఉదాసీనత నా లోపల నుండియే వెలువడుతున్నట్లుగా ఉంది. విసుగు చెందిన మరియు ఉదాసీనమైన మనస్సు చివరకు కళ్ళు మూసుకుని పండుకోవాలని కోరుతున్నట్లుగా ఉంది, అయితే ఇది నా స్వంత ఇంటి (శరీరం) నుంచే వస్తూ ఉండగా ఇంక శాంతి ఎలా కలుగుతుంది. మనస్సులో ఎంత అశాంతి భరించలేనిదిగా ఉందంటే, ప్రాణాలు పెకలించుకుపోతున్నట్లుగా అనిపిస్తోంది. ఎటువంటి చలనంలేని మైదానంలో ఒక విలవిలలాడుతున్న ప్రాణంలాగా నా దశ ఉంది. అయితే ఈ విలవిల్లాడటం కూడా చలనం లేనిదే అన్నట్లుగా అనిపిస్తోంది. నా కణకణాలలో ఉన్న ఒక వింత విషయంగా

ఇది ఉంది.

ఈ రోజు రాత్రంతా స్వప్నంలో ఇలా అనిపించింది. నేను తమవద్ద తమ చరణాల దగ్గర ఉన్నాను. తమరు చాలా ప్రేమతో రోటీ తింటున్నట్లుగా చూశాను. నేను కూడా ప్రేమతో తమకు తినిపిస్తున్నాను. ఈ సంఘటనతో ఈ రోజు పగలంతా మనస్సంతా ఎంతో హాయిగా అనిపించింది. ఒక ఎండగా ఉన్న ఎడారిలో నీటిజల్లు పడినట్లుగా నా దశ ఉంది. అయితే ఒక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఏమి అడుగుతారోనని నేను ఆలోచిస్తూనే పరుగులు తీస్తూ తమకు తినడానికి అందిస్తున్నాను. తమరు తింటూనే ఉన్నారు. అయితే తమరు నన్ను ఏది అడుగుతున్నారో, నేను ఏమి ఇస్తున్నానో, తమరు ఏమి తింటున్నారో తెలియదు. అక్కడ తినడానికి ఏమీలేదు. నా అమితమైన ఉత్సాహంతో తమరు అర్ధాకలితో వెళ్ళిపోయారా? నేను తమకు ఇష్టమైనదానిని ఇచ్చానో లేక ఏది ఉంటే అది ఇచ్చానో తెలియదు. నాకు స్పృహ లేకపోయినందుకు దుఃఖిస్తున్నాను. అయితే ఎందుకోగాని ఈరోజు నా శరీరంలో లోన, బయట ఆనందం పొంగిపొర్లుతున్నట్లుగా అనిపిస్తోంది. ఎండగా ఉండే ఎడారిలో ఒక చిరుజల్లు పడినంత హాయిగా ఈ దశ ఉంది. నా 'మాలిక్' నాకు అదృష్టాన్ని కల్పించి నావద్దకు వస్తారా, నేను వారికి హృదయ పూర్వకంగా తినిపించగలనా? ఈ ప్రపంచంలోని వస్తువులు ఏవీ తమ పవిత్ర పాదాలవద్ద సమర్పించటానికి యోగ్యమైనవి కావు. ఏదైతే తమరు కృపతో నాకు ఇచ్చారో అదే ఉంది, దానినే తమ చరణాలకు అర్పిస్తున్నాను.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 781

బరేలీ,
15.11.1962

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందని అనుకుంటున్నాను. తమరు ఆరోగ్యంగా ఉన్నారని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశలో అన్నివేళలా ఎంత మందకొడిగా ఉంటున్నదంటే, ఏదైనా ఆలోచించాలని కూడా అనిపించటం లేదు. ఈ స్థితిలో ఎంత నీరసంగా ఉందంటే, నేను కూర్చుని ఉన్నానా, నడుస్తూ ఉన్నానా లేక పండుకుని ఉన్నానా అని ఆలోచించటానికి కూడా ఇష్టం ఉండటం లేదు. '$Y_1$' పాయింట్ యాత్ర ముగిసినట్లుగా అనిపిస్తోంది. ఇప్పుడు ఈ దశలో, ఈ విధంగా ఎందుకు అనిపిస్తున్నదో ఏమోకాని, నావద్ద మనస్సు లేదు, బుద్ధిలేదు, చిత్తం లేదు, ఆత్మ లేకపోగా అహం మాత్రమే విపరీతంగా ఉంది. 'మాలిక్' యొక్క జ్ఞాపకం లేదు, ప్రేమలేదు, తపన లేదు. ఈ ఉన్న అహం కూడా ఎటువంటిది అంటే, దానిలో నేనే ప్రధానమా లేదా దానిలో నా రూపం యొక్క ఆలోచనే ఉందా అంటె అలా ఏదీ కూడా లేదు, బుద్ధి యొక్క అనుభూతి లేదు. 'విశిష్టత' (Special) అను దానికి కూడా విలువ ఉన్నట్లుగా నాకు అనిపించటం లేదు. కాని అహం అంటె అహం మాత్రమే ఉంది, అది కూడా (Pensive) ఉదాసీనం మరియు (Idle) చైతన్యం లేకుండా ఉన్న స్థితిలోనే.

నాకు ఇప్పుడు 'మాలిక్' నుంచి ఏదైనా పనిగాని, ఆజ్ఞగాని కలగాలనే దాహం ఎందుకు ఏర్పడుతున్నదో తెలియటం లేదు. అది నన్ను ప్రశాంతంగా కూర్చోనివ్వటం లేదు. నా అణువణువు, కణకణం నుంచి (Commanding power) ఆజ్ఞాపించు శక్తి వస్తోంది. ఇది కొంచెం స్వభావరీత్యా వస్తున్నాగాని, అన్నివైపులా అన్నింటి మీద (Command) చెలాయింపు దశ వంటిది ఉంటోంది. ఇటువంటి విరుద్ధమైన దశను నేను నాలో చూస్తున్నాను. ఎలా

అంటే, ఒకవైపు మందకొడిగా మందగించిన (Dull) స్థితి ఉంటోంది. ఏదైనా ఆలోచించాలన్నా, అర్థం చేసుకోవాలన్నా ఆసక్తి ఉండటం లేదు. ఇంకొకవైపున అణువణువులోను చలాయింపు (ఆజ్ఞాపించు) వంటి శక్తి ఉంటోంది. దాని ప్రభావం 'తమ'వైపుగా ఏదైనా ఆజ్ఞకోసం ఎదురు చూస్తున్నట్లుగా ఉంటోంది. ఇది అహం యొక్క కాంతి, ఒక క్రొత్త రకమైనది వెలువడుతున్నట్లుగా ఉందని చెప్పవచ్చు. అయితే ఈ అహంలో నేనుగాని, నాదిగాని, నా రూపంగాని లేదు. అదేమిటో తమకే తెలుసు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 782

షాజహాన్‌పూర్,

05.12.1962

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరం అందింది. నీకు నేను చెప్పిన విధంగా ప్రార్థన చేస్తూ ఉండు. ప్రస్తుతానికి దాని ప్రభావం స్వల్పంగానే ఉంది. నేను బరేలీ రైల్వేస్టేషన్‌లో ఉండగా నిన్ను '$X_1$' లేదా '$Y_1$' స్థానం మీదకు చేర్చాను. ఇది నీకు అనుభవమై ఉండాలి. దీనిని పరీక్షించి నాకు తెలియజేయి. నేను ఆ విషయం మరచిపోయాను.

నీ సోదర సోదరీలకు ఆశీస్సులు. అమ్మకు, చౌబేజీలకు ప్రణామం.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 783

బరేలీ,

14.12.1962

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం అందింది. చదివి చాలా సంతోషించాను. తమరు చెప్పిన పనిని తప్పకుండా చేస్తూ ఉంటాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నవంబర్ 16 లేక 17వ తేదీన నన్ను తమరు దయతో '$Y_1$' పాయింట్ దాటించి '$Z_1$' పాయింట్‌కు చేర్చారు. ఇంకను దానిలో యాత్ర ప్రారంభమైనట్లుగా అనిపించటం లేదు. ఈ రోజు నుంచి కొంత స్వచ్ఛంగా ఉన్నట్లు ఉంది. నిన్న రాత్రి ఎటువంటి కల చూశాను అంటే, నాకు విశ్రాంతి లేదు అన్నట్లుగా నేను రైలులో కూర్చుని, చాలా వేగంగా ప్రయాణిస్తున్నాను. కేసర్ కూడా నా వెంట రావటానికి చాలా ఆసక్తిగా ఉంది. ఇప్పుడు నేనొక విషయం చూస్తున్నాను. అది ఏమిటంటే, ఇప్పుడు నాలో సూక్ష్మ శరీరంగాని, స్థూల శరీరంగాని, కారణ శరీరంగాని, ఆత్మగాని లేవు. అవి నా అనుభూతికి రావటం లేదు. అయితే ఈ స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు లేక ఆత్మ అనేవి చెప్తూ ఉంటే, 'తమరు' మాత్రమే ఉంటున్నారు. అది కూడా ప్రియమైన, అందమైన రూపం కాదు. ఇంకా 'తమరు' కరిగిపోయి నాలో అంతటా లీనమైపోయినట్లుగా అనిపిస్తోంది. ఈ అనుభూతితో నేను ఒకవేళ ఆనందించబోతున్నట్లయితే, ఆ ఆనందం అనేది నాలో లేనటువంటి వేరే విషయంగా అనిపిస్తోంది. కేవలం ఆంతరికమైన దిగులు లేక తపన తప్ప ఇంకేమీ నా అనుభూతికి రావటం లేదు. ఇది ఎటువంటిది అని దీనిని గురించిన ఆలోచనయే నాకు లేదు.

"హితోపదేశం చేయటం చాలా మంచి విషయమే, అయితే దానిని స్వయంగా అన్వయించుకోవాలి" అను విషయం మీద వ్యాసం వ్రాయాలి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 784

షాజహాన్‌పూర్,

07.03.1963

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

ఆశీర్వాదాలు. ఇప్పుడు నీ యాత్ర '$A_2$' మీద ప్రారంభమై కొనసాగుతున్నది. నీకు కలిగిన అనుభవం సరైనదే. నీ తల్లిదండ్రులకు ప్రణామం. నీ సోదర సోదరీలకు ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 785

బరేలీ,

14.03.1963

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం అందింది. సమాచారం తెలిసింది. దయచేసి ఇటువంటి కృపయే ఈ దీనురాలైన కుమార్తెపట్ల నిలిపి ఉంచండి. ఇప్పుడు 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశలో, నేను అన్ని పనులు చేస్తున్నా కూడా ప్రయోజనం ఏమి లేకుండా తిరుగుతున్నట్లుగా అనిపిస్తోంది. స్థితిలో ఒక విధమైన ఒంటరితనం పాతుకుపోయిన కారణంగా, ఎప్పుడూ ఎడారిలాగా ఉన్నటువంటి స్థితి ఉంటోంది. 'మాలిక్' నా ఆలోచనల నుంచి ఎందుకు తొలగిపోయారో తెలియటం లేదు. ఇప్పటివరకు ఎప్పుడైనాసరే దశ అనుభమవుతూ ఉండేది, కాని ఇప్పుడు నాకు ఒక్క క్షణమైనా ఇటువంటి అనుభవం కలగటం లేదు.

14.02.1963వ తేదీన 'తమరు' దయతో నన్ను '$Z_1$' పాయింట్ దాటించి '$A_2$' పాయింట్ మీదకు చేర్చారు. భక్తి, విశ్వాసాలు అన్నీ ఒక స్థిరస్థితిలో స్వయంగా లయమైపోయినట్లుగాను లేదా ఆధ్యాత్మికత అంతటికీ ఇదే పరిణామం కలిగినట్లుగాను చెప్పవచ్చు.

ఇప్పుడు '$A_2$' పాయింట్ యాత్ర జరుగుతున్నట్లుగా అనుభవమవుతోంది. ఈ స్థితి ఎలా ఉందంటే, లోన, బయట, నా కణకణం అన్నీ ఉదాసీనంగాను, శూన్యత్వ రూపంగాను అయిపోయినట్లు ఉంది. ఎటువంటి వేడుకలోనైనా కూర్చున్నప్పటికీ, అన్నివైపులా ఉదాసీనత, ఎడారితనం, శూన్యత్వం మరియు నిరాశయే వ్యాపించి ఉన్నాయి. మనస్సు ఎందులో మునిగి ఉందో కాని, అన్నివైపులా నా స్పృహకు శూన్యత్వం, ఎడారితనం అనుభమవుతున్నాయి.

ఇప్పుడు '$A_2$' పాయింట్ యాత్ర సగం పూర్తయినట్లుగా తెలుస్తోంది. ఈ యాత్ర ఎటువంటిదో గాని, దీనిలో మరణించి ఉన్నటువంటి స్థానం దశగా ఉంది. జీవించి ఉన్న అనుభూతి నాకు లోన, బయట ఎక్కడా కలగటం లేదు. అయితే 'మాలిక్' ఎటువంటి కృపను అనుగ్రహించారు అంటే, దానివలన ఇటువంటి యాత్రలో కూడా ముందుకు సాగిపోవాలనే ప్రగాఢమైన కోర్కెతో ఉంచారు. నాకయితే ప్రతిచోటు, ప్రతిస్థానం యొక్క యాత్ర కాకుండా,

నా 'మాలిక్'ను కలుసుకోవాలని కోరిక ఉంది. నా 'మాలిక్' ఎలా ఉంటారో నాకు తెలియదు. నా 'శ్రీ బాబూజీ' నన్ను ఎప్పుడు, ఎలా కలుస్తారు? (Meeting) కలయిక మరియు (Separation) వేరగుట రెండూ కలిసిన ఒక మిశ్రమ దశగా ఆశ్చర్యంగా ఉంది. నాకు అనుభవమవుతున్నది ఇప్పుడు అనుభవంలాగా కాకుండా, ఒక అంగీకరించిన విషయంలాగా ఉంటున్నది. నేను మర్చిపోతూ ఉన్నాను. ఇది ఎటువంటి సాదా అనుభవం అంటే, దానిని అనుభవం అన్నా, అనకపోయినా ఒకటిగానే అనిపిస్తోంది. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 786

బరేలీ,

25.04.1963

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. అమ్మ ఆరోగ్యం ఇప్పుడు బాగుంది. నాకు కూడా ఆరోగ్యం బాగానే ఉంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

గత 5,6 రోజులుగా రోజంతా నిద్ర వంటి దశయే ఉంటున్నది. నిద్రిస్తున్నప్పటికి దశ నిద్రిస్తున్నట్లుగా ఉండటం లేదు. నిద్ర వస్తున్నట్లు అనిపించినప్పటికి, పండుకోవాలను కోరికగాని, అవుసరంగాని ఉండటం లేదు. మగతగా అసలు ఉండటం లేదు. అయినాగాని ప్రాపంచికమైన ఆనందంగాని, ఆకర్షణగాని లేవు. తరచుగా ఇది కూడా భ్రమ వంటి దశగానే అనిపిస్తున్నది. మరణించి ఉన్న దశలో జీవిస్తున్నట్లుగా అనిపిస్తోంది. వాస్తవం చెప్పాలంటే, జీవితం అనేది నాకు ఎక్కడా అనుభవంలోకి రావటం లేదు. అంతా శూన్యంగాను, ఖాళీగాను కనిపిస్తోంది. ఇంతకుముందైతే పాటలు, వాయిద్యాలు అంటె నాకు చాలా ఇష్టంగా ఉండేవి, కాని ఇప్పుడు వాటిమీద ఆసక్తి లేదు. అసలు అవి వినిపించకపోవటం లేదా వింటూనే మర్చిపోవటం జరుగుతోంది. ఒక నిశ్శబ్దగోళంలో ఉంటూ, దానిలో చక్కర్లుకొట్టుతూ అశాంతిగా ఉన్నట్లు అనిపిస్తోంది. పూర్తిగా నిర్జీవస్థితిలాగా ఉంది. దానిలో జీవం లేదు, ఆనందం లేదు, పయనించటం లేదు. ఈ విధంగా ఉన్నా కూడా 'మాలిక్' అనుగ్రహించినది ఎంతమాత్రం చెడుగా అనిపించటం లేదు. ఎక్కడ జీవితం, ఆనందం, పయనించటంలోను ప్రాణం లేదో అక్కడ నా పయనం సాగుతోంది. అయినా కూడా 'మాలిక్' అనుగ్రహించిన దానిని గురించి ఏమి అనిపించటం లేదు. అవన్నీ హృదయంతో స్వీకరించబడుతూ ఉన్నాయి. నేను ఒక (Circle) వలయంలోనే ఉంటున్నట్లుగా అనిపిస్తోంది. కొంచెం నిద్రమత్తులాగా అనిపించినప్పటికీ అంతా నిర్మలంగా (Freshness) ఉంటోంది. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 787

బరేలీ,

09.05.1963

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందని అనుకుంటున్నాను. చాలా రోజులుగా తమ ఆరోగ్యం గురించిన సమాచారం తెలియనందున కొంచెం దిగులుగా ఉంది. అమ్మగారు ఇప్పుడు బాగున్నారు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నా ఆత్మిక దశ, 'మాలిక్' దయతో 'వారి' అడుగుజాడలను అనుసరించియే పురోగమిస్తున్నట్లుగా అనిపిస్తోంది. ఇప్పుడు పూర్తిగా ఖాళీదశయే ఉంటోంది, ఎందుకో తెలియదు. తనదంటూ ఏమిలేని ఒక పకీరు వంటిదిగానే ఉంది. శరీరధారణ ఉన్నా కూడా అది నా శరీరంగా అనిపించటం లేదు. దానిని స్పర్శిస్తూనే ఉన్నాను, తింటూనే ఉన్నాను, బట్టలు ధరిస్తూనే ఉన్నాను, అయినా కూడా వాటి భావం ఒక్క క్షణమైనా స్ఫురించటం లేదు. ఇంతకుపూర్వమైతే, ఏదో కోల్పోయినట్లు ఉన్న దశ ఉండేది (అనగా విస్మృతి దశ), కాని ఇప్పుడు పూర్తిగా స్పృహ కలిగి ఉన్న స్థితియే ఉంటోంది. 'తమరే' నా ప్రాణధనం, కాని శరీరంతో, మనస్సుతో, ఆలోచనలో కూడా తమ నామాన్నే స్మరిస్తున్నప్పటికీ 'తమ'పట్ల నా వారు అను భావం కూడా కలగటం లేదు అన్నట్లుగా చూస్తున్నాను. అయినాగాని 'తమరు' నా జీవన సర్వస్వం అనుపించునట్టి దశగా ఇది ఉందని అనుకోండి. తనువు, మనస్సు మరియు లోన, బయట కణకణాల్లోను ఎప్పుడూ మాలిన్యం కాలేనటువంటి స్థిరత్వం చేకూరి ఉంది. కాని నా మనస్సు మాత్రం ఇప్పుడు ఎక్కువ అశాంతిగా ఉంటున్నది. అది ఏమిటో అర్థం కావటం లేదు. '$A_2$' పాయింట్ యాత్ర సమాప్తమైపోతున్నట్లుగా అనిపిస్తోంది. మరి కళ్ళు అయితే ముందున్న దృశ్యాన్ని దర్శించాలని అనుకుంటున్నాయి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 788

బరేలీ,

24.07.1963

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

గౌరవనీయులైన మాస్టర్ సాహెబ్‌గారికి తమరు వ్రాసిన ఉత్తరం ద్వారా తమ ఆరోగ్యం బాగుండలేదని తెలిసింది. అప్పటి నుండి తమ ఆరోగ్యం కొరకు 'మాలిక్' యొక్క శక్తితోపాటు ప్రార్థన చేస్తున్నాను. ఆ జబ్బును నా శరీరానికి అన్వయించుకోవాలని ఆలోచన చేస్తున్నప్పుడు, 'వారి' శరీరం మరియు నా శరీరం రెండూ ఒకటిగానే అనిపిస్తున్నాయి, ఎందుకో తెలియదు. 'తమరు' నాకు పరమ పూజ్యులు మరియు జీవన సర్వస్వం అయినప్పటికి, నేను 'తమ' సేవ చేయలేకపోతున్నాను.

బాబూజీ, నేనయితే నా ఆత్మిక దశను గురించి ఏమి తెలియనిదానిగా ఉన్నాను. ఏదో కొంత అర్థమవుతున్నాగాని ఏమి అర్థంకానట్లుగానే ఉంటోంది. వ్రాయాలని కోరుకున్నాగాని ఏమి వ్రాయలేకపోతున్నాను. ఈ విధంగా ఎందుకు అనిపిస్తోందో తెలియటం లేదు. చాలా నిదానంగా పురోగమిస్తున్నాను. నా మనస్సు మాత్రం విలవిల లాడుతోంది. '$A_2$' పాయింట్ యాత్ర సమాప్తమైపోయింది. దీనితో నా మనస్సు ఇంకా వికలమవుతోంది. స్థితి అంటారా, స్థితిలేని స్థితి, మరి ఇంకేమి వ్రాయగలను? అనుభవం మాత్రం కేవలం అంగీకరించిన విషయంలాగానే అనిపిస్తున్నది. అందువలన అర్థం చేసుకోవటానికి ఏమి లేదు. దీనిని తమరు మాత్రమే గ్రహించగలరు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 789

బరేలీ,

03.09.1963

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

15.08.1963వ తారీఖున 'తమరు' నన్ను దయతో '$B_2$' పాయింట్ మీదకు చేర్చారు. ఇప్పుడు నా దశ ఎలా ఉందంటే, ఆంతరికంలో సూక్ష్మాతి సూక్ష్మం వరకు ఎక్కడా ఎటువంటి గ్రంథిగాని, మాయగాని నామ మాత్రంగానైనా లేకుండాపోయాయి. నా లోలోపల ఎంతవరకైతే ఆలోచనగాని, అనుభవంగాని చేరగలవో, అక్కడి వరకు నా అనుబంధం పేరుకైన లేదు. అంతా సమానంగా అయిపోయింది. ఎక్కడైనా, ఎప్పుడైనా ప్రాణశక్తి ఉందని భావించినా కూడా అది తమ శ్వాసయే నా శ్వాసగా అయి ప్రవహిస్తున్నట్లుగా అనిపిస్తోంది. నాలో ఏమయ్యిందో ఏమో! నాలో ఒక దృఢత్వం వంటిది ఉత్పన్నమైంది. అది నిద్రిస్తూ ఉన్నట్లుగా ఉండాలి లేక నేనే దానివైపు గమనించకుండా ఉండాలి. ఎందుకంటే, ఎప్పుడైతే నేను తమరు చెప్పిన పని ఎంత చిన్నదైనాగాని చేయటానికి సన్నద్ధమవుతానో అప్పుడు దాని భావం కలుగుతుంది. నేను ఇప్పుడు ప్రయాణించటానికి ఎదురుగా మైదానం ఉంది. దాని అణువణువు నాకు పరిచయం ఉన్నదే అని ఎందుకు అనిపిస్తున్నదో తెలియదు.

ఇప్పుడు ఈ దశలో, నా లోలోపలనే ఏదో కలిసిపోతున్నట్లుగాను, ఏదో చొచ్చుకుపోతున్నట్లుగాను ఉంది. మొన్న ఒక్కసారిగా నాకు స్వల్పంగా కరెంట్ షాక్ వంటిది తగలగానే ఒక క్షణంపాటు స్పృహ (Sense) వచ్చింది. అయితే ఆ స్పృహలో చైతన్యం (Consciousness) ఉన్నా కూడా చైతన్యం లేనట్లుగానే (Unconscious) ఉంది. ఆ క్షణికమైన స్పృహ (Sense) నాదిగా ఉండి కూడా నాది కానట్లుగా ఉంది. నాకయితే పూజ లక్షణాలు ఏమిలేవు. ఆ క్షణికమైన స్పృహలో నేను చైతన్యవంతంగా అయి ఏదో బాగున్నట్లుగా అనిపించింది. ఎందుకో తెలియదు. అయితే నేను ఆ స్పృహను చక్కబెట్టుకునేంతలోనే నా స్థితి మళ్ళీ యధాతథంగా అయిపోయింది. అది అలా ఉండగా ఇప్పుడు నా స్థితి, ఆధ్యాత్మికతతో ఎటువంటి సంబంధం లేని మనిషిలాగా ఉంది. ఇటువంటి సామాన్యమైన స్థితియే నాదిగా ఉంటోంది. ఎందుకోగాని ఉన్నట్లు ఉండి ఒక్కసారిగా విసుగుదల వస్తోంది. దీనిపట్ల జాగ్రత్త వహించాలని నేను ప్రయత్నిస్తున్నప్పటికీ, 'మాలిక్' కృప లేకుండా నేను దీనిని జయించలేకపోతున్నాను. నేను తమవద్దకు వచ్చినపుడు మాత్రం నాకు ఆధ్యాత్మికతతో కొంచెం సంబంధం ఉన్నట్లుగా అనిపిస్తుంది, లేకపోతే ఆ సంబంధం ఉన్నట్లు అనిపించదు. నేను 'మాలిక్' చరణాలవద్దనే ఉండాలనే ధ్యాసతో తపించిపోతున్నపుడు, ఆధ్యాత్మికతతో సంబంధమే కాకుండా ఆ సమయంలో నాలో ఏదో అర్థం చేసుకోగల శక్తి మరియు గ్రహింపు శక్తి (Reading power) విశదమవుతాయి.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 790

బరేలీ,

24.09.1963

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు తావూజీకి వ్రాసిన ఉత్తరం చేరింది. సమాచారం తెలిసింది. తమరు ఆరోగ్యంగా ఉన్నారని తెలిసి సంతోషించాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశ ఏమిటోగాని, ఒక మూతపడిన సొరంగం తెరుచుకుంటూ ఉన్నట్లుగా ఉంది. లోలోపలనే ఏదో కోల్పోతున్నట్లు, అలాకాదు, లోలోపలికి చొచ్చుకుపోతున్నట్లు ఉంది. లోపల కూడా పదార్థం (Material) ఏమి లేకపోయినప్పటికీ, సూక్ష్మాతి సూక్ష్మమైనది కూడా అంతా కలిసిపోయి కరిగిపోతున్నట్లు ఉంది. ఈ దశ ఏమిటో 'మాలిక్'కే తెలియాలి. ఇది ఒక నూతన స్థితి అని, అనుభవానికి అతీతమైనదని మాత్రం తెలుసుకుంటున్నాను. అది తత్వాలకు (పంచభూతాలు) మరియు సూక్ష్మత్వానికి కూడా అతీతంగా ఉంది. ఈ దశ ఊహించనలవికానిది, వ్యక్తం చేయనలవికానిదిగా ఉంది.

ఒక రోజున ఎటువంటి కల చూశాను అంటే, దానిని జ్ఞాపకం చేసుకుంటూ ఉంటే, నా లోపల ఒక తేలికదనం వంటిదానికి ఉదాహరణగా అయిపోయింది. నేను చాలా సమయం తమవద్ద ఉంటున్నట్లుగాను, ఆ తర్వాత, ఎక్కడైతే గాలికి కూడా ప్రవేశం లేదో అటువంటి నిశ్శబ్ద ఎడారిలో ఉన్నట్లుగాను, అందులో మరణిస్తున్నట్లుగాను ఆ కలలో చూశాను. నేనయితే మరణించానుగాని శవం, ఈ శరీరం ఎక్కడా లేదు. ఎవరికీ తెలియనటువంటి, కనిపించనటువంటి కస్తూరీ మరణించింది. నేను చెప్పగలిగింది చెప్పాను. కాని దశను నేను పూర్తిగా వ్రాయలేకపోయాను.

ఇప్పుడు దశ ఎలా ఉందంటే, తేలికదనం కూడా అనుభూతికి రావటం లేదు. అది కూడా చనిపోయింది. ఈ స్థితి ఏమిటో తెలియకున్నది, కాని నేను ఇంతకుముందు కంటే ఎక్కువ అశాంతిగా ఉంటున్నాను. మనస్సు కుదుటపడటం లేదు. నిజం చెప్పాలంటే, నా మనస్సు, ఆత్మ అన్నీ మరణించాయి. దశ స్థిరంగానే ఉంది. మనస్సు అశాంతిగా ఉంది. ఇలా ఉంటే, నేను తమ జ్ఞాపకం ఎలా ఉంచుకోగలను? ఏదీ నా వశంలో లేదు. ఇప్పుడు పనులన్నీ చేస్తూనే ఉన్నాను. అందరితో నవ్వుతూ మాట్లాడుతూనే ఉన్నాను. ఎవ్వరైనా ఆహ్వానిస్తే వెళ్ళుతున్నాను. అయినా గాని దేనిలోను అభిరుచి లేదు, రుచి లేకపోవటమూ లేదు. అందుచేత ఎటువంటి ఉత్సవాలకు వెళ్ళినా, మనస్సు విసుగుదలగా ఉంటోంది. స్థితి శూన్యత్వం కంటె కూడా శూన్యంగా ఉంటోంది. దశ అంతా కూడా స్వయంగా శవంగా అయిపోయింది. లోన, బయట ఆచ్ఛాదనం (Covering) లేకుండా నగ్నంగా అయిపోయింది. శూన్యాతి శూన్యం, ఉదాసీనత కంటె ఉదాసీనంగా స్థితి ఉంటున్నది. ఇప్పుడు జీవించి ఉండటంలోని సంతోషంగాని, మరణంలోని దుఃఖంగాని లేవు. నా 'మాలిక్', నాస్థితి ఇలా ఉండగా, దేనిలోనూ నా మనస్సు లగ్నం కావటం లేదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన<br>
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 791

బరేలీ,<br>
22.10.1963

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందని అనుకుంటున్నాను. నా ఆరోగ్యం ఇప్పుడు బాగానే ఉంది. విచారించాల్సిన అవసరం లేదు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

'తమరు' దయతో నన్ను '$C_2$' పాయింట్ మీదకు చేర్చారు. ముందుకు వెళ్తే ఉన్నతితోపాటుగానే శక్తి కూడా పెరుగుతుందని 'తమరు' చెప్పారు. దానిని (Balanced State) సామ్యావస్థకు తెచ్చిన మీదట అభ్యాసీకి శాంతి చేకూరుతుంది. కల చాలా బాగుందని కూడా 'తమరు' చెప్పారు.

నా దశ ఇప్పుడు పూర్తిగా స్థిరపడి ఒక స్థాయికి వచ్చింది. దీనివలన దశ శాంతిమయంగా అయిపోయి చాలా బాగుంది. ఈ దశలో నిద్ర వంటి స్థితి ఉంటున్నది. ఈ స్థితి నుంచి నిద్రావస్థను తొలగించినట్లయితే, ఇంక పూర్తిగా అసలైన స్థితియే మిగిలి ఉంటుందని 'తమరు' చెప్పారు.

ఈ స్థితి ఎటువంటిదంటే, అలసిపోయిన మనిషి తన ఇంటికి చేరుకుని నిశ్చింతగా నిద్రపోయినట్లుగా ఉంటుంది. అయితే, అన్నివైపులా మరియు లోన, బయట, శాంతి మరియు సౌఖ్యాల సామ్రాజ్యం వ్యాప్తమై ఉండి కూడా, లోపల ఏదో మూలన ఒక తీవ్రమైన తపన తలెత్తుతుంది. ఏదైతే మానసిక బాధగా ఉన్నదో అది మనస్సులోనే ఉత్పన్నమై దానిలోనే కలిసిపోతుంది. ఒక పెద్ద పాత్రలో పాలు పొంగి నిలిచిపోయినట్లుగాను, బయటకు దొర్లిపోకుండా ఉన్నట్లుగాను నా స్థితి ఉంది.

ఇప్పుడు నా దశ ఎలా ఉందంటే, ఒకవైపు ఆత్మతృప్తి దశలో లీనమై తిరుగుతున్నట్లుగాను, మరొకవైపు నా కణకణం స్వయంగా తపన చెందుతున్నట్లుగాను ఉంది. శాంతి లేదు, మాటిమాటికి నా హృదయం మరియు కణకణం నుండి 'బాబూజీ', 'బాబూజీ' అనే పిలుపు వస్తున్నది, కాని నాకైతే వినిపించటం లేదు. ఎప్పుడైతే మరుపుస్థితి నుండి కొంచెం స్పృహలోకి వస్తుందో అప్పుడు ఒక మనిషి నీటిలో మునుగుతూ, తేలుతూ, ఈదుకుంటూ ముందుకు పోతున్నట్లుగా నా దశ ఉంటున్నది. మునిగినప్పుడు మరుపుస్థితి ఉంటుంది. మళ్ళీ పైకి తేలినపుడు తపన తపింపజేస్తుంది. అప్పుడు మరుపుస్థితి అవగాహనకు వస్తుంది. అలా కాకపోతే ఒక సమానదశగా ఉంటుంది. నా లోన, బయట ఇప్పుడు నా అవయవాల జ్ఞానం నాకు ఉండటం లేదు. అంతటా (Balanced State) సామ్యావస్థయే వ్యాపించి ఉంది. సామ్యావస్థ యొక్క సముద్రమే నా పాన్పుగాను మరియు (Simple conditon of Nothingness) సహజ శూన్యదశయే నా దుప్పటిగాను అయిపోయాయి.

ఉదయం నేను ఒక కల గాంచాను. అది కల అయినప్పటికీ దానిని గురించిన జ్ఞానం నాకు ఉంది. ఆ కలలో, నాకు బాగా దప్పిక కలిగింది. నేను, నాకు దాహంగా ఉంది, ఎవరైనా నీరు త్రాగించి దాహం తీర్చండి అని అంటున్నాను. అప్పుడు ఎవరో అదృశ్యంగా త్రాగటానికి నీరు అందిస్తూ ఉంటే నేను త్రాగుతూనే ఉన్నాను. అయితే ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఎంత త్రాగినా దాహం తీరటం లేదు. నీరు కూడా ఎంతో రుచిగా ఉన్నాయి, కనుక త్రాగుతూనే ఉన్నాను. చివరకు నీరు త్రాగుతూ  ఉండగానే నిద్రాభంగమైంది, ఆ తర్వాత కూడా దప్పిక ఉంది. అయితే నిద్ర లేచాక ఒక మంచి పవిత్రత వంటి దశ కలిగింది. దానిని వ్రాయలేను. ఇదంతా ఏమిటో తమకే తెలియాలి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

**ఉత్తరం సంఖ్య - 792**

బరేలీ,

08.11.1963

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందని అనుకుంటున్నాను. నా ఆరోగ్యం ఇప్పుడు కొంత పాడైంది. అయితే త్వరలోనే బాగవుతాను. 'తమరు' చింతించవద్దు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు దశ స్వయంగా నా అనుభూతికి దానంతట అదే వస్తే రావచ్చు, లేకుంటే నేను దానిపై ఏకాగ్రత నిలపటం సాధ్యం కావటం లేదు. దశ ఏదైనాగాని, సమస్థితిలేని, ఎక్కడా ఎటువంటి ఆటంకంలేని మైదానంలో నేను ఈదుకుంటూ వెళ్తున్నాను. ఈ దశ ఎటువంటిది అంటే, దీనిలో ఏకత్వంగాని, ద్వైతంగాని లేవని అనిపిస్తోంది. మొత్తం అంటే మొత్తమే! ఇంకా దానిలో అనుభూతి అనే ప్రస్తావనే లేదు. సముద్రం లేదు, మైదానం లేదు, కాని ఈదుకుంటూ పోతున్నాను. నాలో ధ్యానమనే మాటలేదు, ఏకాగ్రతను సాధించలేను, శాంతి, అశాంతి ఏమీలేవు, ప్రత్యేకమైన విషయం ఏమిలేదు. పూర్తిగా సాధారణ మానవీయ దశగానే ఉంది. కాని నా ఆంతరికం మాత్రం ఒక అద్దంలాగా అయిపోయింది. దానిలో నా ప్రియతముని రూపం కూడా ప్రతిబింబించటం లేదు. ఆ ఆంతరికం నాది కానేకాదు. ఒక రకమైన దశ ఉంది, అది ఏలాంటిది అంటే, దాని మూలంగా అన్ని దశల అనుభవం ఉంటున్నది. అదే నా లోన, బయట ఏర్పడి ఉంది. ఎందుకంటే, లోన, బయట అని చెప్పటంలో ఇప్పుడు నాది అంటే ఏదిలేదు. కాని ఒక శుష్కించిపోయిన (ఎండిపోయిన) దశ ఉంది. అది ఇప్పుడు తడవదు, ఎండదు. అది నా శుష్కించిన రూపంగా అయిపోయింది.

నా మాలిక్! ఇప్పుడు నావద్ద చిరునవ్వులు లేవు, అశ్రువులూ లేవు (అనగా విలాపంగాని, సంతోషంగాని లేవు). ఇప్పుడు నా ప్రియతమునికి కొల్లగొట్టి ఇవ్వడానికి ఏమీలేవు. అయినా కూడా లోలోపల ఏదో దశ కొల్లగొట్టుతూనే ఉంది. ఇప్పుడు 'మాలిక్'యే ఏదైనా అర్థమయ్యేట్లు చేయగలిగితేనే నాకు అర్థం చేసుకోగల శక్తి వస్తుంది. అంతేగాని నాకు శక్యం కాదు. ఈమధ్యన నేను ఎప్పుడైతే తమ చరణాల వద్దకు వెళ్ళానో, తమరు పూజ చేయించారో అప్పటినుండి దశ అద్భుతంగా ఉంటోంది. అయినప్పటికి నాకు బాగుంది ఏమిటో తెలియదు. అయితే నా మనస్సు మాత్రం దానిని సంతరించుకోవాలని అనుకుంటోంది. మైదానం అంతా చుట్టచుట్టుకుని నా హృదయంలోకి చేరిపోయినట్లుగాను, లోలోపలనే అంతా మ్రింగి వేయబడుతున్నట్లుగాను అనిపిస్తోంది. ఈ దశ ఎటువంటిది అంటే, ఈశ్వరుని అంశలు ఏవైతే ఉన్నాయో అవన్నీ కూడా నాలో కలిసిపోయినట్లుగా అనిపిస్తోంది. గతంలో నేను వ్రాస్తూ వచ్చినటువంటిది –నాకు ఎవరి స్వరూపం కనిపించటం లేదని, ఏదో నీడలాగా అనిపిస్తున్నదని అన్నదానికి బహుశా ఇదే కారణమై ఉంటుంది. అయితే ఇప్పుడు వాస్తవికత (రియాలిటీ) మాత్రమే ఉండిపోయింది. ఇప్పుడు నా ఈ దశ కారణంగా అన్నీ కనిపిస్తున్నాయి, అన్నీ అనుభవానికి వస్తున్నాయి. నాకు అనుభవం కావటానికి అవసరమైన దృష్టిగాని, కారణంగాని నాలో లేవు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 793

బరేలీ,
03.12.1963

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఇక్కడ అందరూ కుశలమే. అక్కడ తామందరూ కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నాలో ఇప్పుడు ఒక వింతైన దశ నడుస్తోంది. రాత్రి నిద్రిస్తున్నపుడు శరీరమంతా నిర్జీవంగా పడియున్నట్లుగా అనిపిస్తోంది. కళ్ళు తెరవగానే నిద్రమత్తు వదిలాక, పూర్తిగా స్పృహలోకి రాగానే 5,7 నిమిషాల తర్వాత, దానిలోకి జీవనం లేదా ఆత్మ తిరిగి వచ్చినట్లుగా అనుభవమవుతోంది. ఇలా ఎందుకు జరుగుతున్నదో తెలియటం లేదు. నాకు '$C_2$' పాయింట్ యాత్ర పూర్తయినట్లుగా అనిపిస్తోంది. హృదయమైతే పురోగతి కోసం ఆరాటపడుతోంది. ముందుకు

నడవాలంటే మనస్సు అశాంతిగా ఉంటోంది. దశ కూడా అశాంతిగా ఉంది. లోన, బయట అన్నీ కదలిక లేకుండా అయిపోయాయి. ఇంకా ఏమిటంటే, శరీరం యొక్క కణకణం శక్తివంతమైనట్లుగా అనుభవమవుతోంది. అయితే ఎక్కడా కదలికగాని, చైతన్యంగాని లేవు. మృత్యువు కూడా మరణించినట్లుగా ఉంది. నిశ్శబ్దమే అంతటా వ్యాపించి ఉంది. కాని లోన, బయట  కణకణం ఒక దివ్యశక్తితో సజీవమైనట్లుగా ఉంది. ఇప్పుడైతే మృత్యువులోను జీవనం మరియు జీవనంలో కూడా మృత్యువు కలిసి ఉన్నట్లుగా ఉంది.

ఇప్పుడు నా దశ ఎలా ఉందంటే, నా మమకారం లేదా ప్రేమ సంపూర్ణ విశ్వవ్యాప్తంగా అయిపోయినట్లుగాను, నేను దానిని ఆపలేనట్లుగాను అనుభవమవుతోంది. నా నాలుక కట్టడైపోయింది. మనస్సు, బుద్ధి, ఆలోచనలన్నీ అంతమైపోయాయి. తరచుగా ఏదైనా లేఖ వ్రాయాలంటే ఆలోచనలు కలగటమే అసంభవంగా ఉన్నటువంటిది, బహుశా ఈ కారణంగానే ఇప్పుడు ఏదైనా వ్రాయటానికి ఆరంభించినపుడు ఆలోచనలు రాకపోయినా కూడా ఎక్కడి నుంచో ఆలోచనా ధార కుమ్మరిస్తూ ఉన్నట్లుగా ఉంటుంది. అది ఏమిటో నాకు తెలియదు. ఎందుకోగాని, తరచుగా నాకు ఉదాసీనత చాలా ఎక్కువగా ఉంటోంది. అది ఉదాసీనత లేక గట్టిదెబ్బ అనేది తెలియదు కాని, దాని మూలంగా లోన, బయట పూర్తిగా అణగారి ఉంటోంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 794

బరేలీ,

01.01.1964

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం, కేసర్ ఉత్తరం తమకు చేరాయని అనుకుంటున్నాను. అమ్మ ఆరోగ్యం బాగుండలేదు. అయినా తమరు విచారించవద్దు. అది త్వరగానే కుదుటపడుతుంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశ ఏమిటోగాని, మనస్సు తరచుగా అత్యంత విసుగుగా అయిపోతున్నది. నా స్థానం ఇక్కడ కాకుండా మరెక్కడో ఉన్నట్లు అనిపిస్తోంది, కాని అది ఎక్కడో తెలియదు. ఈ తెలియకపోవటం అనేది కొన్ని సెకన్లు మాత్రమే, ఆ తర్వాత అది ఏదో దశ అయి ఉంటుందని అనిపిస్తోంది. అది కూడా కొన్ని సెకన్లు మాత్రమే వచ్చింది. కొన్ని రోజుల క్రితం అకస్మాత్తుగా ఏమి అనిపించింది అంటే, మొదట 1,2 సెకండ్లు కళ్ళెదుట కోటానుకోట్ల సూర్యుల కంటె కూడా అధిక తేజస్సుతో సమానమైన తేజస్సు అనుభవమైంది. తర్వాత ఎలాగో గాని, నేను దానిని మ్రింగేసినట్లు అయ్యింది. అదంతా జీర్ణమైపోయాక 10 నిమిషాల తర్వాతనే నేను యధాతథంగా అయ్యాను. ఆ విధంగా అయినా కూడా నా లోపల ఇప్పుడు తేజస్సుగాని, కాంతిగాని లేవు. చీకటి లేకపోయినాగాని కాంతి కూడా అనుభవానికి రావటం లేదు. దశ పూర్తిగా ఒక (Silent moderation) నిశ్శబ్ద సమతుల్యతలో ఈదుతూ లేక త్రాగుతూ ముందుకు పోతున్నట్లుగా అనిపిస్తోంది. అంతులేని ఉదాసీనతయే దాని ఫలితం అన్నట్లుగా ఉంటోంది. ఇది ఎటువంటి స్థిరమైనది మరియు నిశ్శబ్ద దశగా ఉంటున్నదంటే ఇక్కడ సుఖదుఃఖాలు అనగా ఇటువంటి ద్వైత భావాలు ఎన్నడూ జనించలేదన్నట్లుగా ఉంది. దశ అయితే నడుస్తోంది, కాని దానిలో బాగున్నదని అనిపించేది ఏమీ లేదు. 'మాలిక్' యొక్క కృప మాత్రమే దానిని నడిపిస్తూ ఉంది. '$C_2$' పాయింట్ యాత్ర పూర్తయింది. ఇప్పుడు నావద్ద శారీరక శక్తిగాని, తపోబలంగాని, మరే విధమైన బలంగాని లేవు. ఉన్నదల్లా నా ఏకైక ప్రియతముడైన 'తమరు' మాత్రమే.

నా దశ ఏమిటో తెలియటం లేదు. మధ్యమధ్యలో కలుగుతున్న మరపు అవస్థ ఏమిటో తెలియటం లేదు. ఆ స్థితిలో కూడా 'మాలిక్' నాకు ఏమి అనుగ్రహిస్తున్నారో చెప్పలేను. ఈ దశను గురించి నేను ఎవరిని ప్రశ్నించాలి? అంతటా వ్యాపించి ఉన్న ఈ దృష్టి ఎదుట ఎప్పుడూ ఎవరూ సంచరించటం లేదు. మరెవ్వరిని అడిగాలి? ఉదాసీనతలో మునిగిపోయి అశాంతితో ఉన్న నేను తేరుకుని కూడా ఈ ఎడారి వంటి మైదానంలో ఏమి ఆలోచించలేకపోతున్నాను. నాలో ఇప్పుడు ఎటువంటి తపన లేదు, దేనినీ అన్వేషించేది లేదు, ఎవరినీ కలుసుకోవాలనే తపన లేదు. నేను ఇప్పుడు గంభీరమైన మృదుత్వం యొక్క స్వరూపంగా ఉన్నాను. లోతైన ఉదాసీనతయే నా ఆంతరికంగాను, ఎడారితనమే నా బాహ్యంగాను ఉంది. నేను అశాంతితో ఉన్నాను. మనస్సులో విసుగుదల పాతుకుపోయింది. నేను నా ఉన్నతికి చెందిన తపనను నా హృదయంలో మాటిమాటికీ కల్పించుకుంటున్నాను. అయితే హృదయం ఇప్పుడు నునుపైన కుండలాగా అయిపోయి దానిమీద ఏమి అంటుకోవటం లేదు. అన్ని ఆలోచనలు, భావాలు, పట్టుదల అన్నీ కూడా సడలిపోతున్నాయి. మరి నేనేం చేయను?

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 795

బరేలీ,

07.01.1964

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందని అనుకుంటున్నాను. ఇక్కడ అందరూ కుశలమే. తమరు కూడా ఆరోగ్యంగానే ఉన్నారని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నేను మునిగి ఉంటే ఉదాసీన స్థితిలోను, పైకి లేస్తూ ఉంటే విసుగెత్తిపోతున్నట్లుగాను, దృష్టి సారిస్తే ఎడారి వంటి మైదానంలోను పడియుంటున్నట్లుగాను ఉంది. నేను శాంతంగాను లేను, అశాంతితోగాను లేను. ఒక స్థిరమైన మరియు సామ్యమైన తపన (Stable and balanced craving) మరియు విలాపం (Moaning) ఉంది.

నా స్థితి ఒక నునుపైన మట్టి కుండలాగా ఉంది. ధ్యానం, స్మరణ, ప్రేమ, వినయం, ఎటువంటి సాధన చేసినా గాని, దానిపైన ఏదీ నిలవనట్లే నా హృదయం మీద అవి నిలవటం లేదు. ధ్యానం చేస్తూ ఉంటే, అది కూడా మునిగిపోతూ ఉంది. నేను మాటిమాటికి మునిగిపోతున్నట్లుగానే ఉన్నాను. ఎందుకో తెలియదు కాని, నా హృదయం ఎడారిలాగా అయిపోయింది. స్థితి ఏమిటంటారా? అది ఎడారి మైదానంలాగా ఉంది. అప్పుడప్పుడు ఉదాసీనత యొక్క తలంపు నా స్థితిలో కలుగుతుంది. లేకపోతే ఎప్పుడూ ఎడారి మరియు నునుపైన మట్టి కుండ వంటిదే నా స్థితిగా ఉంటోంది. మునుగటమైతే మునుగుతున్నాను ఇటువంటి స్థితిలో, కాని నాకు ఏమి తెలియటం లేదు. ఎందుకంటే, నాకు ఆ మునక స్థితి యొక్క లోతు అంతుబట్టటం లేదు. ఆ మునక స్థితి నుంచి బయటపడగానే దానిని మర్చిపోతున్నాను. అప్పుడు మళ్ళీ ఉదాసీనత మరియు విసుగుదల స్థితికి (Monotonous and melancholy conditon) వస్తున్నాను. హృదయం యొక్క ఏదో మూలన కుమిలిపోతూ ఉంటోంది. కాని దాని స్థానంగాని, కారణంగాని తెలియనపుడు దానికి వైద్యం (పరిష్కారం అని అర్థం) ఏముంటుంది. సమర్పణ (Dedication) మరియు లయకు చెందిన సహజ అవస్థ ఏదైతే నాలో వ్యాపించి ఉండేదో, అది ఇప్పుడు జాడ లేకుండా పోయింది. దానిలో నాకు పరమానందం కలుగుతూ ఉండేది. ఆనందమైతే లేదు కాని, ఆ కుమిలిపోవటంలో నాకు కొంత అనుబంధం దొరుకుతుంది. ఆ అనుబంధమే నన్ను పూర్తిగా మునిగిపోవటం నుంచి లేదా శాశ్వతంగా నిద్రపోవటం నుంచి, నిరంతరం విశ్రాంతి పొందటం నుంచి నిరోధిస్తుంది. నేను అస్తవ్యస్తంగా ఉంటున్నాను. అందుకే ఈ కుమిలిపోవటం

నన్ను వేధిస్తోంది. ఇది ఎలా ఉందంటే, స్థితిలో నేను పూలతో కాకుండా ముళ్ళను అంటిపెట్టుకున్నట్లుగా ఉంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 796

బరేలీ,

29.02.1964

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నారాయణ దద్దాగారి ద్వారా తమ సంగతి తెలిసింది. తమకు మళ్ళీ కడుపునొప్పి వచ్చిందని తెలిసి బాధపడ్డాను. తమరు మందులు సరిగ్గా వాడండి. శీఘ్రంగా ఆరోగ్యవంతులవుతారు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

సుఖదుఃఖాలు ఇప్పుడు నాకు తెలియకుండా పోయాయి. ఈ దశ ఎటువంటిది అంటే, నావద్ద ఒక్క ప్రశ్న కూడా లేదు, ఉన్నది జవాబులు మాత్రమే. ఎవరైనా, ఏదైనా అడిగినా గాని నాకు భయం (Fear) కలగటం లేదు, అస్థిరత్వం (Instability) ఉండటం లేదు. హృదయంలో శక్తియే శక్తి ఉంటోంది. బలహీనత (Weakness) అంటే ఏమిటో మర్చిపోయాను. అయితే మృదువైన భావనలు మరియు ప్రేమ అందరిపట్ల వ్యక్తమవుతోంది. హృదయమనే సముద్రాన్ని లూటీ చేయబడటానికి ఆవేశమైతే ఉప్పొంగుతుంది కాని అలా లూటీకాబడటానికి ఏమీ లేదు. (అనగా అర్పించటానికి హృదయం పెల్లుబుకుతోంది కాని, అందులో అర్పితం చేయటానికి ఏమీ లేదు.) 'మాలిక్'కు చెందినది మరియు 'మాలిక్' ఇచ్చేదానిపైనే నా దావా (Claim) ఉంటుంది (అనగా నా అధికారం ఉంటుంది). ఇవన్నీ విద్దూరమైన విషయాలు, నాకేమీ తెలియవు. తమరు నాకేమీ తెలియజెప్పటం లేదు. స్వామి మరియు సేవకుడు అను భావమే లయమైపోయినట్లుగా ఉంది. ఇప్పుడు నేనేమి చేయాలో తెలియటం లేదు. 'మాలిక్' యొక్క మనోహర రూపం నేత్రజ్యోతిని కబళించి వేసింది. ప్రియతముని (Sweet-melodious sound) మధుర స్వరఝురి వీనుల (చెవుల) శక్తిని హరించి వేసింది. స్పర్శ కూడా నాకు అనుభూతి కావటం లేదు. నా మనస్సు మరియు ప్రాణాల యొక్క దీపపు వత్తినే (Wick of the lamp) ఎవరో దొంగిలించుకు పోయినట్లుగా ఉంది. అపరిశుభ్రమైన ఇంటి ఆవరణలో, చీకటిలో శూన్యంగా, ఒక ఉదాసీనురాలిగా నిద్రిస్తున్నట్లుగానో లేదా విచారంతో కూర్చున్నట్లుగానో ఉంది. బహుశా ఇది కూడా తప్పు ఏమో. దీనిని 'మాలిక్'యే నిర్ణయించాల్సి ఉంది. అయితే 'వారి' నిర్ణయం ఎటువంటిదైనా కావచ్చు. నేను 'వారి' దానినే అయినా, కాకపోయినా గాని, ఒక ఆర్తనాదం నా కణకణం నుంచి వస్తోంది. దాని వలన నా మనస్సుకు తృప్తిగా ఉంది. అది ఏమిటంటే, నా ఆత్మ యొక్క ప్రతి ప్రతిధ్వని నుంచి, 'తమరు' నావారు, 'తమ' మీద నాకు పూర్తి అధికారం ఉంది, కాని నేను ఎక్కడ ఉన్నాను? అని ఆక్రందనం వెలువడుతోంది. 'తమ' పవిత్ర పాదాలవద్ద, 'తమ' పావన హస్తకమలాల మధ్య 'తమ' హృదయంలో కలిసిసోయాను అనే దానిని కూడా 'మాలిక్'యే నిర్ణయించాల్సి ఉంది. నా అణువణువునా, కణకణంలోనూ దివ్యశక్తి ప్రవహిస్తోంది. ఒక్కొక్క అణువులోను కోటానుకోట్ల బ్రహ్మాండాల శక్తి ఉంది కాని, నా ఉనికియే నాకు తెలియకుండా ఉంది. ఇంకా నాకు అపరిమితానందం, శక్తి లేదా ఇంకేదైనా ఉంది అని నేను ఎలా చెప్పగలను? నేనయితే శూన్యమైన ఇంటి ఆవరణలో ఉదాసీనంగా మహాశూన్యమైపోయి ఆనందంగా కూర్చున్నాను. ఇదంతా చూస్తూ కూడా నాకు ఎటువంటి ఆశ్చర్యంగాని, అలౌకికత్వంగాని, దివ్యత్వంగాని లేవు. నేనయితే కస్తూరీని మాత్రమే, నేను నా 'శ్రీ బాబూజీ'నే కోరుతున్నాను.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 797

బరేలీ,

09.04.1964

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. చాలా రోజులుగా తమ సమాచారం తెలియలేదు. దిగులుగా ఉంది. దయచేసి వెంటనే తమ సమాచారం తెలియజేయండి. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇంతకుముందు నేను, అంగ అంగాల్లోను, కణకణంలోను కోటానుకోట్ల బ్రహ్మాండాల శక్తి ఉన్నట్లుగా ఉందని వ్రాశాను. అయితే ఇప్పుడు అన్ని వైపులా, లోన, బయట అంతా నిలకడగా ఉన్నట్లు ఉంది. తరచుగా హృదయం అనే నదిలో నుంచి ఏదో అందరికీ పంచిపెట్టాలనే ఉద్వేగం కలుగుతోంది. కాని దాని పగ్గాలు కూడా ఎవరో పట్టుకుని ఉన్నట్లుగా ఉంది. నిన్న డాక్టర్‌వద్దకు వెళ్తూ ఉండగా ఒక మృతుడ్ని చూశాను. అప్పుడు నేను కూడా పూర్తిగా మరణించినదానిలాగానే అనిపించింది. ఎంత ఖాళీ మరియు అమాయకమైన దశ ఉంటున్నది అంటే, నేను దానిని గురించి చెప్పదలచినట్లయితే దానినంతటిని మలినంగా చేస్తున్నట్లు అనిపిస్తోంది. అందుకని నేను యధాతథంగా మౌనంగా ఉంటున్నాను. నా మనస్సును, ప్రాణాల దీపపు వత్తిని (Wick of the lamp) ఎవరో దొంగిలించుకు పోయినట్లుగా ఉంది. మనస్సులో ఎటువంటి కోరిక జనించటం లేదు. నిరర్థకమైన జీవితంలో లక్ష్యం లేకుండా సంచరిస్తున్నాను. లోన, బయట ఎటువంటి శూన్య ఎడారిలాగా అయిపోయింది అంటే, ఎక్కడా ఎప్పుడూ ఏమి లేనట్లుగాను, ఇప్పుడూ లేనట్లుగాను మరియు ఇంకముందు ఎన్నడూ ఉండబోదు అన్నట్లుగాను ఉంది. అంతా సమాన స్థాయిలో నడుస్తోంది. దేని కారణంగానైతే అన్ని ఆధ్యాత్మిక గతులు అనుభవానికి వస్తూ ఉండేవో, అదే కారణంగా నా వాస్తవిక రూపంలో ఒక సమాన గతి వంటిది అనంతకాలం నుంచి నడుస్తూ వస్తున్నట్లుగాను, దానికి అంతమంటూ లేదన్నట్లుగాను అనిపిస్తోంది.

ఈ దశ ఏమిటో తెలియకున్నదిగాని, శరీరం అపార కష్టాలపాలైన తర్వాత కూడా ఎక్కడైతే అంతర్ దృష్టి సారించబడుతుందో, అక్కడ పరిపూర్ణ శాంతిసామ్రాజ్యం విస్తరించి ఉన్నట్లు ఉంది. దానిలోనే కలిసిపోతున్నాను. ఆధ్యాత్మిక యజ్ఞం పూర్తయిపోయినట్లుగా ఈ దశ ఉంది. శాంతి యొక్క హద్దు సమాప్తమైపోయినట్లు అనిపిస్తోంది. ఇప్పుడు దానిని శాంతి అని చెప్పినాగాని స్థితి యొక్క పరిపూర్ణతగా చెప్పనలవి కాదు. స్థిరత్వం యొక్క స్థితి కూడా సమాప్తమైపోయింది. అందుచేత దశ ఇప్పుడు స్థిరంగా ఉందని చెప్పటం కూడా దశను గురించి పూర్తిగా చెప్పినట్లు కాదు. ఇప్పుడు దశకు హద్దు, ఆది అంతాలు ఏమిలేవు. ఒక సమాన స్థాయిలో సూటిగా నడుస్తోంది. ఇప్పుడు దశలో లీనమైపోతున్నట్లు చెప్పటం కూడా సరైనది కాదు. అంతేగాకుండా ఇప్పుడు బయటపడటం, లీనమైపోవటం అనేవి ఎప్పుడూ అనుభూతికి రావటం లేదు. ఇప్పుడు ఇటువంటి స్థితినే కలిగి ఉన్నాను. ఇప్పుడు ఎటువంటి లీన దశ ప్రాప్తమైంది అంటే, అక్కడ నుండి మళ్ళీ ఎప్పుడూ ఎవరికీ ఉన్నతి చెందటం సాధ్యపడదు. ఇప్పుడింక మనస్సు, బుద్ధి, ఆలోచనల యొక్క వృత్తమే లేదు (అనగా వాటి కట్టుబాటే లేదు). అన్నీ ఈ విధంగా లీనమైపోయినట్లుగా అనిపిస్తోంది. ఇంక ఉన్నతి గురించిన ఆశయే లేదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 798

బరేలీ,

12.05.1964

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. ఆరోగ్యం ఇప్పుడు బాగుందని తెలిసి సంతోషించాను. ఈశ్వరుడు సదా తమరిని ఆరోగ్యంగా ఉంచుగాక! 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక స్థితిని వ్రాస్తున్నాను.

ఈ దశలో ఏమిటోగాని, మనస్సు అత్యంత శాంతంగా అయిపోయింది లేక ఏదో కారణం మూలంగా దశలో అదే నిరంతరం వ్యాపించి ఉంటోంది. దానిలో సంతోషంగాని, విషాదంగాని, మహనీయతగాని, అల్పత్వంగాని, ఆదుర్దాగాని, ధైర్యంగాని, అధైర్యంగాని లేవు. కాని ఎలా ఉన్నా, ఏమున్నాగాని నడక ఒకే విధంగా కొనసాగుతూ ఉంది. 'మాలిక్' చరణాలకు అర్పితమైపోయింది.

మొన్నటి నుంచి 'తమరు' నా శరీరానికి బలం చేకూర్చుతున్నట్లుగా అనిపిస్తోంది. అందువలన శరీరం చైతన్యవంతంగా అయ్యింది. ఉదాసీనత దశలో లోలోపలనే కలిసిపోయి, మనస్సు ప్రశాంతంగా ఉంది. ఉదాసీనత యొక్క దశ నాలోపల లోతుగా ప్రవేశించి విస్తరించినట్లుగా ఉంది. అందువలన నేను ఇప్పుడు ఉదాసీనంగా లేను, కాకపోతే ఉదాసీన దశ నాలో లీనమైపోయింది.

ఈ దశలో, నేను ఉన్నాను అనేది కేవలం ఒక ఊహ మాత్రమే అని చెప్పవచ్చు. అంతే కాకుండా, 'తమరు' కూడా నా ఆలోచనకు ఎప్పుడైనా ఊహా మాత్రంగానే వస్తున్నారు. ఆధ్యాత్మికతకు చెందిన స్థితి ఇదే. సత్యత్వం (రియాలిటి) అంతా యదార్థమేనా లేదా భ్రమ మాత్రమేనా అనేది నాకు అర్థం కాకుండా ఉంది. ఒక దశ మాత్రమే నిరంతరాయంగా నడుస్తోంది. ఇంకా ఏమిటంటే, దాని నుంచి తల పైకెత్తినపుడు, ఏదో ఆధ్యాత్మిక స్థితి ఉన్నట్లుగా అనిపిస్తోంది. కాని లోతుగా ఒకే విధంగా ప్రవహిస్తూ ఉంటే, ఆధ్యాత్మికత అనేది ఇసుమంతైనా ఉన్నట్లుగా లేదు. ఆధ్యాత్మికత యొక్క స్పర్శ కూడా నాకు ఎప్పుడూ కలగనట్లుగా ఉంది. ఈశ్వరుడు లేదా నా ప్రియతముడైన 'మాలిక్' యొక్క జాడ నాకు తెలియనట్లుగా ఉంది. అటువంటప్పుడు ప్రేమించటం ఎలా? నాలో తపన కూడా ఎప్పుడూ కలగనట్లుగా ఉంది. ఇప్పుడు నా వలన ఎటువంటి స్థితి కూడా కల్పించబడటం లేదు. ప్రాణులు, అప్రాణులు అన్నీ ఒకటిగానే అనిపిస్తున్నాయి. కాదంటే, ప్రాణులు, అప్రాణులు ఏవైనాగాని నాకు లెక్కకు రావటం లేదు.

ఇప్పుడు ప్రాణులు, అప్రాణులు అన్నీ ఒక నీడలాగా నాకు ఊహలో ఉండి కూడా, ఇప్పుడు నా గుర్తింపులోను, అనుభవంలోను, అనుభూతిలోను ఉండటం లేదు. పూజ నిమిత్తం కళ్ళు మూసుకోగానే లేదా 'తమ'కు చెందిన ధ్యానం కొంచెం ఆలస్యమైనాగాని, ఒక ఆక్రందనం వంటిది లోపల కలగ నారంభిస్తుంది. ఉండి ఉండి అంతస్సు నుంచి ఒక కేక వంటిది ఉత్పన్నమవుతోంది. ఈ కేకయే నాకు, గాఢ నిద్ర నుంచి లేచినపుడు కలుగు స్పృహ వంటి స్పృహను కల్పిస్తుంది.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 799

బరేలీ,

06.08.1964

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఆరోగ్యం ఇప్పుడు చాలా బాగుంది. స్వస్థత నిదానంగా చేకూరుతోంది. కనుక 'తమరు' నా గురించి విచారించవద్దు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నా ఆత్మిక దశ ఇప్పుడు చెల్లాచెదురుగా అయిపోయింది. దృష్టి లోపలికి సారించినప్పుడల్లా, లోన, బయట అంతటా ధ్యానం యొక్క రూపమే ఉన్నట్లుగా అనిపిస్తోంది. అలాకాదంటే, ధ్యానం కూడా ధ్యానావస్థ చెంది నాలో అంతటా చొచ్చుకుపోయినట్లుగా చెప్పవచ్చు. అయినా కూడా నాకు శాంతి లేదు. నా ఉదాసీనత తొలగిపోవటం లేదు. చనిపోవాలను కోరిక లేదు, తెలివి లేదు, జీవించాలనే లోభం (అనగ తపన) లేదు, అందుకు తగిన జ్ఞానం లేదు, అటుపైన తమకే తెలియాలి. నేనయితే కేవలం నా 'శ్రీ బాబూజీ' కొరకే ఈ ప్రపంచంలోకి వచ్చాను. వారికే చెంది ఉంటాను. నాకు ఇది మాత్రమే తెలుసు. నాకు, 'తమ' కష్టం మరియు సుఖం నావిగా అనిపిస్తున్నాయి, కాని నాకు చెందిన కష్టం మరియు సుఖం మాత్రం నావిగా అనిపించటం లేదు.

ఇప్పుడు ఏమయ్యిందో ఏమోగాని, తనువు, మనస్సు, మెదడు అన్నీ పూర్తిగా శూన్యావస్థలోకి వెళ్ళిపోయాయి. శారీరిక శ్రమ కూడా బలహీనపడిపోయినట్లుగా అనిపిస్తోంది. ఎవ్వరైనా కస్తూరీ, కస్తూరీ అని పిలిచినా గాని ప్రయోజనం ఏమి ఉండటం లేదు. కస్తూరీకి కస్తూరీ కనిపించటం లేదు. ఒక చేయి ఇంకొక చేతిని స్పృశించలేనట్లుగా ఉంది. తనువు, మనస్సు, లోన, బయట ఎక్కడ కూడా, ఒక్క కణంలో కూడా ఉత్సాహంగాని, ప్రేరణగాని ఉండటం లేదు. అనుభవం కూడా నిద్రిస్తున్నట్లుగా ఉంది. దేనివల్లనైతే ప్రేమ మత్తు కలుగుతుందో, అటువంటి ప్రేమ దశను ఎప్పుడూ దరిచేరలేదు. అయితే నా లోన, బయట, శరీరం యొక్క కణకణంలోను ఒక అదృశ్యమైన మాదగత వంటిది (ప్రేమ) అంతిర్నిహితమై ఉంటుంది. దానిలో స్పృహ కలగకపోయినా గాని, అప్పుడప్పుడు ఉత్సాహపరుస్తున్నట్లుగా ఉంటుంది. చల్లదనంగాని, వెచ్చదనంగాని లేవు, అయినప్పటికి అప్పుడప్పుడు స్వతహాగానే ఉత్సాహపరుస్తున్నట్లుగానే ఉంటుంది. స్పృహలేని స్థితిలోను, మగత స్థితిలోను, నాకు ఇటువంటి స్పృహ లేదా అనుభవం కలుగుతుంది. అలా కాకపోతే, నా తనువు, మనస్సు, లోన, బయట అన్నీ నిర్జీవంగా అయిపోతాయి. ఉదాసీనత స్వయంగా నా రూపంగా అయిపోయింది. అయితే నా స్వరూపం నా దృష్టికి రావటం లేదు. పూజలో కూర్చునపుడు చాలా బాగుందనిపిస్తోంది. అదేమిటోగాని, పూజలో కూర్చుండటానికి మనస్సు రావటం లేదు. పూర్తిగా ఉదాసీన మైదానం అంతటినీ నేను మ్రింగేసినట్లుగా ఈ దశ ఉంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 800

బరేలీ,
07.09.1964

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. చాలా రోజులుగా నేను తమకు ఉత్తరం వ్రాయలేకపోయాను. జలుబు, దగ్గు మూలంగా సాయంత్రం వరకు జ్వరం ఉంటోంది. నీరసం కూడా ఉంటోంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇదొక విచిత్రమైన దశగా ఉంది. పూజలో కూర్చున్నపుడు హృదయం చాలా బాగుంటుంది, కాని కూర్చుండగానే దాని నుంచి హృదయం పారిపోతుంది. కళ్ళు మామూలుగా మూసుకున్నట్లుగా మూసినా కూడ, ఒక శూన్య స్థితి వంటిది నా లోపల, బయట అంతా వ్యాపించి ఉంటోంది. దానిలో నేను పూర్తిగా లీనమైపోయినట్లుగా ఉంటుంది. ఇంకొక రకంగా చెప్పాలంటే, కళ్ళు తెరచి ఉంచినపుడు లేదా ఎల్లప్పుడు నాలో ఏ స్థితి అయితే పూర్తిగా ఏర్పడి ఉన్నట్లుగా ఉంటుందో అలా ఉంటుంది. **కళ్ళు మూసుకున్నాక సూటిగా నేను అనంత సముద్రంలోకి చొచ్చుకు**

**పోతున్నాను. ఇంకా ఏమయ్యిందంటే, కళ్ళు తెరచినా కూడా నాకు ఏమి కనబడనట్లుగా ఉంటుంది లేదా అది కనిపిస్తున్నట్లుగా ఒక భ్రమ వంటిదిగా ఉంటుంది. అయితే కళ్ళు మూసినపుడు లోపల ఉన్నదంతా కనిపిస్తుంది.** నాలో ఉన్న ఈ స్థితి తమరిలో ఉన్న స్థితి వంటిదే.

సంపూర్ణ నిర్మలత్వం, మృదుత్వం లేదా సరళత్వం లేదా పవిత్రత అన్నీ నేను త్రాగినట్లుగా అనిపిస్తోంది. ఏకాగ్రత అనేది ఇప్పుడు నాకు సాధ్యం కావటం లేదు. ఈ ఏకాగ్రత స్వయంగా నా రూపంగా అయిపోయి ఉండవచ్చు. ఎందుకంటే, నా రూపం ఒక గాజులాగా పారదర్శకంగా అయిపోయింది. వ్యవస్థ అంతా ఒక సీసాలాగా పారదర్శకంగా అయిపోయింది. కావాలనుకుంటే, ఎవ్వరైనా చూడవచ్చు. నేను ఎంతగా పవిత్రంగాను, స్వచ్ఛంగాను అయిపోయాను అంటే, అవి నా రూపంగా అయిపోయినట్లుగా ఉంది. ఈ రోజు ఉదయం నుంచి నా నాభికి సూటిగా 6 అంగుళాల దూరంలో తీవ్రమైన పోటు ఎడతెగకుండా ఉంది. అక్కడ ఒక చాలా లావుపాటి నరం జాగృతమైనట్లుగా ఉంది. నరాలన్నింటిలోను సంపూర్ణ పవిత్రత ప్రవహిస్తోంది. కణాలన్నీ ఈశ్వరీయ ప్రకాశంతో దేదీప్యమానంగా అయిపోయాయి. స్థితి ఎంత సరళంగాను, తేలికగాను ఉందంటే, దీనికి సాటియైనది, పోల్చదగినది ఏదీలేదు. దీనిని చెప్పటానికి తగిన మాటలు దొరకటం లేదు. కణాలన్నీ ఈశ్వరీయ ప్రకాశంతో నిండి ఉండటంతోపాటుగా ఈశ్వరీయ శక్తి కేంద్రంగా అయినట్లు ఉంది. ఈ దశ ఏమిటో, ఎటువంటిదో నాకు తెలియటం లేదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 801

షాజహాన్‌పూర్,
15.09.1964

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

ఆశీర్వాదాలు. నీ ఉత్తరం అందింది. నీ ప్రార్థనను ఆలకించినందుకు దైవానికి ధన్యవాదాలు తెలుపుతున్నాను. **ఏ అభ్యాసి భగవత్ సాక్షాత్కారం కొరకైన సాధనలో ముందుకు సాగిపోతూ ఉంటాడో, అనగా ఉన్నతి లేదా సామీప్యత చెందుతూ ఉంటాడో, అపుడు పవిత్రత, సాధన, అనుభవం మొదలైనవన్నీ 'ఆతని'లో లయమైపోతాయి. ఎందుకంటే, భగవంతునిలో ఈ విషయాలు ఏమీ ఉండవు.** ఇప్పుడు నీ దశ 'ఈశ్వరీయ దశ'.

మీ అందరికీ ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 802

బరేలీ,
26.09.1964

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం అందింది. చదివి సంతోషించాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశ ఏమిటో వింతగా ఉంది. నాకు జీవితం యొక్క హద్దులు తెలియటం లేదు. జీవితంలో ఇటువంటి మధ్యకాలం ఎప్పుడూ ఉండలేదు, ఎప్పుడూ ఉంటూ ఉండటం లేదు లేదా ఉండబోదు. అదే విధంగా తమరు

ఇప్పుడు నన్ను కలిశారు అని కూడా అనిపించటం లేదు, కాని దీనికి కూడా అంతు లేదు. నాకు అంటూ ఏమైన కొంతకాలం ఉందో లేదో తెలియదు. ఎందుకంటే, దానిని గురించిన జ్ఞానం నాకు లేదు. జన్మజన్మలు దాల్చుతూ మనం వస్తూ ఉంటాము అని అందరూ చెప్పుకుంటారు కదా! అందరిలాగానే నేను కూడా ఆ విధంగా చెబుతున్నాగాని నాకు అలా అనిపించటం లేదు. నాలో జీవనం అనేది లేనపుడు, తమరు లేకుండా నేను ఎప్పుడూ ఉండలేదని అనిపిస్తోంది. నా అంతరాత్మలోనో లేక నా లోపలనో ఎక్కడో ఏదో కరిగి కరిగి కలిసిపోతున్నట్లుగా ఉంది. అయితే అది శరీరానికి సంబంధించినది కాదు. అక్కడ ఏదో జరుగుతున్నది. నేను ఒంటరిగా ఏదో చూస్తున్నాను కాని దానిని మాటల్లో చెప్పటం కష్టమనిపిస్తోంది.

ఈ దశ ఏమిటో గాని, ఈ ప్రపంచంలో అసలు ఏమైనా ఉన్నదో లేక అంధకారం ఉన్నదో తెలియటం లేదు, ఏమి కనిపించటం లేదు. ఈ దశ ఎటువంటిది అంటే, అసలు ఈ ప్రపంచం అనేది ఉంది అనే ఆలోచన కూడా నా మనస్సులో లేదు. ఎప్పుడైనా సృష్టి రచన జరిగిందా, లేదా అనేది కూడా నాకు స్ఫురించటం లేదు. ఈశ్వరుడు లేక సేవకుడు, జీవుడు లేక బ్రహ్మ –ఈ విషయాలు కూడా నాకు అనుభవానికి రావటం లేదు. మనస్సులో అవి ఉన్నాయా లేవా అను విభేదం కూడా కలగటం లేదు. అంతా సాధారణ జీవితంగా అయిపోయింది. ఆధ్యాత్మిక దశ కూడా చాలా సామాన్యంగాను, సాధారణమైనదిగాను నడుస్తోంది. ఎప్పుడు కూడా ఎటువంటి కలవరం (Complexity) లేక సమస్యాత్మక (Perplexity) దశ తటస్థపడటం లేదు. ఇంక మామూలు దశయే నడుస్తోంది. నా ప్రియతమ 'మాలిక్' యొక్క రక్ష సదా ఈ కుమార్తెకు తమ కృప మరియు అభయహస్తం అనుగ్రహించినట్లు ఉంటోంది. ఈ రక్షణ నాకు ఆకాశం వంటి నీడలాగా ఉంది. అలాకాకపోయినట్లయితే, భూమి, ఆకాశం, వాయువు అన్నీ నా దృష్టి నుంచి అదృశ్యమైపోతాయి. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 803

బీదర్,
04.12.1964

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరం హైదరాబాద్‌లో అందింది. నా ఆరోగ్యం బాగానే ఉంది. ఇక్కడ మిషన్ వ్యాప్తి చెందటానికి పెద్ద ఎత్తున ప్రయాత్నాలు ప్రారంభమయ్యాయి. ప్రతి అభ్యాసి సోదరుడు దీనికొరకు ప్రయత్నిస్తున్నాడు. దీని ప్రచారం దినదినాభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్నాను.

మీ అందరికీ ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 804

బరేలీ,
16.11.1964

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నారాయణ దద్దాగారి ద్వారా తమ సమాచారం తెలిసింది. తమరు ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నారని తెలిసి సంతోషించాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

ఈ దశలో ఎలా ఉందంటే, నడుస్తున్నా, కర్తవ్యాలన్నీ సాధారణంగానే నిర్వహిస్తునే ఉన్నా కూడా మొత్తం శరీరం లోపల, బయట అంతా శూన్యంగా ఉంటోంది. నాలో ఇలా ఎందకు అనిపిస్తున్నదో తెలియదు కాని, 'తమరి'ని తలచుకోగానే హృదయం దోచుకోబడుతున్నట్లుగా ఉంటోంది. దాని నుంచి హృదయం రక్షింపబడాలని అనుకుంటోంది.

షాజహాన్‌పూర్ నుంచి తిరిగి వచ్చాక, ఎవరిచేతనైనాగాని పూజ చేయించినపుడు అతనికి దానిలో మనస్సు లగ్నం కావటం లేదు. స్థితి పూర్తిగా స్వచ్ఛంగానే ఉంటోంది, కాని దానిలో (Absorbness) గ్రహించేతత్త్వం ఉండటం లేదు. ఇంకొక విచిత్రమైన విషయం ఏమిటంటే, నేను నా స్థానం నుండి (Unstable) అస్థిరంగానే ఉంటున్నాను. అక్కడి నుంచి క్రిందికి చూసినట్లయితే ప్రతి మనిషి హృదయం పూజమీద లగ్నం కావచ్చు. కాని నేను క్రిందకు చూడదల్చుకోవటం లేదు. ఎందుకంటే, ఇలా చూడటం వలన నేను నా శ్రీ బాబూజీకి ఎంతమాత్రం విశ్రాంతి కల్పించలేను. నేను ఎక్కడ, ఏ స్థానంలో ఉన్నానో (ఉన్నత స్థితి) అక్కడే ఉంటే, నా 'మాలిక్'కు బాధ, బలహీనత నుంచి విశ్రాంతి దక్కుతుందని నాకు గట్టి నమ్మకం ఉంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 805

బరేలీ,
06.12.1964

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందని భావిస్తున్నాను. ఇక్కడ అందరూ కుశలమే. నా ఆరోగ్యం కూడా ఇప్పుడు బాగానే ఉంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ప్రస్తుతం నా స్థితి ఎలా ఉందంటే, స్వయంగా నన్ను నేను కోల్పోయినట్లుగా ఉంది. పూజాదికాలలోను, ఆధ్యాత్మిక క్షేత్రంలోను నేను చేయవలసింది ఏమి లేనట్లుగా ఉంది. నాకేమి పనిలేనట్లుగా చేతిలో చేయి వేసుకుని కూర్చుండిపోయాను. అయినా కూడా నడవటానికి సిద్ధమైన నా కాళ్ళు 'మాలిక్' అడుగుల దిశగానే ఉన్నాయి. ఒక విషయం ఏమిటంటే, సర్వస్వం తమదే, అని చెప్పినపుడు దాని ప్రభావం ఏమి ఉండటం లేదు. ఎందుకో తెలియదు. ఇంతకుపూర్వం అయితే, ఇటువంటి భావం నాలో ఒక నూతన ఉత్సాహం, నూతన చైతన్యం కల్పిస్తూ ఉండేది. కాని ఇప్పుడు నాకు చైతన్యం, అచైతన్యం రెండూ ఒకే అర్థాన్ని స్ఫురింపజేస్తున్నాయి. ఎందుకోగాని, నాకు ఇప్పుడు చదవటం, వ్రాయటం మీద, మాట్లాడటంలోను, మననం మరియు ధ్యానం యొక్క ప్రభావమే లేదనిపిస్తోంది. ఇప్పుడింక ఎడారియే నా నివాసం అన్నట్లుగా ఉంది.

పిప్పరమెంట్ వంటి చల్లని తుషారం శిరస్సులో అనుభవమవుతూ ఉంది. శిరస్సులో నరాలుగాని, మరేవైనా గాని కొంచెం చిటచిట లాడుతున్నట్లుగా అనిపిస్తోంది. అయితే నాకు ఎక్కడా, దేనితోనూ సంబంధం ఉండటం లేదు. జీవ శరీర సంబంధం కాని, స్వామి సేవకుని సంబంధంగాని, అలాగే నాకు, ఇతరులకు మధ్య ఉన్న సంబంధాల గొలుసుకట్టు / లంకె ఏమి తెలియటం లేదు. ఈ గొలుసుకట్టు లేదా లంకె అను దానిని నేను కేవలం దశను వ్యక్తం చేయటానికే వ్రాశానుగాని, నేనయితే ఒక వింతైన (Identity) అస్థిత్వం లేకుండా తిరుగుతున్నాను. దానిలో ఎటువంటి (Virtue) తత్త్వంగాని, (Element) గుణంగాని లేకుండా (Lifeless life) జీవనంలేని జీవనంగా జీవిస్తున్నాను. నేను 'ప్రపంచం' అని చెబుతున్నాను అంటే, అది మాటవరసకేగాని దానిని గురించిన ఎలాంటి ఆలోచనయే లేదు. ఒక వింతైన దశలో ఉంటున్నాను, అది ఏమిటంటే, ప్రేమ లేకుండా కలత చెందుతున్నాను. భక్తి లేకుండా, (Voice) స్వరం

లేకుండా ప్రాణంలో ఒక దప్పిక లాంటిది నిండి ఉంది. బాధలేని బాధ వంటిది ఆంతరికాన్ని కుమిలిపోయేట్లు చేస్తోంది. దానిలో ఒక నిట్టూర్పు, ఒక ఆక్రందన తలెత్తుతున్నాయి. అయితే ఇదంతా ఏమిటో, ఎందుకో అన్న దానికి జవాబు లేదు, అసలు అది ప్రశ్నయే కాదు. ఉన్నదేదో ఉన్నది. దానిని తెలిసివారు 'తమ'రే. నాకు అనుభూతి కలిగించేది 'తమ'రే.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 806

బరేలీ,

19.12.1964

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం అందింది. సమాచారం తెలిసింది. మిషన్ అయితే విస్తరిస్తుంది, దక్షిణ భారత్‌దేశంలోనే కాకుండా సమస్త ప్రపంచంలోను వ్యాప్తి చెందాలి, వ్యాపించి తీరుతుంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశ గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు చాలా రోజులుగా ఎటువంటి దశ నడుస్తున్నదంటే, పని ఏమీ లేదన్నట్లుగా ఉంది. అందువలన, ఇంటిపట్టునగాని, బయటగాని మనస్సు లగ్నం కావటం లేదు. మనస్సులో విసుగుదల లేదు, అయినా కూడా దేనిలోనూ లగ్నం కావటం లేదు. నాకు బయట, లోపల పని ఏమీ లేనట్లుగా ఉంది. కోపం చాలా తొందరగాను, ఎక్కువగాను వస్తోంది. నా జ్ఞాపక శక్తి కూడా తగ్గిపోతూ ఉంది. ఎందుకో తెలియదు. అంతటా ఒక పొగవంటి మసక వ్యాపించి ఉంది. ఇది కూడా 'మాలిక్' అనుగ్రహించిన పవిత్ర వస్తువే. ఈ జ్ఞాపకశక్తిలో 'తమరు' నా జ్ఞాపకానికి రావటం లేదు. ఏమైనా వ్రాయాలి అనుకుంటే ఆలోచనలు ఏమి రావటం లేదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 807

తిరుపతి,

27.12.1964

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరం, కేసర్ ఉత్తరమూ అందాయి. కేసర్ తన స్థితి బాగున్నట్లుగా వ్రాసింది. నీవు కలలో చూసిన దృశ్యం, లయ–అవస్థకు చెందిన మంచి దశకు చెందినది. ఇతరులకు నీరు ఇవ్వటం అనేది ఆ స్థితి యొక్క సాయుజ్యగతి.

దక్షిణ భారతదేశంలో ఈ పని పూర్తిస్థాయి నందుకోవటానికి 2 సంవత్సరాలు పడ్తుందని అనుకుంటున్నాను. మన మందరం బాగా శక్తివంచనలేకుండా కృషి చేసినట్లయితే ఇంకా ముందుగానే పని జరుగవచ్చు.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 808

బరేలీ,
04.01.1965

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం చేరింది. చదివి చాలా సంతోషమైంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నా దశ కొంత వింతగా ఉంది. మనస్సు విసుగ్గా ఉంటుంది. ఎందులోను లగ్నం కాదు, పని ఏమి లేనట్లుగా మనస్సు నిలకడ లేకుండా ఉంది. చేతిలో చేయి వేసుకుని కూర్చున్నాను. ఇంత విరక్తిగా ఉండి కూడా, ఎవరి ఇంటికి వెళ్ళినా ఒకలాగే ఉండటం వలన ఎక్కడికీ వెళ్ళి రావాలనిపించటం లేదు. ఇంకెక్కడా చోటు లేదన్నట్లుగా ఒకేచోటు ఉంది. ఇంకెక్కడా స్థానంగాని, రోడ్డుగాని, మార్గంగాని, లక్ష్యంగాని, కోర్కెగాని, ప్రేమగాని, భక్తిగాని, ఇంకేమీ లేవు. మాటల్లోను ఇంకా వ్రాయటంలోను ఒక విధమైన ధృఢత్వం మాత్రం హృదయంలో నెలకొని ఉంది. ఈ సహజ దశయే నా దశగా ఉంది. దశలో లోన, బయట ఎటువంటి ప్రభావం కలగటం లేదు. ఉన్నది ఉన్నట్లుగా నడుస్తోంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 809

తిరువణ్ణామలై,
01.01.1965

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరానికి జవాబు వ్రాశాను. అది నీకు చేరే ఉంటుందని అనుకుంటున్నాను. భగవంతునికి ధన్యవాదాలర్పిస్తున్నాను. ఇక్కడ తిరువణ్ణామలైలో నేను బాగా కృషి చేయాల్సి ఉంది. అది ఇంకా అభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్నాను. నేను ఇక్కడి నుంచి బయలుదేరే సమయానికి 70,80 మంది అభ్యాసులుగా ఉంటారని ఆశిస్తున్నాను. ఇక్కడ ఉన్న అభ్యాసులు నాకు అన్ని సౌకర్యాలు కల్పించారు. భగవంతుడు నీకు మంచి పురోగతిని కల్పించుగాక!

మీ అందరికీ ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 810

బరేలీ,
07.02.1965

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం చేరింది. సమాచారం తెలిసింది. తిరువణ్ణామలైలో మిషన్ పని బాగా జరుగుతున్నదని తెలుసుకొని చాలా సంతోషమైంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశలో ఎలా ఉన్నదంటే, ఎంతో మంది మధ్యలో నేను కూర్చున్నా కూడా ఒంటరిగానే ఉన్నట్లు అనిపిస్తోంది. నిరంతరం స్పృహలేని దశలో మాటిమాటికీ ఏదో (Jerk) కుదుపు వంటిది కలుగుతున్నపుడు అకస్మాత్తుగా నేను ఒంటరిగా ఉన్నానని అనిపిస్తోంది. నాకు ఎప్పుడూ, ఎవరి కంఠస్వరం వినిపించటం లేదు, ఎవ్వరి రూపమూ

కనిపించటం లేదు. నేను ఎప్పుడూ ఏ వ్యక్తితోను కలిసి ఉన్నట్లుగా అనిపించటం లేదు. ఈ ఒంటరితనంలో నా అస్తిత్వంగాని, 'తమరి' యొక్క ఉనికిగాని ఉన్నట్లుగా అనిపించటం లేదు. ఇంక, ఒంటరితనం యొక్క వ్యాపకంలో కోల్పోయి, మళ్ళీ తిరిగి రానటువంటి స్పృహలో కలిసిపోయి, సదా ఒంటరిగానే ఉంటున్నాను. లయావస్థ నాలో లయమవుతున్నట్లుగా అనిపిస్తోంది. లయావస్థ యొక్క మైదానమంతా నాలో లీనమైపోయినట్లుగాను, నేను కేంద్రంలో వేగంగా దూరిపోతున్నట్లుగాను ఉంది. ఇంక స్థితిని ఏమని వ్రాయను? ఆలోచనలనేవి ఎప్పుడూ రావటమే లేదు. మెదడు కొద్దిగా పని ఏమైనా చేస్తున్నదంటే, దాని నరాల్లో కొంత స్పందన కలుగుతూ ఉంది. ఈ దశ ఏమిటో తెలియకున్నదిగాని, మాటిమాటికీ నన్ను (Disturb) భంగపరుచుకుంటున్నాను. మాటల్లో నిమగ్నం చేసుకుంటున్నాను, వ్రాయటంలో లగ్నం చేసుకుంటున్నాను కాని, ఒంటరితనం మాత్రం నన్ను వీడటం లేదు, అలాగని ద్వైతమూ కలగటం లేదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 811

బరేలీ,

12. 02. 1965

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందని అనుకుంటున్నాను. ఇక్కడ అందరూ కుశలమే. 'తమరు' కూడా కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

సాక్షాత్కారంలో స్వార్థం ఏ రూపంలోను ఉండదు అని 'తమరు' చెప్పారు. అతడు సదా (Balanced state) సమస్థితిలోనే ఉంటాడు. ఎవ్వరైనా పాదాలు అంటినా లేదా కోపగించినాగాని అతడు రెండు స్థితులకు అతీతంగానే ఉంటాడు. హృదయానికి చివర (దిగువన) కుడివైపున ఒక పాయింట్ ఉంది. దానిమీద 15 నిమిషాలు (Transmit) ప్రాణాహుతి నిలిపినట్లయితే నిరంతరం ఆ స్థితి పైదిశగా ఉంటుంది. 'తమరు' దయతో పాయింట్ '$D_2$' యాత్ర ప్రారంభింపజేశారు. ఈ దశలో పూర్తిగా ఒక (State of silent Moderation) నిశ్శబ్ద సమతుల్యత యొక్క దశ మొత్తం నాలో వ్యాపించి, కలిసిపోయినట్లుగా అనిపిస్తోంది. ఒక (Inert) జడమైనది (Balanced state) సమతుల్యతా స్థితినంతటినీ పీల్చివేసినట్లుగా అనిపిస్తోంది. సమతుల్యత దశలో ఏదో దశ ఉంది అని నేను చెబుతున్నటువంటిది, కేవలం (Silent) నిశ్శబ్దం లేదా (Inert) జడం అనే చెప్పాల్సి ఉంటుందని అనిపిస్తోంది. దశ, శరీరం యొక్క అణువణువు, కణ కణాలన్నింటిలోను వ్యాపించి మళ్ళీ ముందుకు చూస్తున్నట్లుగా నేను గమనిస్తున్నాను.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 812

బరేలీ,

31. 03. 1965

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. చాలా రోజులుగా తమ నుంచి సమాచారం రానందున దిగులుగా ఉంది. దయచేసి వెంటనే తమ సమాచారం తెలపండి. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ రోజు తమరు నన్ను దయతో '$D_2$' పాయింట్ నుంచి తొలగించి '$E_2$' పాయింట్ మీదకు చేర్చారు. ఈ దశ ఏమిటోగాని శాంతిలోను, అశాంతిలోను ఒక విధమైన సమానత్వం ఉంటుంది. నాకు ఏమైందో తెలియదు, ఏకత్వం, ద్వైతం అని అంటున్నానుగాని, వాస్తవానికి నాకు రెండూ సమాన స్థితిలాగానే ఉంటోంది, కాని ద్వైతం అన్నది కనిపించటం లేదు. సుఖ దుఃఖాలు, శాంతి అశాంతులు అన్నీ ఒకే అర్థం కలిగి ఉన్నట్లు ఉంది. అయినా కూడా తమ స్వస్థత విషయంలో మనస్సులో దిగులు ఉంటోంది. నాకు అత్యధికంగా ప్రియమైనటువంటి (Surrender) శరణాగతి కొరకు ప్రయత్నిస్తున్నాను, కాని నేను దాని విధానాన్ని కనుగొనలేకపోతున్నాను. నేను ఏమి చేయాలో, ఎలా చేయాలో తెలియటం లేదు.

నాకు ఏమైపోయిందో ఏమిటో, నా 'శ్రీ బాబూజీ' నాకు అత్యంత ప్రియుడు, అయితే హృదయంలో ఇప్పుడు వారిని గురించిన ప్రేమ ఉప్పొంగటం లేదు. నా హృదయం, నా దృష్టి వారి ప్రియత్వంతోనే నిండి ఉంటాయి. ఇప్పుడు ఏమైందో ఏమోగాని, నా ఇంటిలో అనగా ఆంతరికంలో, మూలమూలన అన్నీ ఖాళీగా శూన్యంగా పడి ఉన్నాయి. పవిత్ర ప్రేమయే కణాలన్నింటిలోను వ్యాపించి ఉంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 813

బరేలీ,

05.04.1965

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమకు ఒక ఉత్తరం వ్రాశాను. అది తమకు అంది ఉంటుందని అనుకుంటున్నాను. ఇక్కడ అందరూ కుశలమే. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నా దశ ఇప్పుడు వింతగా ఉంది. శరీరమంతా, లోన, బయట అంతా శూన్యంగా ఉన్నట్లు ఉంది. శరీరం, మనస్సు, హృదయం అన్నీ శూన్యంగా పడి ఉంటున్నాయి. నాలో చైతన్యం (Activeness) ఏమీలేదు. అయితే ఎన్నడూ తరగనటువంటి ఒక విధమైన చైతన్యం ఉంటోంది. దానితో నాకు సంబంధం ఉన్నట్లుగా తెలియటం లేదు. నన్ను చైతన్యంగా ఉంచటానికని 'మాలిక్'చేత నాలో సమకూర్చబడిన చైతన్యమే (Activeness) అది, అని నాకు తెలుసు. నాలో ఏదో రహస్యస్థితి నెలకొని ఉన్నట్లుగా అనుభూతి కలుగుతోంది. ఈ రహస్యం ఏమిటో లేదా ఏదైనా స్థితియో నేను చెప్పజాలను. నా జన్మ జన్మాంతరాలుగా వస్తున్న పరంపర (గొలుసు) ఇప్పుడు కరిగిపోయినట్లుగా అనిపిస్తోంది. ఏదో రహస్యంగా ఉన్నటువంటిది ఇప్పుడు వెల్లడయ్యింది. అది నాకు కాదు గాని, నా 'మాలిక్'కి బాగా తెలుసు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 814

బరేలీ,

01.05.1965

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఇక్కడ అందరూ కుశలమే. అక్కడ తమరు కూడా క్షేమమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఎవ్వరితోనైనా ధ్యానం చేయించటానికి సన్నద్ధమైతే నేను రోదిస్తాను. ఇంకా ఏమిటంటే, లోపలికి నా దృష్టి సోకగానే బాగా ఏడ్పు వస్తోంది, అదేమిటో నాకు తెలియదు. 'తమరు' నా ఎదుట కనిపించినంత వరకు బహుశా స్థితి బాగుంటుంది. లోపల తమరు నాకు కనిపించటం లేదు. బహుశా అందుకే శరీరం ఏడుస్తుందో ఏమో, తమకే తెలియాలి. ఇప్పుడు ప్రపంచం యావత్తు, పైన, క్రింద, అన్నీ నా కనుసన్నల్లో ఉన్నట్లుగా ఉంది. ఇలా ఎందుకో గాని, నా ప్రియతముడు 'మాలిక్' నన్ను అత్యధికంగా ప్రేమిస్తున్నాడు, జ్ఞాపకం ఉంచుకుంటున్నాడు కాని, నేను మాత్రం హృదయ పూర్వకంగా ప్రేమించలేకపోతున్నాను. ఎందుకంటే, మరి మరి జ్ఞాపకం చేసుకుంటున్నా కూడా నేను మరచిపోతున్నాను. తరుచుగా ఎటువంటి స్థితి ఉంటుందన్నదంటే, ఏ 'మాలిక్' నయితే నేను పొందాలని అనుకుంటున్నానో, ఎవరి కోసమైతే నాలోని ప్రతి కోణం (స్థానం) వెదుకుతూ ఉంటుందో, ఎవరి దర్శనభాగ్యం కోసమైతే నా శరీరం యొక్క కణకణం కళ్ళుగా అయిపోయాయో అటువంటి నా 'మాలిక్'నే నేను మర్చిపోతున్నాను. అంతేకాదు, నా ఈ లక్ష్యం కూడా నన్ను మరపింపజేస్తోంది. ఇప్పుడు నా దశ ఎటువంటిదంటే, జ్ఞాపకం అను సిద్ధాంతాన్నే పూర్తిగా నేను మర్చిపోయినట్లయింది. ఎప్పుడు, ఎలా నా ధ్యాస నుంచి ధ్యానం యొక్క లక్ష్యం (ధ్యేయం) కూడా తొలగిపోయిందో నేను గ్రహించలేకపోయాను. ఇప్పుడు నేను ప్రయత్నిస్తున్నాను, కాని ప్రయత్నం చేయటాన్ని జ్ఞాపకం చేసుకుంటున్నపుడు మాత్రమే నేను చేయాల్సింది చేయగలుగుతున్నాను. బాబూజీ, నేను ప్రపంచంలో ఒక సాధారణ బాలికను. నాకు ఏదైనా లక్ష్యంగాని, సిద్ధాంతంగాని లేవు. ఇప్పుడైతే నాలోని నమ్రతస్థితి కూడా నాది కానట్లుగా ఉంది. కాని ఎప్పుడైనా 'మాలిక్' కల్పించినపుడు, అది అనుభవానికి వస్తుంది. ఆ తర్వాత మళ్ళీ మర్చిపోతాను. అయినా కూడా ఇది నాకు బాగున్నట్లుగానే అనిపిస్తోంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 815

బరేలీ,

18.06.1965

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమకు జాబు వ్రాసి చాలా రోజులైంది. దయచేసి క్షమించగలరు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నేను 'మాలిక్' యొక్క ఆంతరికంలోనే ఉంటున్నట్లుగా ఉంది. శరీరం, హృదయం, మనస్సు అన్నీ కూడా నాకు 'మాలిక్'లోనివే అన్నట్లుగా ఉంది. ఆ విధంగా వాటి అస్తిత్వమే లేనట్లుగా ఉంది. నాకు ఆధ్యాత్మికత లేక ఈశ్వరీయ స్థితిలోవి తప్ప ఇంకేమీ అనుభవం కావటం లేదు. నాలో ఏదో ఒక విషయం ఉండి అదే నా స్థితులన్నింటినీ చెలాయిస్తున్నట్లుగా అనిపిస్తోంది. ఏ స్థితిని గురించినైతే చెబుతానో, అదే స్థితి నా ఎదుట నిలుస్తుంది. దైవీయ ఆంతరికం అంటే ఏమిటో నాకు తెలియదు. అయితే నేను ఆ ఆంతరిక స్థితిని త్రాగుతూ పోతున్నట్లుగా అనిపిస్తోంది. తరచుగా, నేను పండుకొని లేచినపుడు చాలా దాహంతో ఉన్నట్లుగా ఉంటోంది. అయినా గాని నాకు నీరు త్రాగాలనే కోరిక ఉండటం లేదు. ఏ స్థితి కారణంగానైతే ఆధ్యాత్మికత అంతా ఉందో, ప్రకాశమంతా ఉందో, ఆత్మ ఉందో అదేమి లేనట్లుగాను, దాని అనుభవం నుండి ఒక సెకను కూడా దృఢమైన మనస్సుకు నచ్చనట్లుగా నేను గమనిస్తున్నాను.

ఈ దశ ఎలా ఉన్నదంటే, రాతి వంటి కళ్ళలో ప్రకాశం లేనట్లుగానే రాతి వంటి అనుభవంలో ఏమీలేదు. ఏదైతే నిరంతరం ఉందో అదే ఉంది. ఆ అనుభవం కూడా ఎల్లప్పుడూ ఉండటం లేదు. ఎటువంటి దశ ఉన్నదంటే,

ఇంతకుముందైతే నేను చూస్తూ ఉన్నా కూడా ఏమి కనిపించేది కాదు, అయితే ఇప్పుడు ఏమైందో ఏమో కాని, నేను అన్నీ చూడగలుగుతున్నాను.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 816

బరేలీ,
17.07.1965

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. ఇక్కడ అందరూ కుశలమే. నా ఆరోగ్యం కూడా ఇప్పుడు బాగానే ఉంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నేను శ్వాస తీసుకోవటంలేదన్నట్లుగా పరిస్థితి ఉంది. అందువలన ఎప్పుడైనా నెలకో, 15 రోజులుకో దృష్టికి వచ్చినపుడు చాలా వేగంగా శ్వాస తీసుకుంటూ ఉంటే శరీరంలో చాలా విశ్రాంతి కలుగుతోంది. అయితే ఈ ఆలోచన అప్పుడప్పుడు మాత్రమే వస్తుంది. వెనుకవైపు మెడలో, వెన్నెముక యొక్క పూసల్లో (ఎముకల్లో) పై నుంచి వీపు సగం వరకు తేలికపాటి బాధ లేదా అటువంటిది ఏదో ఉంటున్నది, తరచుగా పగిలినట్లుగా ఉంటోంది. శిరస్సు మీద తెలియనిది, అదృశ్యరూపంలో ఒక చేయి ఉంచినట్లుగా ఉంటుంది. కాని దాని స్పర్శ కూడా నాకు తెలియటం లేదు. ఒకవేళ ఆ హస్తకమలం కొంచెం పైకి లేపినట్లయితే దాని పూర్తి దృశ్యం నా గుప్పిటలోకి (అనగా దృష్టికి) వస్తుంది. అలా జరిగితే నాకు ఇష్టంగా కూడా ఉంటుంది. అదేమిటోగాని మనస్సుకు ఏ రంగుగాని, భావంగాని స్ఫురించటం లేదు. స్వయంగా నా రంగు కూడా తెలియటం లేదు. దీనివలన మనస్సులో గ్రహణశక్తి కూడా హరించుకుపోయినట్లుగా ఉంది. అందువలన ఏమి అంటనట్లుగానే ఉంటున్నాను. కాని సరియైన జాడగాని, ఊహగాని అందటం లేదు. నాలో దయ, మమకారాలకు చెందిన ఏ నది అయితే ఉప్పొంగుతూ ఉండేదో, అది కూడా ఇప్పుడు ఎటుపోయిందో తెలియటం లేదు. నా స్థితి అయితే ఒక సాధారణ గృహస్థు బాలికలాగా ఉండి, ఆమె చేతిలో స్వయంగా తయారు కావటంగాని, చెడిపోవటంగాని ఏమీ లేనట్లుగా (అనగా వశంలో లేనట్లుగా) ఉంది. కృప అనేది నన్ను స్పర్శించనట్లుగానే ఉంది. పూజ చేయటం, చేయించటంలో ప్రాముఖ్యత ఏమి లేనట్లు ఉంది. అంతా సమానస్థితియే ఉంటోంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 817

బరేలీ,
12.08.1965

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. నా ఆరోగ్యం ఇప్పుడు బాగానే ఉంది. తమరు కూడా కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు నాకు చెందిన ఏ స్థానం నా ఎదుట కనిపించటం లేదు. నేను ఎక్కడికో తప్పకుండా వెళ్ళాలనిగాని, త్వరగా వెళ్ళాలి అనిగాని, ఉత్సాహభరితమైన ఆలోచనలు కల్పించుకోవాలన్నాగాని హృదయంలో ఉత్పన్నం కావటం లేదు. గమ్యం లేకుండా, హృదయం లేకుండా, ఆలోచన లేకుండా కూడా ఏదో శక్తి నన్ను తనలోకి గుంజుకుంటోంది. ఈ అనుభూతియే నాకు బలం చేకూరుస్తోంది. కాని ఈ అనుభూతి ఎల్లప్పుడూ చైతన్యవంతంగా నాలో ఉండటం లేదు. అనుభూతియే కాదు, ఇంకా ఏమైనాగాని, చైతన్యం మరియు ఆత్మిక శక్తి, అన్నీ కూడా జాగృతావస్థలో ఉండటం లేదు.

ఇప్పుడు ఏదైనా పాయింట్ లేదా దాని యాత్ర జరుగుతున్నదా అను అంచనా కూడా నాకు కలగటం లేదు. ఏదో ఒక దృఢత్వం లోన ఉండి స్వయంగా పని చేస్తోంది. అది నాది కాకపోయినాగాని, నా దృష్టిని అటు మళ్ళించి ఉంచుతోంది. దానివలన ఈ స్థితి జరుగుతున్నది అని తెలుస్తోంది. నా స్థితిలోను, ఇతరులకు పూజ చేయించటంలో కూడా నేను ప్రేక్షకురాలిగానే ఉంటున్నాను. ఈ పట్టుదల మరియు దృష్టి (దృశ్యం)లోను ఇతరుల స్థితి వచ్చిపోతూ ఉంటే, పూజ జరుగుతున్నది అని అంగీకరించవలసి వస్తోంది, అలాగే విశ్వాసమూ కలుగుతోంది. యాత్ర జరుగుతున్నది అను విశ్వాసం ఉండి కూడా నేను పురోగతి చెందుతున్నాను అని తెలియటం లేదు. ఇంతకుముందైతే వడివడిగా పరిగెడుతున్నట్లుగా సదా అనిపించేది. ఇప్పుడు ఏమైందో తెలియదుగాని, ఇంతకుపూర్వమైతే నేను ఆధ్యాత్మికతలో లీనమై ఉన్నట్లుగా ఉండేది, అలాగే ఆధ్యాత్మికత అంతా నాలో కలిసిపోయినట్లుగాను అనిపించేది. ఆధ్యాత్మికత వంటి పరిపూర్ణస్థితిలో నేను లయమైపోతున్నట్లుగాను, ప్రతిస్థితి నాలో లీనమైపోతున్నట్లుగాను అనుభవమవుతూ ఉండేది. అయితే ఇప్పుడు నేను వాటినన్నింటినీ దూకిపోతున్నట్లుగా ఉంటోంది. నాకు ఈ విధంగా ఎందుకు అనిపిస్తోందో తెలియటం లేదు. అయినా కూడా ఇదేదీ నాకు పట్టనట్లుగా ఉంది. కేవలం ఒక విచిత్రమైన విశ్వాసం, ఒక పట్టుదల లోన జాగృతమయ్యాయి. ఇదే నా స్వరూపం, ఇదే నా స్థితి, ఇంక చెప్పటానికి ఏమీ లేదు, అర్థం చేసుకోవటానికి కూడా ఇప్పుడు నావద్ద ఏమీ లేదు. నా స్థితిని గురించి నాకు ఇప్పుడు ఏమి అనిపిస్తున్నది అంటే, స్థితి అనేది ఒక్కటే ఉంటుంది, అది నిక్కచ్చిగా ఉంటుంది అని. కాని ఎదుట ఉన్న అనుభూతి మారిపోయాక, స్థితి వృద్ధి చెందుతున్నదని, దానిలో చలనం ఉందని అనిపిస్తోంది. అలా అయి ఉండకపోతే దాని గమనం యొక్క జ్ఞానం ఉండేదికాదు, దాని స్పందన యొక్క అనుభూతి కూడా కలిగి ఉండేది కాదు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 818

బరేలీ,
04.09.1965

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఇక్కడ అందరూ కుశలమే. తమరు కూడా కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇంతకుపూర్వం నాకు లోన, బయట ప్రతికణంలోను ఈశ్వరుని జ్ఞాపకం ఇమిడి ఉండేది, కాని ఇప్పుడు ఈశ్వరుని గురించిన ఇష్టంగాని, జ్ఞాపకంగాని ఎక్కడా అంతుబట్టడం లేదు. అటువంటప్పుడు అశాంతి అను దానికి స్థానం ఎక్కడ ఉంటుంది? ఈశ్వరుడు ఎక్కడ ఉన్నాడు అనిగాని, ఎలా ఉన్నాడు అనిగాని, దక్కుతాడా లేదా అనిగాని మనస్సులో మెదలటం లేదు. అశాంతిని పొందటానికి నా హృదయంలో ఎక్కడో మారుమూల తపన ఉంది కాని, ఉత్పన్నం కావటం లేదు. లోన, బయట అంతటా కణకణం ఎంత మృదువుగా అయిపోయింది అంటే, అసలేమీ

లేదన్నట్లుగానే ఉంది. అది ఎందుకో తెలియదు. పూవుల కంటె కూడా అది తేలికగా ఉంది. నా కణకణాలన్నీ ఎలా అద్దంలాగా అయిపోయాయి అంటే, వాటిలో ఎవరి రూపమైనా ప్రతిబింబించునట్లుగా అయిపోయాయి, కాని నా రూపం ఏమిటో, ఎలా ఉందో తెలియదు. ఇతరుల రూపమే కాదు, అందరూ కూడా ఒకటిగా అయిపోయి, కణకణంలోను ఇమిడిపోయినట్లుగా ఉంది. కనుక దీనిలో చూడటానికి రూపం ఎక్కడి నుంచి వస్తుంది. అందువలన నేను నా జీవన సర్వస్వమైన 'తమ' దర్శనం పొందటానికి అశాంతిగా ఉన్నాను. ఎందుకో తెలియదుగాని, 'తమ'వద్దనే ఉంటూ కూడా ఎప్పుడూ దర్శనం పొందలేకపోతున్నాను. తమ దివ్య ఆంతరికంలోనే నేను ఉన్నాను అని నా ప్రగాఢ విశ్వాసం. తమ దివ్య ఆంతరిక స్థితియే నా కళ్ళు అన్నట్లుగా ఉంది. అలాకాకపోతే నా దృష్టియే నా స్వరూపం అని చెప్పవచ్చు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 819

బరేలీ,

13.09.1965

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశ ఏమిటో తెలియటం లేదు. ఎందుకంటే, నాకు (Conscious State) స్పృహ ఉన్న దశలో కూడా ఎప్పుడైనా స్పృహ (Consciousness) వంటిది వచ్చినట్లయితే, అప్పుడు అంతసేపు నేను ఇక్కడ లేనేమోనని అనిపిస్తుంది. ఇప్పుడు నిద్రపోయి లేచినపుడు 3,4 రోజుల నుండి మంచం కాళ్ళపట్టీమీద ఎవరో కూర్చున్నారని అనిపిస్తోంది. అతని రూపం ఏదీ తెలియటం లేదు. అలాగే ఎటువంటి భయం కలగటం లేదు. అప్పుడప్పుడు మేల్కొని ఉన్నప్పుడు కూడా ఇలాగే అనిపిస్తుంది. ఇలా ఎప్పుడైనా చాలా అల్పంగా అనిపిస్తుంది కాని రాత్రిపూట మెలకువ రాగానే చూస్తే కాళ్ళపట్టీవైపు మామూలుగానే ఉంటుంది. నిద్రకు ఉపక్రమించి మంచంమీద పండుకున్నప్పుడు ఏమి ఉన్నట్లుగా అనిపించదు. మెలకువ రాగానే ఎవరో మంచంమీదనించి లేచిపోయినట్లు అనిపిస్తుంది. అదేమి తప్పుకానట్లుగా దానిపట్ల నాకు ఎటువంటి ఆలోచనా కలగదు. నాకు మాత్రం నా 'మాలిక్'యే సర్వత్రా కనిపిస్తున్నాడు. మరొక రకంగా చెప్పాలంటే, 'అతడు' నా ఆలోచనగా మారిగాని, లేదా మనస్సు రూపంలోగాని నన్ను కలిసి ఉంటాడు. ఎందుకంటే, నేను నా ప్రియతముని ఎంతగా ప్రేమించాలో అంతగా ప్రేమించలేక పోతున్నాను కనుక. ఆ 'దయాకరుడే' నన్ను తనదిగా స్వీకరించాడు. నా 'శ్రీ బాబూజీ'ని నేను హృదయ పూర్వకంగా ప్రేమించగల సాహసం నాకు లేదు. ఇప్పుడింక "బినా భక్తి తారో, తబ్ తారిబొ తిహారోహై" అనిపిస్తోంది. అనగా భక్తి లేకుండానే నీవు ముక్తి కలిగించినట్లయితే అప్పుడు నీవు కీర్తివంతుడవుతావు, అని.

నా శరీరం యొక్క కణకణం అద్దంలాగా అయిపోయి మెరుస్తోంది, కాని దానిలో ఎప్పుడూ ఏ రూపం కనిపించదు, దాని నీడ కూడా పడదు. ఇప్పుడు పాయింట్ల యొక్క యాత్ర కూడా 'మాలిక్' కేవలం తమ (Vision) దృష్టితో చేయిస్తున్నారు. అలాకాకపోతే, నాలో ఇప్పుడు సాహసమే లేకుండా ఉంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 820

బరేలీ,

17.09.1965

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఒక ఉత్తరం పోస్టు చేశాను. అది తమకు చేరిందని అనుకుంటున్నాను. మొన్నటి నుండి దశలో మరి కొంత మార్పు వచ్చింది. అందులో నాకు అర్థమైనదానిని వ్రాస్తున్నాను.

'$E_2$' పాయింట్ యాత్ర ముగిసింది. నేను కణకణం అద్దంగా అయినట్లుగా వ్రాశాను, కాని అద్దం ఎలా ఉంది అంటే దానిలో మెరుపులేదు. అలాగని అంధకారంగా ఉందని చెప్పటానికి కూడా వీల్లేదు. 'నేను' అని చెప్పటంలో ఎటువంటి జీవ వస్తువు ఉన్నట్లుగా లేదు, అయినా కాని ఏదైనా జడం (Inanimate), చైతన్యం (Animate) వంటివి కూడా లేవు. నాకేమి తెలియనపుడు నేనేమి వ్రాయాలి? ఈ రోజు నా జన్మదినం. కాని నేను ఎప్పుడైనా జన్మించానా, ఈ భూమి పైకి వచ్చానా, పెద్దయ్యానా అనేది అర్థం కావటం లేదు. ఈ కథ ఏమిటో నాకు తెలియదు. తమకు మాత్రమే తెలుసు. నేను జడమో, చైతన్యమో కూడా నాకు తెలియదు. నేనయితే 'తమ' దివ్యాంతరికంలోనే ఉన్నాను. అదేమిటో కూడా నాకు తెలియదు, కాని నాకు యాత్ర చేయటానికి మైదానం కావాలి. నేను కదలకుండా ఒక్క నిమిషమైనా ఉండలేను. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 821

బరేలీ,

30.12.1965

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. 04.11.1965వ తేదీన తమరు దయతో '$E_2$' పాయింట్ దాటించి '$F_2$' పాయింట్ మీదకు చేర్చారు. అందుకు నేను ఎంతగా ధన్యవాదాలర్పించాలి అంటే, అందుకు యోగ్యమైన పదాలు లేవు.

నేను రాత్రి స్వప్నంలో కాకుండా స్వయంగానే కణకణం నా ఎదుట చెల్లాచెదురుగా పడి ఉన్నట్లుగా చూశాను. ఒక్కొక్క కణాన్ని ఆధ్యాత్మిక దృష్టిలో పరిశీలించినపుడు వాటిలో అనగా కణకణంలోను (Truth) సత్యం యొక్క ప్రత్యక్ష స్వరూపం వ్యాపించి ఉన్నదా అని అనిపించింది. అది నా నుంచి బయటకు వచ్చి విస్తరించింది. నా ఎదుట ప్రత్యక్షంగా ఉన్న ఈ దశ ఏమిటో తెలియలేదు. నేను స్వయంగా నావైపు దృష్టిపెట్టినపుడు, కేవలం నా స్వచ్ఛమైన రూపమే ఉన్నట్లుగా అనిపించింది. వాస్తవానికి నా దశ అంటూ ఏమిలేదు, కాని నేను మాత్రం ఒక పరిశీలకురాలిగా (సాక్షీభూతంగా) ఉన్నాను. చెప్పటానికైతే ఏదైనా చెప్పవచ్చు, కాని యదార్థం ఏమిటంటే, ఇప్పుడు నా సంబంధం ఆధ్యాత్మికతతోగాని, మరెవ్వరితోగాని లేదు. నాకు ఏమయ్యిందో తెలియదు కాని, నా సంబంధం యొక్క సంబంధం నా నుంచి తెగతెంపులైపోయినట్లుగా ఉంది. నేనయితే, నా 'మాలిక్' నన్ను ఈ ప్రపంచంలోకి ఎలా పంపించారో అలాగే ఉండిపోయాను. ఈ దివ్యమైన పట్టుదలయే నా వస్త్రంగా ఉంది. ఇప్పుడు నేను ఎలా ఉన్నానో అలా అందరి ఎదుట ఉన్నట్లుగా ఉన్న దశయే ఉంటోంది. ఏది ఉన్నదో అది ప్రత్యక్షంగా ఉంది. అదే నా దశ అనో, రూపమనో చెప్పండి. నాకు ఇప్పుడు జ్ఞానం లేదు. 'తమరు' నన్ను ఎలా తయారుచేసి ఉన్నారో అలాగే ఉన్నాను. దానిలో కూడా తమరు అందంగా అలంకరించిన స్థితులేవీ లేవు. ఇప్పుడు దివ్యమైన పట్టుదలయే నా వస్త్రం (ఆచ్ఛాదనం)గా ఉంది. లేకపోతే నేను సదా నగ్నంగానే ఉండి ఉన్నాను. ఎప్పుడూ అలాగే ఉంటాను. ఇప్పుడు నాలో జ్ఞాపకశక్తి యొక్క

సామర్థ్యం లేనందువలన, ఇది కూడా నాకు జ్ఞాపకం లేకుండా పోయింది. తమరు ఇప్పుడు ఏమి చేశారో కాని నేను ప్రతి విషయంలోను నిక్కచ్చిగా ఉంటున్నాను. 'తమరు' నా వారు అని నాకు తెలియదు. నా సృష్టికర్తయైన తమరు ఎక్కడ ఉన్నారో, ఎలా ఉన్నారో అంతా మర్చిపోయాను. కాని నేను లోలోపలనే అశాంతిగా ఉన్నాను. ఇది కూడా నాకు అప్పుడప్పుడు స్పృహలోకి వస్తుంది.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 822

మోడీనగర్,

04.02.1966

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. చాలా రోజులుగా తమ సమాచారం తెలియరాలేదు. ఈ కారణంగా ఇక్కడ మాకు అందరికీ దిగులుగా ఉంది. దయచేసి తమ సమాచారం వెంటనే తెలియజేయండి. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

కలయిక (Meeting) మరియు ఎడబాటు (Separation) మధ్య దూరాన్ని నాకు 'మాలిక్' ఒక సమస్థాయికి తీసుకువచ్చారు. అయినా కాని ఈ వ్యధ చెందిన మనస్సు, ఈ గాయపడిన ప్రాణం ఏదో కోరుకుంటోంది. ఏ కారణంచేతనో బాధపడుతోంది. ఇప్పుడు నా వాక్కు అవాక్కయిపోయింది. ఇలా ఎందుకు అయ్యింది అనే దానికి, నేను ఎందుకు అశాంతిగా ఉన్నానో అనే దానికి, నావద్ద సమాధానం లేదు. నేను ఏమైనా కోరుకుంటున్నాను అంటే అదీ చెప్పలేను. నావద్ద కేవలం సమాధానం మాత్రమే ఉంది కాని, ప్రశ్నలేదు. కాంతి లేకుండానే అంతా ప్రకాశవంతంగా ఉంది. ఏమి తెలియకుండానే అన్నీ నాకు తెలుసు. నాలో శక్తి లేకుండానే అన్ని శక్తిమయంగా ఉన్నాయి. కేవలం నేనుతప్ప అన్ని (Total peaceful) పరమశాంతిగా ఉన్నాయి. ఇంకేముంది, ఒక దివ్యమైన పట్టుదలయే నా వస్త్రం అన్నట్లుగా ఉంది. అలా కాకుంటే, నేను ఎలా ఉన్నానో అలాగే ఉన్నాను. 'నేను ఉన్నాను' అని, ఏదో శక్తి నన్ను నా వాస్తవిక స్థితి నుంచి మేల్కొల్పి చెబుతోంది. నా అస్తిత్వం యొక్క స్పృహను ఏదో ఒక అదృశ్య శక్తియే పలుమార్లు గుర్తుచేస్తోంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 823

మోడీనగర్,

04.03.1966

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నిన్న విష్ణుగారు ఇక్కడకు వచ్చారు. వారి ద్వారా తమ సమాచారం తెలిసింది. తమరు ఆరోగ్యంగా ఉన్నారని తెలిసి సంతోషం కలిగింది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు నాకు పూజలోనే కాకుండా లోపల ఎల్లప్పుడూ చాలా మంచిగాను, స్థిరంగాను ఒక సమాన దశ దృఢంగా ఉంటున్నది. అయినా కూడా నా మనస్సులో సంతోషంగాని, ధైర్యంగాని క్షణ కాలమైనా కలగటం లేదు. నేను ఎవరినైతే కోరుకున్నానో 'వారి'ని హృదయ పూర్వకంగా ప్రేమించి ఉండకపోవచ్చు. ఎంతగా ప్రేమలో

మునిగిపోవాలని అనుకున్నానో అంతగా తడిసిపోకుండా పొడిగా ఉదాసీనంగా అయిపోతున్నాను. నా దశ ఎలా ఉందంటే, నా మనస్సు ఎడారిని తుషారంగా భావించి ఉండిపోయింది. చెమ్మ (సరళమైన దశ) ఎంత మాత్రమూ కలగటం లేదు. తమరు నన్ను ప్రపంచంలో నీటికోడిలాగ ఉండమని వ్రాశారు. కాని నేనయితే ఇప్పుడు ఆధ్యాత్మిక సాగరంలో ఇటువంటి దశనే పొందుతున్నాను. ఎప్పుడు మునిగి ఉన్న స్థితి నుంచి బయటకు వస్తున్నానో అప్పుడు పొడిగానే ఉంటున్నాను. హృదయ రూపమైన కొంగులో 'తమ' జ్ఞాపకాన్ని బంధించి ఉంచి సంతోషించాలని అనుకుంటే, నాలో ఇప్పుడు అంత శక్తి కూడా లేదు. దశలో గమనం ఉన్నదో, లేదో నాకు తెలియటం లేదు. లోపల ఏదో గుంజుతోంది. దాని మూలంగా నన్ను (State of utter peace) పరమ శాంతిమయ దశ నుంచి కూడా పైకి లాగిపట్టుతోంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 824

మోడీనగర్,

26.03.1966

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. ఇక్కడ అందరూ కుశలమే. తమరు కూడా కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

20.03.1966వ తారీఖున 'తమరు' నన్ను '$G_2$' పాయింట్‌కు చేర్చారు. ఆంతరికంగా ఏదో తెలియని బాధ, మనస్సు యొక్క ఏ మారుమూలనో దాగి ఉంది. దాని జాడ ఒకప్పుడు తెలుస్తూ, మరొకప్పుడు తెలియకుండా ఉంటోంది. నాకు తెలిసో తెలియకనో ఏకాగ్రత అను పరమస్థితి (Highest state of concentration) ఒక సమానగతిలో నా స్వరూపంగా అయిపోయింది. నిద్రలోను, మెలకువలోను మనస్సు ఏకాగ్రతతోను మరియు దృఢంగాను ఉంటోంది. స్థితి ఎక్కడో పైకిలాగి ఉంచబడినట్లుగా ఉంటోంది. స్థితిని గురించిన జ్ఞాపకం లేదా స్పృహ ఎప్పుడైనా కలిగితే అప్పుడు అది పైకిలాగి ఉన్నట్లుగా ఉంటోంది. ఏ మూలం నుంచి ఆధ్యాత్మిక స్థితులు ఏర్పడుతున్నాయో అవి 'నేను'గా అయిపోయి నాలో ప్రవేశించిపోయాయి. ఇంక వాటి ప్రవేశం ఏమిటి? వాస్తవికత ఏదైతే ఉందో, అది కూడా నిలిచిపోయింది. అన్ని చిక్కులు తొలగిపోయాయా అన్నట్లుగా ఉంది. భ్రమ లేదా భయం జాడ లేకుండా పోయాయి. దృఢత్వం లేదా గట్టి పట్టుదలయే ఒక ఆంతరిక అచంచల విశ్వాసంగా అయి, అదే ఒక స్థితిగా తయారై నాలోకి దిగి వచ్చింది. స్వయంగా నా ప్రియతమ 'మాలిక్'యే దశ రూపంలో నాలోకి ప్రవేశించినట్లుగా అయ్యింది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 825

మోడీనగర్,

16.05.1966

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నారాయణ దద్దాగారి ద్వారా తమ సమాచారం తెలిసింది. తమకు కడుపులో నొప్పి తిరగబెట్టిందని తెలిసి చాలా బాధపడ్డాను. దయచేసి తమరు మందు విధిగా వాడుతుంటే త్వరగా కోలుకుంటారు.

'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశలో ఎలా ఉందంటే, నాలో స్వయంగా ఉత్పన్నమవుతున్న ఆలోచనలు, అవి నన్ను స్పర్శించటం లేదు. నేను 'మాలిక్' జ్ఞాపకాన్ని హత్తుకుని ఉండాలని అనుకుంటున్నాను. కాని దాని స్పర్శ కూడా కలగటం లేదు. ఆలోచన ద్వారా 'తమరి'ని పట్టుకుని ఉండాలనుకున్నాను కాని, అది కూడా నాకు సాధ్యపడటం లేదు. నా 'మాలిక్'ను నా నేత్రాలల్లోను, కనురెప్పల్లోను కరగించి లోపలనే నింపి ఉంచాను. ఈ విధంగా చేసిన కూడా విజయం సాధించలేకపోయాను. అయితే, నా 'మాలిక్'కు చెందిన అన్నింటిపైనా నాకు హక్కు ఉంది. నాకు దృఢ విశ్వాసం ఉంది, అయితే నా మీద కాకుండా 'వారి' (మాలిక్) అభీష్టం మీద ఉంది.

ఇప్పుడు ఇంకొక నూతన దశ ఏముంది అంటే, ఒక్క క్షణంలోనే బాగా స్పృహలేని దానినిగా అయిపోతున్నాను. కొద్ది సమయం తర్వాత నాకు ఏమి జరిగిందో గ్రహించలేకుండా ఉన్నాను. మైండ్ ఎక్కడికో ఎగిరిపోయినట్లుగా అనిపిస్తోంది. ఇప్పటివరకు నేను దీనిని, బహుశా బలహీనత వలన అయి ఉంటుందని భావిస్తూ వచ్చాను. కాని ఇప్పుడు ఇది ఏదో స్థితియై ఉంటుందని గట్టి నిర్ణయంతో ఉన్నాను. ఎందుకంటే, మైండ్ ఒక్క క్షణానికే ఏదో లోతైన స్థితిలోకి మునిగిపోతోంది. స్పృహ వచ్చాక కూడా నాకు ఏమి జరిగిందో జ్ఞాపకానికి రావటం లేదు. ఒకసారి నేను పడిపోగా ఇప్పటివరకు ఎప్పుడు, ఎలా జరిగిందో, ఏదైనా దెబ్బ తగిలిందో, బాధ ఉందో అనేది నా దృష్టికి రావటం లేదు. ఇటువంటి (State of deep unconsciousness) లోతైన స్పృహలేమి దశ బహుకొద్ది సమయానికి మాత్రమే కలుగుతుంది. ఆ తర్వాత ప్రపంచం నాకు క్రొత్తదిగా అనిపిస్తుంది. ఇంక ఏమిటంటే, అంతర్ దృష్టిలోను, బాహ్య దృష్టిలోను ఏ భేదం, ఎటువంటి సామాన్య స్థితిలోను ఉండటం లేదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు తెలుపుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 826

మోడీనగర్,
18.05.1966

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ సమాచారం తెలిసింది. ఇప్పుడు తమరు ఆరోగ్యంగా ఉన్నారని తెలిసి సంతోషంగా ఉంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక స్థితిని గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు నా దశ ఏమిటంటే, స్వప్నంలో నేను తమతో సంభాషిస్తున్నాగాని, తమ ప్రశ్నలకు జవాబులు చెపుతున్నాగాని, అవి నా పూర్తి జ్ఞానంతోనే జరుగుతున్నట్లు అనిపిస్తోంది. అయితే ఆ సమయంలోని ఆ స్పృహయే నాకు (Real Consciousness) అసలైన స్పృహలోకి వచ్చినట్లుగా అనిపిస్తోంది. అంతేగాని ఇంకేమి లేదన్నట్లుగా ఉంది. ఒక సమాన గతి (నడక), ఒక సామాన్య స్థితి నడుస్తున్నట్లుగా అనిపిస్తోంది. ఇంకా స్థితి ఎలా అనిపిస్తోంది అంటే, అది గమ్యం (లేదా గమ్యస్థానాన్ని) నా కొంగు పట్టుకుని దృఢంగా ఉన్నట్లు అనిపిస్తుంది. కాని నాకు మాత్రం దానిని చూసే తీరిక లేకుండా ఉంది. ఎందుకంటే, నేను నా 'శ్రీ బాబూజీ' వద్దకు చేరుకోవాల్సి ఉంది, వారిని పొందాల్సి ఉంది. నా 'మాలిక్' యొక్క కృపను చక్కపెట్టుకోవటానికి, కృతజ్ఞత తెలుపటానికి నాకు శక్తి లేకుండా ఉంది. 'అతని' మీద ఇప్పుడు ఫిర్యాదులు ఏమి లేవు, ఎందుకంటే, నేను పూర్తిగా నా 'మాలిక్'కు చెంది ఉన్నాను. 'తమరు' నా వారుగా నేను చూస్తున్నాను. స్థితులతో నాకు సంబంధం లేకుండా ఉంది, అయితే అనుభవిస్తూ ఉంటాను.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 827

మోడీనగర్,

19.06.1966

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందని అనుకుంటున్నాను. ఇక్కడ అందరూ కుశలమే. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

పని అంతా ఈ విధంగా లీనమైపోయే స్థితిలోనే జరిగిపోయింది. అది నాకు తెలియదు. తెలుసుకోవాలని కూడా అనుకోవటం లేదు. నా స్థితి అయితే లోలోపలనే క్రమబద్ధమైపోతూ ఉంది. దానిని చూడటానికి తగిన తీరిక నాకు ఉందా లేదా అనేది వేరే విషయం. నేనైతే దానిని సూటిగా చూస్తునే ఉన్నాను కాని, మరొక వంక, దేనికైతే ఒక హద్దు లేదా తీరం అంటూ లేదో, దేని జాడనైతే కేవలం నా 'మాలిక్' కృపయే నాకు కల్పిస్తూ ఉందో, అటువంటి దానిలో అనగా అటువంటి లీనమవ్వటంలో నేను లీనమై ఉంటున్నాను. అలా కాకపోతే, మానవుని నేత్రాలలో ఇంత ప్రకాశం ఎక్కడ ఉంటుంది. ఆంతరిక దృష్టి కూడా లోనికి సంబంధించినంతవరకే చూడగలదు. అటుపైన 'మాలిక్' యొక్క దివ్య దృష్టియే సహకరిస్తుంది.

లీనమయ్యే స్థితిలో నేను లీనం కాకుండా ఉంటున్నాను, కాని ఆ లీనత్వమే నన్ను తనలో లీనం చేసుకుని ఉంటోంది. అదే నన్ను తనలో మునిగి ఉండేట్లుగా బలవంతం చేస్తోంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 828

మోడీనగర్,

25.07.1966

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఆరోగ్యం ఇప్పుడు బాగుండటం లేదు. దానిని గురించి తమరు బాధపడ వద్దు. త్వరలోనే నేను స్వస్థత పొందుతాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ రోజు 'తమరు' దయతో నన్ను '$H_2$' పాయింట్ మీదకు చేర్చారు. అందుకు అనేక ధన్యవాదాలర్పిస్తున్నాను. 'తమ' కృప ఇలాగే ఈ దీనురాలైన కుమార్తె మీద ఎప్పుడూ ఉండాలి, ఉంటుంది కూడా. నేను తప్పకుండా నా 'మాలిక్'ను చేరుకుంటాను. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 829

మోడీనగర్,

12.09.1966

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నాకు ఇప్పుడు స్వస్థత చేకూరింది. బలహీనత కూడా క్రమక్రమంగా బలహీనపడుతోంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు నా దశ ఎటువంటిది అంటే, పవిత్రతను కూడా పవిత్రవంతం చేసేదిగా ఉంది. భక్తికి కూడా మాధుర్యం చేకూర్చేదిగా ఉంది, అది స్వయంగా (Tasteless) రుచి లేనప్పటికీ. ఈ స్థితి ఏమిటో తెలియటం లేదు. ఎలా ఉంది అంటే, సాక్షాత్కారం (Realisation) లేదా సమస్త ఆధ్యాత్మికతను పిండి పారబోసి, అప్పుడు స్థితి ఏమిటో చూడు అన్నట్లుగా ఉంది. దశ యొక్క ఆనందం ఏమిటంటే, అది స్వయంగా ఎటువంటి దశ కాదు. దశ ఎటువంటిది అంటే, అది అన్ని దశలను కలిగించగలదు, కాని అది స్వయంగా దశయే కాదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 830

మోడీనగర్,

17.11.1966

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మికదశను గురించి వ్రాస్తున్నాను.

మొన్న రాత్రి కలలో 'తమ'తో (Self surrender) ఆత్మ సమర్పణ మరియు ఇతర విషయాలను గురించి చర్చిస్తూ ఉన్నాను. వాటిలో కొన్నింటిని నేను వ్రాశాను కూడా. ప్రకృతి నాతో ఏదో పని చేయించుకొనాలని అనుకుంటున్నట్లుగా నాకు అనిపిస్తోంది. కాంగ్రెస్ పక్షంవైపుగా నా దృష్టి ఉంటోంది, కాని 'మాలిక్' ఆజ్ఞ కోసం నేను నిరీక్షిస్తున్నాను. ఒక విధంగా నేను ఈ సంఘర్షణలు, ఉద్రిక్తతలు అన్నీ శాంతింపజేయగలను, అని అప్పుడప్పుడు అనిపిస్తుంది, కాని 'మాలిక్' ఆజ్ఞ లేకుండా కాదు.

నా ఆత్మిక దశ అయితే దివ్యమైనదిగా అనిపిస్తోంది. నా నివాస స్థానమే మారిపోయినట్లుగా అనిపిస్తోంది. నేను ఎక్కడ ఉన్నానో, నేను ఏమిటో నాకు తెలియటం లేదు. నేను దేనినో ఛేదించుకొని దాటి పోయినట్లుగాను, అదే నా వ్యాపక (విస్తరణ) స్థానంగా అయిపోయింది అన్నట్లుగాను ఉంది. నేను '$H_2$' పాయింట్ యాత్ర చేస్తున్నాను. అది కూడా పూర్తిగా తెరచుకుని నా ఎదుట విస్తరించి ఉన్నట్లుగాను, నేను నడిచిపోతున్నట్లుగాను ఉంది. అయితే నేను వ్రాసినటువంటి ఆత్మిక స్థితి కొంచెం వేరుగా ఉంది. పవిత్రత అంతమైపోయినట్లుగా ఉంది. ఈ స్థానంలోనే అది వెల్లడి అయినట్లుగా ఉంది. సామ్యావస్థ యొక్క హద్దును ఛేదించుకుని దాటిపోయి నేను వ్యాపించి పోయినట్లుగా అనుభవమవుతోంది. నేను ఈ స్థితిలో 'ఆధ్యాత్మికత' అను శబ్దం జోడించాలని అనుకోవటం లేదు. ఎందుకంటే, అది పూర్తిగా సరైనదికాదని, మూర్ఖంగా ఉంటున్నట్లు అనిపిస్తోంది. స్థితిని నేను ఈ విధంగా పేర్కొన్నాను, సరైనదేదో తమకే తెలుసు. ఎందుకంటే, స్థితిని కల్పించేవారు తమరే కనుక.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 831

మోడీనగర్,

24.11.1966

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమకు ఒక ఉత్తరం వ్రాశాను. అది చేరి ఉండవచ్చు. ఇక్కడ అందరు కుశలమే. తమరు కూడా అక్కడ ఆరోగ్యవంతులై ఉంటారని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశలో, (Unwavering stability) అఖండ స్థిరత్వమే స్థితి రూపంలో నాలో వ్యాపించి ఉన్నదేమోనని అనిపిస్తోంది. (Infinite firmness) అనంత దృఢత్వమే నా స్వరూపం అన్నట్లుగా ఉంది. ఇదేమిటో తెలియకున్నది, ఏమిటంటే, నా స్థితి ప్రకాశం లేదా అంధకారం –వీటి స్పర్శతోగాని, చేరికతోగాని కాకుండా వీటికి అతీతంగా ఉన్నట్లు ఉంది. కాని **నేను ఎక్కడ కూర్చున్నా, ఏమి మాట్లాడినా కూడా వాటిలో ప్రకాశం ఉన్నట్లుగా ఉంది. అయితే ఈ ప్రకాశం అనేది మామూలు వెలుతురుగా భావించకూడదు. దానిని దివ్య ప్రకాశం అనిగాని ఇంకేదైనా అనిగాని చెప్పాలి. దీనిని అనుభవరీత్యా గ్రహించాలేగాని మాటల్లో చెప్పనలవి కాదు.**

(Infinite firmness) అనంత దృఢత్వమే నాలో కుక్కి–కుక్కి కూర్చబడుతున్నట్లుగా అనిపిస్తోంది అంటే, ఇంక నా సంగతి ఏమని వ్రాయను? నేను హద్దు దాటి ఎక్కడికో ఎగిరిపోతున్నాను. నేను అటువైపుగా చూసినట్లయితే, అలా ఎగిరిపోతున్న కస్తూరీకి సామర్థ్యంగాని, తీరికగాని ఎటువైపుగా చూడాలన్నా లేవన్నట్లుగా ఉంది. ఈ కస్తూరీ ఒక ప్రేక్షకురాలు మాత్రమే. ఒక విగ్రహంలాగ ఉండి, ఊసరక్షేత్రాన్ని (బంజరు భూమి) కూడా వసంత శోభతో ఉన్నట్లుగా భావించి అటువైపుగా చూస్తూ ఉంటున్నది. నా అంగాంగాలన్నింటిలోను పరిపక్వత (Maturity) వ్యాపించిపోతున్నట్లుగా అనుభవమవుతోంది. ఒక సహజమైన పరిపక్వతయే నా కణకణంలోను వ్యాపించి పోయింది. కనుక నేను (Matured) పరిపక్వత చెందినదానను, (Firm) దృఢమైనదానను మరియు (Powerful) సశక్తురాలను అని అనుభవమవుతోంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 832

మోడీనగర్,

10.12.1966

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు ఆరోగ్యంగా ఉన్నారని తెలిసి సంతోషించాను. ఇక్కడ కూడా అందరూ కుశలమే. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశ ఎలా ఉందంటే, ఒక అదృశ్యమైన దానిలోకి నేను చొచ్చుకుపోతున్నట్లుగా ఉంది. అటువైపు నేను దృష్టి సారించినపుడు, నాకు ఇటువంటి సామర్థ్యం లేనట్లుగాను, మాలిక్' యొక్క కస్తూరీయే నన్ను చూస్తున్నట్లుగాను, ఈశ్వరీయ పరమశక్తి స్వరూపంగా అయిపోతూ ఉన్నట్లు ఉంది. ఇది ఎలా ఉన్నాగాని, నేను మాత్రం ఒక సాధారణ ప్రాపంచికపు బాలికనే. ఆ పరమశక్తి స్వరూపంగా అవ్వటంతోపాటుగానే, నాలో ఒక అలౌకిక దివ్యతేజస్సు వ్యాప్తమైపోయినట్లుగా ఉంది. ఇదంతా ఏమిటో తమకే తెలియాలి.

ఈ దశలో ఇంకా ఎలా ఉందంటే, తరచుగా నేను ఒక్కసారిగా ఎక్కడికో దూరంగా వెళ్ళిపోతున్నట్లుగాను, ఎక్కడో నూతనమైన ఒక గాఢస్థితిలో మునిగిపోతున్నట్లుగాను అనిపిస్తోంది. భూకంపం వచ్చినట్లుగా శరీరం కంపించిపోతుంది. ఇలా చాలా ఎక్కువగానే ఉంటోంది. లోపల, బయటా శరీరమంతటా ఈ భయకంపనం కలుగుతోంది. పృథ్వి మీద నేను కూర్చుని ఉన్నాను కాని, ఆ పృథ్వి నన్ను స్పర్శించటం లేదన్నట్లుగా అనిపిస్తోంది, ఎందుకో తెలియదు. ఇదంతా ఏమిటో తమకే తెలియాలి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 833

మోడీనగర్,

19.12.1966

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. చాలా రోజులుగా తమ ఉత్తరం రాలేదు. తమరు ఆరోగ్యంగానే ఉన్నారని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక స్థితిని గురించి వ్రాస్తున్నాను.

ఒక విషయం ఏమిటంటే, నేను వ్రాసినట్లుగానే, నా ముఖానికి అన్నివైపులా ఒక దివ్య తేజస్సు వ్యాపించి ఉన్నట్లుగా ఉంది. ఆ తేజోవలయం మధ్యలో నా ముఖానికి బదులు 'తమ' ముఖమే మళ్ళీ మళ్ళీ మెరిసిపోతోంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 834

మోడీనగర్,

03.02.1967

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. చాలా రోజుల తర్వాత 'తమ'కు ఉత్తరం వ్రాస్తున్నాను. ఇక్కడ నా ఆరోగ్యం అంతగా బాగుండలేదు, కాని ఇప్పుడు బాగుంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఇదేమిటో తెలియటం లేదు, ఏమిటంటే, తమరు నా ఎదుటనే ఉంటున్నారు, అయినా కూడా 'తమ'తో నేను సంబంధంలేనట్లుగా అనుభూతి చెందుతన్నాను. '$H_2$' పాయింట్ యాత్ర కూడా పూర్తయినట్లుగా ఉంది, ఎందుకంటే, ఇంకా ముందుకు పరుగులు తీయటానికి మైదానం లేకుండా ఉంది. దశలోనో లేక మనస్సులోనో ఒక వింతైన తపన ఉంటోంది. తరచుగా శరీరం లోపలి నుంచి ఒక వణుకు ఉన్నట్లుగా ఉంది లేదా శరీరం అంతటిలోను కంపనం వ్యాపిస్తున్నట్లుగా ఉంది. దీని వలన శరీరం అంతా వణుకుతోంది. తరచుగా నాకు భూకంపం వచ్చిందేమో అన్నట్లుగా ఉంది కాని అలా జరగలేదు.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 835

మోడీనగర్,
07.03.1967

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను. ఇక్కడ అందరూ కుశలమే. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ స్థితి ఏమిటో తెలియటం లేదు. ఏమిటంటే, దూరంగాని, సామీప్యతగాని అనుభవం కావటం లేదు. రెండూ ఒకే మాటగా ఉండి, వాటికి అర్థం లేనట్లుగా ఉంది. ఇప్పుడు ఎలాంటి ఒక దృఢమైన మరియు స్థిరమైన అభిప్రాయం కలుగుతుంది అంటే, అది స్వయంగా తమ యొక్క 'స్వరూపం'గా ఉంటోంది. అపరిచితులు లేదా పరాయివారు అంటూ నాకు ఎవ్వరూ లేరు, అలాగని నావారు అని చెప్పగల సమర్థతగాని, అధికారంగాని లేవు. ఒక దివ్య స్థిరత్వం (Divine Stability) మరియు విశ్వాసం నా జీవితంలో తిష్ట వేశాయి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 836

మోడీనగర్,
27.03.1967

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు నేను వాతావరణంగా అయిపోయినట్లుగా అనిపిస్తోంది. అదేమిటో దైవానికే తెలియాలి. ఒక (Chain) గొలుసును నేను స్వయంగా చూస్తున్నాను. అది ఎటువంటిది అంటే, అది నా నుండి ఎక్కడివరకు వెళ్ళింది అంటే, ఒక తెలియని ప్రదేశానికి వెళ్ళింది. నాకు ఆ ప్రాంతం మీద పూర్తి అధికారం ఉంది. ఎందుకంటే, నా 'మాలిక్' నివాసమే నా నివాసంగా ఉంది కనుక. ఒక (Divine Stability) దివ్య స్థిరత్వం, ఒక (Indomitable Faith) అలౌకిక భరోసా, ఒక సాటిలేని (Mastery) ఆధిపత్యం నాలో పాతుకు పోయాయి. ఎక్కడా నాది అంటూ ఏమి లేకపోయినాగాని ఆధిపత్యం నాదిగా ఉంది. ఇంకా ఏమి అనిపిస్తోంది అంటే, నాకు దూరంగా ఎక్కడో ఉన్న నేత్రాలు నావి కానట్లుగా ఉన్నాయి. కాని వాటితో నాకు వ్యాప్తి చెందటం కనిపిస్తోంది. (Vision) దృశ్యమైనా లేదా స్థితియైనా రెండూ ఒకటిగానే అనిపిస్తోంది. ఒక శుభ్రం చేయబడినటు వంటిది, పరమ శాంతమైనది, గంభీరమైనటువంటిది, మృదువైన స్థితియే అన్నివైపులా వ్యాపించి ఉన్నట్లుగా అనుభవమవుతోంది. ఒక బీజం (మూలం) నుంచి దృశ్యాలన్నీ ఉద్భవించి ఇప్పుడు కేవలం బీజం లోపలనే అన్నీ ఇమిడిపోయిన దృశ్యంలాగ అనిపిస్తోంది. అది ఏమిటో, ఎటువంటిదో నేను చెప్పలేను కాని, నాకు అన్ని కనిపిస్తున్నాయి, అన్నీ అనుభవమవుతున్నాయి. నేను ఇదివరకు ఒక అల్పమైనటువంటి వెచ్చదనం (Fomentation) గురించి వ్రాస్తూ ఉండేదానను. ఇప్పుడు ఆ వెచ్చదనం నాలోకి దిగివచ్చినట్లుగాను, వెల్లడైనట్లుగాను, వ్యాప్తమైపోయినట్లుగాను అనుభవమవుతోంది. ఇప్పుడు అనుభవించాల్సింది (భోగం చెందవలసింది) గాని, అనుభవించాల్సినవారు గాని, సంస్కారాలవల్లగాని ఏమీ లేవు. ఇంకేముంది, అసలు ఏది కావల్సి ఉందో అదే ఉంది. దీనిని నేను సరిగ్గా వ్రాయలేకపోయాను. చాలా నమ్రత కలిగిన స్థితి, చాలా సున్నితమైన స్థితి వ్యాపించి ఉంది. నేను

ఇంకేమి చెప్పాలి?

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 837

మోడీనగర్,

30.03.1967

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. తమరు ఆరోగ్యంగా ఉన్నారని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇదేమిటోగాని, లోలోపలనే ఏదో తరచుగా విరుగుతున్నట్లుగా అనుభవమవుతోంది. శరీరం అంతటిలోని కణకణాలు వేర్వేరుగా అయిపోతున్నట్లుగా ఉంది. వీపు అంతటా మరియు శిరస్సు అంతటిలోను నరాలన్నీ వేరైపోయినట్లుగా అనుభవమవుతోంది. నా శరీరం అంతటిలోను, లోలోపల ఎంతగా వణుకు వస్తుంది అంటే, ఏమైనా భూకంపం వచ్చిందేమో అను ఆలోచన కలుగుతోంది. కాని, అదైతే రాలేదు. శిరస్సు వెనుక, మెడకు సంబంధించి ఏదో విరుగుతున్నట్లు, గుల్లగా అయిపోయి బాధ కలుగుతోంది. ఇంకా ఏమిటంటే, స్థితి పరమ సుస్థిరంగాను, దివ్యంగాను ఉండి దృశ్యం మారిపోతున్నట్లుగా అనిపిస్తోంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 838

మోడీనగర్,

30.04.1967

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. చాలా రోజులుగా తమ సమాచారం ఏమి తెలియరాలేదు. దయచేసి వెంటనే తమ సమాచారం తెలియజేయండి. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ రోజు తమ జన్మదినోత్సవం. రాత్రి నిద్రిస్తున్నప్పుడు ఒక స్వప్నాన్ని చూశాను. దానిలో 'తమరు' మరియు లాలాజీ సాహెబ్ కూర్చుని ఉన్నారు. ఇంకా చాలమంది కూడా ఉన్నారు, కాని వారి రూపాలు నా అనుభవంలోకి రాలేదుగాని, సమూహం మాత్రం ఉంది. నేను తమ ఎదుట కూర్చుని ఉన్నాను. అపుడు 'తమరు', "పరమ సంత్‌గతిని (Super Saint) గురించి నీ అభిప్రాయం ఏమిటో ఏమైనా చెప్పగలవా?" అన్నారు. నేను తమ ముఖం వంక చూశాను. అపుడు చెప్పాను ఏమని అంటే, అనుభవపూర్వకంగానైతే నాకు తెలియదు. అయినా గాని నేను తమకు తప్పకుండా వివరిస్తాను అని. నేను ధ్యానంలో నిమగ్నమైపోగా, 'లాలాజీ' కంఠస్వరం విని నేను కళ్ళు తెరిచాను. వారు "నీ స్థితిని గురించి వివరించు" అని అన్నారు. అప్పుడు నేను నా స్థితిని చూశాను. దానికి నాలుగువైపులా పవిత్రత యొక్క సువాసన విస్తరించి ఉంది. 'తమ' అనుగ్రహం నా స్థితిగా అయిపోయింది అన్నట్లుగా ఉంది. అందులో తమ అనుగ్రహంతప్ప ఇంకేమీ లేదు, అయితే దాని ద్వారా అన్ని స్థితులు నాలో ఉత్పన్నమవుతాయి. 'పరమ సంత్‌గతి'లో ఉండి నేను చెబుతున్నాను, ఏమంటే, (Balanced State) సమత్వస్థితి మరియు (Universal Love) విశ్వప్రేమ యొక్క

స్థితి మీద (Command) ఆధిపత్యం ఉంటుంది. నేను దేనినైతే అనుభూతి చెందుతున్నానో దానిని పూర్తిగా వ్రాయలేకపోతున్నాను.

వెనుకవైపు శిరస్సు అంతటా మెడ నుంచి పైభాగం మరియు వీపంతా కొంచెం కలత వంటిది ఏర్పడి ఉంటోంది. పూర్తి శరీరం యొక్క కణాలన్నీ పరమ శాంతిని, పరమ స్థిరత్వాన్ని దాల్చి ఉన్నాయి. అలాగే పట్టుదల (Firmness) నెలకొని ఉంది. అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 839

షాజహాన్‌పూర్,
08.05.1967

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నేను మే 21వ తేదీ సాయంత్రం బయలుదేరి 22వ తేదీ ఉదయం ఢిల్లీ చేరుకుంటాను. మే 23 సాయంత్రం దక్షిణ భారతదేశానికి ప్రయాణమవుతున్నాను.

మే 6వ తేదీన ఆశ్రమ భవన నిర్మాణం నిమిత్తం 10 వేల రూపాయలతో భూమి కొనుగోలు చేయబడింది. ధనం ఇవ్వటానికి వాగ్దానం చేసినవారిలో చాలామంది నుంచి ఇంకా డబ్బు వసూలు కాలేదు. విరాళంగా వచ్చినదాని నుండి రూ. 5,500 నావద్ద ఇతర ఖాతాలలో ఉన్నదాని నుంచి రూ. 5,500 చెల్లించటం జరిగింది. నీలో (Vibrations) ప్రకంపనలు, (Power) శక్తి నిండుగా ఉన్నాయి.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 840

మోడీనగర్,
15.05.1967

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం చేరింది. సమాచారం తెలుసుకుని సంతోషించాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక స్థితిని గురించి వ్రాస్తున్నాను.

శరీరం యొక్క కణకణాలన్నీ (Melancholy) ఉదాసీన రూపం దాల్చినట్లుగా ఉంది. సమస్త ప్రపంచం యొక్క అణువణువులోను ఉదాసీనతయే వ్యాపించింది. దేనిపైనా మనస్సు నిలవటం లేదు. మనస్సు అంతా విసుగుదలగా ఉంది. ప్రతి కణం, ప్రతి క్షణం సదా ఉదాసీనంగా ఉంటున్నాయి. లోన, బయట కేవలం ఉదాసీనతయే ఉంది. ఎన్నడూ వసంతమే కలగనట్లుగా, లోన, బయట కేవలం ఉదాసీన అవస్థయే ఉండి, అదే వ్యాపించి ఉంది.

శరీరమంతా చాలా ఉదాసీనంగా ఉంటోంది. (Sea of melancholy) ఉదాసీనం అనే సముద్రంలో మునిగి ఉంటున్నట్లుగా ఉంది. ఎందుకంటే, ఎప్పుడైనా దృష్టిపెట్టినా, ఆలోచన వచ్చినా, నేను ఉదాసీనత అనే సముద్రం నుండి ముఖం పైకెత్తి చూసి, మళ్ళీ మరచిపోయినట్లుగా ఉంటున్నాను. ఇదంతా తమ కృపయే.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 841

మోడీనగర్,

24.07.1967

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. 'తమరు' కుశలమేనని భావిస్తున్నాను. ఇక్కడ కూడా అందరు కుశలమే. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

10.07.1967వ తారీఖున తమరు దయతో నన్ను '$H_2$' పాయింట్ యాత్ర పూర్తి గావించి '$I_2$' పాయింట్‌కు చేర్చారు. జ్ఞాపకంలో హృదయం సహకరిస్తోందని, ధ్యానంలో ప్రవృత్తి మళ్ళీ ఉంటోందని, ఈ రోజు గుర్తించాను. **హృదయంలో ఉప్పొంగిన ఆవేదనయే జ్ఞాపకం యొక్క రూపంగాను, దానిపట్ల ప్రవృత్తులు ధ్యాస నిలిపి ఉంచటమే ధ్యానంగాను ఉంది.** నా దశ ఇప్పుడు చక్కదిద్దబడింది. వెలుగును పరాజితం చేసినటువంటి చీకటి ఉంది. ఇప్పుడు దశ శుద్ధంగాను, దివ్య ప్రకాశం మరియు అలౌకికత్వం కంటె కూడా మించి ఎంతో బాగున్నట్లుగాను ఉంది. అయితే అది ఏమిటో, ఎటువంటిదో చెప్పటం కష్టం. ఇది కాదు, అది కాదు అని చెప్పాల్సి వస్తుంది. ఇప్పుడు స్థితిని సత్యస్థితి అని చెప్పటం కూడా కుదరదు. ఎందుకంటే, అది ముఖాన్ని అధోముఖం అనగా క్రిందివైపు త్రిప్పి చూస్తేనే కనిపిస్తుంది. ఇంకను అక్కడ ఒక స్వచ్ఛమైన ప్రకాశమే ఉంది. అలాగే ఊర్ధ్వంగానైతే ఎక్కడ నేను చూస్తున్నానో, ఎక్కడ నేను ఈదవలసి ఉందో, అక్కడ ఒక మసక చీకటి వంటిది వ్యాపించి ఉంది. ఎంతో బాగుంది, దానిని చెప్పనలవి కాదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 842

షాజహాన్‌పూర్,

02.10.1967

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ ఉత్తరం చేరింది. నీవు నీ స్థితి యొక్క వర్ణన బాగానే వ్రాశావు. నేను ఏమి చేయాలి అని ఆలోచిస్తున్నాను. కొంతవరకు అవగాహనకు వచ్చింది. మిగిలినది కూడా త్వరలోనే వస్తుంది. టండన్ ఇటీవల చాలా దిగులుగా ఉంటున్నాడు. నీవు ఇచ్చిన ప్రాణాహుతి మరియు ప్రార్థనలతో అతనికి కొంత ప్రయోజనం కలిగింది. దానితో అతని సంస్కారాల పీటముడులు తొలగించబడ్డాయి. అతనికి ఇప్పుడు ఇంకా ఎక్కువ ఫలితం చేకూరుతుందని, దైవేచ్ఛతో అతని ఇబ్బందులు తగ్గుతాయని భావిస్తున్నాను.

హైదరాబాదు నుంచి కొంతమంది అభ్యాసులు 9, 10వ తేదీలలో ఇక్కడకు వస్తున్నారు. అవకాశం ఉంటే నీవు కూడా రాగలవు.

మీ అందరికీ నా ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 843

షాజహాన్‌పూర్,
25.10.1967

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరం అందింది. లాలాజీ సాహెబ్ ఆధ్యాత్మిక పరిశోధన కొరకు నిన్ను ఎంపిక చేసినందుకు చాలా ఆనందంగా ఉంది. సాధ్యమైనంతవరకు నీవు ప్రతి స్థితిని వివరంగా, స్పష్టంగా వ్రాస్తూ వచ్చావు. కాని ఉన్నత స్థితులకు చేరిన సందర్భంలో తగిన మాటలు దొరకనందున ఆ స్థితులను వివరించటం చాలా కష్టం అవుతుంది. నేను దీనికి ముందు వ్రాసిన ఉత్తరంలో నాకు కొంత అవగాహనకు వచ్చిందని, ఇంకా కొంత వస్తుందని వ్రాశాను. నేను నిన్ను '$J_2$' స్థానం మీదకు చేర్చాను. దైవేచ్ఛ ఉంటే నీవు త్వరలోనే ఈ స్థితిని గురించిన శుభవార్తను నాకు అందిస్తావు. నీ స్థితిని చూసి నేను ఎందుకు ఉప్పొంగిపోతున్నానో నాకు అర్థం కావటం లేదు. లాలాజీ సాహెబ్ నిన్ను ఆశీర్వదించుగాక! నీ ఆరోగ్యం కూడా బాగుండాలి.

మీ అందరికీ ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 844

మోడీనగర్,
05.12.1967

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు వ్రాసిన ఉత్తరం చేరింది. నేనే చాలా రోజులుగా తమకు ఉత్తరం వ్రాయలేకపోయాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆధ్యాత్మిక స్థితిని గురించి వ్రాస్తున్నాను.

25.10.1967వ తేదీన తమరు నన్ను దయతో '$J_2$' పాయింట్ మీదకు చేర్చారు. తమరు అక్కడ ఒక అర్థచంద్రాకారంలో (Arc) వంపు ఉన్నట్లుగా చెప్పారు. అది ఒక్కసారిగా బ్రద్ధలై దాని నుండి ఒక్క పెట్టున అత్యంత ప్రకాశం అంతటా వ్యాపించింది. ప్రపన్న అవస్థ, ప్రభు అవస్థ మరియు ప్రపన్న ప్రభు అవస్థల తర్వాత ఇంకను 63 పాయింట్లలో ప్రయాణించాలని, ఆ తర్వాత '$K_2$' పాయింట్ దాటించిన తర్వాత తమ యొక్క ఆధ్యాత్మిక పరిశోధన పూర్తవుతుందని చెప్పారు. '$K_2$' పాయింట్ తర్వాత బ్రహ్మరంధ్రం ఉంటుందని, దాని వలన ప్రాణం పోకుండా జాగ్రత్త వహించి, ఒక్కసారిగా ముందుకు లాక్కెళ్ళాలని తమరే చెప్పారు. ఇక్కడ ప్రయాణింపజేయరు. ఇంక '$L_2$' పాయింట్ తర్వాత కేంద్ర మండలం (సెంట్రల్ రీజియన్) ఉంది. తమరు దయతో నన్ను ఆ కేంద్ర మండలానికి చేర్చినందుకు వేలకువేలుగా ధన్యవాదాలర్పిస్తున్నాను. హృదయం యొక్క భారం వంటిది తొలగిపోయినట్లుగా ఇప్పుడు అనిపించింది. ఆ నియంత్రణ, ఆ పర్యవేక్షణ (Control and Check) ఏవైతే నన్ను నా పాయింట్లు మీదకు లాగి ఉంచేవో, గెంతుకుంటూ పోవటంలో అడ్డుపడుతూ ఉండేవో, అవి తొలగిపోయి హృదయం తేలికపడిపోయింది. నిశ్శబ్ద ప్రాంతంలో నిశ్శబ గమనం ఉంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 845

మోడీనగర్,
27.12.1967

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. నా ఆరోగ్యం ఇప్పుడు బాగానే ఉంది కాని, కొంచెం బలహీనత ఉంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

లోన, బయట, యావత్తు శరీరం యొక్క కణకణమూ నిశ్శబ్దమైపోయినట్లుగా అనిపిస్తోంది. భస్మం కూడా చల్లారిపోయినట్లుగా అనిపిస్తోంది. గోరువెచ్చని వేడి కూడా ఇప్పుడు చల్లబడిపోయినట్లుగా అనుభవమవుతోంది. ఈ నిశ్శబ్ద దశను అంటిపెట్టుకుని నేను వ్యర్థంగా అయిపోతున్నట్లుగాను, పూర్తిగా నిశ్శబ్దంగా అయిపోతున్నట్లుగాను అనుభవమవుతోంది. ఈ రోజు అతికష్టం మీద స్థితి నుంచి వేరుపడి ఏదో వ్రాస్తున్నాను.

ఎందుకో తెలియదు కాని, నాలో భక్తిలో మునిగిపోయే శక్తి లేనట్లుగా ఉంది. ఇప్పుడైతే ఒక (Divine devotion) అలౌకిక భక్తి ఏదైతే స్వయంగా ప్రవహిస్తూ ఉందో, దానిలో నేను ప్రవేశించిపోయాను. అదేమిటో తెలియదు కాని, సదా రెంటిని ఒకటిగా కూర్చి ఉంచే గొలుసు కరిగిపోయి నాలోనే కలిసిపోయినట్లు ఉంది. ఇప్పుడు అంతా ఏకమైపోయి కూడా నేను అలౌకిక భక్తి ప్రవాహంలో ప్రవేశించిపోయాను. ఏ స్థితి అయితే ఇప్పటివరకు సమస్థాయిలో నడుస్తూ వచ్చిందో, దేనివల్లనయితే ఆధ్యాత్మిక స్థితులు నాలో ఏర్పడ్డాయో, ఆ స్థితి కూడా ఇప్పుడు కరిగిపోయి నాలో జీర్ణించుకుపోయింది. ఇప్పుడు ఎక్కడా కూడా కారణమంటూ ఏదీ లేకుండా పోయింది. ఇంకేమి జరుగుతున్నదో నాకు తెలియదు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 846

మోడీనగర్,
31.12.1967

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. తమరు ఆరోగ్యంగా ఉన్నారని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశలో ఎలా ఉందంటే, ఇప్పుడు సామ్యగతి (Balanced State) స్వయంగా లేదు, కాని సామ్యగతియే ఇక్కడి నుండి ప్రవహిస్తున్నట్లుగా ఉంది. హృదయంలో ఎటువంటి దశ కలుగుతున్నదంటే, అది స్వయంగా ఆనందంకానిదిగా ఉండి కూడా హృదయాన్నో లేక లోలోపలనో ప్రకాశిస్తూ ఉంచి, హృదయం దానిని పట్టుకుని నడుస్తోంది. రాత్రి నిద్రలోను, మెలకువలోను తమ అనుగ్రహాన్ని చూశాను. ఏమంటే, తమరు నా చేతిలో ఏదో పెట్టి, నుదుటిమీద చేతితో నిమిరారు. ఆ తర్వాత "లాలాజీ సాహెబ్ ఏదో చెబుతున్నారు" అని అన్నారు. వెంటనే ఒక సెకనుపాటు కళ్ళు మూసుకుని, నా లోపల ఏమి చేశారో ఏమోకాని, నా కణకణాలన్నింటిలోను జీర్ణమైన సామ్యావస్థ (సమస్థితి) అంతా ఒక్కసారిగా తుడిచిపెట్టుకుపోయినట్లు గాను, నా లోపల, బయట అంతటి నుంచి దివ్యత్వం అనుకుంటాను, అది మిరిమిట్లుగొల్పింది. దాని మూలంగా ఇపుడు నా దశ లోలోపలనే చాలా బాగుందనిపిస్తూ ఉంది. లోపల్లోపల నేను అయితే సంతోషంగా లేను, కాని నా అణువణువూ ఆ దివ్యానందంలో పులకరించిపోయాయి. ఇప్పుడు ఏమైందో తెలియదు కాని, నేను స్వయంగా పూజ ఆరంభిస్తూ, కళ్ళు మూసుకోగానే, దానిని తమరే

ఇస్తున్నారేమో, ఎటువంటి స్థితి కలుగుతున్నదో కాని, చాలా గట్టిగా నా అరుపు వెలువడి, కళ్ళు తెరుచుకుంటున్నట్లుగా అనిపించింది. ఆ తర్వాత నేను సత్సంగ్ చాలా సమయంవరకు నిర్వహించినా కూడా ఏమి జరగలేదు. కొంత శారీరిక బలహీనత కారణంగా హృదయంమీద వత్తిడి, అల్పమైన బాధ కూడా ఉన్నట్లుగా అనిపించింది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 847

చెన్నపట్నం,

01.01.1968

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

ఆశీర్వాదాలు. నేను ఈ రోజు చెన్నపట్నం చేరాను. సేలంలో అభ్యాసుల సంఖ్య పెరిగింది. మదురైలో షుమారు 20 మంది ప్రవేశించారు. నా ఆరోగ్యం బాగానే ఉంది. నేను పని చేయటంకోసం, లాలాజీ సాహెబ్ నుంచి (Energy) శక్తి నాకు లభిస్తూ ఉంటుంది. నీవు కూడా శక్తిని ఇస్తున్నావు. ఇప్పుడు నీవు శక్తిని ఇవ్వనవసరం లేదు. ఎందుకంటే, ఏ వ్యక్తి అయినా చివరిగా చేరేది (సెంట్రల్ రీజియన్) కేంద్ర మండలం. అక్కడ మానవుని శక్తి బాగా ఉధృతం కావటమే కాకుండా చిన్న వస్తువు కూడా పెద్దదిగా అయిపోతుంది. నీవు దానిని అంచనా వేయలేవు. ఈ రోజు నా హృదయం కొంత భారంగా ఉంది. బలహీనంగా ఉన్న కారణంగా దాని ప్రభావం ఎక్కువగా ఉంది.

చిరంజీవి పార్థసారథి ఇక్కడ (మద్రాసు) బాగా కృషి చేశారు. దైవం ఆయనను సంతోషంగా ఉంచుగాక!

పిల్లలందరికీ ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 848

మోడీనగర్,

05.01.1968

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం చేరింది. చదివి సమాచారం గ్రహించాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

మనస్సు ఇప్పుడు (Concentration) ఏకాగ్రతకు దూరంగా ఉండాలని భావిస్తున్నట్లుగా నేను చూస్తున్నాను. నేను ఏదైనా కొంచెం చదివినా లేదా స్వయంగా వ్రాసినా ఏమీ అనిపించదు. కాని ఏదైనా వ్రాయటానికి ప్రయత్నించినట్లయితే మనస్సు బంధించబడి పూర్తిగా చిటపటలాడుతుంది. దాని వలన నేను గాబరాపడుతున్నాను. ఈశ్వరప్రాప్తి యొక్క లక్ష్యాన్ని ఎంచుకొని పూజ ప్రారంభించాను. కాని ఇప్పుడు పరిస్థితి ఏమిటంటే, ఈశ్వరుని పేరెత్తితేనే మనస్సు భయపడిపోతోంది. ఇప్పుడు స్థితి యొక్క నిలకడ సమాప్తమైపోయి సమస్థాయికి వచ్చేసింది. ఎక్కడకు వెళ్ళినా (లయావస్థ) 'ఫనా'లో కాకుండా, (పరిపూర్ణ లయావస్థ) 'బకా'లోనే ఈదుతూ ఉన్నాను. ఇప్పుడు ఈ (Balanced State) సమస్థితిలోనే లయమై ఉంటున్నాను. బకాలోనే ఈదుతూ ఉంటున్నాను. ఇలా ఈదిన తర్వాత పైకి వచ్చినపుడు 'బకా'నే పొందుతున్నాను. అనగా సమత్వంలోను లేదా బకాలోను ఈది సమత్వం లేదా బకానే పొందుతున్నాను. దశలో కలుస్తున్నది గాని, తరుగుతున్నదిగాని ఏమి లేనట్లుగా ఈ దశను చూస్తున్నాను. ఇప్పుడు

కూడిక, తీసివేత ఏమీలేవు. ఏ స్థితిలోనైతే ఈదుతున్నానో దానితోనే సమత్వానికి వస్తున్నాను.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 849

మోడీనగర్,

09.01.1968

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. ఇక్కడ అందరూ క్షేమమే. తమరు కూడా కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక స్థితిని గురించి వ్రాస్తున్నాను.

నిన్న పార్థసారథి, సోదరి సులోచన మరియు సోదరుడు రాజగోపాలాచారి గార్లమీద ఒక నూతన అనుగ్రహం (ప్రాణాహుతి) యొక్క ప్రభావం బాగా ఉన్నట్లుగాను, అది ఇప్పటికీ ప్రవహిస్తున్నట్లుగాను చూశాను. అనగా శారీరిక వ్యవస్థ యొక్క ఏ మైండ్ సెంటర్ (మానసిక కేంద్రం) ఉందో దాని మీదనే ప్రాణాహుతితో నిర్మలీకరణచేసి మళ్ళీ దాని మీదనే ప్రాణాహుతిని ఇచ్చాను. దీని ఫలితంగా సంస్కారాలు ఏర్పడటం త్వరగా అరికట్టబడి, ఒక ఆధ్యాత్మికత యొక్క మత్తు వంటిది, దానితోపాటు ఉత్సాహం కూడా ఉంటుంది. శరీరం ఎంత తేలికగా అయిపోయింది అంటే, అది ఎగిరి పోవాలని అనుకుంటుంది. యావత్తు శరీరం పువ్వులాగా తేలికైపోతుంది. నేను ఎంతవరకు కరక్టు అనేది 'తమ'ర్ని చెప్పవలసిందిగా కోరుతున్నాను.

కుడి భుజం నుంచి క్రిందుగా వెనక ఉన్న వెడాల్పాటి ఎముకలో చాలా వణుకు మరియు ప్రకంపనం ఎప్పుడూ ఉంటోంది. ఇది ముఖ్యంగా పూజ చేస్తున్నపుడుగాని, చేయిస్తున్నపుడుగాని ఉంటున్నది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 850

మోడీనగర్,

26.01.1968

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. విష్ణుగారి ద్వారా తమ సమాచారం తెలిసింది. తమరు ఆరోగ్యంగా ఉన్నారని తెలిసి సంతోషించాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇది ఫలానా స్థితి అని వ్రాయటం దుర్లభం. అత్యంత తేలికగా ఉన్నదని చెప్పినాగాని దానికి భారం కలుగుతుంది. సాదా (Simple) అను దానికి పైన ఇంక సాదాతనం ఏమి ఉంటుంది. ఇప్పుడు స్థితి ఎలా ఉందంటే, స్థితి తేలికైనదని చెప్పినా గాని దానిలో తేలికదనం లేదని చెప్పవచ్చు. ఈ స్థితి (Simple) సాదాగానే ఉంది కాని, దానిని (Simplicity) సాదాతనం స్పృశించలేదు. అది ఒక్కటే, ఉన్నదేదో అదే ఉంది. దానిని మరొక విధంగా చెప్పలేము.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 851

మోడీనగర్,

13.02.1968

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు కుశలంగానే ఉన్నారని భావిస్తున్నాను. నా ఆరోగ్యం కూడా ఇప్పుడు బాగుంది. స్వస్థత క్రమక్రమంగా వృద్ధి చెందుతోంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక స్థితిని గురించి వ్రాస్తున్నాను.

నా గమనం మొదటి వలయంలో ఉందని, నేను దానిలో ముందుకు వెళ్ళుతున్నానని తమరు నాకు చెప్పారు. అది అలా ఉండగా, నా స్థితి ఎలా ఉందంటే, నేనయితే ఆత్మిక గతుల స్పర్శ కూడా తగలనట్లుగానే ముందుకు పోతున్నాను. నేను కేవలం ప్రేక్షకురాలిగా ఉండి అంతా చూస్తున్నాను.

శారీరక సుఖదుఃఖాల లాగానే ఆధ్యాత్మిక గతుల ఆనందం కూడా నాకు అంటనట్లుగానే చాలా దూరంగా కొంచెం అనుభవమవుతోంది. ఏ విధంగానైతే ప్రాపంచిక జీవితం లేదా నడక నన్ను అంటకుండా ఉంటున్నదో అదే విధంగా ఆధ్యాత్మికతతోనూ అంటకుండానే ఉంచుతూ 'మాలిక్' నన్ను తీసుకుని వెళ్ళారు. భక్తి, జ్ఞానం మరియు ఆధ్యాత్మికత యొక్క భూమిక (Plane of Spirituality) నుంచి పూర్తిగా సంబంధం త్రెంచుకుని విముక్తురాలనై పోయినట్లుగా ఉంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 852

మోడీనగర్,

19.02.1968

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం 'తమ'కు అంది ఉండవచ్చు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

నేను 'మాలిక్'లో లయమై ఉన్నానా లేక సంబంధం కలిగి ఉన్నానా అను ఒక్క ఆలోచననే నా లోపల ఉంచుకుని ఉంటున్నాను. కేవలం ఆలోచన మాత్రంగానే నేను వారిని స్పర్శించిన ఆనంద సుగంధాన్ని పొందుతున్నాను. అలాకాకపోతే, అటువంటి ఆనందాన్ని నేను ఎక్కడ పొందగలను. ఎందుకో తెలియదు గాని, వ్రాయటంలోను, చదవటంలోను ఏ విధమైన (Concentration) ఏకాగ్రత నిలిపినా, మనస్సు భయాందోళనకు గురై విసుగెత్తిపోతోంది. దాని మూలంగా ఆంతరికంలోకి వెళ్ళటానికి బదులు బయటకు పారిపోవాలని అనుకుంటున్నాను. నా ఆత్మిక దశను కూడా నా లోపలికి చొచ్చుకుపోయి అక్కడ కూర్చుండి నేను చూడాలనుకోవటం లేదు. అందుకని దూరం నుంచే చూస్తున్నాను.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. కేసర్ తమకు ప్రణామం చెబుతోంది. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 853

మోడీనగర్,
06.03.1968

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు క్షేమంగా చేరి ఉంటారని అనుకుంటున్నాను. ఇక్కడ అందరూ బాగున్నారు. అక్కడ కూడా అందరూ బాగున్నారని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు స్థితి ఎలా ఉన్నదంటే, (Sun of Reality) అంతిమసత్యపు సూర్యుడు ఇప్పుడు నాలో అస్తమించినట్లుగా ఉంది. ఎక్కడి నుండి ఎటువంటి ప్రకాశం యొక్క మెరుపు ఉండటం లేదు. ఎక్కడా కాంతి అంటూ లేదు. దానిని చీకటి అని కూడా చెప్పలేను. ఒక ఆంతరిక వేదన బాగా నన్ను పీడిస్తోంది. ఏమి తీసుకురావాలి, ఎక్కడి నుండి తీసుకురావాలి, ఎక్కడికి వెళ్ళాలి అనేది ఏమి తెలియదు; కాని మనస్సు వ్యధ చెందుతోంది. ఈ దశలో వింత ఏమిటంటే, యోగం సహించటం లేదు. యోగం చెందటంలోనే ఉన్న వియోగం, అది తపింపజేస్తున్నది. అయితే వియోగం నన్ను తిని వేయకుండా, నేనే దానిని తిని వేస్తున్నట్లుగా అనిపిస్తున్నది. తపన స్వయంగా నన్ను వేధించటం కాకుండా, అది నాలో ప్రవేశించి అదే తపించిపోతున్నట్లుగా ఉంది. నేనే స్వయంగా దప్పికతో ఉన్నానో, లేదా దప్పికయే నన్ను త్రాగటానికి దప్పికగా ఉందో నాకు అర్థం కావటం లేదు. ఎటువంటి (Knot) గ్రంథిగాని, (Covering) ఆవరణగాని లేదు. పావన పవిత్రత (Divine Purity) సజీవ స్వరూపంలో ఉండి, నా ఎదుట మైదానంలాగ విస్తరించి ఉంది. కాని నేనే శీఘ్రంగా పరిగెత్తుకు వెళ్ళి దానిని త్రాగి వేయాలని ఉంది, కాని నేను హృదయ పూర్వకంగా అలా చేయలేకపోతున్నాను. నా సందేహం ఏమిటంటే, దేనినైతే 'ప్రాణం' అని చెబుతూ, దానిని నింపాలని అనుకుంటున్నానో, అలా నింపాలనుకుంటున్న 'ప్రాణం' ఎక్కడా లేకుండా పోయింది అని. ఇది నాకు ఎండమావిలో నీరు త్రాగటం వంటిదేనేమో, తమకే తెలియాలి. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 854

మోడీనగర్,
23.03.1968

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. ఇక్కడ అందరూ కుశలమే. తమరు కూడా కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

హృదయం అంతా లేదా ఆంతిరికం అంతా గాయపడిపోయింది. సద్గురువు దొరకకపోతే, (Condition of Separation) విరహావస్థ అనేది ఎప్పుడూ కష్టం కలిగించదు. ఆనందం ఉంది, (Separation) విరహమూ ఉంది. అదేమిటో అర్థం కావటంలేదు.

షుమారుగా 5,6 రోజుల నుండి నేను, తమరు ఎదురుగా ఉన్నట్లు ఆలోచన కల్పించుకున్నా, ఆంతరికంగా ఉన్నట్లు ఆలోచన కలిగినా, నాకు తమ స్పర్శ యొక్క ఆనందం ప్రత్యక్షంగా అనుభవమవుతున్నది. ఆశ్చర్యం ఏమిటంటే, నా యొక్క స్పర్శ నాకు స్వయంగా అనుభవం కావటం లేదు. కాని తమ స్పర్శ యొక్క ఆనందం అనుభవమవుతోంది, ఇదంతా తమ కృపవల్లనే.

నా ఆనందం అంతా, (Activity) చైతన్యం, అన్నీ లూటీ అయినట్లుగా ఉంది. నేను (Inanimate) చేతనారహితంగా ఉండి అంతా చూస్తూ ఉన్నాను. ఇప్పుడు స్థితిని గురించి చెప్పాలంటే, ఒక నూతన (Chapter) అధ్యాయం

తెరవబడినట్లుగా ఉంది. పుస్తకం అంతా తెరవబడినా, చూసేవారుగాని, చదివేవారుగాని ఎవరూ లేనట్లు ఉంది. నేను ఒక జడ వస్తువులాగా, నిస్తబ్ధంగా మోసపోయినదానిలాగా నిలబడి ఉన్నాను. లోన, బయట అన్నీ శక్తిహీనమైపోయినట్లుగా అనిపిస్తోంది. 'మాలిక్' ఇచ్చినవి, ఇప్పించినవి అన్నింటిమీద నీళ్ళు జల్లి (తిలోదకం ఇచ్చి) కూర్చున్నట్లుగా ఉంది. నేను ఏ ముఖం పెట్టుకుని 'మాలిక్' వద్దకు వెళ్ళాలి? నేను లూటీ చేయబడ్డాను. నేను ఇప్పుడు ప్రతి ఒక్కరితోనూ భయపడుతున్నట్లుగా అనిపిస్తోంది, ఎందుకో తెలియదు. ఈ స్థితి ఏమిటో తెలియకున్నది, ఎందుకంటే, నేను భయపడుతూనే ఉన్నాను. అయినా నిశ్చింతగా ఉంటున్నాను. నాకు ఈ ప్రపంచంలో ఏమి కనిపించనట్లుగాను, నా ప్రపంచంలో (అనగా ఆధ్యాత్మిక జగత్తులో) వెలుతురూ లేకుండానే అన్నీ కనిపిస్తున్నట్లుగాను, చీకటి లేకపోయినాగాని ఎక్కడా ప్రకాశంలేనట్లుగా అనుభవమవుతోంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 855

మోడీనగర్,

22.04.1968

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. చాలా రోజుల తర్వాత తమకు ఉత్తరం వ్రాస్తున్నాను. నా ఆరోగ్యం బాగుండకపోవటమే అందుకు కారణం. కాని ఇప్పుడు బాగానే ఉంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశ ఏమిటో అర్థం కావటం లేదు. నా శరీరం అంతా, మనస్సు అన్నీ కూడా కొంచెం జడంగా (Inanimate) అయిపోయాయి. శరీరం పడుతూ లేస్తూనే అన్ని పనులూ చేస్తూ ఉంది. నేను మాట్లాడుతూనే ఉన్నాను. నేను ఎంతగా పని చేస్తున్నాగాని, మాట్లాడుతున్నాగాని, ఒక జడవస్తువులాగే ఉంటున్నాను లేదా ఒక రాయిలాగా ఉంటున్నాను అని చెప్పవచ్చు. ఇప్పుడు ఏ కారణంగానయితే స్థితి కలుగుతూ ఉంటుందో, దానికి సమానాంతర రేఖ కూడా తెలియటం లేదు. ఇంకేముంది, నేనయితే ప్రక్క చూపులు లేకుండా, ఆలకించకుండా చొచ్చుకునిపోతూ ఉన్నాను. ఎటువంటి అవరోధాలు లేకుండా ఈదుకుంటూనే పోతున్నాను. ఆలోచనలతో నాకు సంబంధం ఉండటం లేదు. ఆలోచనలు నా స్థితికి దిగువనే ఉంటున్నాయి.

నేను ఒక స్వప్నం చూశాను. దానిలో నేను ఎప్పుడూ చూసి ఉండని జనమందరిలో ఒకరు, సెయింట్ గతి (Saintly condition) యొక్క స్థితి లేదా నిర్వచనం ఏమిటి? అని ప్రశ్నించారు. నేనేమి సమాధానం చెప్పానంటే, ఎవ్వరైనా తన కణకణాన్నీ పరిశీలించినట్లయితే (Balanced state) సామ్యగతినే చూస్తారు, అని. ఇది చెప్పినంతనే నా లోపలి నుంచి ఏదో కంఠస్వరం వినపడింది. అది తమదే అని అనిపించింది. ఆ కంఠస్వరంతోపాటుగానే, నాలో అంతటి నుండి ఆ 'సెయింట్'గతి (Saintly condition) గుంజివేయబడినట్లుగా అనిపించింది. మరింక దాని స్థానంలో ఒక అద్భుతగతి నా లోకి జలజలమంటూ దిగివస్తున్నట్లుగాను, అదే నాలో ఇమిడిపోతున్నట్లుగాను అనుభవమైంది. ఇప్పుడు కూడా అది ప్రవహిస్తూనే ఉంది. నా లోపలికి దిగివస్తూనే ఉంది. ఇప్పుడు కణకణంలోను ఒక ఉదాసీనమైన స్థితి, పవిత్రమైన ఉదాసీన స్థితియే వ్యాపించి ఉంది. నేను నిర్ఘాంతపోయి ఆశ్చర్యంగా చూస్తూ ఉన్నాను.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 856

మోడీనగర్,
30.04.1968

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. తమరు కుశలంగా ఉన్నారని ఆశిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

అదేమిటో దైవానికే తెలియాలిగాని, ఏదో ఆకర్షణ నన్ను ఎంత తీవ్రంగా తనవైపు గుంజుతున్నదంటే, అదే వేగంతో నేను దానిలో కలిసిపోవాలని అనుకుంటున్నాను. అయితే ప్రాణాలు పోతున్నట్లు ఉంది. నేను దానిని (ఆకర్షణను) నిలవరించలేకపోతున్నాను. అది ఎంత ఆత్యంత ఆనందప్రదమైన దశ అంటే, దానిలో ముగ్ధమైపోతూ ఉండగానే, ఒక విధమైన శక్తి అనుభవమవుతోంది. ఆదే సమయంలో ఎంత ఆవేశం వచ్చిందంటే, ఒక ఉబ్బస వ్యాధిగ్రస్తుడు తన వస్త్రాలు, చొక్కా చింపుకుని ఊపిరాడక చేతులు పైకి ఎత్తుతున్నట్లుగా ఉంది. అయితే ఏదో శక్తి వెంటనే నన్ను దానిలో కలిసిపోతున్నా కూడా కలవనివ్వకుండా లాగివేసినట్లుగా అనిపించింది. ఈ రక్షణ కల్పించినందుకు 'మాలిక్'కు ధన్యవాదాలు. యదార్థం ఏమిటంటే, నాకు క్షణక్షణం భారంగా ఉంటోంది. అలా ఎందుకో నాకు తెలియదు. నాకైతే పారిపోవాల్సి ఉంది. అంతులేని మైదానంలో కలిసిపోవాల్సి ఉంది. బిందువులో సముద్రం పడుతోంది. ఒక పర్యవేక్షణ వంటిది, ఇప్పటివరకు నన్ను వెన్నంటి ఉన్నట్లుగాను, అది ఇప్పుడు కూడా ఉన్నట్లుగాను నేను గమనిస్తున్నాను. ఎలా అంటే, గూడు ఎదుటనే ఉంది, కాని దానిలో దూరనివ్వదు అన్నట్లుగా ఉంది. నేను మాత్రం 'మాలిక్'నే చూస్తున్నాను.

సముద్రం ఎప్పుడో బిందువులో కలిసిపోయింది, కాని ఇప్పుడు కేవలం బిందువే వ్యాపించి ఉన్నట్లుగాను అనిపిస్తోంది, వ్యాప్తమై ఉంది. ఇది నిజమే, కాని ఆ బిందువు జాడ తెలియటం లేదు. ఇప్పుడు దశ ఎలాంటిదంటే, విద్యుత్ (Electric current) నన్ను పట్టుకుని ఉన్నట్లుగాను, దానిని వదిలించుకోలేకపోతున్నట్లుగాను ఉంది. (Unconsciousness) స్పృహలేనివంటి దానిలో ఎప్పుడైనా (Consciousness) స్పృహ కలిగినపుడు తపనయే ఉంటోంది. ఒకవేళ నేను స్పృహ కోల్పోయి ఉండకపోతే దానిని సహించటం కష్టమే. ఏ స్థితి ఉన్నదో దానిలోనే ఉండాలని, మళ్ళీ స్పృహ కలగకూడదని నేను కోరుకుంటున్నాను. ఇల్లు ఎదుటనే ఉంది. నేను దాంట్లో దూరిపోవాలని అనుకుంటున్నాను. కాని ఎవరో నన్ను అడ్డగిస్తున్నారు. బయటివైపు అడ్డంగా ఉన్నాయి, అయినప్పటికీ ఇంటి దృశ్యం నాకు కనిపిస్తోంది. నా ఇల్లు నాదే. ఎప్పుడైనా దెబ్బ తగిలినపుడు లేదా కొట్టుకున్నపుడు స్పృహ కలిగినా అది స్వచ్ఛంగా ఉండటం లేదు. ఒకవేళ స్వచ్ఛమైన స్పృహయే కలిగినట్లయితే, నా ఎదుట ఉన్న తపన నా ప్రాణాలనే హరించి వేస్తుంది. అప్పుడప్పుడు ఏదో (Shock) అఘాతం వంటిది నాకు అనుభవమవుతున్నట్లుగాను, అది నా కణకణంలో (Divinity) దివ్యత్వాన్ని చైతన్యపరుస్తున్నట్లుగాను అనిపిస్తోంది. షాక్స్ అనేవి నాకు తరచుగా అనుభవమవుతూనే ఉన్నాయి. ఈ షాక్‌లే సామ్య మరియు (Great divine power) పరమ మహాశక్తిలో కోల్పోకుండా మనల్ని పైకి నెట్టుతూ ఉంటాయి. ఇంటిలో మునిగిపోవటం నుంచి కేవలం మనల్ని పైకి లేవనెత్తుతాయేగాని, దూరంగా మనల్ని విసరివేయవు. దాని మూలంగా మనం మన ఇల్లు అనే దానిని చూస్తూనే ఉంటాము. కాని అందులో దూరిపోలేము.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 857

షాజహాన్‌పూర్,
28.06.1968

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరం చేరింది. దానిలోని సంగతులు తెలియగానే ఆ స్థితుల పరమానందం (Bliss) నా ఎదుట నిలిచినట్లుగా అనిపించింది. ఆ ఉన్నత స్థితుల యొక్క అత్యంత పరమానంద స్థితిని నీకు కల్పించినందుకు లాలాజీ సాహెబ్‌కు నేను ఏ విధంగా ధన్యవాదాలర్పించగలను! "ఏదో ఆకర్షణ నన్ను ఎంత వేగంగా తనవైపు ఆకర్షిస్తూ ఉందో అంతే వేగంగా నేను దానిలో కలిసిపోవాలనిపించింది. కాని అలా జరిగినట్లయితే ప్రాణం హరించుకు పోయేట్లుగా ఉంది" అని నీవు వ్రాసిన స్థితి ఎంతో రమణీయంగా ఉంది. ఆ స్థితి నీ వశంలో లేకుండాపోయే పరిస్థితి ఏర్పడినట్లయితే పూజగదిలో పూజా పీఠానికి ఎదురుగా కూర్చోవాలి. ఇటువంటి స్థితిలో శిష్యులు గురువుకు అతిసమీపంలో ఉండాలి. పరిస్థితి నీ వశంలో లేకుండాపోయే సందర్భంలో ముందుగానే లాలాజీ సాహెబ్ తమ శక్తితో దానిని నియంత్రించటం, వారి కృపకు నిదర్శనం. "బిందువులో సముద్రం పీల్చుకుపోబడింది లేదా బిందువులో సింధువు విలీనమై పోయింది. అప్పుడు బిందువు తన ప్రియతముడైన సముద్రం (సింధువు) ఎక్కడ ఉన్నది అని తపన చెందుతున్నట్లుగా అనిపిస్తున్నది" అని నీవు వ్రాసిన స్థితి నీలో కలిగినందుకు నిన్ను ఏ విధంగా ప్రశంసించగలను! ఇప్పుడు నీయొక్క ప్రతిస్థితి సందర్భంలోను దృష్టి పెట్టాల్సి ఉంది. ఒక యదార్థమైన విషయం ఏమిటంటే, కరెంటు నిన్ను పట్టుకోవటం లేదు కాని (Divine Power) దివ్యశక్తి నీలో ప్రవేశిస్తూ ఉంది. దైవం అనుగ్రహస్తే (సెంటర్ రీజియన్) కేంద్ర మండలంలో నీవు ఈదటం కూడా ప్రారంభించగలవు.

మీ అందరికీ ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 858

మోడీనగర్,
08.08.1968

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. చాలా రోజుల తర్వాత తమకు ఉత్తరం వ్రాస్తున్నాను. నా ఆరోగ్యం ఇప్పుడు బాగుపడింది. తమరు చింతించవద్దు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశను గురించి చెప్పాలంటే, ఒక చీకటి గుహ వంటి దానిలో నేను ప్రవేశించి వెళ్తున్నాను, కాని దాని అంతం ఎక్కడో తెలియటం లేదు. అక్కడ వెలుతురు అయితే లేదు కాని, అన్ని కనిపిస్తూనే ఉన్నాయి. ఒక నూతన ప్రకరణం (New para) నా ఎదుట తెరవబడి, విస్తరించి ఉన్నట్లుగాను, నాకు అంతా కనిపిస్తున్నట్లుగాను ఉంది. ఎదుట ఉన్న దానిని త్వరత్వరగా తనలో జీర్ణించుకోవాలని శరీరం తహతహలాడుతోంది. వాస్తవిక ధ్యానం (Real Meditation) తెరచుకుని విస్తరించి ఉన్నట్లుగాను, స్వయంగా కల్పించకపోయినాగాని, ఆలోచనల పరంపర ఏమి లేనట్లుగా అనిపిస్తోంది.

నడక, ఈదడం అయితే ఉన్నాయి కాని, వాటి గురించిన జాడ తెలియటం లేదు. కాని, ఒక ఊహ వంటిది మాత్రం ఉంది. అది ఆత్మ యొక్క వ్యాప్తి వంటిదిగా ఉందని అనిపిస్తోంది, కాని ఆత్మిక స్థితి అంటూ ఏమి లేదు. ఆత్మతో సంబంధం లేకుండా ఉంది. గుడారం (Tent) ఎక్కడో పాతబడి ఉన్నట్లుగాను, తడుముకుంటూ దానిని

చేరుకోవాల్సి ఉన్నట్లుగాను అనిపిస్తోంది. ఇప్పుడు ఆకర్షణ అనేది ఎక్కడా లేదు. నడుస్తున్న వారిలోగాని, పిలుస్తున్నవారిలో గాని ఆకర్షణ లేకపోగా, మొత్తం ఆకర్షణయే సమాప్తమైపోయింది.

ఇప్పుడు ఎందుకోగాని, ఆత్మ కరిగిపోయి చెల్లాచెదురైపోయినట్లుగా అనిపిస్తోంది. కణకణంలోను ఆత్మ కనిపిస్తున్నట్లుగా ఉంది. నేను ఎక్కడ చూసినా నా ఇల్లే వ్యాపించి ఉన్నట్లుగా అనిపిస్తోంది. కాని తెలిసిన ఇంకొక విషయం ఏమిటంటే, నాకు దేనితోనూ సంబంధం లేదు. ఆలోచనలు స్వయంగా ఉత్పన్నం కాకపోతే వాటితో పెనగులాటయే లేదు. ఇంకొక విషయం ఏమిటంటే, ఎటువంటి యాత్ర లేదా స్థితి ఉన్నాగాని, ఇల్లు (మకాం) నా ఎదుటనే విస్తరించి ఉన్నాగాని నేను దానిలో ప్రవేశించలేకపోతున్నాను. అయితే ఒక్కటి మాత్రం ఖాయం, ఏమిటంటే, నేను ఇంటిలో ప్రవేశించలేకపోయినా, నేను ఇంకెక్కడో దూరి ఉన్నాను. అక్కడ నాకు తీరికంటూ లేదు, అలాగని నేను దేనిలోనూ మగ్నమై ఉండలేదు. నా దశ ఏమిటో నాకు అర్థం కావటం లేదు. ఏదో మత్తు వంటిది నాలో ఎప్పుడూ చోటుచేసుకుని ఉన్నట్లుగా అనిపిస్తోంది. నా లోన, బయట కణకణాలు అన్నీ పూర్తిగా స్థిరంగా లేకపోవటమే కాకుండా, జడంగా (నిర్జీవంగా) అయిపోయాయి అని అనుభవమవుతోంది. ఒక వినమ్రమైన, మృదువైన స్థితి, తోడై నడుస్తోంది. కాని, అది జడమైనది కాదు, నా దశ కాదు, సహజంగానే నడుస్తున్నట్లుగా ఉంది.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 859

మోడీనగర్,

18.09.1968

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. చాలా రోజులుగా తమ సమాచారం తెలియరాలేదు. అందరికీ దిగులుగా ఉంది. దయచేసి వెంటనే తమ సమాచారం తెలియజేయండి. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక స్థితిని గురించి వ్రాస్తున్నాను.

నా స్థితి ఎలా ఉందంటే, గాయాలు అన్నింటిమీద ఎవరో ఉపశమనం కలిగించే పైపూత మందు రాసినట్లుగా ఉంది. అయితే ఇక్కడ గాయమైతే లేదు కాని, మందు మాత్రమే ఉంది. ఇదే భేదం. అర్థంకాని విషయం ఒకటి ఏమిటంటే, స్థితిలో కలిసి ఉండునట్లుగా ఊహిస్తూ ఎక్కువసేపు దానికి హత్తుకుని ఉన్నట్లయితే మనస్సు గాబరాపడుతోంది. కాని ఎంత బాగున్నట్లు అనిపిస్తున్నదంటే, నేను మళ్ళీ మళ్ళీ దానినే చూడాలని కోరికగా ఉంటోంది.

ఇప్పుడు ఇదేమిటోగాని, స్వప్నంలో రాత్రంతా తమతో మాట్లాడుతూనే ఉన్నాను, కాని స్వప్నాలు ఎంత (Dim) పేలవంగా ఉంటున్నాయంటే అవి స్వప్నమను భ్రమయే అన్నట్లుగా ఉంది. నేను వాటిల్లో (స్వప్నాల్లో) తమరిని మరియు నన్ను చూడలేకపోతున్నాను. అయితే నేను తమవద్దనే ఉన్నాను అన్న ఒక ఆలోచన లేదా ఊహ వంటిది ఉంటోంది, కాని అది భ్రమ మాత్రంగానే ఉంటోంది. అయితే దీనిని తమరు 'సత్యం' యొక్క భ్రమగా చెప్పవచ్చు. ఇలా ఎందుకయ్యిందో ఏమో తెలియదు కాని, నాలో తెలివిగాని, ప్రేమగాని, అనుభవంగాని, అంచనా గాని మరేమీ లేవు. 'మాలిక్' మరియు నా సంబంధం కూడా నిలవటం లేదు. అది ఎటువంటిదంటే, 'మాలిక్' 'మాలిక్'యే! నేను కేవలం 'వారి' చరణాలవద్ద ఒక గడ్డిపోచను. ఎటువంటి ఆలోచనగాని, అనుభూతిగాని ఎప్పుడూ రావటం లేదు. కాని మాట్లాడుతూ ఉన్నపుడు లేదా ఎప్పుడైనాగాని, సమయోచితంగా ఏదైనా విషయం వచ్చినపుడు, అది ఈ విషయాలన్నింటినీ స్మరణలో తాజాగా నిలుపుతున్నట్లుగా నేను గ్రహిస్తున్నాను. ఇంకేమి కాకుండా, జ్ఞాపకమైతే కల్పిస్తుంది, కాని మాటలు సమాప్తమైపోగానే, సమయం / సందర్భం గడచిపోగానే నేను మళ్ళీ యథాతథంగా

అయిపోతున్నాను. నేను ఏ మార్గంలో సంచరిస్తున్నానో నాకు తెలియదు. ఎక్కడా (Path) మార్గంగాని, (Traveller) మార్గగామి గాని, (Guide) మార్గదర్శకుడుగాని ఎవ్వరూ కనిపించకపోయినా నేను ముందుకు పోతూనే ఉన్నాను. అదృశ్యంగా గాని, తెలియకుండా గాని అప్పుడప్పుడు నా శిరస్సు మీదగాని, భుజంమీదగాని ఒక చేయి ఉంచినట్లుగా అనిపిస్తుంది. ఆ జ్ఞాపకంతో నేను ఆనందపరవశమైపోతాను. ఆ పరమ ప్రియంగా అనిపించే హస్తం నుంచి ప్రేమరసం స్రవిస్తుంది. నేను దానిని పానంచేసి (త్రాగి) మర్చిపోతాను. కాని నేను ఆ రసం స్రవిస్తున్నా కూడా, ఆ సమయంలో నేను పొడిగానే (Dry) ఉంటున్నాను. ప్రశ్నలకు సమాధానం చెప్పుతున్నపుడు కూడా, జవాబు ఏమి చెబుతున్నానో తెలియటం లేదు. ఆ తర్వాత కూడా తెలియకపోతుంది, కాని ఇతరులు చెప్పిన దానినిబట్టి నేను సరైన సమాధానం ఇస్తున్నట్లుగా నిరూపించబడుతుంది. నా సహజమార్గ విషయాలను నేను తెలియజెప్పుతున్నాను. లేకపోతే నాకేమీ తెలియదు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 860

మోడీనగర్,
12.10.1968

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. ఇక్కడ అందరూ కుశలమే. తమరు కూడా కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక స్థితిని గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఎలాంటి దశ ఉన్నదంటే, నా దశ బాగుందని చెప్పవచ్చునా అనేది నాకు తెలియటం లేదు. ఎందుకంటే, దీని కోసం రెండు విషయాలు చెప్పాల్సిన అవుసరం ఉంది. ఒకవైపున (Extreme staionary) అపరిమితమైన నిలకడ లేదా (Extreme stability) అపరిమితమైన స్థాయిత్వపు స్థితి ఉంది. మరోవైపున, ఇంకేవైపుకు చూడకుండా, గమనం వేగాన్ని (Velocity of moving) గ్రహించకుండా నడకను కొనసాగిస్తున్నాను. కాని ఇప్పుడు బాగున్నట్లు అనిపించటం లేదు. 'వారు' అన్ని ఇచ్చేవారు. ఇదంతా కేవలం మనస్సును సంతోషపరచే దశగానే అనిపిస్తోంది, కాని అది నాకు సంతోషం ఇవ్వలేకపోతోంది. అప్పుడప్పుడు అపరిమితమైన శక్తి నా ఎదుట ఉన్నట్లు ఉంటుంది. అప్పుడప్పుడు (Vision) దూరదృష్టితో చూసే దృశ్యం వంటిదిగా అనిపిస్తుంది. అయితే వేటితోను నాకు సంబంధం లేదు. ఇప్పటిదాక నేను కేవలం ఒక తమాషాలాగా అన్నింటినీ తిలకిస్తున్నాను. వాస్తవంగా నేను ప్రేక్షకురాలను అని చెప్పకూడదు, ఎందుకంటే, దృష్టితోను, తమాషాతోను నాకు సంబంధం లేదు. నాకు ఇప్పుడు ఆంతరికమైన మరియు బాహ్యమైన సంబంధం ఏమీ లేదు. నేను ప్రాపంచికపు సాధారాణ బాలికలాగా ఉన్నాను, ఆమెలో ఏమీ లేదు.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 861

మోడీనగర్,
25.12.1968

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. దాదాపు రెండు నెలల తర్వాత ఈరోజు తమకు ఉత్తరం వ్రాస్తున్నాను. ఈ ఆలస్యానికి దయచేసి తమరు ఈ కుమార్తెను క్షమించగలరు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వివరిస్తున్నాను.

ఈ దశ ఎటువంటిది అంటే, దానికి కారణం అంటూ ఏదీలేదు. కారణం లేకపోతే, అది ఏమై ఉంటుంది? దీనిని ఉన్నది, లేనిది అనే భ్రమగా చెప్పవచ్చు. భ్రమ అనేది ఏ వస్తువును గురించియైనా కావచ్చు. అయితే నా గ్రహింపుకు వస్తున్నది ఏమిటంటే, అసలు వస్తువు అంటూ ఏదీ లేకపోయాక, దానిని గురించిన భ్రమ అని కూడా ఎలా చెప్పగలం! ఏ (Stage) దశయో, (State) స్థితియో ఏమి లేకుండానే ఏమని చెప్పగలం. దశ అనేది లేకపోతే మానసిక ఆనందం కూడా ఏమి ఉంటుంది, ఏమని చెప్పగలం. కాని మనస్సు ఎక్కడా నిలవటం లేదు. స్థితిని గురించి ఏమని వ్రాయాలి? ఒకవైపున (Extreme stable condition) అమితమైన నిలకడ (కట్టడి) స్థితి వ్యాపించి, నిలిచిపోయింది. ఇంకొక వైపున నాకు శాంతి లేదు. నేను నడుస్తూనే ఉన్నాను కాని, వాస్తవంగా ఎవరో నన్ను తనలోనికి లాక్కుంటున్నారు. అయితే అక్కడ ఆకర్షణ లేదు. నేను ముందుకు ఎక్కడ ఆగకుండా నడుస్తూనే ఉన్నాను, కాని వేగం ఏమాత్రం లేదు. సమయం సద్దుమణిగి పోయింది. దీనికి బంధనం అంటూ లేదు, ఎందుకంటే, సమయం, సమయం కాకుండా పోయింది. ఎక్కడా (Complexity) కాఠిన్యంగాని, (Simplicity) సరళత్వంగాని లేవు. ఎక్కడా (Difficulty) కష్టంగాని, (Naturalness) సహజత్వంగాని లేవు. అక్కడ ఏమి లేదు అయినా కూడా ఏదో ఉంది. అది అంగీకరించక తప్పదు. నేను ఒప్పుకున్నా, ఒప్పుకొనకపోయినా ఏమవుతుంది. ఏది ఉందో అదే ఉంటుంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 862

మోడీనగర్,

01.01.1969

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందని ఆశిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక స్థితిని వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఈ దశలో ఎలా ఉంది అంటే, సంపాదించుకున్న లయ–అవస్థ ఏదైతే ఉందో, అదంతా ఎక్కడికో పోయినట్లుగాను, నేను మాత్రం ఎలా నిలబడి ఉన్నానో అలాగే నిలబడి ఉన్నట్లుగాను అనుభవమవుతోంది. ఇది ఎంత (Simple) సాదాస్థితి అంటే, దీనిని వివరించటం కష్టమనిపిస్తుంది. ఇంకొక విధంగా చెప్పాలంటే, కేవలం ఒక స్థితి అంటే ఒక స్థితియే అని చెప్పాల్సి ఉంటుంది. దానిని అంచనా వేయటం లేదా వివరణ అంటే కొంత వక్రీకరించ బడుతుంది, అది నాకు ఇష్టంగా ఉండదు. ఇప్పుడు తారుమారైపోయింది. లయ–అవస్థను గురించి ఆలోచించినట్లయితే, అది నాకు పూర్తిగా ఒక ఎండిపోయిన వస్తువులాగా అనిపిస్తుంది. దానిని గురించిన ఆలోచనగాని, మరేదైనాగాని ఆ అసలు (రియాలిటి) లేదా ఒక స్థితి ఏదైతే ఉందో దానిని స్పృశించలేకపోతోంది. ఇప్పుడు ఒక స్థితి ఉంది. స్థితి అంటే స్థితియే. దానిని గురించి ఏమి చెప్పాలన్నా సాధ్యపడదు. దానిని గురించి ఏదైనా చెప్పటానికి, దృష్టిని రెండుగా మరల్చవలసి ఉంటుంది, అయితే అది సహజత్వానికి లోబడి ఉండదు. దానిని అంచనా వేయటం కూడా సహించరానిదిగానే ఉంటుంది. కాని ఇలా చెప్పవచ్చు: దాని అంచనా దాని నుంచి నన్ను వేరుపర్చాలనుకుంటుంది. మరైతే అది అనగా స్థితి ప్రాణంలాగ అవుసరమైనదిగా ఉంటుంది. చెప్పటానికైతే ఇలా చెబుతాను, ఏమంటే, ఏదైతే (స్థితి) పూజకు పూర్వం ఉండేదో అదే ఇప్పుడు మొత్తంలో జీర్ణించుకుపోయింది అని, లేదా ఇలా చెప్పవచ్చు– ఏమని అంటే, ఈశ్వరుని జ్ఞాపకంగాని, 'అతని' ఆలోచనగాని రావటానికి పూర్వం ఏ స్థితి అయితే ఉండేదో, అదే ఇప్పుడు అంతటా జీర్ణించుకపోయింది అని. తడుముకోవాల్సిన అవుసరం లేకుండానే అంధకారంలో ముందుకుపోతున్నాను.

అంధకారంలో వెళ్తున్నాగాని దానిని అంధకారం అనటానికి వీల్లేదు. ఇప్పుడు నాకు ఏమైందో తెలియదుగాని, ఆత్మకు కూడా ఒక ఆవరణ అంటూ ఉందని, అది నిర్మలమైపోయి చెదిరిపోయిందని, 'ఆత్మ' శబ్దం ప్రయోగించటం కూడా నాకు కష్టంగా ఉందని, నాకు అనుభవమవుతోంది. ఎందుకంటే, ఇవి నన్ను నా అసలు స్థితి (రియాలిటి) నుంచి వేరుచేస్తున్నాయి.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 863

మోడీనగర్,
08.01.1969

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు షాజహాన్‌పూర్ చేరి ఉంటారని అనుకుంటున్నాను. తమరు మా అందరిపట్ల ఇంత దయ చూపుతున్నందుకు, మేమందరం తప్పకుండా భాగ్యశీలురమే. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

ఈ దశలో హృదయానికి (Concentration) ఏకాగ్రత సహించరానిదిగా ఉంటోంది. ఏకాగ్రత నిలుపుతుండగానే హృదయం గాబరా చెందుతోంది. చేపను నీటి నుంచి బయటకు తీసినపుడు అది విలవిల లాడినట్లుగానే ఇది (హృదయం) ఉంటోంది. నేను ధ్యానంలో కూర్చోలేకపోతున్నాను. ఎందుకంటే, హృదయం దానికి తెలియనంతగా ప్రాణాహుతి (ట్రాన్స్‌మిషన్) ఉండాలని కోరుకుంటోంది. ఇది జాలిపడాల్సిన ఒక వింత స్థితి. నేను తమతో మాట్లాడుతూనే ఉన్నప్పటికీ నాకు తమ జ్ఞాపకం రావటం లేదు, ఎందుకో తెలియదు. నాకు తమరిని జ్ఞాపకం చేసుకుంటున్నట్లుగా ఎప్పుడూ అనిపించటం లేదు. తమ జ్ఞాపకాన్ని ఎలా జ్ఞాపకం చేసుకోవాలి? అని కూడా అనిపించటం లేదు. ఇంకా ఏమిటంటే, ఎప్పుడైనా ఒక క్షణంపాటు జ్ఞాపకం యొక్క జ్ఞాపకం వస్తున్నట్లు అనుభవమైనాగాని, అది నన్ను 'మాలిక్' నుంచి ఎవరో వేరుపర్చటం మూలంగానేనని అనిపిస్తోంది. ఇప్పుడు జ్ఞాపకం కలగడమంటే, నన్ను వేరుపర్చి కష్టపెట్టడమే. ఇలా ఒకటి లేదా అర క్షణంపాటు జరుగుతూ ఉండేది కాని, ఇప్పుడింక అలా జరగటం లేదు. జరగబోదు కూడా అని అనిపిస్తోంది. లోన, బయట ఎక్కడ చూసినా ప్రతిదీ (Infinite) అగమ్యంగాను, (Unlimited) అపరిమితంగాను కనిపిస్తోంది. నా కణకణాన్ని పరిశీలించినప్పుడు అవి అపరిమితంగా ఉండి స్మృతికి రావటం లేదు. మనస్సు ఎంత నిశ్చలంగా ఉండిపోయింది అంటే, ఏదైనా ఆలోచన కల్పించుకోవాలంటే, దానిని గింగరాలు పెట్టించవలసి వస్తోంది, ఏదైనా తగిలినపుడు ఎలా ఉంటుందో అలా. ఆ తర్వాత ఏదైనా సమస్యగాని, ఆలోచనగాని ఎదురైనపుడు, అవి వాటంతటవే పరిష్కారమైపోతాయి. ఇప్పటివరకు ఈ పని చేయాలి, ఆ తర్వాత ఈ పని చేయాలని తటస్థపడుతూ ఉండేవి, కాని ఇప్పుడు పనులు ఒక దాని తర్వాత ఒకటి వాటంతటవే జరిగిపోతున్నాయి. నా దృష్టికి ఏ పని జరగకుండా మిగిలి ఉన్నట్లుగా లేదు. ఇటువంటి ఉదాసీన స్థితి (Melancholy condition) ఉండటం వలన జీవించటం కూడా దుర్భరమైపోతున్నది. హృదయం ఇలా రోదిస్తుంది – "లగ్‌తా నహీ హై దిల్ మేరా ఉజడె దయార్ మెం" – నా హృదయం ఈ పాడుబడ్డ క్షేత్రంలో ఉండలేకపోతోంది, అని. తమరు ఎదుట ఉన్నట్లుగాను, 'తమ' శిరస్సు పైనుంచి నా వరకు కాంతిలేని కాంతిపుంజం ప్రవహిస్తున్నట్లుగా చూస్తున్నాను. 'తమరి'నైతే నేను చూస్తున్నానుగాని నన్ను 'తమరి'లో చూడలేకపోతున్నాను. ఒకసారి ఆ కాంతిపుంజం నన్ను ఎత్తి 'తమ'లో ప్రవహింపజేసి ఒకటిగా (ఏకం) చేసినట్లుగాను, కాని నన్ను నేను స్వయంగా చూడలేకపోయినట్లుగాను అనిపించింది. ఇప్పుడు సదా నాలోకి

ఏదో ప్రవాహం వస్తున్నట్లుగాను, కాని నేను దానితో ఎటువంటి భావం లేకుండా ఉన్నట్లుగాను అనుభవమవుతోంది.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 864

మోడీనగర్,

07.02.1969

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఇక్కడ కొంత కాలం క్రితం నా ఆరోగ్యం కొంత పాడయ్యింది, కాని ఇప్పుడు బాగానే ఉంది. ఎంతమాత్రం విచారించాల్సిన పనిలేదు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక స్థితిని వ్రాస్తున్నాను.

ఈ దశ ఎలా ఉందంటే, నా కణకణంలోను ఒక సాటిలేని (Softness) మృదుత్వం వంటిది వ్యాపించినట్లుగాను, ఇప్పుడు నా ప్రతికణం ఒక అద్దంలాగా అయిపోయినట్లుగాను, దానిలో ఎటువంటి ప్రతిబింబంగాని, నీడగాని కనిపించనట్లుగాను అనిపిస్తోంది.

ఇది ఎటువంటి నిస్సారమైన (Monotonous) దశ అంటే, నా జీవితానికి ఏ ఉద్దేశ్యం లేనట్లుగా ఉంది. తపన అనేది లోపలి నుంచి సూక్షాత్మి సూక్ష్మంగా కలిగి చెదిరిపోయింది, కాని నాకయితే దాని అనుభూతి కలగలేదు. అప్పుడప్పుడు శక్తి మరియు సమర్థతల అంచనా నా స్థానంలో పొందగలుగుతున్నాను, కాని నాకు ఏదైతే కావలసి ఉందో దాని ఉనికి మాత్రం తెలియటం లేదు. ఆ కోరిక ఎంత గాఢంగా పాతుకుపోయింది అంటే, నాకు దాని అంతుచిక్కటం లేదు. కాని 'అతడి' ఆకర్షణ నన్ను శాంతంగా ఉండనివ్వటం లేదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 865

మోడీనగర్,

03.04.1969

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. చాలా రోజుల తర్వాత తమకు ఉత్తరం వ్రాస్తున్నాను. నాకు స్వస్థత చేకూరుతోంది. నీరసం కూడా చాలావరకు తగ్గింది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

జీవితానికి చెందిన పనులన్నీ పూర్తయిపోయినట్లుగా అనిపిస్తోంది. పూర్తిగా శూన్యంగా (ఖాళీగా) కూర్చుంటున్నాను. కాని శూన్యం అంటే శూన్యత్వంగా అర్థమవుతుంది, అయితే అది నాలో లేదు. అయినా కూడా నేను ఒడ్డున పడియున్నట్లుగా ఉంది. రోజంతా శరీరం మరియు మనస్సుతో కొంత పని జరపబడుతుంది, అయినా కూడా నేను ఖాళీగానే కూర్చుంటున్నాను. ఇంత జనసమూహంలో ఉంటూ కూడా నేను ఒంటరిగా ఇంట్లో కూర్చున్నట్లుగా ఉంది. నా ఎదుట (Deserted field) ఊసరక్షేత్రమే ఉంది. నేను ఏమి చేయాలి, ఎక్కడకు వెళ్ళాలి, ఎలా చేయాలి అనేది అర్థం కాకుండా ఉంది. మనస్సు అశాంతిగా ఉంది. కాని అశాంతి లేదా మనస్సు ఎంత పరాయివిగా ఉంటున్నాయంటే, వాటితో నాకు సంబంధం లేనట్లుగా ఉంది. ఎందుకో తెలియదు కాని, నేనే స్వయంగా నాతో పరాయిదానిగా ఉంటున్నాను. ఇది యదార్థం. నేను ఈ విషయం దాచిపెట్టున్నాను. కాని ఇప్పుడు చెప్పక తప్పలేదు. తరుచుగా నాకు ఏమి అనిపిస్తున్నదంటే, నా బాబూజీ, శ్వాసలో తమకు ఎంతో సమీపంలో ఉంటున్నాను, కాని

ఇప్పుడు మరెవ్వరి శ్వాసయో నాలోకి వస్తున్నట్లుగా అనిపిస్తోంది. ఆలోచనలో తమతో ఎంత సామీప్యత లేక ఏకత్వం ఉంటున్నదంటే, తమ మాటలు నావిగా ఉంటున్నట్లు ఉంది. ఆలోచనలోను లేదా వ్రాయటంలోను, ఏదైతే వ్రాయబడుతూ ఉందో, అంతా తమది అన్నట్లుగానే ఉంటోంది. నా యొక్క ప్రతి లేఖను చదువుతుంటే, నేను మరెవ్వరి లేఖనో చదువుతున్నట్లుగా నాకు అనుభమవుతోంది. దృఢత్వం ఎంతగా పట్టు పట్టిందంటే, తరచుగా నేను మనిషిని కాకుండా ఒక శిలనని అనిపిస్తోంది. ఇంకొక స్థితి ఏమిటంటే, ప్రతి ఒక్కరి కష్టంలోను వెంటనే అశ్రువులు స్రవించటానికి సిద్ధంగా ఉంటున్నాయి. హృదయం ద్రవించటానికి తయారుగా ఉంటోంది. ఇవన్నీ వాస్తవమే అయినా నేను మాత్రం నిజంగా శిలనే. ఏమి మాట్లాడలేను, వ్రాయలేను. ఎటువంటి భావంగాని, భావనగాని లేవు. ఉన్నదానిని ఉన్నట్లుగా ఒక శిలగా మారిపోయి ఉన్నాను.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 866

మోడీనగర్,

08.04.1969

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందనుకుంటున్నాను. ఇక్కడ అందరూ కుశలమే. తమరు కూడా కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

ఈ దశ కొంచెం విచిత్రంగా ఉంది. ఎందుకంటే, నిద్రపోతున్నప్పుడు నిద్రపోతున్నది నేను కాకుండా మరెవ్వరో అన్నట్లుగా అనుభవమవుతోంది. నేను అసలు ఎప్పుడూ నిద్రపోవటం లేదు, మేల్కోవటమూ లేదు. అంతటా ఒకే స్థితి వ్యాపించి ఉంది, అది ఏమంటే, నిద్ర కాదు, జాగరణ కాదు. ఎటువంటి పరిస్థితిలోనైనా ఎప్పుడూ నేను తిరిగి రావటమంటూ ఉండదో, ఆ స్థితిలో నేను కలిసిపోయాను. నిద్రలో కూడా నేను తిరుగుతున్నట్లు అనిపిస్తోంది. నా పని ఇంకెక్కడో ఉంది. అలాగే మేల్కొని ఉన్నపుడు, ఇంటి పనులు చేస్తున్నపుడు కూడా ఇలాగే అనిపిస్తోంది. ఇక్కడి పనులు నేనే చేస్తున్నప్పటికీ, అవి నన్ను తాకటం లేదు అన్నట్లుగా అనిపిస్తోంది. నేను ఎక్కడో నిమగ్నమై ఉన్నట్లు అనిపిస్తుంది.

ఇప్పుడు నా స్థితి ఎలా ఉందంటే, నా స్పర్శ నాకే కలగనట్లుగా ఉంటోంది. అదే విధంగా అందరి విషయంలోను అనగా (Animate, inanimate) జడ చేతనా లన్నింటిపట్ల అదే స్థితి ఉంటోంది. అది ఏదైనా ఆఖరికి మురికిదైనా వాటిపట్ల ద్వేషంగాని, అంటుకోరాదనే భావంగాని ఉండటం లేదు. జీవిత చక్రం (Cycle of life) ఎలా అయిపోయింది అంటే, దానిని అదుపులో పెట్టుకోలేకపోతున్నాను. నేనయితే లోన, బయట అంతా శిలగా (రాయిలాగా) అయిపోయాను. నా డైరీ చదువుతూ ఉంటే, మరెవ్వరి గురించో చదువుతున్నట్లుగా అనిపిస్తోంది. తమరు ఎప్పుడైనా నేను ఫలానా స్థానంలోగాని, పాయింట్‌లోగాని ఉన్నాను అని చెబితే కూడా నాకు ఆ స్థానంగాని, పాయింట్‌గాని తెలియటం లేదు. ఈ కారణంగా నేను అక్కడకు చేరుకోవటానికి అశాంతిగా ఉంటూ ఉన్నాను. అయితే ఇప్పుడు నేను ఎక్కడ ఉన్నానో తెలియనపుడు అక్కడకు చేరాలని, ఎందుకు విలపించాలి, పెడబొబ్బలు పెట్టాలి. నేను ఇప్పుడు పూజ ఎలా చేయాలి, ఎందుకంటే, నేను కళ్ళు మూసుకోగానే విలపిస్తున్నాను. ఒక విధమైన అశాంతి వలన కళ్ళు బలవంతంగా తెరచి ఉంచాల్సి వస్తోంది. స్వయంగా నావైపుగా నన్ను పట్టుకునిపోయే ప్రయత్నం చేస్తూ ఉండగానే గుండె గాబరా చెందుతోంది. కేకలు పెట్టాలనిపిస్తోంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 867

మోడీనగర్,
21.04.1969

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఆరోగ్యం ఇప్పుడు అంత బాగుండలేదని తెలిసి చింతిస్తున్నాను. దయచేసి తమ సమాచారం వెంటనే తెలియజేయండి. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశలో ఎలా ఉందంటే, 'సారూప్యత' కలగటం లేదు, 'సాయుజ్యత' యొక్క ప్రవేశం లేదు. 'లయ-అవస్థ' కూడా కలగటం లేదు. నేను అజ్ఞానురాలను అని చెప్పటానికి వీల్లేదు. ఎందుకంటే, అసలు ఏదీ లేకపోయాక నేను ఏమి చూడగలను. చూడటానికి నా ఎదుట విస్తరించి ఏదీలేదు. సామాన్యత (Simplicity) కూడా నన్ను వదిలిపెట్టి పోయినట్లుగా ఉంది. నగ్నంగా ఉన్న మనిషి ఇంక ఏమి విప్పుకుంటుంది, ఏమి ఉంచుకుంటుంది, ఎందుకంటే, వారేమి ధరించి ఉండరు కనుక! అన్నీ నా నుంచి లేకుండాపోయాయి. కేవలం మాటలకే పరిమితమైపోయాయి. అన్నివైపులా, లోన, బయట అన్నీ (Motionless) చలించనవిగాను, (Stable) స్థిరంగాను ఉన్నట్లు ఉంది. అన్నీ అని నేను ఏదైతో వ్రాశానో, అసలు అవి అంటూ లేకపోయాక, అచలంగాను, స్థిరంగాను ఉన్నాయి అని వేటిని గురించి చెబుతాను. అంతా ఉన్నది ఉన్నట్లుగా ఉంది. ఇక్కడ తరంగాలు ఏవీ ఎగసిపడలేదు, ఏవీ స్పర్శించనూ లేదు. అయినా కూడా మనస్సు యొక్క ఏ మూలనో ఏదో బాధ మూల్గుతుంది. అయితే అది కూడా నాకు ఎంత దూరంగా ఉందంటే, ఎప్పుడైనా కేవలం దృష్టికి వస్తుంది ఎవరో పరదేశీయునిలాగా. నేను ఇప్పటివరకు ఏదో అంతులేని మైదానం నా ఎదుట వ్యాపించి ఉందని వ్రాసినటువంటిది, ఇప్పుడు కనిపించటం లేదు, లేదా అసలు లేదేమో కూడా. నా లోపల, కోల్పోయిన అశాంతి నన్ను పిలుస్తున్నట్లు ఉంది, కాని నేను దానిని వినలేకపోతున్నాను. నాకు ఏమి అర్థం కావటం లేదు. ఇల్లు నాదే, కాని నేను పరాయిదాన్ని అన్నట్లు ఉంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 868

షాజహాన్‌పూర్,
26.04.1969

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

ఆశీర్వాదాలు. నీ ఉత్తరం చేరింది. నేను జూన్ 6న అస్సాం వెళ్ళి తిరిగి జూన్ 21న వస్తాను. చాలా రోజుల క్రితం నేను నిన్ను మొదటి వలయం వరకు లాగాను. అయితే ఆ వలయం మీదా, ఇతర వలయాలకు ముందూ రెండువైపులా నిరంతర స్మరణ (Constant Remembrance) అనేది ఉంది. ఇప్పుడు నిన్ను ఇంకా ముందుకు లాగాను, దానితో నీవు మొదటి వలయం మీదకు చేరతావు.

నీ హృదయానికి గాయమైంది, కాని నీవు నాకు వ్రాయలేదు. ఇప్పుడు ఎలా ఉంది? నాకు కూడా గాయమైంది, కాని అది ఎప్పటికీ మానిపోనిది. నేను జాగ్రత్తలు తీసుకుంటే అది కొంచెం నయమవుతుంది కాని, జాగ్రత్తలు

తీసుకొనకపోతే అది పెరుగుతుంది. నీవు నాతో ఆ జాగ్రత్తలు కొంచెంగానే ఉండాలని చెప్పినందున నేను ఆ విధంగా చేస్తున్నాను.

మీ అందరికీ ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 869

షాజహాన్‌పూర్,
04.05.1969

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

ఆశీర్వాదాలు. నీవు మొదటి వలయం మీద ఉన్నట్లుగా దీనికి పూర్వమే వ్రాశాను. దీనికి వెనుక ఉన్న మైదానం మీద కూడా నిఘా ఉంది. నేను ఇప్పుడు నిన్ను రెండవ వలయం వరకు లాగాలనుకుంటున్నాను. కాని నీవే స్వయంగా అక్కడకు వచ్చి తీరతావు, దానికి కొంత సమయం పట్టుతుంది. ఈ విధంగా తరచుగా ఆలస్యం కావటం జరుగుతూనే ఉంటుంది. శక్తి తన స్థావరం ఏర్పాటు చేసుకున్నప్పుడు అది ముందుకుపోతూ ఉంటుంది. నేను నీకు చాలాసార్లుగా చెప్పి ఉండటమే కాదు, ఇప్పుడు కూడా చెబుతున్నాను. **నీవు కనీసం 10 నిమిషాలు పండుకొని ఉండి, నీలోని సమస్త వ్యాధులు నయమైపోతున్నట్లుగాను, నీవు ఆరోగ్యవంతంగా అవుతున్నట్లుగాను భావనలో ఉండు. దీనిని నీవు ఇప్పుడు ఆచరించి చూడు. ఆరంభంలో తక్కువ సమయం కేటాయించు.**

మీ అందరికీ ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 870

మోడీనగర్,
04.07.1969

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం చేరింది. నేనే తమకు చాలా రోజులుగా ఉత్తరం వ్రాయలేకపోయాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

ఈ దశ ఏమిటో అర్థం కాకుండా ఉంది. మనస్సు నా వశంలో లేకుండా నాకు దూరంగా ఉంటున్నట్లు అనుభవమవుతోంది. ఇప్పటివరకు, ఎప్పుడైనా కాలికి బలంగా దెబ్బ తగిలితే, అప్పుడు ఒక్క క్షణంపాటు అది నా దరికి వస్తూ ఉండేది, మళ్ళీ మరుసటి క్షణంలోనే యథాతథంగా అయిపోయేది. ఇప్పుడు అది వచ్చినా, రాకపోయినా అంతా ఒకటిగానే ఉంది. కొంచెం కాలినపుడుగాని, తెగినపుడుగాని, తగిలినపుడుగాని మంట లేదా నొప్పి కలుగుతూనే ఉంటుంది. అయితే తరచుగా ఏమనిపిస్తుంది అంటే, ఆ మంట, బాధ ఎవరికో చెందినవి అన్న మాటలు వింటున్నట్లు ఉంటోంది. అదే విధంగా ఇతరుల బాధను నేను అనుభవిస్తున్నట్లు అనిపిస్తుంది. ఈ విధంగా తెగినప్పుడు, దెబ్బ తగిలినప్పుడు, రక్తం వస్తున్నచోట లేదా కాలినచోటును చూసి కేసర్ మందుకోసమని పరుగుపెట్టుతుంది. నా చేతిలో పని లాగేసుకుంటుంది. అప్పుడు నా గురించి నేను సిగ్గుపడతాను. అప్పుడు నేను ఆలోచిస్తాను, దృష్టి పెడ్తాను, కోరుకుంటాను, అయినా కూడా మనస్సు నా స్వాధీనంలోకి రాదు. 'తమరు' నాకు ఎంతో ప్రియమైనవారుగా అనిపిస్తారు, అయినా కూడా స్మరించలేకపోతున్నాను. ఎప్పుడూ స్మరించటం లేదు కూడ. ఈ విషయమై నాకు

మనస్సులో బాధ ఉంది. అభ్యాసులందరూ రోజంతా తమర్ని జ్ఞాపకంలో ఉంచుకుంటున్నారు, కాని నేను జ్ఞాపకం చేసుకోవటం లేదు. నేను ఎప్పుడూ 'తమరి'ని జ్ఞాపకమే చేసుకోలేదు. నేను చూస్తున్నది ఏమిటంటే, ఇటువంటి తమ భవ్యరూపాన్ని ఎంతగా మరచిపోయాను అంటే, అకస్మాత్తుగా 'తమరు' నా ఎదుట పడినాగాని జ్ఞాపకం రానట్లుగాను, జ్ఞాపకం చేసుకోవాల్సి వస్తున్నట్లుగాను అనిపిస్తోంది. ఇటువంటి దశ నా స్వరూపంగా అయిపోయి, తొలగించినా తొలగిపోవటం లేదు. ఇప్పుడు లేఖలు వగైరా వ్రాద్దామనుకున్నాగాని మనసొప్పటం లేదు, అందుకోసం ప్రయత్నించాల్సి వస్తోంది. ఏమి వ్రాయాలి అనేది కూడా స్ఫురించటం లేదు, కాని ఎప్పుడు వ్రాయగలుగుతానో అప్పుడు తప్పకుండా వ్రాస్తాను. మతిలేని దానితో 'మాలిక్' వ్రాయించాలని అనుకుంటున్నారు కనుక అలాగే వ్రాస్తాను. ఒకవైపు ఈ స్థితి ఉండగా, మరోవైపు ఎటువంటి స్థితి ఉన్నది అంటే, 'మాలిక్' యొక్క శక్తి భాండాగారం నాలో ఇమిడిపోయి జీర్ణమైపోయినట్లుగా అనిపిస్తోంది. అయితే నాకేమీ కష్టమని అనిపించటం లేదు. ఇప్పుడు తమ 'సహజమార్గం' రెండు అర్థాలుగా నా ఉదరంలో జీర్ణించుకుపోయింది సరళ శబ్దంలోను, సహజపు అర్థంలోనూ. ఎందుకంటే, ప్రకృతి నా కాళ్ళవైపు ఉన్నట్లుగా అనిపిస్తోంది. ఇప్పుడు నేను సహజ–మార్గం అయినా, కాకపోయినా, సహజ–మార్గం అంతా నాలో కరిగిపోయింది. కొన్ని రోజుల క్రిందట, నన్ను ఆవరించిన పరదా వంటిది పూర్తిగా తొలగిపోయింది. అప్పటి నుంచి మొత్తం శక్తి కేంద్రం నాలో లయమైపోయింది. ఇంకా ఏమిటంటే, నా లోపల నాలుగువైపులా కరెంట్ (విద్యుత్) వంటిది వెలువడుతున్నట్లుగా అనిపించింది.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 871

మోడీనగర్,
27.08.1969

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఇక్కడ అందరూ కుశలమే. 'తమరు' కూడా కుశలంగానే ఉన్నారని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

నిన్నటి నుండి ఎలా ఉంటున్నదంటే, నాకు ఎదుట ఉన్నచోట మరియు అన్నిచోట్ల నేనే కనిపిస్తున్నట్లు అనిపిస్తోంది, కాని నేను నాలో లేను. ఒకవేళ నా ఎదుటగాని, మరెక్కడైనాగాని చూడటానికి ప్రయత్నించినప్పటికీ, నాకేమి కనిపించటం లేదు. నిన్నటి నుంచి, ఎప్పుడైతే ఏదో పరదా శుభ్రంకాలేదని, కొంచెం మసక వంటిది వ్యాపించిందని అనిపించగానే, అప్పుడు వెంటనే అది శుభ్రపడిపోయింది. అప్పటి నుండి ఏమనిపిస్తున్నదంటే, తమ రూపాన్ని శ్రద్ధగా పరిశీలించినట్లయితే ఏమి లేనట్లుగా అనిపిస్తోంది. అలా అనిపించినా కూడా, తమరు ఉన్నారన్న భావానికి అంటిపెట్టుకుని పోతున్నాను. దీని మీద ఎక్కువ ధ్యాస నిలపటం లేదు. ఎందుకంటే, అలా ధ్యాస పెట్టినట్లయితే, అసలేమీ లేదని అనిపిస్తుంది. అదే విధంగా నేను తమ ఎదుట ఉన్నపుడు కూడా దృష్టి పెట్టినట్లయితే, నా ఎదుట ఏమీ లేనట్లుగానే అనిపిస్తోంది. ఇప్పుడు నేను (Automatic) తలవనితలంపుగా ఉన్న జీవితంతో జీవిస్తున్నట్లుగా అనిపిస్తోంది. అది ఎలా అంటే, ఏదైనా ఒక జీవి (Insect) నా పాదం క్రిందపడి మరణించినట్లయితే, నేను ఒక రక్తపు బొట్టును నా శరీరం నుంచి బయటకు తీస్తాను. కాని నేను ఇప్పుడు ఏమి తెలియకుండా, అనుభూతి చెందకుండా ఒక యంత్రంలాగా పని చేస్తున్నాను. నా లోపల (Faculties) వృత్తులన్నీ మరణించినట్లు అనిపిస్తోంది. (Tendency of violence) హింసాత్మక వృత్తిగాని, (Mercy) దయాత్మక భావాలుగాని లేవు, అంతా యధాతథంగా ఉంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 872

మోడీనగర్,

13.10.1969

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. చాలా రోజులుగా తమ సమాచారం తెలియలేదు. విచారంగా ఉంది. దయచేసి తమ సమాచారం వెంటనే తెలియజేయండి. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఎలా ఉందంటే, తెలియనిదేదో ఒకటి అడ్డుపడి నా స్థితిని తెలియనివ్వటం లేదు. అయినా కాని, స్థితియే స్వయంగా తన గురించి తెలియజేస్తున్నది. ఎందుకంటే, ఆ ఏదో అన్నదాని అడుగున ఏమి లేనట్లుగా చూస్తున్నాను. స్థితిలో ఈదుతూ ఉంటే బాగానే ఉంటోంది, కాని దానిని చూడాలనుకుంటే, వాస్తవంగా స్థితి ఏదైతే ఉందో అదే ఉన్నట్లు ఉంది, లేకపోతే ఏమీలేదు. దానికి ఎటువంటి అస్తిత్వం లేదు. ఎవరినైనాగాని, ఏ వస్తువైనా గాని చూడనపుడు అంతా ఒక నీడలాగా మనసులో ఉంటుంది, కాని దానిని నిశితంగా చూస్తే నీడ కూడా ఉండదు. ఇప్పుడు స్థితి, ఈ విధంగా అయిపోయింది. ఏ స్థితులైతే గడిచిపోయాయో, అవి వాస్తవంగా ఆధ్యాత్మిక స్థితులు కావు అని, ఆత్మ యొక్క భ్రమ అని చెప్పాల్సి ఉంటుంది. ఇప్పుడు మైదానం స్పష్టంగా ఉంది. అక్కడ ఆత్మలేదు, దాని భ్రమా లేదు. ఆత్మ ఒక పరదాగా ఉండి, దానిమీద (ఆత్మిక దశల) ఈ తమాషా అంతా తెలుస్తూ ఉంది. అయితే వాస్తవంగా ఏమిలేదు, అది చెప్పదగినదీ కాదు. ఇప్పుడు ఒక (Simplicity) సాదాతనం కాకుండా, చనిపోయినది, లూటీ కాబడినది, ఒక ఎడారి వంటిది అయిన ఒక స్వచ్ఛమైన సాదాతనమే కణకణంలోను వ్యాపించిపోయింది. కణకణం ఒక గాజులాగ అయిపోయి, దానిలోకి చూస్తే ఒక (Pure) స్వచ్ఛమైనది, (Humbleness) వినమ్రత లేదా (Unconcious) స్పృహ లేనటువంటి (Simplicity) సరళత్వం లీనమై ఉంది. ఒక (Firmness) దృఢత్వం నా చేతుల్లో ఉండేది, కాని అది కూడా ఇప్పుడు నా చేతుల్లో లేదు. దేనినైనా తయారు చేయాలన్నా, చెడగొట్టాలన్నా, నాకు అది చాలా చిన్న విషయం. 'మాలిక్' నిర్దేశించినట్లయితే ఈ విషయంలో నా అధికారం ఉంటుంది. 'అతడు' ఎలా తలిస్తే అలా జరుగుతుంది. ఈ ప్రపంచాన్ని సృష్టించటం, వినాశనం చేయటం నాకు చాలా చిన్న విషయం. దీనికిమించి ఇంకా చాలా పని ఉంది. అది కూడా జరగ్గలదు. కాని నేను అటువంటి దానను కాను. నేను 'మాలిక్' యొక్క ఆజ్ఞానువర్తినియై ఉన్నాను. కనుక "కస్తూరీ! ఈ పని చేయి" అని చెబితే, నాకు తెలియకుండానే 'వారి' ఆజ్ఞ రూపంలో, 'వారి'లో నుండియే వచ్చేస్తాను, అలాగే అయిపోతాను. ఆజ్ఞాపాలన తర్వాత ఏమీకానట్లుగా ఉంటాను. ఇక్కడ ఇంకొక విషయం ఏమిటంటే, నా లోపల అంతటా దృష్టి నిలిపినపుడు, శరీరమంతటా మరియు అణువణువులోను ఒక స్వల్పాతి స్వల్పమైన కంపనం (Vibration) వంటిది ఉంటోంది. దానిని నేను ఎప్పుడైనా తెలుసుకోవాలనిగాని, పొందాలనిగాని అనిపించటం లేదు. ఏ స్థానం, మైదానం లేకుండానే నేను వెళ్ళుతూనే ఉంటాను అయినా కూడా ఎటువంటి అటంకం ఉండదు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 873

మోడీనగర్,
17.10.1969

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. ఇక్కడ అందరూ కుశలమే. 'తమరు' కూడా కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఎలా ఉందంటే, (Vibration) ప్రకంపనం, నా కణకణంలోను, చివరకు రక్తంలోను కలిసిపోయినట్లుగా ఉంది, కాని బాగా పరిశీలించకుండా ఏమి తెలియటం లేదు. దీనిని కనుక పూర్తిగా విడుదల కానిచ్చినట్లయితే వేలకొద్దీ ప్రపంచాలను సృష్టించగలది, నాశనం చేయగలది అయిన శక్తి దీనిలో దాగి ఉంది. దీనిమీద బాగా దృష్టి నిలిపినట్లయితే, నా పనికోసం, నా ఆజ్ఞ కోసం సిద్ధంగా ఉన్నట్లుగా ఉంది. అయితే ఇటువంటి స్థితి సాధారణంగా అన్ని సమయాల్లోను ఉంటుంది. ప్రత్యేకత అంటూ ఏమీలేదు. అంతా సమానస్థాయిలో నడుస్తోంది. ఇంకొక విషయం ఏమిటంటే, నేను ఏదైనా మాట్లాడినా అది దృఢంగా, నిశ్చయంగా ఉంటోంది. అయితే అది నేను మాట్లాడటం లేదు కాని, చూస్తున్నట్లు ఉంది. ఎవరైనా క్లిష్టమైన ప్రశ్నవేస్తే, నేను ఏదైనా జవాబు చెప్పినా లేదా వ్రాసినా దానికి తిరుగులేనట్లుగా ఉంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 874

మోడీనగర్,
28.10.1969

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఒక ఉత్తరం వ్రాసి పోస్టు చేశాను. అది తమకు చేరి ఉండవచ్చు. తమరు కుశలంగా ఉన్నారని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

షుమారు 20, 22 రోజుల నుండి, శిరస్సులో వెనుకభాగాన మెడపై నుండి చాలా బాధ కలుగుతోంది. ఇది బాగా పాకిపోతోంది. పండుకున్నా కూడా శిరస్సులో టక్, టక్మని అంటున్నట్లుగా ఉంటోంది. ఏదో ఒక కన్ను వంటిది వెనుక వైపున తెరచుకున్నట్లుగా ఉంది. వెన్నెముక మొత్తం మరియు ప్రక్కటెముక లన్నింటిలోను ఏదో ప్రాకటం మరియు బాధ వంటిది ఉంటోంది. లోపల, బయట ఏమి లేనట్లుగా ఉంది. అంతా ఒక అద్దంలాగా అయిపోయింది. దానిలో ప్రతిబింబంగాని, మరేదిగాని ఏమిలేదు. ఒక అల్పమైన ప్రకంపనం ఇమిడి ఉంటోంది. అది కూడా ఎలా అంటే, బాగా దృష్టిపెడితేనే తెలుస్తోంది, లేకపోతే తెలియటం లేదు. శిరస్సు అంతా కూడా ఒక అద్దంలాగా అయిపోయినట్లుగా ఉంది. ప్రతి ఎముక మెరిసిపోతోంది. కాని అన్నింటిలోను, శిరస్సు అంతటిలోను కూడా ప్రాకటమనేది అల్పంగానైనా ఉంటూనే ఉంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 875

మోడీనగర్,

21.11.1969

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ సమాచారం తెలిసింది. తమరు ఆరోగ్యంగా ఉన్నారని గ్రహించి సంతోషమయ్యింది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

నేను ఏదైనా మాట్లాడుతున్నప్పుడు, అదే స్థితి నా దృష్టికి వస్తున్నట్లుగా అనిపిస్తోంది. కాని ఆ విధంగా మాట్లాడుతూ ఉండటమో లేక చెప్తూ ఉండటమో లేక వ్రాస్తూ ఉండటమో పూర్తయిపోయాక, అంతా ఏమి తెలియనట్లుగా అయిపోతున్నాను. ఇప్పుడు స్థితి కూడా బంధించినట్లుగా ఉంది. అందుచేత ఎంతసేపు అయితే వ్రాస్తానో, చదువుతానో, మాట్లాడుతానో అంతసేపు కొంత అశాంత స్థితి ఏర్పడి నన్ను ఎవరో ఖైదుచేసి బందీగా ఉంచినట్లుగా ఉంటుంది. ఆ పని పూర్తి చేశాక, చాలా సుఖంగా ఊపిరి పీల్చుకుంటున్నట్లుగా ఉంటుంది, అనగా నేను స్వతంత్రురాలను అయిపోయినట్లుగా అనిపిస్తుంది. స్థితి కూడా దానిని ఎవరో రగ్గు కప్పినట్లుగా ఉంటుంది. మాట్లాడుతున్నప్పుడుగాని, వ్రాస్తున్నప్పుడుగాని స్థితి తొలగిపోయి, నేను నా స్పృహను కోల్పోతాను. అప్పుడు, నేను ఏమి మాట్లాడానో కూడా జ్ఞాపకం లేనంతగా (Absent minded) మనస్సుకు విస్మృతి కలుగుతుంది. అందుచేత మాట్లాడుతూ ఉన్నపుడుగాని, వ్రాస్తున్నపుడుగాని ఒక సమస్యగా అయిపోయి, నేనొక స్థితిని పట్టుకుని ఉండవలసి వస్తోంది. ఇప్పుడు స్థితి ఏమిటంటే, నేను దాని ముసుగుతో ఉన్న వస్త్రాన్ని పట్టుకుని ఉన్నాను. ఈ స్థితి ఏమిటో ఎవరికి తెలుసు! ఈ స్థితి కంటె సామాన్య జీవనమే బాగుంది. కోపం వచ్చినా, కష్టం కలిగినా, స్వేచ్ఛగా ఉంటున్నాను. నేను ఎటువంటి ఆవరణ యొక్క బందీగాను లేను. పూజ విషయంలో కూడా ఇదే పరిస్థితి ఉంటోంది. కళ్ళు మూసుకుందామని అనుకుంటే, సాధ్యపడటం లేదు. కళ్ళు మూసుకోగానే, నేను ఎక్కడో బంధించబడినట్లుగా అనిపించి భయపడి, వెంటనే కళ్ళు తెరచుకునే ఉంటున్నాను. అయితే పని చేయటంలోగాని, పూజ చేయిస్తున్నపుడుగాని, ఎంతసేపు కూర్చున్నా ఏమీ అనిపించదు. 'మాలిక్' నన్ను స్వతంత్రురాలిగా చేశాడేమోనని అనిపిస్తుంది, కనుక నేను స్వతంత్రురాలిగానే ఉంటాను. అయితే వ్రాయటం లేదా మాట్లాడటం అనేది తమ చేతుల్లోనే ఉంది. ఏ స్థితి కావాలనుకుంటే దానిని తీసుకురాగలిగినట్లుగా మాత్రం తప్పకుండా ఉంటోంది. అయితే స్వయంగా వేరుగానే ఉంటున్నాను.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 876

మోడీనగర్,

06.03.1970

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. చాలా రోజులుగా తమకు ఉత్తరం వ్రాయలేకపోయాను. నా ఆరోగ్యం ఈ మధ్య చాలా దెబ్బతింది, కాని ఇప్పుడు బాగుంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

శక్తి మరియు కేంద్రం నాలో ప్రవేశించిపోయినట్లుగా అనిపిస్తోంది. అందుకని, నేను మాట్లాడుతున్నది, నా ద్వారా జరుగుతున్నది, (Charged with power) శక్తిమయంగాను, (Firm) దృఢంగాను ఉంటున్నట్లుగా అనుభవమవుతోంది. నేను అన్ని సమయాల్లోను నా వ్యర్థమైన మాటలతోసహా నేను మాట్లాడేది ఖచ్చితంగా ఉంటోంది. నాలోపల, బయట

అంతటా ఒక రకమైన తేజస్సు వ్యాపించి ఉంది. అది నన్ను, నా నుంచి వేరుచేసి ఇప్పుడు (Store of Power) శక్తి పుంజంగా నన్ను తయారు చేసింది. ఈ తేజస్సు నా లోపల, బయటనే కాకుండా సమస్తంలోను, అపరిమితంగా వ్యాపించి ఉంది. ఇదే నా స్థితిగా ఉంది. నన్ను (Omniscient) సర్వజ్ఞురాలు అనండి, (Omnipotent) సర్వశక్తిత్వం అనండి, ఇంకా (Omnipresent) సర్వవ్యాపి అని అయినా అనండి– ఇటువంటి స్థితి మొత్తం నాలో వ్యాపించి ఉంది. ఎందుకో తెలియదుగాని, ఇప్పుడు నాలో నేను ఒక (Spiritual) అలౌకిక, (Divine Power) దివ్యశక్తితో నిండి ఉన్నట్లుగా అనుభూతి చెందుతున్నాను. అయితే ఈ స్థితిని వ్రాస్తూ ఉండి కూడ నా స్థితి ఈ విధంగా ఉన్నదని చెప్పటం నిజమనిపించటం లేదు. ఎందుకంటే, నాకు ఎవరిపట్ల ఏ విధంగాను నాది అను భావన ఉండటం లేదు. ఈ విషయం నాలో లేకపోయినప్పుడు ఇదంతా కేవలం ఒక భ్రమ వంటిదే. అది కావచ్చును, కాకపోవచ్చును. తమరు దీనిని ఏమైనా అనవచ్చు, కావాలంటే ఉందని చెప్పవచ్చు, లేదంటే లేదు. నాకు అన్నీ సమానమే. నేను ఎటువంటి దివ్యత్వంతో నిండి ఉన్నాను అంటే, దానికి విలువ అంటూ ఏమీలేదు. ఒక అపరిమితమైన తేజస్సు వ్యాపించి ఉంది. దాని మూలంగా ఏమనిపిస్తున్నదంటే, సమస్త విశ్వంలోని అన్నీ కూడా నా ఆజ్ఞతో జరుగుతూ వచ్చినట్లుగాను, జరుగుతున్నట్లుగాను అనిపిస్తోంది. కాని ఆ తేజోవంతుడు (దివ్యపురుషుడు) ఎవరు, ఎలా ఉంటారు, ఎక్కడ ఉంటారు, సమస్త విశ్వంలో వ్యాపించి ఉన్న ఆ జ్యోతిర్మయమైనది ఎలా ఉంటుంది? అది ఎటువంటిదో, ఎక్కడ ఉందో, దాని జాడ తెలుసుకుందామన్నా తెలియటం లేదు. ప్రయత్నిస్తూ ఉంటే అది విఫలమవుతోంది. ఇప్పుడు ఉన్న స్థితి ఏమిటంటే, ఎప్పుడూ ఖాళీగా కూర్చుండటం లేదు, పనీలేదు.

నేను (Limited) పరిమితంగా గాని, (Unlimited) అపరిమితంగా గాని లేనిస్థితిలో ఉంటున్నాను. నేను (Expansion of Unlimited) అపరిమితమైన దాని వ్యాప్తిని మాత్రమే నా ఎదుట చూస్తున్నాను. అక్కడి నుండి వస్తున్న దివ్యకాంతి నన్ను తనలో నింపుకోవాలని అనుకుంటున్నది. ఏమయ్యిందో తెలియటం లేదు కాని, రోజులు గడుస్తున్నకొద్దీ, లోపలి అశాంతి యొక్క హద్దు (Limit of restlessness) తెగిపోయింది. అయితే, హృదయాన్ని ఎవరో తమ పవిత్ర హస్తంతో చక్కపెట్టుతున్నట్లుగా అనుభవమవుతోంది. వారి శక్తి నన్ను హద్దులు దాటి పోనివ్వటం లేదు. నన్ను పగ్గాలు పట్టియున్నట్లుగా నిలిపి ఉంచుతోంది. దాని నుంచి వేరుపడి నన్ను ఉంచటం లేదు. నేను నాతో కలిసిపోవాలి. నేను అలా కలిసిపోయి, అపరిమితమైపోయి, నా ప్రియతమునిలో వ్యాపించిపోవాల్సి ఉంది. కాని ఈ విధంగా ఎలా జరుగుతుంది? ఎవరో నన్ను పట్టుకుని ఉన్నారు. ఆ పట్టు సడలిస్తే, నేను 'అతని'లో విలీనమైపోవచ్చును కదా! అని అనిపిస్తోంది. నేను మధనపడుతున్నాను. తనువు, మనస్సు అన్నీ కూడా బాధతో వ్యధ చెందుతున్నట్లుగా ఉంది. బాధను హరించే మందు ఎదుటనే ఉంది, కాని దానిని రాయలేకపోతున్నాను. ఎందుకంటే, నా బాధను ఎవరో సరిచేస్తున్నారు. మరైతే మందు రాయాలన్నా ఎవరు రాస్తారు? నా లోపలి తెర తొలగిపోయింది. ఆవరణం అంతా శుభ్రపడిపోయింది. నేను అంతా నిర్మలమైపోయినట్లుగా చూస్తున్నాను, కాని అది నా చేతుల్లోది కాదు. ఎవరో పట్టుకుని ఉన్నారు, పట్టుకుంటే పట్టుకొని ఉండనివ్వండి. నేను ఈ (Bondage of unlimited pain) అపరిమిత బాధ అను బంధనాన్ని మరిచిపోతూ, జ్ఞాపకం చేసుకుంటూ ముందుకు సాగిపోతున్నాను, సాగిపోతూనే ఉంటాను. ఎందుకంటే, ఇంకనూ చిక్కీచిక్కనట్లుగా 'మాలిక్' దోబూచులాడుతున్నారు. ఎలా అంటే, ప్రియతముడు ఇప్పుడు వచ్చేశాడు, నేను కలుసుకోవాలని అనిపిస్తుంది. మళ్ళీ వెంటనే 'అతడు' కొంచెం దూరంగా వెళ్ళిపోయాడని అనిపిస్తుంది. నేను 'అతడి'ని సమీపించాలని అనుకుంటే, 'అతడు' దూరంగా వెళ్ళిపోతున్నాడు. నాతో ఎందుకు దోబూచులాడుతున్నాడో తెలియదు. అయినప్పటికి 'అతడి'ని చూస్తూ ఉంటే, నేను నిజంగా పొందుతున్న అనుభవం ఏమంటే, 'అతని' శక్తి సామర్థ్యం మరియు మాధుర్యం, అన్నీ ఇప్పుడు నాలోనే ఉన్నట్లుగా నాకు కనిపిస్తోంది. ఆ కాంతి వైభవం ఇప్పుడు నాలోకి స్వయంగా దిగివస్తున్నట్లుగా ఉంది. తరచుగా నేను పులకించిపోతున్నాను. అప్పుడప్పుడు నేను, నన్ను ఆశ్చర్యంగా

చూస్తూ ఉండిపోతున్నాను. 'మాలిక్' ఈ ఆట ఎందుకు ఆడుతున్నట్లు? అయితే ఇది ఆటగాదు, యదార్థమే. ఏదైతే ఇప్పటివరకు లోన దాగి ఉందో, పెంపొందుతూ ఉందో, ఇప్పుడు అది ప్రత్యక్షంగా ఎదుట వ్యాపించిపోయింది. కాని దానిని చూసి ఏం చేయాలి! కనిపించేటటువంటి ఈ బాధ, కనిపించకుండా నా లోపల హృదయంలో జీర్ణించుకు పోయింది, అయితే అది నాకు ఇష్టంగానే ఉంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 877

మోడీనగర్,

25.03.1970

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందనుకుంటున్నాను. ఇప్పుడు నా ఆరోగ్యం పూర్తిగా బాగుంది. దాని గురించి తమరు విచారించవద్దు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక స్థితిని వ్రాస్తున్నాను.

ఇప్పుడు నేను ఉన్న స్థితిని గురించి కాకుండా, ఏ స్థానం అయితే నేను చేరుకుంటున్నానో ఆ స్థానం గురించి వ్రాస్తున్నట్లుగా ఉంది. **ఈ దశలన్నీ వాస్తవానికి మరణానంతరం జరిగే ప్రయాణం గురించినవిగా ఉంటాయి. వాటిలోకి 'మాలిక్' మనల్ని జీవించి ఉండగానే తీసుకుని వెళ్ళటమే కాకుండా పరిపూర్ణ అనుభవంతోపాటు అక్కడ లయ-అవస్థను కూడా ప్రసాదిస్తున్నారు.**

ఎందుకో తెలియదుగాని, ఇప్పుడు నేను ఆంగ్లంలో మాట్లాడుతూ ఉంటే, అది పైన, ఎక్కడి నుండో దిగివస్తున్నట్లుగా ఉంటోంది. నేను దానిని గ్రహిస్తూ ఉంటాను. అలాగే హిందీలో వ్రాసినా, మాట్లాడినా కూడా ఇలాగే ఉంటోంది. ఏ సందర్భంలో ఏది అవుసరమో అది సమకూర్చబడుతోంది. బహుశా అందుకేనేమో అవగాహన బాగా స్పష్టంగా లేదా నిఖార్సుగా ఉన్నట్లు నేను చూస్తున్నాను. ఇప్పుడు ఎటువంటి వాస్తవికత నాలో వచ్చింది అంటే, అది ఇతరులను ప్రభావితం చేస్తున్నట్లు ఉంది. ప్రతి విషయంలోను, ప్రతి మాటలోను, ప్రతి పనిలోను వాస్తవికతయే మనోహరంగా ప్రతిబింబిస్తుంది. కృత్రిమత్వమే తొలగిపోయినప్పుడు ఇంకా ఏమి మిగులుతుంది? అయితే, వాస్తవికత (రియాలిటి) నాలో కనిపిస్తున్నది కాని, నేను మాత్రం వాస్తవికతలో లేను. అలా కాకుండా 'మాలిక్' నాకు వాస్తవికతలో స్వయంగా స్వచ్ఛత తీసుకురాగల శక్తిని ఇచ్చారు. అయితే 'వారు' ఏమి ఇస్తున్నారో అంతా 'వారి'కే తెలుసు.

ఎందుకో తెలియదుగాని, హృదయం ఎప్పుడూ విచారంగానే ఉంటోంది. నాకు ఏదీ ఇష్టంగా ఉండటం లేదు, దానికి కారణం అంటూ ఏమిలేదు. కలత కూడా కలత చెంది ఉంది, అది ఎందుకో మరి. ఉదాసీనత (Melancholy) కూడా నన్ను వదిలించుకున్నట్లుగా అనిపిస్తోంది. నాకు స్వయంగానే నాతోనే ఇంత వైరాగ్యంగాను, ఉదాసీనంగాను ఉంటున్నదంటే, నేను స్వయంగా నాతో (Separated) వేరుగా చేసుకున్నట్లుగా ఉంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 878

మోడీనగర్,
06.04.1970

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. చాలా రోజులుగా తమ సమాచారం తెలియరాలేదు. తమరు దయచేసి శీఘ్రంగా తమ సమాచారం తెలియజేయండి. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

మొన్న పూజ చేస్తున్నపుడు నాకు అకస్మాత్తుగా ఎవరో నాతోపాటు పూజలో కూర్చున్నట్లుగా అనిపించింది. అప్పుడు చూస్తే స్వయంగా నేనే ఉన్నాను. అప్పటి నుంచి, ఎవరో నాతోపాటు ఉన్నట్లు ఉంటోంది, చూస్తే అది నేనుగానే కనిపిస్తున్నాను. నా లోలోపలనే ఒక (Effulgence) తేజస్సు వంటిది వృద్ధి చెందుతున్నట్లుగా అనుభవం చెందుతున్నాను, కాని దానిలో (Light) ప్రకాశం లేదు. దాని వలన నాకు (Active) చైతన్యం కలగటం లేదు. అది మాత్రం నాలో వ్యాపించిపోయింది. అయితే దీనితో నావద్దకు వచ్చేవారు బాగా ప్రభావితులవుతున్నారు. నేను దీనిని ఆపాలనుకుంటున్నాను కాని, అలా జరగటం లేదు. ఎందుకంటే, అది నాలోకి దిగివస్తున్నట్లుగా అనిపిస్తోంది. నేను దానిని అణచిపెట్టాలని అనుకుంటూ ఉంటే, దాని ప్రభావం ఇంకా పెరుగుతూ ఉంది. అందుచేత నేను ఎలా ఉన్నానో అలాగే ఉండి, ఆ దిగి వస్తున్న దానిని చూస్తూ ఉంటున్నాను. నేను స్వయంగా నన్ను మాత్రమే నాతోడుగా పొందుతున్నట్లు చూస్తున్నాను. ఇదంతా ఏమిటో ఏమో, అంతా తమకే తెలియాలి.

నేనయితే, ఇప్పుడు ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోతున్నాను. ఆ చూస్తున్నది ఏమిటంటే, ఏదో నాలో దిగి వస్తోంది. దాన్ని పరిశీలిస్తే ఏమీ కనిపించటం లేదు. 'మాలిక్' ఏ ఆట ఆడుతున్నారో తెలియటం లేదు.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 879

మోడీనగర్,
06.04.1970

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. ఇక్కడ అందరూ కుశలమే. తమరు కూడా కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇది ఏమిటో తెలయదుగాని, నేను ధ్యానంలో స్వయంగా నన్ను నేను కోల్పోయి ఉంటున్నాను. లోలోపల ఏదో శక్తి పైనుంచి వచ్చి నన్ను స్పృశిస్తుంది అన్నట్లుగా ఉంది. అప్పుడు నా కళ్ళు తెరుచుకుపోయి, నేను గాఢనిద్ర నుంచి లేచినట్లుగా ఉంటోంది. తర్వాత నా దృష్టి తమవైపు మరలుతుంది. నేను స్వయంగా ధ్యానంలో మైమరచిపోయి ఉంటున్నాను. నాకు చాలా దిగులుగా ఉంటుంది. ఎందుకంటే, తమకు బదులుగా నా ఫోటో ఎదుట నిలిచి ఉంటుంది, అది ఎందుకో తెలియదు. నేను కూడా నిశ్చింతగా ఉన్నాను, ఎందుకంటే, అది కేవలం నా 'మాలిక్' ఇచ్చిన ఒక స్థితియే కదా! అని. ఆశ్చర్యం ఏమిటంటే, నేను గాఢనిద్ర నుంచి లేచినట్లుగా అనిపిస్తోంది. ఒకవైపు ఈ విధంగా ఉంటూ ఉండగా మరోవైపు నేను దినసరి కార్యకలాపాల్లో నాకు స్పృహ లేనంతగా మునిగిపోయి ఉంటున్నాను. ఇది అంతా విచిత్రమైన ఆటగా ఉంది, అది తమకే తెలియాలి.

ఇప్పుడు పరస్పర విరుద్ధమైన రెండు విధాలుగా ఉన్న స్థితి ఉంటోంది. ఎలాగంటే, ఒకవైపు మనస్సు విసుగుదలగాను, అశాంతిగాను ఉండి, ఏ విషయంలోను లగ్నం కాకుండా ఉంటోంది. నేను పనిలో నిమగ్నమైపోయి, తీరిక లేకుండా, విసుగు చెందకుండా ఉండాలని ఉత్తరాలు వగైరా వ్రాస్తూ ఉన్నా కూడా విసుగ్గానే ఉంటోంది. మరోవైపు లోపలికి చూస్తూ ఉంటే, మనస్సు ఎలాంటి విరక్తి లేకుండా ప్రశాంతంగాను, నిలకడగాను ఉన్నట్లు ఉంటోంది. స్వయంగా నా శరీరంలోగాని, ఎవరి కష్టాన్నయినా చూసినగాని, బాహ్యంగా భయకంపితురాలనవుతున్నాను. కాని లోపలికి చూసినట్లయితే అక్కడ మనస్సు పూర్తిగా లగ్నమై ఉన్నట్లు ఉంటోంది. ఎక్కడా ఏమీ జరగటం లేదన్నట్లుగాను, భూమి నీడ ఆకాశాన్ని అంటుకోలేనట్లుగాను, దానిమీద పడనట్లుగాను, మనస్సు స్థిరంగా, నిశ్చలంగా ఉంటోంది. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 880

మోడీనగర్,
16.04.1970

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమకు మళ్ళీ శ్వాసకోశ ఇబ్బంది కలిగిందని తెలిసి చింతిస్తున్నాను. తమరు శీఘ్రంగా ఆరోగ్యవంతులయ్యేట్లు ఈశ్వరుడు అనుగ్రహించుగాక! నా ఆరోగ్యం ఇప్పుడు బాగానే ఉంది. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఇటువంటి (Unlimited melancholy) గాఢమైన ఉదాసీనతతో నేను ఈ ప్రపంచంలో ఎలా ఉండగలను? ప్రాపంచికమైన ఏ విషయంలోను మనస్సు లగ్నం కావటం లేదు. ఈ స్థితి ఏమిటోగాని, కళ్ళు మూసుకుని ధ్యానం చేయకుండా మౌనంగా కూర్చున్నట్లయితే ఏమి అనిపించదు, కాని అలా కాకుండా కళ్ళు తెరవగానే ఎంత విరక్తిగాను, (Melancholy) ఉదాసీనంగాను ఉంటున్నదంటే, ఇటువంటి స్థితిలో నేను జీవితాన్ని ఎలా గడపగలనో తెలియటం లేదు. జీవన్మరణాలు రెండింటిలోను మనస్సు ఉదాసీనంగానే ఉంటోంది. పూజ చేయమని నేను ఇతరులకు చెబుతున్నాను కాని, పూజ లేదా ఆధ్యాత్మికత లేదా ఈశ్వరుడు –అని చెప్పాలంటే, అన్నీ ఒక భ్రమ మాత్రంగానే ఉన్నాయి. ఈ భ్రమ యొక్క ముసుగు నా పైనుంచి తొలగిపోయినట్లు నేను యధాతథంగా నిలబడి ఉన్నాను. ఎక్కడా ఏది కూడా బాగున్నట్లు అనిపించటం లేదు. లేవటం, కూర్చోవటం, తినటం, నిద్రించటం –వీటిపైన మనస్సు పోవటం లేదు. మరణం మీద ఆసక్తిలేదు, అలాగే జీవనం మీద మనస్సు లేదు. రెండు విషయాల్లోను గాఢమైన ఉదాసీనతయే ఉంది. ఈ గాఢ ఉదాసీనతకు హద్దంటూ లేకుండా ఉంది. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 881

మోడీనగర్,
26.04.1970

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఇప్పుడు తమరు ఆరోగ్యవంతులయ్యారని తెలిసి సంతోషించాను. ఇక్కడ కూడా అందరూ కుశలమే. తమరు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉండాలని మేము సదా ఈశ్వరుని ప్రార్థిస్తున్నాము. 'మాలిక్'

కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ దశలో ఎలా ఉందంటే, జనం మధ్యలో ఉన్నా కూడా నేను ఒంటరిగా ఉన్నానని అనిపిస్తోంది. హృదయం అణగారి ఉంటోంది. హృదయంలో వైరాగ్యం లేదా ఎటువంటి భావం లేకపోయినా కూడా ఎక్కడికో పారిపోవాలని అనుకుంటోంది. ఏదైనా శక్తి పైనుంచి చక్కబెట్టకపోతే నేను ఆగిపోవటం సంభవం కాదేమో. ఇక్కడి నుండి పారిపోయి ఎక్కడికైనా వెళ్ళాలనే ఉద్దేశ్యం లేకపోయినప్పటికీ, పారిపోకుండా ఎక్కడ ఉండాలనేది కూడా తెలియటం లేదు. ఒక లక్ష్యం అంటూ లేకుండా పిచ్చివాడు ఎక్కడెక్కడో ఎలా తిరుగుతూ ఉంటాడో, నా స్థితి కూడా అలాగే ఉంది. నా స్వవిషయంలో కూడా, ఏదైనా పాడాలన్నా, తమ ఉత్తరాలు చదవాలన్నా, ఇంకేమైనా చేయాలన్నా ఆసక్తి ఉండటం లేదు. ప్రతి వస్తువు లేదా ప్రతి విషయం, ఆధ్యాత్మికతకు చెందినది, ఈశ్వరీయతకు చెందినది అయిన సత్యం (Truth) నాకు తెలిసిపోయినట్లుగాను, అసలు అదేమీ లేనట్లుగాను (Nil) నా స్థితి ఉంది. అటువంటప్పుడు నేను ఎక్కడికి పోవాలి, ఏమి చేయాలి? వెనుక చూసినా, ముందు చూసినా ఏమీలేదు (Nil). ఇప్పుడు ఈ ఏమీలేదు అనేది కూడా నాకు అర్థం లేనిదిగా అనిపిస్తోంది. మైదానం అనేది కనిపించినా, కనిపించకపోయినా నేను ఎక్కడికో పరుగుతీస్తున్నాను. ఇప్పుడు నేను ఒక పిచ్చిదానను. ఇలా పిచ్చిదానిగా ఉన్నా కూడా పనులన్నీ సక్రమంగానే నిర్వహించబడుతున్నాయి. పూజాఫలం అందరికీ బాగానే లభిస్తోంది. ఇంటిలో ఉంటూనే, నేను పిచ్చిదానిలాగ, వెర్రిదానిలాగా ఎక్కడికో దూరంగా ఉరుకులు –పరుగులు తీస్తున్నాను. ఇది ఎలా ఉంటుంది అంటే, అయస్కాంతం ఎక్కడో ఉంటే, సూది దానివైపుగా దూసుకుపోతున్నట్లుగా ఉంది. ఉన్న తేడా ఏమిటంటే, సూది అయితే అయస్కాంతానికి హత్తుకుపోతుంది, కాని నేను మాత్రం లక్ష్యం లేకుండా పరుగు తీస్తున్నాను. ఇప్పుడు నన్ను ఎవరైనా అడ్డగించినట్లయితే, నా గుండె ఆగేట్లుగా ఉంది. వైద్యులు 'తమరే' కనుక, దీని గురించి తమకే తెలియాలి. మాలిక్! నాకు ఈ ప్రపంచంలో జీవించి ఉండటం అసంభవంగా అనిపిస్తోంది. నా ప్రాణాల తాడు ఎక్కడో సంధించబడి ఉన్నట్లుగా ఉంది. అందుచేత, అక్కడికి వెళ్ళకుండా, 'అతడి'ని పొందకుండా, ప్రాణం నిలవాలన్నా ఎలా నిలుస్తుంది. 'మాలిక్' నన్ను 'అతడు' లేకుండా ఎందుకు ఉంచుతున్నారో, ఇంతకూ 'అతడు' ఎవరో, నేను ఎందుకు అశాంతిగా ఉన్నానో, ఎంత ఆలోచించినా గాని అంతుచిక్కడం లేదు. ఏ కారణం లేకుండానే ప్రాణం తీసేటటువంటి అశాంతి నా భాగ్యంగానే ఎందుకు ఉందో అర్థం చేసుకోండి. అసలు నేను లేను, నాకు తీరికా లేదు, మనస్సు కూడా నిలవటం లేదు. అయినా కూడా (Store of all the Power) శక్తి భాండాగారం యొక్క సామర్థ్య సమూహమంతా నాలోకి దిగి వస్తోంది. సరే, ఏమైతే నాకు ఏమిటి? నాకు ఆపివేయటానికి సమయం లేదు. దానిని నాలోకి దిగి రాకుండా అడ్డగించనూ లేను.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన<br>
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 882

మోడీనగర్,<br>
30.07.1970

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. దాదాపు ఒక నెల రోజుల తర్వాత తమకు ఉత్తరం వ్రాస్తున్నాను. ఈమధ్య నాకు కొంత బలహీనత కలిగింది, కాని ఇప్పుడు బాగానే ఉంది. తమరు నా గురించి విచారించవద్దు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక స్థితిని వ్రాస్తున్నాను.

**ఈ రోజు రాత్రి పండుకొని ఉన్నప్పుడు షుమారు 12 గంటలు లేదా 1.00 గంటకు అకస్మాత్తుగా ఒక దృశ్యంలో (Vision) తమ విశాల విరాట్ స్వరూపం నా ఎదురుగా ఉండటం చూశాను. అది భూమి నుంచి ఆకాశం వరకు వ్యాపించి ఉంది. ఈ ప్రపంచమే కాకుండా తమలో సమస్తం వ్యాపించి ఉన్నాయి. తమ యొక్క రోమరోమంలోను విశ్వమంతా ఇమిడి ఉంది. తమ హృదయంలో నేను మరియు అందరూ ఒక కాంతి బిందువులాగా ఇమిడి ఉన్నాము. తమ హృదయం మరియు ఉదరం నుంచి లెక్కలేనన్ని గొలుసులు (Chains) వ్యాపించి ఉన్నాయి. ఆ తంతువులన్నీ కూడా అనంతం వరకు వ్యాపించి ఉన్నాయి. వాటి అంతం తెలియటం లేదు. నా హృదయం ఎంతో స్వల్పమైనది కావటం మూలంగా నేను 'తమరి'ని పూర్తిగా నాలో ఇముడ్చుకోలేకపోతున్నాను. 'తమ' యొక్క దివ్యదృష్టితోనే నేను తమర్ని చూడగలిగాను, చూస్తూ ఉన్నాను. ఈ రోజు కూడా పరమప్రియులైన 'తమరు' అదే రూపంలో నా దృష్టిలో ప్రత్యక్షంగా నిలిచి ఉన్నారు. ఎప్పుడైతే నా ఆలోచన ఆ (Vision) దృశ్యంవైపు నిశితంగా ఉంటుందో, అప్పుడు నాలో అనంతశక్తి సామర్థ్యాల సమూహం ఇమిడిపోతున్నట్లుగా అనుభూతి చెందుతున్నాను. ఇదంతా తమ కృప మూలంగానే.**

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 883

మోడీనగర్,
17.08.1970

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

నా దృష్టి (Vision) ఇప్పుడు అపరిమితమై పోయింది. 'మాలిక్' యొక్క విరాట్ రూప దర్శనం చూశాక, అప్పటినుంచి నేను కూడా 'వారి' చరణాలకు చుట్టుకుని విరాట్‌లాగానే అయిపోతూ వెళ్ళుతున్నాను. నాకు తెలియని విషయం ఒకటి ఉంది. అదేమంటే, నాలో అత్యంత శక్తి సామర్థ్యాలు ఉన్నాయి కాని, నేను వాటితో సంబంధం కల్పించుకోలేకపోతున్నాను, అయినా గాని అవి నావే. తరచుగా అవి దివ్య దృశ్యంలోకి వస్తున్నాయి. శారీరిక స్థితి ఎలా ఉందంటే, జడమైపోయినట్లుగా (Inert) ఉంది. దానిని స్పర్శిస్తూ ఉన్నా కూడా స్పర్శ లేకుండా ఉంటోంది. ఈ ప్రపంచం కోసం ఒక (Machinery) యంత్రాంగం నా పేరున నడుస్తున్నట్లుగా ఉంది, కాని నా లోపల ప్రపంచం అంతటికోసం సంబంధం లేదా మమత్వం పెరుగుతూ ఉన్నాయి. నాకు ఏ ఒక్కరి దుఃఖమైనా, బాధయైనా నా స్వంత బాధగానే అనుభవమవుతున్నాయి. నా ఆత్మ మరణించిందో లేదా ఇంకేమైందో తెలియదు. మంచి చెడులు చేయటానికి ఏ ఒక్కరికైనా ఆత్మ నుంచే ప్రేరణ కలుగుతుందని అందరూ చెబుతూ ఉంటారు. కాని నాకేవి చేయటానికైనా ఎప్పుడూ ఎటువంటి ప్రేరణ కలగటం లేదు. ఇంకేముంది, ఉన్నదేదో అదే ఉంది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 884

మోడీనగర్,

28.08.1970

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. 'తమరు' కుశలమేనని భావిస్తున్నాను. ఇక్కడ కూడా అందరు కుశలంగానే ఉన్నాము. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

సూక్ష్మత్వం (Subtlety) నుంచి కూడా నేను దాటి పోతున్నట్లుగా నా స్థితి ఉందనిపిస్తోంది. తేలికదనం నుంచి కూడా దాటిపోయాను. ఎందుకంటే, స్థితిని సూక్ష్మంగా గాని, లేదా తేలికదనం కంటె కూడా తేలిక అని చెబుతున్నా, నా స్థితి దానికి వేరుగా ఉన్నట్లు అనిపిస్తోంది. నాకు నా స్థితిని తూచడానికి, ఇప్పుడు నా అనుభవ శక్తిగాని, ఊహాశక్తిగాని పనిచేయటం లేదు. నా అనుభవంలోకి వస్తున్న ఏ స్థితియైన, (Divine sight) దివ్యదృష్టి మరియు (Divine condtion) దివ్యస్థితి కూడా, ఏవైతే నావిగా భావిస్తున్నానో అవి 'తమరి'వే అన్నట్లు ఉన్నాయి. నేను రెండు భాగాలుగా విభజించబడి ఉన్నట్లుగా అనిపిస్తోంది. ఒకవైపు దృష్టిపెడితే, 'మాలిక్'కు చెందిన భాగంలో నేను, దివ్యం, అలౌకిక గతి మరియు సామర్థ్యం, శక్తితో కూడి ఉంటున్నాను. రెండవ భాగంలో ప్రాపంచికపు పనులు కొన్ని మరియు బాధలు తీసుకుని కస్తూరీగా ఉంటున్నాను. అయినా గాని, 'మాలిక్'కు చెందిన భాగంలోనే ఉంటున్నాను, సంచరిస్తున్నాను, అక్కడే అంతటా వ్యాపించి నేను ఉన్నాను. నేను విరాట్‌లో వ్యాపించి దివ్యదృష్టితో చూస్తున్నాను. 'మాలిక్' చరణాల వద్దనే 'వారి' నియమాల ప్రకారమే ఉంటున్నాను. అందువలన చెప్పటానికి నేను రెండు భాగాలుగా చెప్పాను కాని, రెండూ వేరుపడి లేవు. నా పూర్తి ఆధ్యాత్మికత ఏదైతే ఉందో అది నా దివ్యత్వమై ఉండి అంతటా వ్యాపించి ఉన్నట్లు ఉంది. నేను నా సాధారణ స్థితిలో ఉంటున్నప్పుడు నా చుట్టురా ఏదో ఉన్నట్లు చూస్తాను. అప్పుడు నాకు కొంత దిగులుగాను, పనివత్తిడితో ఉన్నట్లుగాను అనిపిస్తుంది, అయితే వీటికి కారణం అంటూ ఏమీలేదు. ప్రపంచంవైపు దృష్టిసారించినట్లయితే ప్రపంచం నాదనిపిస్తుంది. బహుశా అందుకేనేమో, డా॥ వరదాచారిగారు నాతో– దీనిని మాతృ హృదయంగా భావించి నేను ఎప్పుడూ కష్టాలే భరించాల్సి ఉంటుందని చెప్పారు. అప్పుడు వెంటనే నా నోటి నుంచి స్వయంగా– నేను అందుకు సిద్ధమే, అని పలికాను. అందుకు వారు సంతోషించి ఆశీర్వాదాలు కూడా పలికారు. ఇప్పుడు కొంచెం (Divine concentration) దివ్యత్వపు ఏకాగ్రత కలగ్గానే, నా హృదయం గాబరా చెందుతుంది. అప్పుడు నా ప్రాణం పోతున్నదా అని అనిపిస్తోంది. అందుచేత నేనేమి చదవలేకపోతున్నాను, వ్రాయలేకపోతున్నాను. ఏకాగ్రతతో ఉత్తరం వ్రాయ నారంభిస్తే హృదయం గాబరా చెందుతోంది. అలా కాకుండా మామూలుగా వ్రాయబూనితే ఆలోచనలు తొలగిపోతాయను భయం కలుగుతోంది. అయినా గాని నేను తమ కృపతోనే వ్రాస్తున్నాను, వ్రాస్తాను కూడా. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 885

షాజహాన్‌పూర్

24.08.1970

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

ఆశీర్వాదాలు. నీ ఉత్తరాలు అందుతూనే ఉన్నాయి. నీ ఉత్తరాలకు జవాబు వ్రాయటంలో ఇబ్బందియే కాకుండా అసంభవం అన్నట్లుగా ఉంటోంది. నేను చెప్పిన దానిని సరిగ్గా వ్రాయగలిగినటువంటి లేఖకులు కూడా

అందుబాటులో లేరు. అతిసూక్ష్మ స్థితుల గురించి వ్రాయించే సందర్భంలో నాకు పూర్తిగా నిశ్శబ్ద వాతావరణం ఉండాలి. అలాగే లేఖరి కూడా నేర్పు, ఓర్పుగలవాడై ఉండాలి. నీకు కలిగిన స్థితినిబట్టి నీవు రెండవ వలయం దాటి ముందుకుపోతున్నట్లుగా తెలుస్తోంది. నీవు మూడవ వలయం మీదకు వచ్చినట్లుగా లాలాజీ సాహెబ్ నాకు సంకేతమిచ్చారు. అందుకు లాలాజీ సాహెబ్‌కు నేను ఎంతగా ధన్యవాదా లర్పించగలను! ఇప్పుడు ఈ అత్యున్నత స్థానానికి చెందిన దశల అనుభూతి నీ ఉత్తరాల ద్వారా తెలుస్తున్నందుకు నేను ధన్యుడయినట్లు తెలుపుకోవాలా లేక నీవు ధన్యురాలవైనట్లుగా చెప్పవలసి ఉంటుందా! నా సంగతి నేను మరచిపోయాను, కాని నీ స్థితి, నా స్థితిని గురించి తెలియజేస్తుంది. నీ దివ్య ఇచ్ఛాశక్తి నన్ను శ్వాసకోశ ఇబ్బందుల నుంచి శాశ్వతంగా విముక్తి చేసింది.

మీ అందరికీ ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 886

మోడీనగర్,
08.12.1970

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు ఆరోగ్యంగా ఉన్నారని భావిస్తున్నాను. ఇక్కడ కూడా అందరూ కుశలమే. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

**నేను ఎరుక లేకుండానే గాలిలాగా ఎక్కడికో వ్యాపించిపోతున్నట్లు అనిపిస్తోంది. నేను ఏ స్థితిలోను వ్యాపించి లేను; కాని గాలిలాగా, ఎక్కడి నుంచి అయితే ఈ ప్రపంచంలోనే కాకుండా సమస్తం అంతటిలోను ట్రాన్స్‌మిషన్ యొక్క ప్రవాహం దానంతట అదే జరుగుతున్నదో అక్కడికి నేను వ్యాపించిపోతున్నాను.** ఈ ప్రవాహం ఏమిటో నాకు తెలియదు, కాని సమస్త ప్రపంచానికి ఏదో లభిస్తున్నట్లుగా చూస్తున్నాను. ఈ ప్రవాహం ప్రపంచంవైపుగా వస్తోంది. ఈ దశ ఏమిటోగాని, దీని గురించి వ్రాయటం కూడా ఒక బంధనంలాగా అనిపిస్తోంది. వ్రాస్తూ ఉంటే మనస్సు పారిపోతోంది. ఇప్పుడు వాస్తవం ఏదో నేను చెప్పాలంటే, నా హస్తం ఎక్కడి నుండి అయితే సమస్త ప్రపంచానికి ఏమి లభిస్తున్నదో, అక్కడికే విస్తరించి ఉంది అని చెప్పగలను.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 887

మోడీనగర్,
27.12.1970

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఆరోగ్యం బాగుందని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

ఇప్పుడు నా స్థితి ఎలా ఉందంటే, పాటలు పాడుతున్నా కూడా నాకు ఆనందం లభించటం లేదు. పాడటానికి మనస్సు కూడా లగ్నం కావటం లేదు. ఇప్పుడు ఎటువంటి స్థితి ఉంది అంటే, ఎడారి వంటిది, ఎండిపోయిన నిర్మానుష్యమైనదే అయినా కూడా నాకు ఆనందంగా ఉంటోంది. నా శ్రీ బాబూజీ! నిజం చెప్పాలంటే, ఇప్పుడు స్థితి

అనేది స్థితిగా ఉండటం లేదు. నేను ఏమి చూస్తున్నానో, ఏమి వింటున్నానో తెలియటం లేదు. నేను మే నెలలో చూసినటువంటి 'మాలిక్' విరాట్ రూపంతోనే నా సంబంధం వ్యాపించి ఉంది. నిజంగా ఇప్పుడు ఆకర్షణగాని, మెచ్చుదనం యొక్క అనుభూతిగాని లేవు. అంతా ఒక స్వప్నంలాగా గడిచిపోయింది. అలాకాదు కాని, నా ఆంతరికమే ఈ ముసుగును తీసివేసినట్లుగా ఉంది. ఎవరోగాని నన్ను నా నుంచే దొంగిలించుకుపోయారు. నేను మాత్రం చూస్తూ ఉండి పోయాను. నేను దెబ్బతిన్నట్లుగా అయిపోయి, అశాంతి మరియు చింతలో మునిగిపోయాను. దీనికి అంతు ఎక్కడో తెలియటం లేదు. మనస్సు, దృష్టి వింతగా అయిపోయాయి. దానివలన శాంతి ఏమాత్రం లేదు, ఆనందం, దుఃఖమూ ఉన్నాయి, విలపించటం, గుండెలు బాదుకోవటం ఉన్నాయి, ఇంకేమీ లేదు. 'అతడు' (దైవం) నా స్నేహితుడు, నాతోనే ఉండేవాడు అన్నట్లు ఉందిగాని ఇంకేమి లేదు. ఉప్పులేని భోజనం తిన్నట్లుగా ఉందని చెబితే బాగుంటుందని అనుకుంటాను. నేను ఏ దృశ్యాన్ని చూశానో అది దృశ్యం కాదు. ఎవరో నా దృష్టిని నియంత్రించి ఉంచారన్నట్లుగా ఉంది. వాస్తవంగా, నేను మోసగించబడ్డాను. మార్గదర్శకుడు తోడుగా ఉండేవాడు నన్ను మోసగించి లూటి చేసినట్లుగాను, నేను స్పృహ కోల్పోయి ఉన్నట్లుగాను ఉంది. నా విన్నపం ఆలకించేవారు లేనప్పుడు ఏం జరుగుతుంది. కాని దృష్టి బంధనం తొలగిపోయింది. తోడున్నవారు ఎవరూ కూడా దృష్టికి రావటం లేదు. అయితే మార్గం మాత్రం శుభ్రంగాను, సహజంగాను ఉంది. నడకలో చలనం లేకపోయినప్పటికీ, నేను రెక్కలు లేకుండానే ఎగిరి సమస్తంలో వ్యాపించిపోతున్నాను. ఎక్కడా ఎటువంటి ఆకర్షణ లేదు. ఇప్పుడు వాయువులాగానే నేనే ప్రవహించిపోతున్నాను. మనస్సు లగ్నం కావటం లేదు కాని, ఎప్పుడైనా ఇంటిగాలిసోకి జ్ఞాపకం వస్తే అప్పుడు స్థిరత్వం కలుగుతోంది. అయితే ఇంటిని గురించిన జ్ఞాపకం ఎందుకు లేకపోతున్నది అంటే, దానివలన శరీరం ఛిన్నాభిన్నమైపోవచ్చు అని. ఆత్మ కూడా ఒక బంధనం వంటిదేనని అనిపించినా అది కూడా ఇప్పుడు తెగిపోయింది. నాకు ఏమయ్యిందో తమకే తెలియాలి.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 888

షాజహాన్‌పూర్,
28.12.1970

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

ఆశీస్సులు. బసంత పంచమి ఉత్సవ తేదీలు జనవరి 30, 31 మరియు ఫిబ్రవరి 1వ తేదీగా ఉన్నాయి. నేను ఫిబ్రవరి 15వ తేదీన ఢిల్లీ నుంచి మద్రాసుకు విమానంలో వెళ్తాను. శ్రీమతి పోరె (ఫ్రాన్స్ అభ్యాసి) కార్యక్రమాన్ని మార్చటం కష్టమైన పని. సేట్‌జీ నా ప్రాణాహుతితో ఎటువంటి అనుభూతిని పొందలేదు అంటె **ప్రతి ఒక్కరూ నా ప్రాణాహుతి యొక్క ప్రభావం లేదనుకోవటం సహజమే కదా! నా (బాబూజీ) ప్రాణాహుతిలో (ట్రాన్స్‌మిషన్‌లో) ఒక విధమైన 'చైతన్యం' మరియు 'సాయుజ్యత' ఉన్నాయి. ఆంతరిక నేత్రాలు పూర్తిగా తెరుచుకున్నవారికే దాని ప్రయోజనం తెలుస్తుంది.** సేట్‌జీ మరియ బాపూభాయి విషయంలో నేను చాలా తొందరపడ్డాను. వారు ఆ ప్రాణాహుతిని గ్రహించలేకపోయారంటే, వారి దృష్టిలో దొంగ సాధువులతోపాటు నేనూ ఒకడిని అనే అభిప్రాయం కలుగుతుంది.

మీ అందరికీ ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 889

షాజహాన్‌పూర్,
13.01.1971

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

ఆశీస్సులు. నీ ఉత్తరం అందింది. డాక్టర్ వరదాచారికి 101 నుంచి 103 డిగ్రీల వరకు తగ్గకుండా జ్వరం ఉంటోంది. దీని మూలంగా ఇంకా బలహీనపడిపోయారు. షుగర్ తగ్గటానికి నేను, నీవు ప్రార్థన చేస్తూనే ఉన్నాము, కాని అది తగ్గటం లేదు. దీని వలన నాకు బాగా ఆందోళన కలుగుతోంది. నేను ప్రార్థన చేస్తూనే ఉంటాను, నీవు కూడా చేస్తూ ఉండు.

పోరే (ఫ్రాన్స్ అభ్యాసి) మరియు దేదీస్ దంపతులు ఇద్దరు (ఇంగ్లాండు) 19.01.1971న ఇక్కడకు వస్తున్నారు. 24.01.1971 వరకు ఇక్కడే ఉంటారు. పార్థసారథిగారు కూడా 19 లేక 20వ తేదీలలో ఉదయం రానున్నారు. నీవు హీర్‌జీ భాయికి, బొంబాయికి చెందిన సేట్‌జీలకు ఇచ్చిన ప్రాణాహుతి ఫలితంగా కొంత సమాధి దశ కలిగింది. హీర్‌జీ భాయి ఎంత సంబరపడిపోయారంటే, ఆయన సేట్‌జీతో, ఆమె (కస్తూరీ) కనుక రెండు మాసాలు మిషన్ ప్రచారం కొరకు అక్కడికి వచ్చినట్లయితే ఖర్చంతా ఆయనే భరిస్తానని చెప్పారట. మిగతా సంగతులు నీవు ఇక్కడకి వచ్చినపుడు చర్చిస్తాను. ఎట్టి పరిస్థితుల్లోనూ మనం దక్షిణాదికి వెళ్ళి తీరాలి. మీ అందరికీ ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 890

మోడీనగర్,
01.01.1971

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను. 'మాలిక్' యొక్క దివ్య విరాట్‌లో నేను వ్యాపించిపోతున్నట్లుగా అనుభవమవుతోంది. ఈ దశను నేను చూస్తున్నాను. నాకు ఎందుకో తెలియదుగాని, నా మనస్సు ఎక్కడికో వ్యాపించిపోతున్నట్లుగా అనిపిస్తోంది. అంతా ఏదో ఆశ్చర్యంగా ఉంటోంది. ఇది ఏమిటో తెలియకుండా ఉంది, ఏమిటంటే, పూజకు చెందిన విషయంగాని, సహజమార్గం గురించిన చర్చగాని జరుగుతునప్పుడు నేను నిజంగానే భగవంతునిలాగా అయిపోతున్నాను. 'మాలిక్' నన్ను క్షమించుగాక! ఎందుకంటే, నేను భగవానునిలాగా అయిపోయి ఎంతో భాగ్యవంతురాలినిగా అయిపోయాను. ఇప్పుడు ఏమయ్యిందో ఏమో, నా కంటె వయస్సులో పెద్దవారుగాని, సాధు సన్యాసులుగాని ఎదుటపడినపుడు చేతులు వాటంతట అవే జతకూడుతున్నాయి (నమస్కారం చేస్తున్నాయి). మనస్సు వారిని ఆశీర్వదిస్తోంది. మొన్న నేను స్వప్నంలో ఏం చూశానంటే, ఎవరో మహాత్ములు నాకు నమస్కరిస్తున్నట్లుగాను, నేను ప్రేమపూర్వకంగా ఆశీర్వదిస్తున్నట్లుగాను చూశాను. అటువంటి వారిలో సంత్ కబీర్‌దాస్ ముఖం మరియు ఎవరో ఒకరు గడ్డం ఉన్న వ్యక్తి నాకు జ్ఞాపకానికి వచ్చారు. కబీర్ పదాలు పాడుతూ వాటిలో లీనమైపోయాను. అయితే ఇప్పుడు పాడుతున్నాగాని, లేక మాటలు చెబుతున్నాగాని, వీటిలో లీనమైపోవటం లేదు. అది తమకు తెలుసు. ఇప్పుడు ఇటువంటి దశలో మార్పు వచ్చింది. శక్తి (Power) మరియు తేజస్సు (Effulgence) నాలో ఇమిడిపోయాయి. ఓ నా మాలిక్! ఇంకొక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, సమస్తంలోను నా తేజస్సే వ్యాపించి ఉంది, కాని తమ వంక చూడగానే (Nil) ఏమీలేదు. ఒక మామూలు ప్రాణివంటి దశగానే నాది ఉంది. 'మాలిక్' పని నా ఎదుట ఉన్నప్పుడు లేదా సత్సంగ్‌లో మాట్లాడుతున్నపుడు సమస్తం నా తేజస్సుతోనే తేజోమయంగా

ఉన్నట్లుగా నేను గమనిస్తున్నాను. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు అందరూ నా ఆధీనంలోనే పని చేస్తున్నట్లుగా ఉంది. అయితే ఎంత మార్పు అంటే, ఇవన్నీ భూమికి చెందిన కస్తూరికి చెందినవి కాకుండా ఆమె వ్యాప్తి సమస్తంలోను ఉన్నట్లుగా ఉంది. ఆమె సంబంధం అక్కడి నుండి ఉన్నట్లుగా కనిపించటమే కాకుండా, దానితోనే ఈ ప్రపంచం వెలుగు లీనుతుంది. నేను గమనిస్తున్న ఇంకొక విషయం ఏమిటంటే, ఎంతమంది ఎదుట కూర్చుని ఉన్నాగాని, నాకు వారు వేర్వేరుగా ఉన్న (Individuality) వ్యక్తిత్వం కనిపించటం లేదు. అంతే కాకుండా శరీరాలు కూడా వేర్వేరుగా కనిపించటం లేదు.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 891

మోడీనగర్,
20.03.1971

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. తమరు ఆరోగ్యంగానే ఉన్నారని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

ఇప్పుడు స్థితి ఏమీ కలగటం లేదు. కాని శక్తి (Power) మరియు తేజస్సు (Effulgence) నాలో లీనమై ఉన్నాయి. ఇంకా చెప్పాలంటే, అవి నా నుంచి సమస్తంలో వ్యాపించి ఉన్నాయి. నా మాలిక్! ఒక వింతైన విషయం ఏమిటంటే, నా యొక్క శక్తి మరియు తేజస్సు భూమి, ఆకాశంలోనే కాకుండా సమస్త విశ్వం అంతటా వ్యాపించి ఉంది, కాని నావైపుగా దృష్టి సారిస్తే అలా ఏమి లేదనిపిస్తోంది. దృష్టిలోకి వస్తున్న అన్ని విషయాలలో ఒక విషయం ఏమిటంటే, ఏ మానవుని యొక్క (Individuality) వ్యక్తిత్వం కూడా నాకు అనుభవం కావటం లేదు. లోపల ఉన్న స్థితితోను మరియు బాహ్యమైన ప్రాపంచిక స్పర్శ లన్నింటికీ అతీతంగానే ఉంటున్నాను. ప్రాపంచికమైన ఒక సాధారణ బాలికలాగా అయిపోయాను. (Simplicity) సామాన్యతయే నాకు (Covering) కప్పుకునేదిగాను, (Bedding) పడకగాను, అన్ని దిక్కులా విస్తరించి ఉన్నట్లుగాను ఉంది. బాబూజీ, ఈ విషయం కూడా ఆశ్చర్యంగా ఉంది. ఏమంటే, సామాన్యత యొక్క ఈ అనుపమానమైన స్థితి కూడా ఒక (Divine covering) దివ్యావరణలాగానే ఉంది. దానిని దాటియున్న దానిని చూడాలనే కోరిక నా హృదయంలో ఎక్కడో ఉంది. ఇప్పుడింక ఆ హృదయంలో తమరే ఉన్నారు అనేది కూడా ఆశ్చర్యమే.

నా బాబూజీ! ఈ సంగతి ఏమిటో నాకు తెలియటం లేదు. ఏమిటంటే, ఏదైనా కోరిక కలిగి, ఆ కోరిక అట్టడుగుకు వెళ్ళినట్లయితే, అసలు అక్కడ కోరికయే లేనట్లుగా అనిపిస్తోంది. కోరిక అయితే ఉంది, సమస్త విశ్వంలోని అన్నింటిలోను ఆసక్తి ఉంది. కాని అడుగున ఉన్నది (Hollow) తొర్ర అనగా ఏమిలేనట్లుగా ఉంది. నేను హృదయ పూర్వకంగా, దీక్షతో పనిలో నిమగ్నమవుతున్నాను. కాని ఎప్పుడైతే అది ఆలోచనకు వస్తుందో అప్పుడు ఆ దీక్ష ఎగిరిపోతుంది. ఆలోచన కూడా బాహ్యమైనదిగానే ఉంటుంది, కాని నన్ను స్పర్శించదు. తపన కూడా నాకు అలాగే ఉంటుంది. కాని దానిని పట్టుకోవాలనుకుంటే, చేతికి చిక్కదు. వింతైన విషయం ఏమిటంటే, వింత అను దాని అడుగు కూడా (Hollow) తొర్రయే. ఇదంతా తమాషాయేగాని ఇంకేమీ కాదు. నాకు చెందిన ఇటువంటి బూటకం మరియు మరపుతో నిండిన స్థితిలో నేను స్మృతి లేకుండా ఉంటున్నాను. మునగటానికి తగిన స్థానం లేదు, అలాగని ఇది ఎండిపోయినది కాదు. ఇది కూడా ఒక విషయమే– ఏమిటంటే, నేను కోల్పోయి అనగా స్పృహ లేకుండా

ఉంటున్నాను లేదా మరపుతో నిండిన స్థితియే నాలో తనను కోల్పోయింది. ఇదంతా తమకే తెలియాలి.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 892

షాజహాన్‌పూర్,

14.04.1971

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

నీకు క్షేమం కలుగుగాక! నీ ఉత్తరం చేరింది. జూన్ 6,7వ తేదీల్లో అస్సాం పర్యటించాలని నా సంకల్పంగా ఉంది. నాకు, నీకు కూడా విమాన ఖర్చులు సమకూరాయి. అక్కడకు చేరటానికి విమానంలో 4 గంటలు పడ్తుంది. ఈ తేదీలు నీకు అనుకూలంగా ఉంటాయో, లేదో తెలియజేయి. ఒకవేళ వీలుపడకపోతే మనం తేదీలు నిర్ణయించుకుని అస్సాం వారికి తెలియపర్చుదాము.

ఢిల్లీలోగాని లేదా ఢిల్లీ నుండి వచ్చిన తర్వాతగాని కేసర్‌ను పరబ్రహ్మాండ మండలంలోకి పూర్తిగా చేర్చి వేశాను. అలా జరిగిందో లేదో నీవు కూడా పరిశీలించు. నేను పశ్చిమదేశాల (Western countries) యొక్క పనిని రాఘవేంద్రరావుగారికి అప్పగించినట్లుగా నీతో చెప్పాను. నీవు మరచిపోయి ఉంటావు. నీ అనుభవం సరైనదే. నీకు కూడా పని అప్పగించాలి అనుకున్నాను కాని, నీ బలహీనతను, ఆనారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆ పని చేయలేకపోయాను. నీవు పనిని స్వీకరించి మంచి పని చేశావు. పని నీవు ఎంతవరకు చేయగలిగితే అంతవరకు చేస్తూ ఉండు. ఈ పనిలో ఆమెరికా మరియు ఆఫ్రికాలను కూడా జత చేయాలి. రాజగోపాలాచారిగారు అమెరికా కూడా వెళ్ళుతున్నారు. **ఆధ్యాత్మికత విషయంలో అక్కడి వారు కూడా ఉన్నతిని సాధించగలిగినట్లయితే ఈ యుద్ధాలు, పోట్లాటలు అన్నీ సమాప్తమైపోతాయి.**

బంగ్లాదేశ్‌లో పాకిస్తాన్ చాలా నేరాలు చేసింది. అవి చరిత్రలో వినిపించలేదు. మేధావు లందరినీ హతమార్చుతోంది. ఇవి ఇంక సహించబడవు. దైవ సంకల్పం ఏమిటో, ఇంక జరగవల్సినది ఏమిటో తెలియకుండా ఉంది. మీ అందరికీ ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 893

షాజహాన్‌పూర్,

23.06.1971

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నేను మద్రాసు నుంచి 20.06.1971న తిరిగి వచ్చాను. భవిష్యత్తులో మిషన్ నిర్వహణ గురించి ఒక విధానం రూపొందించవలసి ఉంది. కనుక దాని కొరకు నీ సలహా నాకు అవసరమై ఉంది. అందువలన నీవు లక్నో నుంచి మోడీనగర్‌కు వెళ్ళేటప్పుడు, 2,3 రోజులు షాజహాన్‌పూర్‌లో ఉండి వెళ్ళు. ఈ పని చాలా అవసరమైనదే కాని, వ్యధ చెందాల్సిన అవసరం లేదు. శుభవార్త ఏమిటంటే, ఈరోజే నిన్ను నేను 3వ వలయం నుంచి 4వ వలయంలోకి చేర్చాను. మీ అందరికీ ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 894

మోడీనగర్,

19.08.1971

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఇక్కడ అందరూ కుశలమే. తమరు కూడా కుశలమేనని భావిస్తున్నాను. తమరు దయతో వ్రాసిన ఉత్తరం వచ్చింది, చదివి ఆనందించాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఈ పరిస్థితి ఏమిటో తెలియటం లేదు. ఏమిటంటే, డిల్లీలో పెద్ద సోదరునికి (తులసీదాస్‌కి) ప్రమాదం జరిగింది. అతడిని మంచంమీద కట్టులతో పండుకుని ఉండటం చూసిన తర్వాత కూడా హృదయం, మనస్సు కూడా ఇదేమి తెలియనట్లు చలించకుండా ఉన్నాయి. సోదరునికి ఎంతో కష్టం వచ్చిందని ఎంత గాఢంగా ఆలోచించినా గాని, ఆలోచనలో ఆ ఆందోళకరమైన దృశ్యం నిలబడటం లేదు. అందుచేత మాటి మాటికీ ఏమి తెలియనట్లుగా ఉండిపోతున్నాను. మనస్సు ఎటువంటి ఆలోచననూ నిలిపి ఉంచుకోవటం లేదు. శరీరం నాకు తోడుగా ఉంటోంది కాని, ఈ విషయంలో నేను అబద్ధాలకోరునే. ఎందుకంటే, అది నాదిగా కాకుండా నాకు తోడుగా మాత్రమే ఉంటోంది. దాని స్పర్శ, సాహచర్యం ఉండి కూడా నేను ఎప్పుడూ దానికి స్పందించటం లేదు. 'మాలిక్' విషయమై ఆలోచించటంలో, వ్రాయటంలో, మాట్లాడటంలో మనస్సు ఎప్పుడూ దివ్య ప్రకాశంతో ప్రకాశిస్తూనే ఉంటుంది. కాని ప్రాపంచికంవైపు వచ్చేసరికి అంతా అంధకారమయమే. ఇంక ప్రకాశం కూడా ఏమిటంటే బాబూజీ, దీనిని గురించి ఏమీ అర్థం కాకపోయేసరికి అదేనని అంగీకరిస్తున్నాను. నా 'మాలిక్'! నా గురించి అయితే తమరు ఈ విధంగా అంటే, మృత్యువు నాకు వెలుగుగా అయిపోయిందని, జీవనం అంధకారంగా అయిపోయిందని చెప్పవచ్చు. అలా కాకుండా, జీవన్మరణాలమధ్య ఉన్నది అంధకారం కాదని, ఒక (Dim) మసక స్థితి వంటిదని చెప్పవచ్చు. ఏ దశ అయితే వాస్తవంగా ఇప్పుడు నాలో వ్యాపిస్తూ ఉందో అది స్పర్శించలేనిది, ఒంటరిది. దానిని ఎవరూ తాకలేరు, ఎవరూ తనదిగా స్వీకరించరు. అయినా కూడా, నేను మరియు ఈ (Divine condition) దివ్యదశ తమదిగా అయిపోయి ఒకటిగా కలిసిపోతున్నట్లుగా నేను చూస్తున్నాను. నేను దీనిని ఈ విధంగానే పొందుతూ నాదిగా ఉంచుకుంటున్నాను. ఇంక దశ అంటారా, అది స్వయంగా తనలాగానే ఉంటున్నది. ఇలా ఎందుకంటే, బహుశా **నేను తమతో నిరంతర సంబంధం లేదా లయ-అవస్థతోనే ఉంటూ, తమ యొక్క దివ్యత్వాన్ని కొద్దిగానైనా దర్శించుకోగలిగాను. ఇంకొక రకంగా చెప్పాలంటే, తమరు, తమరిని నాలో ఎంతగా ప్రకాశింపజేశారో, అంతగానే నేను తమరిని తెలుసుకోగలిగాను. అది ఎలా అంటే, స్వయంగా మరణించకుండానే స్వర్గం చూడలేనట్లుగా ఉంటుందో, ఇదే విధంగా తమలోనే లయమై, నా ప్రళయం అయ్యాకనే తమరిని తెలుసుకోవటం సంభవమవుతుంది.**

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 895

మోడీనగర్,

24.11.1971

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. 'మాలిక్' కృపతో ఇక్కడ అందరూ సంతోషంగానే ఉన్నాము. నా జీవన సర్వస్వమైన శ్రీ బాబూజీ, అక్కడ తమరు కూడా ఆనందంగా ఉన్నారని భావిస్తున్నాను. తమ కృపతో కలిగిన ఆత్మిక దశను

వ్రాస్తున్నాను.

ఆధ్యాత్మికతయే కాకుండా (Divinity) ఈశ్వరీయత అంతా కూడా నాలో కలిసిపోయినట్లుగా ఉంది. ఇప్పుడు నా బాబూజీవద్దకు షాజహాన్‌పూర్ ఎలా వెళ్ళగలను? 'వారు' తన కస్తూరీని గుర్తించగలరా? నా ఆలోచన శాశ్వతంగా 'మాలిక్'లో విశ్రాంతి తీసుకుంటూ ఎప్పుడూ ఉంటోంది. అలాగే 'మాలిక్' నా కణకణంలో విశ్రాంతిగా ఎప్పుడూ ఉంటూ ఉంటారు. కాని ఇప్పుడు ఏమయ్యిందో ఏమో తెలియకున్నది, నావద్ద ఏ ఆలోచనా లేకుండా పోయింది. ఇప్పుడు ఈ స్థితి ఏమిటోగాని, నేను మాట్లాడుతూ ఉన్నా కూడా మాట్లాడనట్లుగానే ఉంటున్నది. ఇప్పటివరకు నా కణకణం, రోమరోమం అన్నీ 'అతని'తో అనుసంధించుకునే ఉన్నాయి. ఇప్పుడు అవన్నీ కడిగి శుభ్రం చేయబడి స్వచ్ఛత యొక్క మెరుపుతో ప్రకాశవంతమైనట్లుగా ఉంది. అప్పుడప్పుడు ఏమి అనిపిస్తుందంటే, నా ఎదుట ఆది యొక్క అవక్షేపం (Precipitate of the Adi, i.e. Beginning) నా ఎదుట ఉండగా, ఇంక దశ యొక్క ప్రస్తావన ఏమిటి అని. ఇప్పటివరకు బాహ్యాంతరాల సమానస్థితిని గురించి తమకు వ్రాస్తూ ఉండేదానను, కాని ఆ స్థితిని దాటి ఇప్పుడు ఏ దశ ఉందో దానిని గురించి ఏమీ చెప్పలేను. ఇప్పుడు ఏమైందో ఏమోగాని, మంచం మీద పండుకుని ఉన్నా కూడా దాని స్పర్శ తెలియటం లేదు. నేను సమస్తంలోను పండుకుని ఉన్నట్లుగా అనిపిస్తోంది. ఇది కూడా నాకు ఎప్పుడు తెలుస్తుందంటే, నేను లేచి పనుల్లో నిమగ్నమైనపుడు మాత్రమే. **నేను ఎటువంటి మార్గంలో నడిచిపోతున్నాను అంటే, ఎవరూ కూడా ఇప్పటివరకు ఈ మార్గంలో ప్రవేశించి పోలేదు.** ఈ దశ ఎటువంటిది అంటే, మాట్లాడుతూ ఉన్నా కూడా ఆ మాటల ధ్వని నన్ను చేరటం లేదు. విశ్వమంతా ఎటువంటి గాఢనిశ్శబ్దం నిరంతరం వ్యాపించి ఉంది అంటే, ఎప్పుడైనా నేను జనంలోకి బజారు మొదలైనచోట్లకు వెళ్ళినపుడు కూడా భంగం కాకుండా ఉంటోంది. వాతావరణం అంతటా (Inactivity) చైతన్యంలేనిది దిగివచ్చినట్లుగా ఉంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 896

షాజహాన్‌పూర్,
03.05.1972

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

ఆశీర్వాదాలు. నీ ఉత్తరాలు అందుతూనే ఉన్నాయి. నీ ఉత్తరాలను ప్రజలు నాకు వక్రీకరించి వినిపిస్తున్న కారణంగా నీకు నేను లేఖలు వ్రాయటం తగ్గిపోతూ ఉందేమోనని అనిపిస్తోంది. **నీ ప్రతి ఉత్తరానికి జవాబు విడమర్చి విస్తారంగా వ్రాయాలని నాకు అనిపిస్తుంది. ఎందుకంటే, దానివలన ప్రజలకు ప్రతి ఆధ్యాత్మిక దశతోపాటుగా, దివ్యశక్తి యొక్క మహిమను కూడా తెలియజేయాలని, ప్రతి ఒక్క స్థితి కూడా ఆధ్యాత్మిక ఉన్నతికి ఊతమిస్తాయని గ్రహింపజేయాలనేది నా ఉద్దేశ్యం.** ఇప్పుడు నీ ప్రతి అనుభూతి (Divine Power) దివ్యశక్తిలోనే లయమైపోతుంది, కాని శక్తి మాత్రం మిగిలి ఉంటుంది. నీకు ఒక శుభవార్తను కూడా అందిస్తున్నాను. అది ఏమిటంటే, దక్షిణాది నుంచి ఎవరైతే వచ్చారో వారందరినీ లాలాజీ సాహెబ్ సంతోషపెట్టి పంపించారు. నేను నిన్ను 5వ వలయం (Ring) మీదకు చేర్చినపుడు, అదే స్థితిని నీవు నీ ఉత్తరంలో తెలియపర్చినపుడు, నీ అనుభూతిని ఎలా ప్రశంసించాలో నాకు తెలియలేదు. ఈ స్థితి కూడా దివ్యశక్తిగా రూపొందుతుంది. అలా రూపుదిద్దుకోవటం ప్రారంభమైంది కూడా. **నీలో ఉన్న ఒక ప్రత్యేకత ఏమిటంటే, ప్రతిస్థితి యొక్క సక్రమ విధానం, నడవడిక కూడా ఆ స్థితిలో తోడుగా ఉంటాయి. నిజం చెప్పాలంటే, కలిగిన స్థితి ఎంతో శ్రేష్టం, ఉన్నతం అయినదే అయినప్పటికి, ఆ స్థాయికి చెందిన నడవడిక అభ్యాసిలో**

**లేనట్లయితే అది చాలా పెద్ద లోపంగానే భావించబడుతుంది.** లాలాజీ సాహెబ్ మాత్రం నీలో ఇటువంటి లోపం ఎప్పుడూ జరగనివ్వరు. ఇప్పుడు తులసీదాస్ ఆరోగ్యం బాగుపడింది అని భావిస్తున్నాను.

మీ అందరికీ ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 897

లఖీంపుర్,
24.07.1972

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ దయతో, అనంత కృప యొక్క వర్షంతో కూడిన ఉత్తరం అంది, చాలా సంతోషించాను. పెద్ద సోదరుడు (తులసీదాస్) ఇప్పుడు పూర్తిగా బాగయ్యారు. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

ఓ నా మాలిక్! మొన్న రాత్రి నిద్ర మెలకువల మధ్య ఒక స్వప్నం వంటిది చూశాను. దానిలో నేను తమ ఆజ్ఞానుసారంగా ఈ ప్రపంచంలో లేనటువంటి వ్యక్తితో పూజ చేయిస్తున్నాను. పూజ పూర్తయిపోగానే కళ్ళు తెరచిన తర్వాత, నాకు స్వప్నంవంటి దానిలో ఏమి కనిపించింది అంటే, ఒక్క సెకను తమరు నృత్యం చేస్తున్నట్లుగాను, దాని వలన సమస్త ప్రపంచం యొక్క భూమి ఊగుతున్నట్లుగాను, అయితే అప్పుడు నేను కూడా ఈ ప్రపంచంలో లేనట్లుగాను, మరెక్కడో ఉండి, అక్కడే పూజ చేయిస్తున్నట్లుగాను అనిపించింది. ప్రపంచపు మాలిన్యం తమ పాదాల అడుగున త్రొక్కి వేయబడినట్లుగాను, ఎక్కడి నుండో కొంచెం స్వచ్ఛత మరియు తాజాదనం యొక్క సుగంధాన్ని ప్రపంచం అప్పుడు పీల్చుచున్నట్లుగాను నాకు అనిపించింది. నృత్యం చేస్తున్న తమ పాదాలు, భూమి మరియు వాతావరణం యొక్క మాలిన్యాన్ని నాశనం చేసినట్లుగాను, దాని ఫలితంగా స్వచ్ఛత మరియు తాజాదనం కలుగుతున్నట్లుగా ఉంది. ఇప్పుడు ఎటువంటి దశ ఉందంటే, 'ఉన్నది' మరియు 'లేదు' అను వాటి అస్తిత్వమే లేనట్లుగా ఉంది. ప్రపంచం అంతా ఒక (Moderation) సమతుల్యత వ్యాపించి ఉంది. దీనిని చూస్తూనే ఉన్నానుగాని వాటిని అంటకుండా, కేవలం ప్రేక్షకపాత్ర వహిస్తున్నాను.

ఓ మాలిక్! నా దశ ఎటువంటిది అంటే, నేనే కాకుండా మొత్తం అచేతనం (జడత్వం) అయిపోయినట్లు నాకు అనిపిస్తోంది. నా ఎదుట మనుష్యులందరూ తిరుగుతున్నారు, పని చేస్తున్నారు. కాని నాకు మాత్రం అంతా (Inert) జడమైపోయినట్లు ఉంది. ఎక్కడా (No activity) చైతన్యం లేదు, (Vibration) కదలిక లేదు. సమస్తంలోను ఒక జడదశ (Condition of inactivity) వంటిదే వ్యాపించిపోయింది. శరీరం కదులుతూ, తిరుగుతూ ఉన్నా కూడా, నా అణువణువూ, కణకణమూ అన్నీ జడత్వం దాల్చి మౌనంగా పడియున్నాయి. పాడుతున్న సందర్భంలో ధ్వని నన్ను చేరటం లేదు. దశ ఎలా ఉంది అంటే, ఒక రాయిలాగ అయిపోయి ఉండిపోయింది. తమకు ఉత్తరం వ్రాస్తున్నాను, కాని కలం ఏమి వ్రాసిందో తెలియదు. కలం నిర్జీవంగా అయిపోయింది. జడసమాధిలో నేను సమాధి చెందినట్లుగా ఉంది. ఎక్కడా కోరిక లేదు, అవసరమూ లేదు. మనస్సు అనేది లేనప్పుడు ఆట అంతా ముగిసిపోయింది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 898

లఖీంపుర్,

13.09.1972

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఇక్కడ అందరూ కుశలమే. అక్కడ తామందరూ కూడా కుశలంగాను, ఆనందంగాను ఉన్నారని భావిస్తున్నాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

పూజ్యులు మరియు ప్రియమైన నారాయణ దద్దాగారి ద్వారా తమరు 6.09.1972వ తారీఖున తమ కుమార్తెను 6వ (Ring) వలయంలోకి చేర్చారని తెలిసి సంతోషమైంది. దద్దాగారు అపరిమితంగా సంతోషించి, "కస్తూరీ, నీవు 'బాబూజీ' యొక్క కోర్కెను తీర్చావు" అని అన్నారు. అయితే నేను ఏం చెప్పగలను, ఎందుకంటే, నేను ఇప్పటికి కూడా తమరినితప్ప ఇంకేమీ చూడలేదు. తమ మధుర స్వరం మినహా నా చెవులు ఇంకేమీ వినలేదు. వలయం (Ring) అంటే ఏమిటో కూడా నాకు తెలియదు. నా 'మాలిక్'! దశ ఏమిటంటారా, (Simplicity) సామాన్యత అంటె సామాన్యతయే ఒక అద్దంగా ఉండగా, దానిని నేను చూస్తున్నాను. బహుశా ఈ అద్దంతోనే నేను లోన, బయట చూస్తున్నాను. నా శరీరంలోని అణువణువే కాకుండా, (Whole Universe) సమస్తం అంతా కూడా (Mirror of simplicity) సామాన్యత యొక్క అద్దంలాగా మెరుస్తూ, దివ్యజ్యోతిని ప్రతిబింబిస్తుంది. అంతర్నేత్రాల జ్యోతి ఇప్పుడు నా ఎదుట విస్తరించి ఉన్నట్లు ఉంది. సామాన్యత యొక్క శోభయే నా నయనాల దర్పణంగా అయిపోయినట్లుగా ఉంది. దివ్యదృష్టి అణువణువులోనూ విస్తరించినట్లుగాను, నేను నేత్రాలు, అన్యదృష్టి ఏమి లేకుండానే చూస్తున్నట్లుగాను అనుభవమవుతోంది. ఇంకొక రకంగా చెప్పాలంటే, ఎదుట దృశ్యంగాని, కాంతిగాని ఏమి లేకుండానే నేను ప్రేక్షకురాలుగా ఉన్నట్లు ఉంది. నా అణువణువు, కణకణం, స్థిరంగా ఉండి పోయినట్లు నాకు అనుభవమవుతోంది. బహుశా నా 'మాలిక్' నన్ను విక్రయించి ఉండవచ్చు. అందువలన నేను నన్ను వదలి ఎక్కడికో వెళ్ళిపోయాను. ఎక్కడకు వెళ్ళాను అనేది నాకు తెలియకుండా ఉంది. అయితే ఆ వ్యాకులత ఎక్కడ దాగి ఉందోగాని, నన్ను మాత్రం కలవరపెడుతోంది. ప్రతిస్థితి యొక్క జాడ లేకుండా ఉంది. ఇంకను ఎటువంటి స్థితి ఉంది అంటే, నేను నా 'మాలిక్'నే పట్టి ఉంచుకోలేకపోయాను, పిడికిలి తెరుచుకుపోయింది, వారు వెళ్ళిపోయారు. అయితే 'వారి'ని ఎవరైనా చూడదలిస్తే, నా అణువణువులోను, కణకణంలోను, జీవితంలోని ప్రతి అడుగులోను చూడగలరు.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 899

మోడీనగర్,

17.01.1973

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఇక్కడ అందరూ కుశలమే. ఇప్పుడు తమ ఆరోగ్యం బాగుందని అనుకుంటున్నాను. తమరు నన్ను దయతో 6వ వలయం (Ring) మీదకు తెచ్చారని పూజ్య నారాయణ దద్దాగారి ద్వారా తెలుసుకుని నా మనస్సు ద్రవించి, నేను తమ చరణాలవద్దనే అర్పితమైపోయాను. 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మికదశను వ్రాస్తున్నాను.

స్థితి ఏమిటి అంటే, "వసంతం లేదు, హేమంతమూ లేదు (వసంత ఋతువులో ఆహ్లాదంగా ఉంటుంది, హేమంత ఋతువులో ఆకులు రాలిపోయి చెట్లు మోడుగా ఉంటాయి). 'నీవు' ఎప్పుడైనా స్పర్శించావేమో, అది ఎవరికి తెలుసు" అన్నట్లుగా ఉంది. స్థితి ఒక నవశిశువులాగా మృదువుగా, స్వచ్ఛంగా ఉన్నట్లు అనిపిస్తోంది. నా అణువణువూ నివాసంగా (ఇల్లుగా) అయిపోయిందని అనిపిస్తోంది. మృత్యువు మరియు జీవనం, జీవితం యొక్క రెండు భాగాలుగా ఉన్నట్లు ఉంది. అవి రెండూ ఈ జీవితంలోనే కలిసిపోయి నా జీవశక్తిని తెలుపుతున్నాయి. నా 'మాలిక్'! నిన్న రాత్రి నేను స్వప్నంలో ఏమి చూశాను అంటే, తమరు అలసిపోయి ఉన్నట్లుగాను, అప్పుడు నేను వెంటనే ప్రార్థన చేయటానికి కూర్చున్నట్లుగాను, 5 నిమిషాల తర్వాత నా పరమప్రియులైన తమరు చిరునవ్వు నవ్వినట్లుగాను చూశాను. అలుపు తగ్గిపోగానే, దివ్య చిరునగవు నిండిన తమ ముఖారవిందాన్ని చూశాను. అది ఇప్పటికీ నా దృష్టిలో నిలిచి ఉంది. ఇంకా ఏమిటంటే, నా 'మాలిక్' యొక్క ముఖారవిందం, ఈ ప్రపంచపు (Charming smile) మృదుహాసంగా అయినట్లు ఉంది. అప్పుడు అది, "ఓ ప్రపంచమా! నీకు ఇప్పుడు దరహాసం చేసే రోజులు వచ్చాయి" అని చెబుతున్నట్లుగా ఉంది. బాబూజీ, ఇంకా ఏమైంది అంటే, నన్ను ఎవ్వరైనా ఎంతగా పొగిడినా గాని, నాలో ఎటువంటి చైతన్యం కలగనట్లుగా ఉంది. బహుశా ఈ విధంగా కావటంవల్లనే, నేను తమకు, "బాబూజీ, ఎవ్వరైనా నన్ను పొగిడినప్పుడు, లోపల ఏమి అనిపిస్తుందో అది నాకు ఇష్టంగా ఉండటం లేదు" అని వ్రాశాను. ఈ ఉత్తరం తమకు చేరేలోపుగానే పైనచెప్పిన స్థితికి తమరు తమ ఈ కుమార్తెను చేర్చారు. జడ-సమాధి నన్ను తన నివాసంగా చేసుకున్నట్లుగా ఉంది. అయినప్పటికి, ఇప్పుడు దాని అస్థిత్వం కూడా లేనట్లుగా నేను చూస్తున్నాను. ఈ దశను ఎలా వ్రాయాలో, ఏమని చెప్పి వ్రాయాలో నాకు తెలియటం లేదు. అయితే, ఆశ్చర్యమే ఆ స్థితిని చూసిందని, దాని అస్థిత్వం లేకుండా పోయిందని వ్రాయటం సహేతుకంగా ఉంటుందని అనుకుంటాను.

నాకు కలిగిన ఒక స్థితి ఏమిటంటే, నేను నిద్రలో ఉన్న సమయమంతా ఎటువంటి దప్పిక కలిగింది అంటే, సముద్రాన్ని త్రాగివేసిన తర్వాత కూడా దప్పిక తీరకుండా అలాగే మిగిలిపోయినట్లుగా అనిపించింది. లేచిన తర్వాత, నేను ఆ విషయం మరచిపోయి దప్పికనే త్రాగివేసినట్లుగా అనుభవమైంది. బహుశా (Everlasting Peace) శాశ్వత శాంతికి ఇదే నమూనా అనుకుంటాను. అదేమిటో తమకే తెలియాలి. మాలిక్! తమరు ఏది చెబుతూ ఉంటే, దానినే నేను వ్రాస్తాను. వాస్తవం ఏమిటంటే, **తమరే నా స్థితి.**

ఇంకొక దశ ఎలా ఉందంటే, నా దృష్టి ఎటు మళ్ళితే అక్కడ నేను ఉంటున్నాను. షాజహాన్‌పూర్ గురించిన ఆలోచన వస్తే షాజహాన్‌పూర్‌లో, అలాగే డెన్మార్క్, ఫ్రాన్స్, లండన్ ఏదైనా కావచ్చు, ఏది దృష్టికి వస్తే అక్కడా నేను వ్యాపించి ఉంటున్నాను, నా శక్తి వ్యాపించి ఉంటోంది. నేను సత్సంగ్‌లో ఉన్న సమయంలో ప్రశ్నోత్తరాలు జరుగుతూ ఉన్నప్పుడు నా జవాబులకు అంతమంటూ లేకుండాపోయాయి. అవి వారికి సంతోషదాయకంగా ఉండటంతో ఆ తర్వాత వారిలో మళ్ళీ ప్రశ్నలు తలెత్తటం లేదు. ఈ జవాబులు ఎక్కడ నుండి, ఎలా వస్తున్నాయా అని నిర్ఘాంతపోతున్నాను. అయితే ఆ సందర్భం ముగిశాక ఆ జ్ఞానం ఎక్కడి నుండి వస్తోందో అక్కడికే తరలిపోతుంది. ఇటువంటి స్థితిని దైవంగాని, ప్రపంచంగాని స్పర్శించటంలేదని అనిపిస్తుంది. దీనిని నేను బాగా పరిశీలించినపుడు అనగా స్థితి ఏమిటా అని దీర్ఘంగా ఆలోచించినపుడు, అక్కడ ఎన్నడూ (Vibration) క్షోభ కలిగి ఉండలేదన్నట్లుగా గ్రహిస్తున్నాను.

ఏదైతే చూడశక్యంకానిదో, అటువంటి దానిని తమరు చూపించినట్లుగా అనుభవమవుతోంది. నాది, నావారు అను బాంధవ్యం నాలో లేదు కాని, ఆ బాంధవ్యమే నన్ను తనదిగా స్వీకరించింది. అందుకనే నన్ను చెడుగా ఎవరు భావిస్తున్నారో, వారు కూడా నాకు అయినవారుగానే అనిపిస్తున్నారు. 'మాలిక్' యొక్క శక్తియే జ్ఞానేంద్రియాలతో (కన్ను, ముక్కు, చెవి మొదలైనవి) యంత్రంలాగా పని చేయించుకుని తిరిగిపోతున్నట్లుగా ఉంది. ఏ స్థితినైతే

బంధించశక్యంకాదో, ఏ (Super-condition) పరమగతిని తనదిగా చేసుకొనగల సామర్థ్యం లేక శక్తి జన్మించి ఉండలేదో, అటువంటి (Super-condition) పరమగతిని కూడా వ్రాయించి తమరు సుసాధ్యం చేశారు. అందుకనే నేను తమకు ఎంతో కొంత వ్రాయటంలో సఫలమవుతున్నాను. సమస్తానికి ప్రాణప్రదమైన నా బాబూజీ, తమరు చిరాయువుగా వర్థిల్లాలి. అందుకోసమే నేను సమర్థ సద్గురు శ్రీ లాలాజీ సాహెబ్‌ని ప్రార్థిస్తున్నాను.

అమ్మ తమకు ఆశీర్వాదాలు చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 900

షాజహాన్‌పూర్,

16.07.1973

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీ ఉత్తరాలన్నీ చేరాయి. జవాబు వ్రాయటానికి ఎవ్వరైనా ఒక లేఖకుని కోసం నిరీక్షించవలసి వస్తోంది. ఈరోజు అనూహ్యంగా లేఖకుడు దొరికినందున నీకు జవాబు వ్రాస్తున్నాను.

**దేవుని మహిమ ఎటువంటిది అంటే, ఎవ్వరైనా ఒక విశిష్టవ్యక్తిని ఈ పృథ్వీమీదకు దింపినపుడు అతడు అనగా ఆ విశిష్టవ్యక్తి యొక్క అభిలాష (సంకల్పం)ను నెరవేర్చటానికి తగిన వ్యక్తిని కూడా ఇక్కడకు పంపుతాడు. ఇప్పుడు నీవు స్థితిని వివరిస్తూ వ్రాసేటటువంటి సరిహద్దును దాటిపోయావు. ఈ సందర్భంలో నా ఆనందం, సమర్థ సద్గురు లాలాజీ సాహెబ్ లోతైన దృష్టి మరియు స్వామి వివేకానందుని ఆశీస్సులు నేడు ఆనందపారవశ్యంతో ఉరకలెత్తాయి. ఏ ఆధ్యాత్మిక సాహిత్యంలోను ఇటువంటి స్థితుల వర్ణన ఎక్కడా చెప్పబడి ఉండలేదు. లాలాజీ సాహెబ్ యొక్క లోతైన పరిశీలన మరియు పర్యవేక్షణ వలన నేను నిన్ను అత్యున్నతమైన స్థితుల ద్వారా "అంతిమ సత్యం" యొక్క నిజరూపాన్ని నీకు బహిర్గతంచేసి దర్శింపజేసాను. అందుకు లాలాజీ సాహెబ్‌కు ధన్యవాదాలర్పిస్తున్నాను.** నేను వ్రాస్తున్న విషయం ఇంకొకటి ఏమిటంటే, ఏ స్థితులగుండానైతే నిన్ను దాటించి తీసుకువెళ్తూ వచ్చానో, అక్కడ శక్తి యొక్క ప్రవేశం కూడా జరగదు. ఇప్పుడు 7వ వలయం మీదకు నీవు వచ్చావు. లాలాజీ సాహెబ్ నీ యొక్క బాధ్యతను స్వయంగా స్వీకరించారు. ఎందుకంటే, 7వ వలయంలోగాని, ఆ తర్వాతగాని అంతిమసత్యం (భూమా) యొక్క అపూర్వ వైభవం కనిపించటం ఆరంభమౌతుంది. నీ దృష్టి ఎప్పుడైనా సరే, ఈ విశ్వంవైపు మరలిపోకుండా ఉండాలి. అందువలన **వారి** భద్రతాదృష్టి, నా దృష్టి నిన్ను పరిశీలిస్తూ, పర్యవేక్షిస్తూ ఉంటాయి. ఓహో! లాలాజీ సాహెబ్ యొక్క దివ్య పర్యవేక్షణ (భద్రతా దృష్టి) యొక్క అద్భుతాన్ని ఏమని చెప్పాలి, ఎలా చెప్పాలి. అదేమిటంటే, లాలాజీ సాహెబ్ తమ భద్రతాదృష్టితో 'ప్రేమ' అను ఆచ్ఛాదనను (Covering) నీకు ఉపయోగించి నా (Unfailing-will) అజేయమైన ఇచ్ఛాశక్తి నీ ప్రస్తుతస్థితిని స్పర్శించకుండా ఉండునట్లు చేశారు. దానికి అభ్యంతరమైతే ఏమీ లేదు కాని, నీ ఆలోచన శక్తి రూపం దాల్చకుండా ఉండాలని **వారి** ప్రేమ నీ స్థితిని దాచి ఉంచింది. ప్రతిస్థితి యొక్క కేంద్రం దాని శక్తి యొక్క కేంద్రంగా ఉంటుంది. వలయం (Ring) యొక్క విశిష్టత ఏమిటంటే, దీనిలో అడుగుపెడ్తూనే కేంద్రం యొక్క ఆకర్షణ శక్తి తనవైపు ఆకర్షిస్తూ ఉంటుంది. నేను 'ఆకర్షణ' అనే పదం వాడాను, కాని ఇక్కడ 'ఆకర్షణ' అను దానికి ప్రవేశమే లేదు. ఒక విధంగా చెప్పాలంటే, మార్గదర్శకుని దృష్టియే ఆకర్షణగా పనిచేస్తూ ఉంటుంది. దర్శింపశక్యంకాని వాటిని నీవు చూశావు. నేను ఇంకా చెప్పేదేమంటే, (Supreme condition) పరమగతియే నిన్ను ప్రాప్తింపచేసుకుంది. ఇప్పుడు ఇంకా వ్రాయించాలి అనే ఆలోచనే లేదు. నిజం చెప్పాలంటే, నీ స్థితి గురించి వ్రాయాలనే వెచ్చదనమే ఆలోచనలను కలిగిస్తూ ఉంది. నేను ఇప్పుడు సంతోషంగా ఉన్నాను. ఎందుకంటే, నీ మీద

ఆశీర్వచనల వర్షం కురుస్తోంది.

నీ సోదర సోదరీలకు ఆశీస్సులు.

నీ క్షేమం కోరుతూ
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 901

మోడీనగర్,
02.05.1975

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. దీర్ఘ అనారోగ్యం తర్వాత ఇప్పుడు తమ ఆరోగ్యం బాగుపడి ఉండవచ్చు. నేను చాలాసార్లు తమరిని దర్శించటానికి షాజహాన్‌పూర్ వచ్చాను. అప్పుడు నేను తమకు సేవచేసే భాగ్యం కూడా పొందాను. అయితే కుర్చీమీద ఎప్పుడూ కూర్చుని ఉండే బాబూజీ అనారోగ్యంగా ఉన్నారు. అయినా కాని, నా బాబూజీ యొక్క అదే మృదు దరహాసం ఎప్పుడూ కూడా క్షీణించనట్లుగా నేను చూశాను. నా ఉత్తరాలకు జవాబు కూడా ఇటీవల రావటం లేదు. ఇంకా ఏమిటంటే, పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి దేహత్యాగం తర్వాత ఇక్కడికి వచ్చిపోయే అభ్యాసీ సోదర సోదరీలు ఎవరూ లేరు. వారి ద్వారా తమ సమాచారంగాని, తమ మాటలుగాని తెలుసుకోగలిగిన అవకాశం లేకుండాపోయింది. అయినా కూడా, నేను వ్రాయగలిగినంతవరకు, నా స్థితులను గురించి తమకు వ్రాస్తూనే ఉంటాను. నా మాలిక్! నాకేమి అనిపిస్తున్నదంటే, శూన్యగతి యొక్క దారిని వేస్తూ, ఎవరో తన మరియు నా చిరునామా ఎవ్వరికీ ఇవ్వకుండానే అనంత సాగరం ఈదించి ఆవలి ఒడ్డుకు తీసుకువెళ్ళారు. అక్కడ ఇచ్చిపుచ్చుకోవటాలు ఏమీ లేవు. అక్కడ ప్రార్థన లేదు, శూన్యమూ లేదు. తమ సంకల్పం అను నావలోకి తీసుకుని తమరు నన్ను దాటించుకు వెళ్ళారు. అయినప్పటికి నాకు ఈవల, ఆవల అంటే ఏమిటో తెలియదు. శక్తి, భక్తి, శూన్యత, జ్ఞానం, అజ్ఞానం అన్నీ కూడా నన్ను విడిచిపోయాయి. నేను పొంది ఉన్నది ఏమిటంటే, తమ దయాదృష్టి, అది నాకు చెందినదే. యదార్ధం ఏమిటంటే, ఈ స్థితికి ఎటువంటి పేరుగాని లేదా స్థానం యొక్క పతాకంగాని ధరింపజేయటానికి సాధ్యపడదు. ఇప్పుడు బిడియం లేదు, భయం లేదు, స్వతంత్రతయే స్వయంగా నా ద్వారా పని చేస్తున్నట్లుగా ఉంది. ఏదో కథ ముగిసినట్లుగా అనుభవమవుతోంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమానురాగాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ